

నవల
దోచేవారెవరు రా!
ఉదయ భాస్కర పంబరాజు

# Chapter 1 – The Incident

భారత పురావస్తు శాఖలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ విక్రాంత్ వర్మ, ఇంకొక రెండు నెలల్లో పదవీ విరమణ చేయబోతున్నారు. భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేక పురావస్తు తవ్వకాలు, పరిశోధనలు చేసి ఎన్నో సత్కారాలు పొందారు. ఇవాళ, ఆయన తన అసిస్టెంట్ అజయ్ తో కలిసి ఏదో మీటింగ్ నిర్వహిస్తున్నారు.

మీటింగ్ హాల్ లో భారతదేశం నలుమూలల నుంచీ వచ్చిన పురావస్తు శాఖ అధికారులు, చరిత్రకారులు ఎంతోమంది వున్నారు. స్టేజ్ మీద వర్మగారు మైక్ దగ్గర నిలుచుని మాట్లాడుతున్నారు. వెనుక వరుసలో అజయ్ నిలుచుని వున్నాడు. ఆ స్టేజ్ వెనకాల ఒక పెద్ద డిజిటల్ తెర మీద ఒక విచిత్రమైన వింత వస్తువు ఒకటి బంగారు రంగులో కనబడుతోంది. దానిని కత్తి అనాలో, పద్మం అనాలో, లేక ఒక ఆయుధం అనాలో తెలియదు. వర్మగారు ఆ వస్తువు గురించి ప్రసంగిస్తున్నారు.

"సభకు నమస్కారం! నేను ఇంకో రెండు నెలల్లో రిటైర్ అవ్వబోతున్నాను. ఆ లోపల మీ అందరికీ ఒక వస్తువు గురించి చెప్పడానికే ఈ మీటింగ్. ఇక్కడ స్క్రీన్ మీద కనిపిస్తున్న వస్తువుని 'పాఖసోయ' అని పిలుస్తారు. ఇది క్రీస్తు పూర్వం, రెండవ శతాబ్దంలో మగధ రాజ్యంలోని రాజులు వాడినట్టుగా తెలుస్తోంది. దీని విలువ, దీనిలో ఆ కాలంలో వాళ్ళు ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానం మనకు అంతుపట్టడం లేదు.

అసలు ఈ వస్తువు ఇప్పుడు ఎక్కడ వుందో కూడా సరిగ్గా తెలియదు. పద్దెనిమిది సంవత్సరాల క్రితం, పాట్నాకు దగ్గర త్రవ్వకాలలో దీనిని భద్రపరిచే ఒక భోషాణం దొరికింది. (వెనకాల తెర మీద ఆ భోషాణం ఫోటో వచ్చింది) దీనిని బట్టి, ఈ వస్తువు ఒక మూడున్నర అడుగుల పొడవు, అర అడుగు వెడల్పు కలిగి వుంటుంది. దీనికి సంబంధించిన బ్రహ్మీలిపిలో వ్రాసిన ఒక తాళపత్ర గ్రంథం దొరికింది. ఆధునిక సైన్స్ లో దీనిని మెటల్ డిటెక్టర్ అంటారు. దీని పూర్తి పేరు 'పాతాళ ఖనిజ సోదని యంత్రం - పాఖసోయ'.

ఈ యంత్రం భూమికి క్రింద గల ఎటువంటి ఖనిజాన్నైనా పసిగట్టగలదు. అవి వజ్ర వైడుర్యాలు, బంగారం, వెండి లేదా ఇంకేమయినా కావచ్చు అని ఆ గ్రంథంలో రాసి ఉంది. ఈ యంత్రం, అది కనిపెట్టిన ఖనిజం రంగులోకి మారిపోతుంది. అక్కడ దొరికిన ఆ భోషణం, గ్రంథాల ఆధారంగా గీసిన ఊహా చిత్రమిది. దీనిని శోధించడం కోసం నేను ఎన్నో ప్రయత్నాలు చేశాను కానీ, నేను రిటైర్ అయ్యేలోపు దీనిని సాధించలేనేమో అని అనిపిస్తోంది. ఇది కనుక దొరికితే దీనిలోని సాంకేతిక పరిజ్ఞానం, మన పూర్వీకుల మేధాశక్తి యావత్తు ప్రపంచానికి తెలుస్తుంది. దానికి సంబందించిన తాళపత్ర గ్రంథం జీర్ణావస్థలో ఉన్నందున, దానిలోని భాష తర్జుమ చేయడానికి చాలా కాలం పట్టింది."

వర్మ అలా చెప్పడంతోనే హాల్ లో ఒక చిన్న కలకలం ఏర్పడింది. కొంతమంది ఏవో సందేహాలు, ప్రశ్నలు అడగాడనికి చేతులు ఎత్తారు.

"నాకు తెలుసు, నేను ఈ విషయం చెప్పగానే మీకు చాలా సందేహాలు, ప్రశ్నలు వుంటాయని, మా వాలంటీర్ లు మీ అందరికీ కొన్ని కాగితాలు, పెన్నులు ఇస్తారు. మీరు మీ సందేహాలు, ప్రశ్నలు వాటి మీద రాసి, వాటి క్రింద మీ పేరు, చిరునామా, మీ మొబైల్ మరియు మీ వేరే కాంటాక్ట్ డీటైల్స్ రాసి, అక్కడ పెట్టిన ఆ పసుపు రంగు డబ్బాలో వేయండి. మేము వాటిని పరశీలించి మీకు సమాధానాలు ఇస్తాము. ప్రస్తుతానికి మీ అందరికీ ఈ పాఖసోయకు సంభందించిన కొన్ని కరపత్రాలు మా వాలంటీర్ లు ఇస్తారు, అవి తీసుకోండి" అని వర్మ అందరికీ చెప్పి, నమస్కరించి మైక్ దగ్గర నుంచి జరిగి స్టేజ్ దిగడానికి నడుస్తుండగా, ఇంతలో ఎక్కడిని నుంచి వచ్చిందో కానీ, ఒక బుల్లెట్ వర్మకి గుండె పై భాగం భుజానికి క్రింద భాగంలో తగిలింది. వెంట వెంటనే ఇంకో రెండు బుల్లెట్ లు వర్మ గారి ఛాతికి దగ్గరగా తగిలాయి. ఆయన వెంటనే వెనిక్కి ఒరిగిపోయాడు.

అతని వెనకాలే వున్న అజయ్, వర్మ నేలకు ఒరగకుండా పట్టుకుని గట్టిగా అరిచాడు "కాల్ ద అంబులెన్స్" అని.

రెండు నిముషాలలో అంబులెన్స్ వచ్చింది. అందులో నుంచి వచ్చిన కాంపౌండర్స్ వర్మగారిని లోపలికి చేర్చి, వచ్చినంత వేగంగా వెళ్ళిపోయారు. వెంటనే అజయ్ పరుగున వెళ్ళి, తన బైక్ తీసి ఆ అంబులెన్స్ వెనకే వెళ్ళాడు.

హాస్పిటల్ ఆ మీటింగ్ హాల్ కు ఒక మూడు కిలోమీటర్ ల దూరంలో ఉంది. ఏది ఏమైనా ఇప్పుడు ముందు వర్మగారిని చూడాలి అని వేగంగా అటు వైపు వెళ్ళాడు అజయ్. అంబులెన్స్ లో అందరూ తెల్లని దుస్తుల్లో మాస్క్ లు ధరించి ఉన్నారు. అంబులెన్స్ లో ఒక డాక్టర్ వర్మగారికి ఫస్ట్ ఏయిడ్ చేస్తున్నాడు. ఒక కాంపౌండర్ వర్మగారి వంటి పైన రక్తం శుభ్రం చేసి ఆయన వేసుకున్న కోట్, చొక్కా తీసేస్తున్నాడు.

వర్మగారి మెడలో రెండు బంగారు గొలుసులు, ఒక తాయత్తు వున్నాయి. ఆయన కుడి చేతి మణికట్టుకు మూడు రంగుల దారాలు, వాటికి మళ్ళీ ఒక చిన్న లాకెట్ కూడా వున్నాయి. ఇంకో వైపు ఇంకో కాంపౌండర్ వర్మగారి పాంట్ జోబులు వెతుకుతున్నాడు. వాడికి ఆయన పర్స్ దొరికింది. దానిలో వెతకగా ఒక నీలం రంగు డిజిటల్ కార్డ్ (బ్లూ కార్డ్) ఒకటి దొరికింది. దానిని వాడు వెంటనే తీసి తన దగ్గర దాచుకున్నాడు. మరలా ఆ పర్స్ ఆయన పాంట్ జోబిలో పెట్టేసి, వెంటనే ''డాక్టర్, డిజిటల్ కార్డ్ దొరికింది'' అని చెప్పాడు.

డాక్టర్ తల ఊపి వర్మకి అన్ని రకాల బ్యాండేజ్ లు కట్టాడు. ఆయన వెనకాల వున్న మానిటర్ లో ఆయన నాడి మెల్లగా ఎక్కడో కొట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇంతలో అంబులెన్స్ హాస్పిటల్ లోపలికి వెళ్ళింది. వెంటనే ఆ హాస్పిటల్ డ్యూటి డాక్టర్, స్టాఫ్ ఒక స్ట్రెచ్చర్ తెచ్చి దాని పైన వర్మగారిని పడుకోబెట్టి లోపలికి తీసుకుని వెళ్ళిపోయారు.

ఆ అంబులెన్స్ వెంటనే అవుట్ గేట్ నుంచి వెళ్ళిపోయింది. అజయ్ అప్పుడే ఇన్ గేట్ లోనుంచి లోపలికి వచ్చి, తన బైక్ ని అక్కడ సెక్యూరిటీ గార్డ్ కి ఇచ్చి, పరుగున లోపలికి వెళ్ళాడు. అక్కడ రిసెప్షన్ లో వర్మని ఆపరేషన్ కోసం తీసుకుని వెళ్లారని, తాను అక్కడే వాళ్ళు చెప్పే వరకు వేచి ఉండాలని చెప్పారు. చేసేది ఏమిలేక అజయ్ అక్కడే కుర్చీలో కూర్చున్నాడు.

ఇంతలో వర్మగారి భార్య నందిని హాస్పిటల్ కి వచ్చింది. అజయ్ ఆమెను చూసి, ''మేడమ్ సార్ లోపల ఆపరేషన్ థియేటర్ లో వున్నారు'' అని చెప్పాడు.

నందిని కూడా అజయ్ పక్కనే కూర్చుంది.

*******

డాక్టర్ నందిని దాస్, డాక్టర్ విక్రాంత్ వర్మ గారి భార్య, (ఇద్దరికీ వారు చేసిన Ph.Dల వల్ల డాక్టరేట్ వచ్చింది.) వారిది ప్రేమ వివాహం. నందిని, వర్మకు కాలేజీలో జూనియర్. వర్మ ఆర్కియాలజీ సొసైటి ఆఫ్ ఇండియాలో చేరగా, నందిని ఆర్కియాలజీ ప్రొఫెసర్ గా ఉండేది. వారికి పెళ్ళయిన పన్నెండు సంవత్సరాలకు, లేక లేక ఒక కొడుకు పుట్టాడు. నందిని తన ఉద్యోగంకు రాజీనామా చేసి ఆ పిల్లవాడితోనే ఉండేది. వాడికి వర్ధమన్ అని పేరు పెట్టారు.

వర్ధమన్ కి రెండు సంవత్సరాలు వచ్చినా ఎటువంటి ఎదుగుదల లేదు. డాక్టర్ లు అన్ని పరీక్షలు చేశారు. ఆ పిల్లవాడికి గుండెలో ఒక రంధ్రం ఉందని, వాడు ఎక్కువ రోజులు బ్రతకడని, దానికి చికిత్స లండన్ లో కొంతవరకు చేస్తారని చెప్పారు. వెంటనే నందిని ఆ పిల్లవాడిని తీసుకుని లండన్ వెళ్ళిపోయింది. వర్మ వీలు దొరికినప్పుడల్లా లండన్ వెళ్ళి నందినిని, పిల్లవాడిని చూసి తిరిగి వచ్చేవాడు.

అలా ఆరు సంవత్సరాలు గడిచాయి. వర్ధమాన్ చనిపోయాడు, నందిని తిరిగి ఇండియా వచ్చేసింది. అప్పటి నుంచి వారికి ఏదో కీడు జరిగిందని, దానికి కేవలం దేవుడు, పూజలు రక్షించగలవు అని బాగా నమ్మేది నందిని. నందిని ఆ తరువాత ఎన్నడూ మళ్ళీ ఉద్యోగం చేయలేదు. ఎప్పుడూ వర్మతో ఇంటి పట్టునే ఉండేది. ఎప్పుడైనా మనసు బాగలేకపోతే తన ప్రాణ స్నేహితురాలు రజనీతో కలిసి కొత్త కొత్త ప్రదేశాలకు వెళ్ళి వచ్చేది.

రజనీ, నందినికి లండన్ లో పరిచయం అయ్యింది. రజనీ భర్త దేవ్ లండన్ లో లెక్చరర్ గా పని చేసేవాడు. వాళ్ళకి రెండు సంవత్సరాలు కొడుకు (రంజిత్) వున్నాడు. నందిని, రజనీ పరిచయమైన తరువాత చాలా మంచి

స్నేహితులైపోయారు. దేవ్ కాలేజ్ కి వెళ్లిపోగానే, రజని తన కొడుకుతో నందిని వద్దకు వచ్చి వర్ధమన్ తో, నందినితో రోజంతా గడిపేది.

వర్ధమన్ చనిపోయే మూడు నెలల ముందు, ఒక కార్ ఆక్సిడెంట్ లో దేవ్, వాళ్ళ కొడుకు చనిపోయారు. ఆ బాధని రజనీ తట్టుకోలేకపోయేది. అప్పుడు నందిని, రజనీకు ధైర్యం చెప్పి తోడుగా నిలిచింది. ఇద్దరు కలిసి ఇండియాకు వచ్చేశారు. రజనీ ఇండియా వచ్చేశాక వర్మ సహాయంతో ఒక సాఫ్ట్ వేర్ కంపనీలో ఉద్యోగంలో చేరింది. ఆ కంపెనీ తరపున అనేక దేశాలకు వెళ్ళి వచ్చేది. వీలైనప్పుడు రజనీతో పాటు నందిని కూడా తన స్వంత ఖర్చులతో వెళ్ళేది.

******

ప్రస్తుతం...

హాస్పిటల్ లో ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరుచుకున్నాయి. ఒక డాక్టర్ బయటకు వచ్చాడు. అతనిని చూసి అజయ్, నందిని లేచి ఎదురు వెళ్లారు. హాస్పిటల్ బయట కొంతమంది పోలీస్ లు, ప్రెస్ వాళ్ళు, TV వాళ్ళు గుమికూడారు. వాళ్ళను లోపలికి రానియకుండా హాస్పిటల్ సెక్యూరిటీ, పోలీస్ లు అడ్డుగా వున్నారు.

అజయ్ ఆతృతగా "సార్, ఏం జరిగింది? వర్మగారు ఎలా వున్నారు?" అని డాక్టర్ ని అడిగాడు.

దానికి డాక్టర్, "హి ఈజ్ అవుట్ ఆఫ్ డేంజర్, ఆయనకు ముందు వైపు తగిలిన మూడు బుల్లెట్ లు, వెనుక వైపు తగిలిన ఒక బుల్లెట్ తీసేసాము. ఆయనకు రక్తం చాలానే పోయింది. కానీ, ఆయన ప్రస్తుతం కోమాలో ఉన్నారు. ఆయనని ఇవాళ ఐసిసియు లో ఉంచి చూస్తాం. కానీ, ఇంకో విషయం వెనకాల తగిలిన బుల్లెట్ వల్ల ఆయన వెన్నెముక బాగా పాడైపోయింది. ఆయన ఇక మీదట లేవటం, నడవటం కుదరకపోవచ్చు. మీరు ఒక గంట తరువాత లోపలికి వెళ్ళి చూడవచ్చు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

అప్పుడే ఒక నర్స్ వచ్చి, వర్మగారి ఒంటి మీది బట్టలు, ఆయన మొబైల్ ఫోన్, పర్స్, ఆయన చేతికి, మెడలో వుండే గొలుసులు, తాయత్తులు అన్నీ ఒక బ్యాగ్ లో వేసి తెచ్చి నందినికి ఇచ్చింది. డాక్టర్ మాటలు విన్న నందినికి కళ్ళు తిరుగాయి. తాను అక్కడే క్రింద నేల మీద కూర్చుండిపోయింది.

అజయ్ "మేడమ్, మీరు ధైర్యంగా వుండండి. సార్ కి ఏమి జరగదు, అంతా నార్మల్ అయిపోతుంది" అంటూ ఆమె చేయి పట్టుకుని లేవదీసి కుర్చీలో కూర్చోబెట్టి, "మీరు ఇక్కడే కూర్చోండి, నేను మీకు కాఫీ తీసుకుని వస్తాను" అంటూ కాంటీన్ వైపు వెళ్ళాడు.

ఆ పక్కనే వున్న డ్యూటి నర్స్ ను "మేడమ్ ను చూసుకోండి" అంటూ చెప్పి వెళ్ళిపోయాడు.

నీరసంగా ఉన్న నందినిని చూసిన నర్స్, ఆమెకు నిమ్మరసం తీసుకునివచ్చి ఇచ్చింది. దానితో పాటు బిపి మెషిన్ తెచ్చి బిపి చెక్ చేసింది.

క్యాంటీన్ లో కాఫీకి ఆర్డర్ ఇచ్చి నిలుచున్నాడు అజయ్. స్టేజ్ మీద నుంచి దిగుతున్న వర్మగారికి ముందు నుంచి బుల్లెట్ ల గాయం తగలడం తెలుసు కానీ, వెనుక భాగంలో బుల్లెట్ ఏమిటి? అని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో అజయ్ మొబైల్ కు ఏదో ప్రైవేట్ నెంబర్ నుంచి ఒక కాల్ వచ్చింది. అజయ్ దానిని రిజెక్ట్ చేశాడు. ఒక నిముషం తరువాత మళ్ళీ ఇంకో కాల్, అది కూడా ప్రైవేట్ నెంబర్. అజయ్ కు అనుమానం వచ్చి కాల్ లిఫ్ట్ చేసి, "హలో" అన్నాడు.

అవతలి వైపు వ్యక్తి ఒక గంభీరమైన వాయిస్ తో "ఆ వర్మ అంటే నీకు ఎందుకురా అంత ఇంపార్టెన్స్? ఆ ముసలోడికి నువ్వు దూరంగా ఉండు. లేకపోతే వాడికన్నా ముందు నువ్వు పోతావు" అని చెప్పి కట్ చేశాడు.

అజయ్ 'ఆ కాల్ ఎవరు చేశారు? ఎందుకు చేశారు? వాడికి ఇక్కడ జరిగిన దానికి సంబంధం ఏమిటి? అసలు వాడికి నా మొబైలు నెంబర్, నా వివరాలు ఎలా తెలుసు?' అని ఆలోచనలో పడ్డాడు.

ఇంతలో క్యాంటీన్ బాయ్ "సార్ మీ కాఫీ!" అంటూ పిలిచాడు.

అజయ్ వాస్తవంలోకి వచ్చి, కాఫీ తీసుకుని నందిని వద్దకు వెళ్ళాడు. నందిని అక్కడ వెయిటింగ్ లాంజ్ కుర్చీలో కూర్చుని ఉంది. డ్యూటి నర్స్ ఆమెకు నిమ్మరసం గ్లాస్ ఇచ్చి మెల్లగా తాగమన్నది.

అజయ్ రావడం చూసిన నందిని, "ఐ యామ్ ఆలరైట్ అజయ్" అని "సిస్టర్ ఇప్పుడు మేము వెళ్ళి వర్మగారిని చూడచ్చా?" అని అడిగింది.

"ఒక పావుగంట తరువాత చూడచ్చు, ఇప్పుడు ఆయనకు డ్రెస్సింగ్ చేస్తున్నారు" అంటూ నందిని చేతిలోని ఖాళీ గ్లాస్ తీసుకుని వెళ్ళిపోయింది నర్స్.

అజయ్ తెచ్చిన కాఫీ కప్ నందినికి ఇవ్వబోగా, "వద్దు అజయ్, ఇప్పుడే లెమన్ జ్యూస్ తాగాను" అని చెప్పింది.

అజయ్ తన కప్ కాఫీ తాగేసి, ఇంకో కప్ పారేయడానికి డస్ట్ బిన్ వద్దకు వెళ్ళాడు. అది నిండిపోయి వుంది. కాఫీ కప్ ఎక్కడ పడేయాలా అనుకునే లోపల క్లీనింగ్ అతను రావడం చూసి, అతనికి తన కప్ ఇచ్చి వేగంగా నందిని దగ్గరికి వెళ్ళడం కోసం తిరిగాడు. ఆ ఇవ్వడంలో కాఫీ మొత్తం కింద పోసేశాడు.

వెంటనే అజయ్ తన పొరపాటుకు అతనికి క్షమాపణ చెప్పి వెళ్ళిపోయాడు. ఆ క్లీనింగ్ అతను కొంచెం సణుగుతూ ఆ కప్ ను తాను తెచ్చిన బండి సంచిలో పెట్టి, ఆ కాఫీ పడిన చోటు మొత్తం మాప్ తో శుభ్రపరిచాడు.

పావుగంట తరువాత నర్స్ వచ్చి "మీరు ఇప్పుడు ఆయనను చూడవచ్చు, కేవలం అయిదు నిముషాలు చూసి వచ్చేయ్యండి. రేపు ప్రైవేట్ రూం కు వెళ్ళాక అక్కడే ఉండవచ్చు" అని చెప్పింది.

నందిని, అజయ్ లోపలికి వెళ్ళారు. వర్మ శరీరానికి మొత్తం ఏవో వైర్ లు, గొట్టాలు, ముఖానికి ఆక్సిజన్ మాస్క్ వున్నాయి. ఆయనలో ఎటువంటి కదలిక లేదు. వర్మ పరిస్థితి చూసి, నందినికి ఏడుపు ఆగడం లేదు. అజయ్ మొబైల్ మళ్ళీ మోగింది.

అక్కడే వున్న డ్యూటి నర్స్, "సార్ మీరు ఫోన్ బయటకు వెళ్ళి మాట్లాడుకోండి" అంటూ చెప్పింది.

అజయ్ ఫోన్ కాల్ మళ్ళీ ప్రైవేట్ నెంబర్ కావడంతో, ఈ సారి అజయ్ కి సహనం పోయింది.

తను వడివడిగా బయటకు వచ్చి, కాల్ ఆన్సర్ చేసి "ఎవడ్రా నువ్వు? పిరికి వెధవాలాగా ఫోన్ లో బెదిరిస్తున్నావు. దమ్ము ఉంటే ముందుకు వచ్చి మాట్లాడు" అని గట్టిగా చెప్పాడు.

అప్పుడు అవతలి వైపు నుండి ఒక ఆడ మనిషి "సార్, మీరేమంటున్నారు? నేను జనజీవం పత్రిక జర్నలిస్ట్ స్వాతిని, వర్మగారి గురించి తెలుసుకోవడం కోసం మీకు ఫోన్ చేశాను. ఇదే మొదటిసారి నేను మీకు ఫోన్ చేయడం. నేను హాస్పిటల్ బయటే ఉన్నాను, కావాలంటే మీరు వచ్చి కలవవచ్చు. నన్ను పోలీసులు లోపలికి రానివ్వడం లేదు" అంది.

"సారి, ఇంతకు ముందు ప్రైవేట్ నెంబర్ నుంచి రెండు ప్రాంక్ కాల్స్ వచ్చాయి. అందుకే మరలా అదేనేమో అనుకుని అలా మాట్లాడాను. ఇప్పుడే వర్మగారి గురించి ఏం చెప్పలేం. ఇంకా పెద్ద డాక్టర్ రావాలి, అప్పుడే మాకు విషయం తెలుస్తుంది" అని చెప్పాడు అజయ్.

"చాలా థాంక్స్ సార్, ఏం అప్డేట్ ఉన్నా ముందుగా నాకే చెప్పండి. నేను మీకు నా నెంబర్ మెసేజ్ చేస్తాను. లేకపోతే మీకు అది ప్రైవేట్ అని కనపడుతుంది" అని ఫోన్ కట్ చేసింది.

అజయ్ మళ్ళీ లోపలికి వెళ్ళి అక్కడి నర్స్ ని, "సార్ ని వేరే రూం కి ఎప్పుడు మారుస్తారు?" అని అడిగాడు.

"రేపు పెద్ద డాక్టర్ చెప్పిన తరువాత" అంటూ వాళ్ళను వెళ్ళమని తలుపు వైపు చేయి చూపించి, తను వెళ్ళిపోయింది.

వాళ్ళు బయటకి వచ్చేటప్పటికి ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుల్స్ వున్నారు.

“మేడమ్! మేము అజయ్ ని కొన్ని ప్రశ్నలు వేయాలి. మాతో ఆ పక్క వార్డ్ తీసుకుని వెళుతున్నాం, ఒక్క పావుగంట లోపల వచ్చేస్తాడు” అంటూ... ఆ ఎస్ఐ అజయ్ తో “మీరు మాకు కొంచెం సహకరించండి” అంటూ ఆ పక్కన ఖాళీగా వున్న రూంలోకి అజయ్ ని తీసుకుని వెళ్ళాడు. ఆ కానిస్టేబుల్స్ ఆ రూంకి బయట నిలుచున్నారు.

అజయ్ ఆ ఎస్ఐ తో, “సార్ ముందుగా నేను ఒక ఎఫ్ఐఆర్ ఫైల్ చేయాలి. ఆ తరువాత మీరు నన్ను ఎన్ని ప్రశ్నలయినా వేయచ్చు” అన్నాడు.

దానికి ఆ ఎస్ఐ “అవసరంలేదు అజయ్ గారు, ఆల్రెడీ మేఘ అనే ఒక అమ్మాయి మా స్టేషన్ లో ఎఫ్ఐఆర్ ఫైల్ చేసింది. ఇప్పుడు మేము దాని గురించే ఇక్కడకు వచ్చాము. వర్మ గారికి మీరు సన్నిహితులు, వారితో పనిచేస్తున్నారు. పైగా ఆయన పైన ఈ ఎటాక్ జరిగినప్పుడు కూడా మీరు పక్కనే ఉన్నారు. అందుకే, మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగాలి” అని చెప్పాడు.

“ఇంతకీ... నా పేరు అజయ్ అని మీకు ఎలా తెలుసు?”

“ఆ మీటింగ్ హాల్ లో కాల్పులు జరిగిన తరువాత మా ఇన్వెస్టిగేషన్ టీంకు మీ ఆఫీస్ వాళ్ళు మీ వివరాలు ఇచ్చారు. అలాగే మేఘ ఇచ్చిన ఎఫ్ఐఆర్ లో, సంఘటన సమయంలో మీరు కూడా వర్మ గారి పక్కన ఉన్నట్టు తానే రాసి ఇచ్చింది”

“ఇంతకీ ఈ మేఘ ఎవరు? ఈ ఎఫ్ఐఆర్ ఇవ్వడానికి తనకేం సంబంధం?”

“మేఘ స్కూల్ ఆఫ్ ఆర్క్యాలజీలో ఫైనల్ ఇయర్ మాస్టర్ డిగ్రీ చేస్తోంది. తనకి వాళ్ళ కాలేజీ డీన్ మీ మీటింగ్ ఇన్విటేషన్ ఇచ్చి పంపించారు. తాను అభిమానించే వ్యక్తికి అలా జరగడం చూసి చలించిపోయి, వెంటనే మా స్టేషన్ కు వచ్చి కంప్లైంట్ ఇచ్చింది. సరే ఆ విషయాలు తరువాత మాట్లాడుకుందాం. ముందు మిమ్మల్ని నేను కొన్ని ప్రశ్నలు అడగవచ్చా?”

“సరే అడగండి, మీకేం వివరాలు కావాలో అడగండి”

“మీరు వర్మ గారితో ఎన్ని రోజులుగా పని చేస్తున్నారు?”

“దాదాపు రెండున్నరేళ్లుగా పని చేస్తున్నాను.”

“వర్మ గారికి ఎవరైనా శత్రువులు వున్నారా?”

“వర్మ గారు చాలా మంచి మనిషి, నాకు తెలిసి ఆయన ఎప్పుడు ఎవరినీ ద్వేషించరు. ఆయనకు శత్రువులు ఎందుకు వుంటారు?”

“అలా అయితే ఆయన ప్రాణాలు తీయడానికి ఆయన పైన కాల్పులు ఎవరు జరిపి వుంటారు?”

“ఆ విషయం నాకు తెలియదు, కానీ ఆయన ఎవరితోనూ శతృత్వం పెట్టుకున్నట్టు నేను గమనించలేదు.”

“సరే, ఈ మధ్య అంటే గత కొద్ది రోజులుగా మీరు ఏమైనా అనుమానాస్పద సంఘటనలు, లేదా వ్యక్తులు రావడం, వర్మగారిని కలవడం లాంటివి చూశారా?”

అజయ్ కాసేపు ఆలోచించి ఏదో గుర్తుకు వచ్చినవాడిలా “ఒక నెల రోజులు క్రితం వర్మ గారికి ఎవరో ఫోన్ చేసేవారు. ఆ ఫోన్ వచ్చిన వెంటనే ఆయన కొంచెం కోపం, చికాకు పడేవారు. ఒకోసారి కొత్త నెంబర్ లేదా ఆయన ఆఫీస్ ల్యాండ్ లైన్ ఫోన్ కు ఫోన్ చేసేవారు. ఆ వ్యక్తి ఎవరో తెలియదు కానీ, ఎప్పుడూ శాంత స్వభావంతో వుండే వర్మ గారు, ఆ వ్యక్తిని కోపంగా తనకెప్పుడు మళ్ళీ ఫోన్ చేయవద్దని చెప్పేవారు. కొన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పేవారు.

ఒక రోజు ఒక వ్యక్తి బహుశా తమిళ అతనో లేక మలయాళీనో వర్మ గారి అపాయింట్మెంట్ కోసం ఆఫీసుకు వచ్చారు. ఆ రోజు వర్మగారు కొంచెం కోపంగా ఆయనతో ఏదో మాట్లాడి ఆఫీస్ డోర్ వరకు సాగనంపారు. పైగా ఆయనకు మళ్ళీ ఎప్పుడు అపాయింట్మెంట్ ఇవ్వవద్దనీ ఆయన సెక్రటరీ కస్తూరికి కూడా చెప్పారు. తరువాత నేను అతనిని ఎప్పుడూ చూడలేదు. ఆ తరువాత వర్మ గారికి మళ్ళీ ఎటువంటి ఫోన్ కాల్స్ రాలేదు, ఇదే జరిగింది. ఆ తరువాత అంతా నార్మల్ గానే ఉంది, ఇప్పుడు ఇది జరిగింది” అని చెప్పాడు.

“ఆ తమిళతనో లేక మలయాళీనో మీరు చూస్తే గుర్తు పట్టగలరా?” అడిగాడు ఎస్ఐ.

“లేదు, నేను అతనిని దూరంగా చూశాను. అతను కట్టుకున్న తెల్లని పంచ, నల్లని హాఫ్ షర్ట్, భుజం మీద వేసుకున్న తెల్లని కండువా మాత్రం చూశాను అంతే. బహుశా కస్తూరి చూసి ఉండచ్చు. లేదా మా ఆఫీస్ సీసీటీవీ లో కనపడవచ్చు.”

“ఆ ఫోన్ చేసిన వ్యక్తి, ఆ వచ్చిన వ్యక్తి ఒక్కరేనా?”

“అది నాకు తెలియదు, ఆ విషయం ఎప్పుడూ నేను వర్మ గారితో చర్చించలేదు”

“సరే! మాకు వేరే విషయాలు, లేదా సమాచారం కావాలంటే మిమ్మల్ని కలుస్తాము. అట్లాగే మీకు ఏదైనా తెలిస్తే నాకు తెలియచేయండి. నా పేరు కృష్ణ ప్రసాద్, కేపి అంటారు, నా మొబైలు నెంబర్ ఇది” అని ఒక చిన్న కాగితం మీద రాసి ఇచ్చాడు.

పోలీసులు వెళ్ళిపోయారు, అజయ్ నందిని దగ్గరకు వెళ్ళాడు.

# Chapter 2 - The Gang

మొహెంజదారో ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్ పోర్ట్స్ ఆఫీసు అది. ముందు పక్క రిసెప్షన్, అక్కడ ఒకావిడ కూర్చుని వుంది. ఆవిడ ముందు రెండు మొబైల్ ఫోన్స్, రెండు ల్యాండ్ లైన్ ఫోన్స్ ఒక కంప్యూటర్ వున్నాయి. అక్కడ సోఫాలు, చిన్న టీపాయ్, గోడ మీద నాలుగు పెద్ద గడియారాలు, అవి ఇండియా టైమ్, లండన్ టైమ్, సింగాపుర్ టైమ్, న్యూయార్క్ టైమ్ చూపిస్తున్నాయి. వాటి క్రింద పేర్లు కూడా వ్రాసి ఉన్నాయి. ఆ గడియారాల క్రింద ఒక పెద్ద వాల్ పేపర్ మీద ఒక పెద్ద ఓడ సముద్రంలో ప్రయాణం చేస్తున్నట్టు ఉంది. అక్కడ చాలామంది వర్కర్స్ ఒకటే రకం యూనిఫారం వేసుకుని కొన్ని ఫైల్స్ పట్టుకుని తిరుగుతున్నారు.

కొంతమంది చిన్న చిన్న పార్సిల్స్ పట్టుకుని వెళుతున్నారు. మరికొందరు చిన్న ట్రాలీ లాంటి వాటిలో సామాన్లు తీసుకుని వెళుతున్నారు. ఇంతలో ఒకతను తెల్లని యూనిఫారం వేసుకుని కొన్ని ఫైల్స్ ఒక బ్యాగు పట్టుకుని వచ్చాడు. అతనిని చూడగానే అక్కడి వాళ్ళందరూ అలర్ట్ అయ్యారు. అతని వెనుక ఒకతను ఖరీదైన సూటు వేసుకుని వచ్చాడు. అతను జగత్ సింగ్, మొహెంజదారో ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్ పోర్ట్స్ కంపనీ యజమాని. కొన్ని వేల కోట్లకు అధిపతి.

జగత్ సింగ్ ఆఫీసు లోపలికి రాగానే అందరూ ఆయనకి నమస్కారాలు చేస్తున్నారు. కొంతమంది వినయంగా గుడ్ మార్నింగ్ అంటూ చెపుతున్నారు. జగత సింగ్ అందరికీ తల కొంచెంగా వంచుతూ ప్రతి నమస్కారాలు చేస్తూ లోపలికి వెళ్ళిపోయాడు. జగత్ సింగ్ తన ఛాంబర్ లోకి వెళ్ళి కూర్చున్నాడు. తన టేబుల్ మీద ఇంటర్ కామ్ మీద ఒక నెంబరు ఒత్తి స్పీకర్ లో "డాక్టర్, వాట్ ఈజ్ ద అపడేట్" అని అన్నాడు.

అవతలి వైపు నుంచి "సార్, ఐ యం కమింగ్" అని ఫోను కట్ చేశాడు.

ఐదు నిముషాల తరువాత ఆరాడుగులు వున్న ఒక వ్యక్తి ఒంటి మీద ఒక డాక్టర్ కోటు వేసుకుని వచ్చి జగత్ సింగ్ కి నమస్కరించి "సార్, వర్మ ఇప్పుడు కోమాలో వున్నారు, ఆయన స్పృహలోకి రావడానికి కనీసం మూడు నెలలు పట్టవచ్చు. మనం ఆ లోపల మన పని త్వరగా ముగించుకోవాలి. వర్మను అంబులెన్స్ లో తీసుకుని వెళ్ళేటప్పుడు తన దగ్గర మనకు కావలసిన బ్లూ డిజిటల్ కార్డ్ దొరికింది. దాని సహాయంతో మనం తన ఆఫీస్ లోనికి వెళ్ళవచ్చు, తన సేఫ్ లాకర్ తెరిచి మనకి కావలసిన ఇన్ఫర్మేషన్ తీసుకుని మన పని పూర్తి చేసుకోవచ్చు" అన్నాడు.

"డాక్టర్, మీరు చెప్పింది బాగుంది. కానీ మనం వర్మ ఆఫీసు లోపలికి ఎలా వెళ్లగలము? దట్ ఇస్ ఎ సెక్యుర్డ్ ప్లేస్, అక్కడ సెక్యూరిటీ చాలా స్ట్రాంగ్, ఒక వేళ వెళ్ళినా మనకు కావలసిన పని ముగించే లోపల మనం దొరికిపోవచ్చు, జస్ట్ థింక్ ఎబౌట్ దట్" అని జగత్ సింగ్ అన్నాడు.

"సార్, నేను ఇవన్నీ ముందే ఆలోచించి కావలసిన ఏర్పాట్లు చేశాను. ఇఫ్ యు డోంట్ మైండ్, విత్ యువర్ పర్మిషన్ ---" అని అక్కడి టెబుల్ మీది ఇంటర్ కామ్ నుంచి రిసెప్షన్ కి కాల్ చేసి,

"శిల్ప, ఆ విజిటర్ రూములో వున్న ఆ ఇద్దరినీ బాస్ రూమ్ కు పంపించు" అని ఫోన్ పెట్టేశాడు.

రెండు నిముషాల తరువాత జగత్ సింగ్ రూముకు ఒక పోలీసు ఆఫీసర్, ఇంకో వ్యక్తి సుమారు యాభై అయిదు ఏళ్లు పైనే వుంటాయి సఫారి డ్రస్ వేసుకుని వచ్చారు.

"సార్, ఇతను ఇన్స్పెక్టర్ రవి, మన మనిషే, ఇతను దుర్గారావు వర్మగారి ఆఫీసులో వర్మగారి పిఏ, మనకు సహాయం చేయడం కోసం వచ్చారు" అని డాక్టర్ ఆ వచ్చిన ఇద్దరినీ చూపించి చెప్పాడు. ఆ వచ్చిన వాళ్ళిద్దరూ జగత్ సింగ్ కి నమస్కరించారు.

"మాకు మీ సహాయం చాలా అవసరం, మీరు మాకు చేసే సహాయానికి మీకు తగిన విలువ కట్టి మేము మీకు ఇస్తాము, మిమ్మల్ని సంతోష పెట్టడం మా ధర్మం" అని జగత్ సింగ్ అన్నాడు.

దానికి ఆ ఇద్దరూ సంతోషంగా తలలు వూపారు.

“ఒకే డాక్టర్, మీరు ఇంక జరగవలసిన పని చూడండి. మనకు అసలే టైమ్ చాలా తక్కువ వుంది. మీరు రవి గారిని, దుర్గారావుగారిని చూసుకోండి, గెట్ ది వర్క్ డన్, ఐ వాంట్ రెగ్యులర్ అప్డేట్స్, ప్లేజ్ టేక్ కేర్” అని జగత్ సింగ్ చెప్పాడు.

డాక్టర్, రవి, దుర్గారావు బయటకి వెళ్లారు.

******

రవి ఒక లోకల్ రాజకీయ నాయకుడికి అక్రమంగా నడిపే మద్యం దుకాణాల విషయంలో సహాయపడ్డాడని సస్పెండ్ చేశారు. ఇక దుర్గారావు లంచాలు తీసుకునే డిపార్ట్మెంట్లో పని చేయక పోవడం వల్ల ఎక్కువ డబ్బు కూడపెట్టలేదు. తను బాగా డబ్బు సంపాదించి తన ఇద్దరి కూతుర్లకు పెళ్ళి, కొడుకుకి మంచి చదువు చెప్పించాలని అనుకున్నాడు. వీళ్ళ బలహీనతలు తెలిసిన డాక్టర్ వీళ్ళకు డబ్బు ఆశ చూపి తన పనులు చేయించుకోవాలని ప్రయత్నం మొదలుపెట్టాడు.

జగత్ సింగ్ నడిపే మొహెంజదారో ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్ పోర్ట్స్ భారత దేశం నుంచి ఇతర దేశాలకు అలాగే ఇతర దేశాల నుంచి భారత దేశంకు అనేక సరుకులు రవాణా చేస్తారు. ఆ వ్యాపారంతోనే జగత్ సింగ్ కు టర్కీలో వుండే జాన్సన్, విల్సన్ సోదరులతో పరిచయం ఏర్పడింది. జాన్సన్, విల్సన్ కు జె-డబ్ల్యూ సన్స్ అండ్ ఏంటిక్స్ అనే కంపనీ వుంది. ఆ పేరుతో వాళ్ళు అనేక దేశాల పురాతన వస్తువులు సేకరించి అమ్ముతారు. వాళ్ళు మెల్లగా భారత దేశం నుంచి పురాతన వస్తువులు, దేవతా మూర్తులు, శిల్పాలు దొంగతనంగా అమ్మడం మొదలు పెట్టారు. ఆ వ్యాపారంలో జగత్ సింగుకు 30% వాటా కూడా ఇచ్చారు.

డాక్టర్, అసలు పేరు నాగేందర్, అందరూ నాగ్ అని పిలిచే వారు. చిన్నతనం నుంచి తనకు కార్డియాలజిస్ట్ అవ్వాలని కోరిక. చదువులో ఎంతో చురుకు, కానీ ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడేవాడు. కష్టపడి స్కాలర్షిప్ మీద అనుకున్నది సాధించాడు. ఒక ప్రైవేటు హాస్పిటల్ లో డాక్టర్ గా చేరాడు. అక్కడే జగత్ సింగ్ తండ్రి విశ్వజిత్ సింగ్ అనారోగ్యంతో చేరాడు. అప్పుడే నాగ్ కి జగత్ సింగ్ కి పరిచయం అయ్యింది. అనుకోకుండ అక్కడ ఒక పేషంట్ కు ఆ హాస్పిటల్ ఓనరయిన డాక్టర్ ఇచ్చిన మందు వికటించి గుండెపోటుతో మరణించాడు. ఆ తప్పు నాగ్ మీదకు తోసి అతనిని పనిలో నుంచి తీసేశారు. ఆ తరువాత తనకు ఎక్కడా వుద్యోగం దొరకలేదు. స్వంత క్లినిక్ పెట్టుకుంటే ప్రాణాలు తీసే డాక్టర్ అని అందరూ అనడంతో అది మూసుకున్నాడు. ఆ సమయంలో జగత్ సింగ్ తన తండ్రిని ఇంటి దగ్గర వైద్యం ఇప్పించడం కోసం నాగ్ ని తన ఇంటిలో పర్సనల్ డాక్టర్ గా వుంచుకున్నాడు. అప్పటి నుంచి నాగ్ జగత్ సింగ్ కు ఎంతో ఋణపడిపోయాడు. నాగ్ కు వైద్యమే కాదు ఇంకా ఎన్నో విషయాలు తెలుసు, బాగా తెలివైనవాడు. కొద్ది రోజులలోనే జగత్ సింగ్ కు నమ్మకమైన, ముఖ్యమైన వ్యక్తిగా మారిపోయాడు.

ఉదయం పదకొండు గంటలు, ఎ ఎస్ ఐ ఆఫీస్. దుర్గారావు ఆఫీస్ లోపలికి వచ్చాడు. అక్కడ రిసెప్షన్ లో కూర్చునివున్న కస్తూరి “ఏమిటి దుర్గా రావుగారు, గంట లేటుగా వస్తున్నారు ఇవాళ” అని అంది.

దుర్గారావు “వర్మ సార్ కి అలా జరగడం నన్ను కలవరపెట్టింది. నేను ఇవాళ అసలు సెలవు పెట్టేద్దామనుకున్నాను. కానీ వుండలేక పోయాను, హాస్పిటల్ లో వర్మ సార్ ను రెండు రోజుల తరువాత చూడవచ్చని చెప్పారు. అజయ్ అక్కడే నందిని మేడమ్ దగ్గరే వున్నాడంట. నేను ఇందాక అజయ్ కి ఫోను చేస్తే చెప్పాడు” అని అన్నాడు.

దుర్గారావు అక్కడ అటెండన్స్ రిజిస్టర్ లో సంతకం పెట్టి వర్మ గారి కేబిన్ వైపు వెళ్ళాడు. కొంత సమయం తరువాత ఇన్స్పెక్టర్ రవి అక్కడికి వచ్చి కస్తూరి దగ్గర “మేడమ్, ఐ అం ఇన్స్పెక్టర్ రవి, ఐ అం డీలింగ్ విత్ ది మిస్టర్ వర్మ షూటింగ్ కేస్, నాకు ఇన్వెస్టిగేషన్ కోసం కొంత సమాచారం కావాలి. నేను వర్మగారి ఆఫీస్, ఆయనతో పని చేసే వాళ్ళను కొన్ని ప్రశ్నలు అడగాలి” అని అంటూ తన ఐడెంటిటీ కార్డ్ చూపించాడు.

వెంటనే కస్తూరి “సార్, వర్మ సార్ పర్సనల్ అటెండెంట్ దుర్గారావుగారిని పిలుస్తాను. ఆయన మీకు కావలసిన వివరాలు ఇస్తారు. తరువాత మీరు ఎవరిని కాలవాలనుకుంటే వారిని ఇక్కడ ఆ మీటింగ్ రూమ్ లో కలవవచ్చు” అని అంటూ దుర్గరావును ఇంటర్కాం లో పిలిచింది.

దుర్గారావు రిసెప్షన్ దగ్గరకు వచ్చాడు.

“దుర్గారావుగారు, ఈయన ఇన్స్పెక్టర్ రవి, వర్మ సార్ కేసు విషయంలో ఏదో ఇన్వెస్టిగేషన్ చేయాలంట, కొంచెం ఆయనకు సహాయం చేయండి” అంది కస్తూరి. ఇంతలో ఏదో ఫోను మోగితే వెంటనే అది తీసుకుని మాట్లాడడం మొదలుపెట్టింది కస్తూరి.

రవిని మొదటిసారి చూస్తున్నట్టుగా దుర్గారావు ఒక సారి చూసి, ఇటు వైపు రండి అంటూ లోపలికి తీసుకొనివెళ్ళాడు. దుర్గరావు, రవి... వర్మ ఛాంబర్ లోనికి వెళ్లారు. దుర్గారావు శబ్దం రాకుండా లోపలి నుంచి తలుపు లాక్ చేశాడు. వెంటనే రవి తెచ్చిన బ్లూ కార్డ్ తీసుకుని అక్కడి ఫైల్ సేఫ్ లాకర్ తెరిచాడు. దానిలో మూడు అరలు వున్నాయి, అడుగు అర మీద “క్లోసడ్ కేసెస్” అని, మధ్య అర మీద “వర్కింగ్ కేసెస్” అని, అన్నిటికన్నా పైన అర మీద “ఇంపార్టంట్ కేసెస్” అని వ్రాసి వుంది. వాటిలో ప్రతీ అరలో చాలా ఫైల్స్ వున్నాయి. రవికి దుర్గారావుకు వాటిలో ఎ ఫైల్ చూడాలో అర్ధం కాలేదు. వెంటనే రవి... నాగ్ కు ఫోన్ చేశాడు. ఆ సేఫ్, దానిలో అరల గురించి చెప్పాడు. ఎందులో నుంచి ఏ ఫైల్ తీసుకోవాలో తెలియడం లేదని కొంచెం వివరంగా చెపితే వాటిని తీసుకుని వస్తానని చెప్పాడు. నాగ్ పది నిముషాలలో చెప్తాను అని ఫోన్ కట్ చేశాడు. చేసేది లేక ఇద్దరూ అక్కడే కూర్చున్నారు. రవి వర్మ ఛాంబర్ లో గోడల మీద వున్న రకరకాల ఫోటోలు, అక్కడ అద్దాల పెట్టెలలో వున్న కొన్ని రాళ్ళు, చిన్న చిన్న మట్టి రాళ్ళు, లోహపు వస్తువులు, ఒక గోడ పైన వున్న రక రకాల మ్యాపులు చూస్తున్నాడు. ఇంతలో రవి కి నాగ్ ఫోన్ చేసాడు.రవిని అక్కడ వున్న అన్ని అరలలోని ఫైల్స్ ను వాటి పేర్లని మొబైల్ తో ఫోటోలు తీసి తనకు పంపమన్నాడు.

రవి దుర్గారావు సహాయంతో ఒక్కో అర లోని ఫైల్స్ ఫోటోలు తీస్తున్నాడు. అవి రెండు మూడు వరుసలలో వున్నాయి. ఒక్కో అరలో దాదాపు నలభై యాభై ఫైల్స్ వుండవచ్చు. సుమారు రెండు గంటల పాటు కష్టపడి అన్ని ఫోటోలూ తీశారు. మరలా నాగ్... రవికి ఫోను చేసి వెంటనే తన దగ్గరకు రావాలని చెప్పి ఫోను పెట్టేశాడు. ఏం జరిగిందో తెలియని రవి వెంటనే ఆ ఫైల్స్ అన్నీ లోపల పెట్టి సేఫ్ లాక్ చేయమని దుర్గారావుకు చెప్పాడు. ఆ హడావుడి లో దుర్గారావు ఫైల్స్ తారుమారుగా ఆ అరలలో పెట్టి సేఫ్ లాక్ చేశాడు. రవి ఆ బ్లూ కార్డ్ తన జేబులో పెట్టుకుని ఇద్దరూ బయటకి వచ్చారు.

రవి కస్తూరి దగ్గరకు వచ్చి “మేడమ్, ఇప్పటికి నాకు కావలసిన సమాచారం నేను దుర్గరావును అడిగి తెలుసుకున్నాను. అవసరం బట్టి నేను మళ్ళీ మళ్ళీ వస్తూ వుంటాను” అని వెళ్ళిపోయాడు.

దుర్గారావు లోపలికి వెళ్ళిపోయాడు.

*****

నాగ్, రవి ఎదురు ఎదురుగా కూర్చున్నారు.

“రవి, మీరు అక్కడ ఆ ఛాంబర్ లో అంత సమయం వుండి వుండకూడదు, ఎవరికైనా అనుమానం వచ్చే అవకాశం వుంది. పైగా మీరు ఇప్పుడు సస్పెండ్ అయ్యివున్నారు, మీ గురించి బయట తెలిస్తే మీకు మాకు కూడా నష్టం” అన్నాడు డాక్టర్.

“సారి నాగ్, లోపల సమయం తెలియలేదు, పైగా అక్కడ ఫైల్స్ చాలా వున్నాయి. వాటన్నింటి ఫోటోలు తీసేటప్పటికి చాలా టైమ్ పట్టింది. ఆ ఫోటోలు అన్నీ మీకు నేను ఇప్పుడు వాట్సప్ చేస్తాను. మీరు వాటిని చూసి మీకు కావలసిన ఫైల్ ఏదో చెపితే నేను తెస్తాను” అన్నాడు రవి.

నాగ్ మళ్ళీ కాల్ చేసి చెపుతానని చెప్పి రవిని పంపించేశాడు.

*****

సమయం సాయంత్రం నాలుగు, పోలీసు కమీషనర్ ఆఫీసు, చాలా మంది పోలీస్ ఉన్నతాధికారులు అందరూ అక్కడ కాన్ఫరెన్స్ హాల్ లో వున్నారు. కమిషనర్ మిత్ర లోపలికి ఒక ల్యాప్టాప్ తీసుకుని వచ్చారు. అందరూ లేచి నిలబడి ఆయనకి సెల్యూట్ చేశారు. ఆయన అందరినీ కూర్చోమన్నట్టు చేయి చూపిస్తూ... ఆయన సెంటర్ కుర్చీలో కూర్చున్నారు. ఆయన దగ్గర వున్న ల్యాప్టాప్ ను వీడియో ప్రొజెక్టర్ కు కనెక్ట్ చేసి పెద్ద స్క్రీన్ మీద వర్మ గారి ఫోటో వేశారు.

"ఆఫీసర్స్, నిన్న జరిగిన షూట్ అవుట్ లో ఆర్కియాలజి సొసైటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విక్రాంత్ వర్మ బాగా గాయపడి ప్రస్తుతం కోమాలో వున్నారు. అసలు ఆయనను ఎందుకు? ఎవరు? దేనికి టార్గెట్ చేశారని మనం తెలుసుకోవాలి. వీ నీడ్ టు సాల్వ్ దిస్ అండ్ అరెస్ట్ ది కల్ప్రిట్స్" అన్నాడు మిత్ర.

స్క్రీన్ మీద వర్మ ముందు రోజు మీటింగ్, అక్కడ ఆయన బుల్లెట్ గాయాలతో పడిపోవడం చిత్రాలు వస్తున్నాయి.

"వర్మ గారికి ముందు నుంచి మూడు బుల్లెట్లు, వెనుక వైపు ఒక బుల్లెట్ తగిలింది. ఆయన పక్కన, వెనుక అంతమంది వుండగా ఆయనను వెనుక నుంచి ఎవరు, ఎలా కాల్చరన్నది నిజంగా ఒక పెద్ద మిస్టరీ గా ఉంది. నా అనాలసిస్ ప్రకారం ఆ ముందు తగిలిన మూడు బుల్లెట్లు లాంగ్ రేంజ్ నుంచి ఫైర్ చేసివుండవచ్చు, సొ దిస్ ఇస్ ఏ ప్లాన్డ్ మర్డర్ అటెంప్ట్. అసలు దీని వెనుక ఎవరు వున్నారు? కారణం ఏమిటి? అన్నది మనం ఇన్వెస్టిగేట్ చేయాలి. ఐ వాంట్ టు హేండ్ ఓవర్ దిస్ క్రిటికల్ అండ్ ప్రెస్టీజియస్  కేస్ టు అవర్ ఏ సి పి క్రాంతి. క్రాంతి, మీకు ఈ కేసులో సహాయంగా వుండడం కోసం ఇన్స్పెక్టర్ గౌతంను అసైన్ చేస్తున్నాను" అని అనగానే క్రాంతి, గౌతం ఇద్దరు లేచి నిలుచున్నారు.

మిగతా పోలీస్ ఆఫీసర్స్ అందరూ వాళ్ళకు "బెస్ట్ ఆఫ్ లక్" అని చపట్లు కొట్టారు.

క్రాంతి "థాంక్ యు వెరీ మచ్ సార్, నా మీద నమ్మకంతో ఇంత భాధ్యత నా మీద ఉంచినందుకు నేను మీ పేరు నిలబెట్టడానికి, ఈ కేసు అతి త్వరగా పరిష్కరించి దోషులను చట్టం ముందు నిలబెట్టడానికి నా అన్ని శక్తులు పణంగా పెట్టి పని చేస్తాను. ఇన్స్పెక్టర్ గౌతం, ఈ కేసులో మీరు ఎంతో కీలకం, హోప్ దట్ ఐ గెట్ అల్ ది రిక్వైర్డ్ సపోర్ట్ అండ్ హెల్ప్ ఫ్రమ్ యు టు సాల్వ్ దిస్ కెస్" అని మిత్ర వైపు తిరిగి "సార్, ఈ కేసులో మాకు ఏమైనా సలహాలు, కాషన్స్, వార్నింగ్స్ ఏమయినా వున్నాయా?" అన్నాడు.

"క్రాంతి అండ్ గౌతం, ఈ కేసుకు సంబంధించి కొన్ని సూచనలు, ఇది చాలా హై ప్రొఫైల్ కేసు. మీకు దీనికి సంబంధించి కొంత రాజకీయంగా, ప్రభుత్వ పరంగా, లేదా కొంత మంది బడా బాబుల దగ్గర నుండి ఒత్తిడి రావచ్చు. బట్, మీరు దేనికి లొంగవలసిన పనిలేదు. మీరు మీ విధులు చేసుకునిపొండి. ఇందులో అంతర్జాతీయ నేరస్తులు కూడా వుండి వుండవచ్చు. మీకు ఎప్పుడైనా టాస్క్ ఫోర్స్ కావాలంటే మీకు సిద్ధంగా వుంటుంది. మీరు ఏదైనా కీలకమైన నిర్ణయం తీసుకునే ముందు నాకు ఒక్క మాట చెప్పండి, మీకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నేను చూసుకుంటాను" అని చెప్పి,

అక్కడ వున్న అందరి ఆఫీసర్స్ ను ఉద్దేశించి "ఆఫీసర్స్, క్రాంతికి, గౌతం కి ఎటువంటి సహాయం కావాలన్న, వారికి మీ సహకారాలు అందించండి, లెట్ అస్ అల్ వర్క్ టుగేథర్ టు సాల్వ్ దిస్ కెస్" అని ముగించి లేచాడు మిత్ర.

అందరూ నిలబడి మిత్రకి సెల్యూట్ చేశారు. ఒక్కొక్కరుగా అందరూ ఆ రూమ్ లోనుంచి బయటకు వెళ్లిపోయారు. క్రాంతి, గౌతం ఇద్దరూ అక్కడే వున్నారు.

"గౌతం, మనం ఈ కేసు గురించి కావలసిన బేసిక్ ఇన్ఫర్మేషన్ కలెక్ట్ చేసి, ఇద్దరం ఒక ప్లాన్ ప్రకారం పని చేద్దాం" అన్నడు క్రాంతి.

దానికి గౌతం "ఎస్, నేను అదే అనుకున్నాను. ముందుగా మనం ఆ ఎఫ్ ఐ ఆర్ ఇచ్చిన అమ్మాయిని, ఆ తరువాత ఆ కాన్ఫరెన్స్ హాల్ కి వెళ్ళి అక్కడ సీన్ రీక్రియేట్ చేసి అప్పుడు యాక్షన్ ప్లాన్ వేద్దాము" అన్నాడు.

క్రాంతి తన సమ్మతం చెపుతున్నట్టు థంమ్సప్ చూపాడు. ఇద్దరూ వాళ్ళ ఫైల్స్, కాప్స్ తీసుకుని బయలుదేరారు. గౌతం ఎఫ్ ఐ ఆర్ కాపీ తీసుకుని అందులో వున్న మేఘ మొబైల్ నెంబర్ కు కాల్ చేశాడు.

‘‘హలో, నా పేరు గౌతం. నేను వర్మ గారి షూట్ అవుట్ కేసు ఇన్వెస్టిగేట్ చేస్తున్న ఇన్స్పెక్టర్ ని, రేపు ఉదయం పది గంటలకి మీరు ఒక సారి బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ కు రావాలి. జస్ట్ ఫర్ ఫార్మాలిటీ అండ్ టు ఆన్సర్ ఏ ఫ్యూ క్వెషన్స్. రేపు ఉదయం కలుద్దాము’’ అన్నాడు గౌతం.

‘‘షుర్ సార్, ఐ విల్ బి దేర్’’ అని చెప్పి ఫోన్ కట్ చేసింది మేఘ.

# Chapter 3 - The Attempt

రాత్రి పదకొండు గంటలు దాటింది. హాస్పిటల్ లో అంతా నిశబ్దంగా ఉంది. డ్యూటిలో ముగ్గురు లేడి నర్స్ లు, ఇద్దరు మేల్ నర్స్ లు మాత్రం ఉన్నారు. నందినికి ఆ హాస్పిటల్ లోనే ఒక గెస్ట్ రూమ్ ఇచ్చారు. అజయ్ ఐసిసియు బయట, విజిటర్ లాంజ్ లో బల్ల మీద పడుకున్నాడు.

కొంత సమయం తరువాత ఎవరో వచ్చినట్టు అలికిడి మొదలయ్యింది. అజయ్ ఆ అలికిడి విని, అది ఎక్కడో అనుకుని కనీసం కళ్ళు తెరిచి కూడా చూడలేదు. కొంతసేపటికి బిగ్గరగా కాలింగ్ బెల్ శబ్దం విని, ఒక్క ఉదుటున లేచి ఐసిసియు దగ్గరకి పరిగెత్తాడు. ఇంతలో ఎవరో ఇద్దరు ముసుకులు వేసుకుని హాస్పిటల్ బయట వైపుకి పరుగెడుతూ కనపడ్డారు.

"ఏయ్! ఎవరు మీరు?" అని అజయ్ గట్టిగా అరుస్తూ, వారిని వెంబడించడానికి పరిగెత్తాడు. ఇంతలో, వాళ్ళు అక్కడ చీకటిలో ఆగి ఉన్న బైక్ లు ఎక్కి పారిపోయారు.

అజయ్ హడావిడిగా ఐసిసియు వైపు పరిగెత్తాడు. ఐసిసియు లో వర్మ గారిని చూశాడు అజయ్. ఆయన ఇంకా కోమాలోనే ఉన్నారు. ఆయన బెడ్ పక్కన, క్రింద ఒక స్టాంప్ పాడ్, కొన్ని తెల్ల కాగితాలు పడి ఉన్నాయి. వర్మ ఎడమ చేతివేళ్ళకు ఇంక్ పూసి ఉంది.

వర్మ పక్క బెడ్ మీద ఉన్న అతను దాహంతో నీళ్ళ కోసం ఆ కాలింగ్ బెల్ వాడాడు. అది విని ఆ వచ్చిన వాళ్ళు భయంతో పారిపోయారని అజయ్ గ్రహించాడు. అజయ్ కోపంగా నర్సెస్ స్టేషన్ దగ్గరకి వెళ్ళాడు. అక్కడ వాళ్ళందరూ మత్తుగా కింద పడిపోయి ఉన్నారు.

బయటకు వెళ్ళి చూస్తే, ఆ వింగ్ (భాగం) సెక్యూరిటీ గార్డ్ తలకు దెబ్బ తగిలి, కిందపడి ఉన్నాడు. గోడకు ఉన్న సీసీటీవీ కామెరాలు విరిగిపోయి వెళ్ళాడుతున్నాయి. అజయ్ వెంటనే కేపి కి ఫోన్ చేసి ఇక్కడి విషయాలు చెప్పాడు.

తర్వాత, నర్సెస్ స్టేషన్ లో వాళ్ళందరి మీద నీళ్ళు చల్లి వాళ్ళను లేపాడు. బయట సెక్యూరిటీ గార్డ్ కి వాళ్ళు కట్టు కట్టి ఇంజెక్షన్ చేశారు. అతడు బాధతో మూలుగుతున్నాడు.

ఇంతలో అజయ్ కి నందిని గుర్తుకు వచ్చి లోపలికి పరుగెత్తాడు. నందిని రూమ్ లోపలి నుంచి లాక్ చేసి ఉంది.

"మేడమ్, మేడమ్!" అంటూ తలుపు మీద తట్టాడు అజయ్.

కొంతసేపటికి లోపలి నుండి నందిని మెల్లిగా వచ్చి తలుపు తీసి, "అజయ్, ఏమయ్యింది?" అంది.

ఆమె క్షేమంగా ఉండడం చూసి అజయ్ ఊపిరి పీల్చుకున్నాడు.

అజయ్ మెల్లిగా అక్కడ జరిగిన విషయం నందినికి చెప్పాడు. ఆమె హడావిడిగా ఐసిసియు కి వెళ్ళింది. అక్కడ వర్మ నిశ్చింతగా పడుకుని ఉన్నాడు.

ఇంతలో కేపి ఒక ముగ్గురు కానిస్టేబుల్స్ వచ్చారు. అక్కడ జరిగిన తంతు చూసి ఆశ్చర్యపోయారు. కేపి సెక్యూరిటీ గార్డ్ దగ్గరకి వెళ్ళాడు.

అతనిని "నీ పేరేంటి? అసలు ఇక్కడ ఏం జరిగింది? నీకు గుర్తు ఉన్నది మొత్తం చెప్పు" అన్నాడు.

ఆ సెక్యూరిటీ గార్డ్ బాధతో, కొద్దిగా ఆయాసం వచ్చిన వాడిలా అక్కడ ఓ పి లో బెడ్ మీద ఉన్నాడు.

కొద్దిగా ఓపిక తెచ్చుకుని, "సార్, నా పేరు లాల్. నేను ఇక్కడ సెక్యూరిటీ గార్డ్ గా ఎనిమిది సంవత్సరాల నుంచి పని చేస్తున్నాను. ఇవ్వాళ జరిగినట్టు ఎన్నడూ జరగలేదు. ఇంచుమించు పదకొండు గంటలప్పుడు బైక్ మీద ఇద్దరు వచ్చారు. ఇద్దరు నల్ల డ్రెస్ లు వేసుకుని ఉన్నారు. ఆ ఇద్దరు నా దగ్గరకి వచ్చి, వాళ్ళు ప్రెస్ వాళ్ళమని వర్మగారికి ఏదో ఇవ్వాలని, ఆయన ఎక్కడ ఉన్నారు అని అడిగారు.

నేను 'ఆయన ఐసిసియు లో ఉన్నారు, ఇప్పుడు విజిటర్స్ లోపలికి వెళ్ళకూడదు. మీరు ఆయనకు ఇవ్వవలసినది ఇక్కడ పెట్టి వెళ్ళిపోండి. రేపు ఉదయం, పది తరువాత రండి' అని చెప్పాను. వెంటనే అందులో ఒకడు, ఒక ఇనుప రాడ్ తీసుకొని నా తల పైన గట్టిగా కొట్టాడు. నేను కింద పడిపోయాను. ఆ తరువాత ఏమి జరిగిందో నాకు తెలియదు'' అని చెప్పాడు.

లాల్ చెప్పిన అన్ని విషయాలు ఒక కానిస్టేబుల్ తన ఫోన్ లో రికార్డ్ చేశాడు. ఇంకొక కానిస్టేబుల్ తన నోట్ పుస్తకంలో వ్రాసుకున్నాడు. కేపి నర్సెస్ స్టేషన్ దగ్గరకి వెళ్ళి ఏం జరిగిందో చెప్పమన్నాడు. వాళ్ళలో ఒక మేల్ నర్స్ ''సార్, మేము అందరం ఇక్కడే భోజనం చేసి మాట్లాడుకుంటున్నాము. సాధారణంగా రాత్రి ఇక్కడ పెద్దగా హడావిడి ఉండదు. ప్రతి రెండు గంటలకి మేము ఐసిసియు డ్యూటీ మారుతాము. అప్పుడే అక్కడ డ్యూటీ దిగి నాన్సీ వచ్చింది. తరువాత డ్యూటీకి గీత వెళ్ళాలి. నాన్సీ గీతకి పేషెంట్ వివరాల రిజిస్టర్ ఇచ్చి అన్నీ వివరిస్తోంది. ఇంతలో ఇద్దరు లోపలికి వచ్చి మా అందరి మీద ఏదో స్ప్రే చేశారు. అంతే! మేమందరం కింద మూర్ఛవచ్చిన వాళ్ళలాగా పడిపోయాం. ఆ తరువాత ఈ అజయ్ సార్ వచ్చి మమల్ని లేపేదాకా ఏం జరిగిందో మాకు తెలియదు!'' అన్నాడు.

ఆ విషయాలన్నీ మళ్ళీ ఫోన్ లో రికార్డ్ చేసి, నోట్ పుస్తకంలో వ్రాసుకున్నారు.

కేపి , లాల్ ని ''వాళ్ళ ముఖాలు గుర్తు పట్టగలవా?'' అనడిగాడు.

దానికి లాల్, ''సార్, నాకు వాళ్ళ ముఖాలు కనపడలేదు. ఇక్కడకు వచ్చిన వాళ్ళు మాత్రం ముఖలకు పెద్ద మాస్క్ పెట్టుకున్నారు. వాళ్ళ ముఖం అంతా బాగా కనపడలేదు'' అని చెప్పాడు.

వెంటనే ఆ మేల్ నర్స్, ''అవును సార్, వాళ్ళ ముఖాలు కనపడకుండా పెద్ద మాస్క్ లు పెట్టుకున్నారు'' అని చెప్పాడు.

ఆ వచ్చిన కానిస్టేబుల్ లో ఒకరు, ''లాల్, వాళ్ళు మీతో మాట్లాడారు కదా! వారి భాష, గొంతు ఏమైనా గుర్తు పట్టగలరా?'' అనడిగాడు.

వెంటనే లాల్ ఏదో గుర్తుకు వచ్చినట్టు, ''సార్, వాళ్ళు నాతో తెలుగులోనే మాట్లాడారు కానీ, వాళ్ళ తెలుగు ఎందుకో...! ఎవరో తమిళ్ వాళ్ళు మాట్లాడినట్టు అనిపించింది'' అన్నాడు.

వెంటనే కేపి ''అది తమిళ్ వాళ్ళు తెలుగు మాట్లాడినట్టు ఎందుకు అనిపించింది?'' అనడిగాడు.

''సార్, నేను ఇక్కడ ఎనిమిది సంవత్సరాల నుంచి పని చేస్తున్నాను. ఈ హాస్పిటల్ కి ఎంతోమంది ఎన్నో రాష్ట్రాల నుంచి వస్తారు. నేను వాళ్ళ బాషను బట్టి వాళ్ళు ఏ రాష్ట్రం వాళ్ళో కనిపెట్టగలను'' అన్నాడు లాల్.

కేపి, అజయ్ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. వాళ్ళు ఆ ఉదయం మాట్లాడుకున్న తమిళ్, కేరళ మనిషి గురించి సందేహం వచ్చింది కేపి కి, అజయ్ ఇద్దరు సెక్యూరిటీ సీసీటీవీ రూమ్ కి వెళ్ళారు. వాళ్ళు అక్కడ మానిటర్ లో చూస్తే మూడు స్క్రీన్ లు బ్లాంక్ గా ఉన్నాయి. కేపి సీసీటీవీ రికార్డర్ ప్లే చేశాడు.

ఇద్దరు వ్యక్తులు మెయిన్ గేటు దగ్గర బైక్ లు దిగి, లాల్ కూర్చున్న దగ్గరకు వచ్చారు. వాళ్ళల్లో ఒకడు పొడవుగా ఉండి, ఒక బ్యాక్ ప్యాక్ వేసుకొని ఉన్నాడు. ఇద్దరు నల్ల డ్రెస్ లు వేసుకుని, పెద్ద మాస్క్ లు పెట్టుకుని ఉన్నారు. వాళ్ళు లాల్ తో మాట్లాడారు, ఇంతలో ఆ పొడవాటి వాడు, వాడి బ్యాక్ ప్యాక్ నుండి ఒక రాడ్ తీసి లాల్ తల మీద కొట్టాడు. వెంటనే లాల్ కింద పడిపోయాడు.

రెండోవాడు ఎంతో నేర్పుగా రాళ్ళు తీసుకుని సీసీటీవీ కామెరాలను కొట్టాడు. అవి విరిగిపోయాయి. ఆ తరువాత వీడియో బ్లాంక్ అయ్యిపోయింది. వెంటనే కేపి ఐసిసియు యూనిట్ సీసీటీవీ ఫూటేజ్ చూశాడు. ఆ ఇద్దరు ఏవో స్ప్రే బాటిల్స్ తీసి, అక్కడ ఉన్న అందరి నర్సెస్ మీద స్ప్రే చేయగానే అందరూ ఒక్కసారిగా పడిపోయారు.

ఆ వచ్చిన ఇద్దరు ఐసిసియు కి వెళ్ళారు. ఆ తరువాత ఒక నిముషానికి వాళ్ళు పరుగున బయటకి పోవడం, కొన్ని క్షణాల తరువాత అజయ్ వాళ్ళని వెంటాడడం చూశారు. ఏ వీడియోలోనూ వాళ్ళకి ఆ వచ్చిన వ్యక్తుల ముఖాలు కనపడలేదు.

కేపి తనతో వచ్చిన ఇద్దరు కానిస్టేబుల్స్ ని అక్కడే కాపలాగా ఉంచి, ఇంకొక కానిస్టేబుల్, తను ఉదయం వస్తామని చెప్పి వెళ్ళిపోయారు. అజయ్ నందినిని రూంకి పంపించి, తాను ఐసిసియు ముందు కూర్చున్నాడు.

# Chapter 4 - The Trial

ఉదయం పది గంటలు, బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ లో క్రాంతి తన రూంలో ఏవో ఫైల్స్ చూస్తున్నాడు. పక్కన గ్లాస్ లో టీ ఉంది, ఎదురుగా కానిస్టేబుల్ శ్రీశైలం నిలుచుని ఉన్నాడు. ఆ ముందు రోజు హాస్పిటల్ లో జరిగిన తంతు మొత్తం వ్రాసింది శ్రీశైలమే. ఇన్స్పెక్టర్ కేపి తను ఇద్దరు హాస్పిటల్ జరిగిన విషయలు క్రాంతికి, గౌతమ్ కు చెప్పడానికి వచ్చారు. బయట హాల్ లో గౌతమ్, తన ఎదురుగా కేపి ఇద్దరు కూర్చుని టీ తాగుతూ మాట్లాడుకుంటున్నారు.

ఇంతలో సెంట్రీ వచ్చి, "సార్! ఎవరో మేఘ అంట, మిమ్మల్ని కలవడానికి వచ్చారు. పంపించమంటారా?" అన్నాడు.

గౌతమ్ పంపించు అన్నట్టు తల ఊపాడు. మేఘ లోపలికి వచ్చింది. గౌతం ఆమెని తన ఎదురుగా కేపి పక్కన ఉన్న కుర్చీలో కూర్చోమన్నాడు.

"హలో! నేను ఇన్స్పెక్టర్ గౌతం, నిన్న మీతో ఫోన్ లో మాట్లాడింది నేనే. ఈయన ఇన్స్పెక్టర్ కృష్ణ ప్రసాద్, అందరూ కేపి అంటారు. ఇతను వర్మగారి కేస్ ఇన్వెస్టిగేషన్ ఇన్స్పెక్టర్, మీరు ఎఫ్ఐఆర్ ఈయన స్టేషన్ లోని వారికే ఇచ్చారు. నేను, ఏసిపి క్రాంతి గారు క్రైమ్ అండ్ ఇన్వెస్టిగేషన్ టీం. మీరు ఆ రోజు అక్కడ జరిగినది మొత్తం మాకు చెప్పండి. ఆ తరువాత మేము మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు వేస్తాము" అన్నాడు.

"ఆరోజు ఉదయం పదకొండు గంటలకి వర్మగారి మీటింగ్ ఉందని తెలిసి, నేను మా డీన్ ని అడిగి ఎంట్రీ పాస్ తీసుకున్నాను. నా థిసీస్ కు కావలసిన ఎన్నో విషయాలు నేను వర్మ గారు పబ్లిష్ చేసిన వైట్ పేపర్స్, డాక్యుమెంట్స్, బుక్స్ చూసి తెలుసుకున్నాను. అందుకే ఆయనని పర్సనల్ గా ఒక్కసారైనా చూడాలని మా డీన్ ని అడిగి పాస్ తీసుకున్నాను. నేను సుమారు పదిన్నర గంటలకి మీటింగ్ హాల్ కి వచ్చాను. అక్కడ నా ఎంట్రీ పాస్ చూసి స్టూడెంట్స్ ఏరియాలో కూర్చోమన్నారు. అప్పటికే, అక్కడి వలంటీర్స్ మాకు పాఖసోయ గురించి కొన్ని హ్యాండ్ అవుట్స్ ఇచ్చారు. నేను అవి చదువుతూ నా సీట్ లో కూర్చున్నాను.

స్టేజి మీద కొంత మంది వాలంటీర్స్, ఏఎస్ఐ స్టాఫ్ ఉన్నారు. వాళ్ళందరూ మెడలో ఐడి కార్డ్స్ వేసుకుని, మీటింగ్ రిబ్బన్ బ్యాండేజెస్ పెట్టుకుని ఉన్నారు. కరెక్ట్ గా పది యాభైకి వర్మగారు, అజయ్, ఇంకో ఇద్దరు స్టేజ్ మీదకు వెనుక వైపు నుండి వచ్చారు. అందరినీ కూర్చోమని మైక్ లో చెప్పారు. ఆ తరువాత వర్మ గారు పాఖసోయ గురించి చెప్పి, మాకు ఉన్న ప్రశ్నలని చీటీలలో వ్రాసి అక్కడ ఉన్న బాక్సాస్ లో వేయమని ఆయన క్రిందకు దిగారు.

ఇంతలో ఎక్కడి నుంచో ఆయన మీదకి ఎవరో గన్ తో కాల్చారు. వెంటనే ఆయన పక్కన ఉన్న అజయ్ మీద పడిపోయారు. అజయ్ అంబులెన్స్ అని అరిచారు. ఆ తరువాత అంబులెన్స్ వచ్చి ఆయనని తీసుకుని వెళ్ళింది. ఆ తరువాత అక్కడికి పోలీస్ లు వచ్చారు. మీటింగ్ హాల్ తలుపులు వేసి, పోలీస్ లు ఒక్కొక్కరిని పరికించి చూసి బయటకు వెళ్ళమన్నారు. నేను అక్కడ ఉన్న పోలీస్ కి ఒక పేపర్ లో ఎఫ్ఐఆర్ వ్రాసి ఇచ్చాను" అని చెప్పింది మేఘ.

"వర్మ గారితో పాటు ఉన్న వాళ్ళలో మీకు ఎవరైనా అనుమానంగా కనపడ్డారా? లేదా ఏమైనా విచిత్రంగా ప్రవర్తించడం చూశారా? ఆయనకు ముందు నుండి తగిలిన బుల్లెట్స్ మాత్రమే కాదు, ఆయన వెనక కూడా ఒక బుల్లెట్ ఉంది. అంటే, ఆయన వెనుక ఉన్న వారిలో ఎవరో కాల్చారు. మీరు అక్కడ ఏమైనా చూసినది గుర్తు తెచ్చుకుని చెప్పండి" అన్నాడు గౌతమ్.

"అక్కడ నాకు గుర్తు ఉన్నంతవరకు అంతా నార్మల్ గానే ఉంది" అంది మేఘ.

కేపి "అంటే ఎవరైనా అనుమానంగా తిరగడం, చేయకూడని పనులు చేయడం, లేదా ఇంకేమైనా..." అన్నాడు.

మేఘ, ఏదో గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇంతలో టీ కప్ లు తీయడానికి వచ్చిన పిల్లాడు, తన చేతిలోని ట్రేతో ఆడుతూ దానిని కింద పడేశాడు. భయంతో అందరినీ చూస్తూ దానిని క్రింద నుండి తీసుకుని, ఖాళీ టీ కప్ లు ఆ ట్రేలో పెట్టుకుని వెళ్ళిపోయాడు.

వెంటనే ఏదో గుర్తుకు వచ్చిన దానిలాగా "సార్, ఇప్పుడు జరిగినట్టుగానే అక్కడ కూడా స్టేజ్ మీద వర్మ సార్ రావడానికి ముందు, సన్నగా కొంచెం పొడవుగా ఉన్న ఒకతను అక్కడ పరధ్యానంగా తిరుగుతూ అక్కడ స్టేజ్ మీద పెట్టిన ఫ్లవర్ వాజ్ ని తగిలి కింద పడేశాడు. మరలా తానే దానిని తీసి సరిగ్గా పెట్టాడు. వర్మ సార్ కి బుల్లెట్ తగిలినప్పుడు తను కూడా ఆయన వెనకే, ఆయనకు వేసిన పూలదండలు అవీ పట్టుకుని ఉన్నాడు. కానీ, ఆ తరువాత నేను అతనిని గమనించలేదు" అంది.

వెంటనే కేపి, గౌతం ఇద్దరు ఒకేసారి "అతనిని చూస్తే మీరు గుర్తు పట్టగలరా?" అని అన్నారు.

దానికి మేఘ సంకోచంగా, "ఖచ్చితంగా చెప్పలేను కానీ, గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తాను" అని అంది.

"థాంక్ యు మేఘ. ఇప్పటికి ఈ ఇన్ఫర్మేషన్ చాలు, మేము మిమ్మల్ని తరువాత కాంటాక్ట్ చేస్తాము. మీరు కొంచెం టైము చేసుకుని ఇంకోసారి రావలసి ఉంటుంది. హోప్ యు ఆర్ ఒకే విత్ దట్" అన్నాడు గౌతం.

"పరవాలేదు సార్, ఒక రెస్పాన్సిబుల్ సిటిజన్ గా అది నా కర్తవ్యం. నేను మీరు పిలిచినప్పుడు తప్పకుండా వస్తాను" అని లేచి వెళ్ళిపోయింది మేఘ.

లోపల నుంచి క్రాంతి గౌతమ్ ని, కేపిని పిలిచాడు.

*******

హాస్పిటల్ క్యాంటీన్ లో అజయ్ నందిని కాఫీ తాగుతున్నారు. నందిని వాళ్ళ ఆయా నిర్మలమ్మ, ఒక పెద్ద బ్యాగ్ లో బట్టలు, నందినికి కావలసిన వస్తువులు తీసుకుని వచ్చింది. ఆమె వెనకాలే రజనీ కూడా ఆతృతగా వచ్చింది.

"మేడమ్, నేను మా ఇంటికి వెళ్ళి ఒక టూ అవర్స్ లో ఫ్రెష్ అయ్యి వచ్చేస్తాను. ఆ లోపల సార్ ని ప్రైవేట్ రూమ్ కి మారుస్తారు. నేను వచ్చే వరకు ఇక్కడ మీకు సహాయంగా మీ ఫ్రెండ్, మెయిడ్, ఆ కానిస్టేబుల్స్ ఉంటారు" అన్నాడు అజయ్.

నందిని 'సరే' అన్నటుగా తల ఊపింది.

అజయ్ లేవబోతుండగా తన ఫోన్ మోగింది. జర్నలిస్ట్ స్వాతి ఫోన్ చేస్తోంది.

"హలో స్వాతి గారు" అన్నాడు అజయ్.

"హలో అజయ్ గారు, రాత్రి హాస్పిటల్ లో ఏదో గొడవ జరిగిందని విన్నాను. ఏమయ్యింది?" అనడిగింది స్వాతి.

"ఏం లేదులెండి, స్మాల్ ఇన్సిడెంట్ అంతే. మీరు దానిని పెద్దది చేయకండి, ఏమైనా విషయం ఉంటే నేనే మీకు ఫోన్ చేసి చెప్తాను" అని కట్ చేశాడు. 'ఈ న్యూస్ వాళ్ళకు అన్నీ విషయాలు ఎలా తెలుస్తాయో ఏమిటో!' అనుకుంటూ నందినితో, "మేడమ్, నేను వెళ్ళి వస్తాను" అని బయలుదేరాడు.

*****

మురుగన్ మ్యూజికల్స్ అండ్ ఇన్స్ట్రుమెంట్స్ షాప్ అది. అందులో అనేక రకాల సంగీతం వాయిద్యాలు ఉన్నాయి. లోపల నడవడానికి మాత్రం చిన్న త్రోవ ఉంచి, తక్కిన స్థలమంతా వీణాలు, మృదంగాలు, తంబూరాలు, తబలాలు, ఘటాలు, హార్మోనియంలు, వయొలిన్ లు, వగైరాలు ఉన్నాయి. గోడల మీద పెద్ద త్యాగరాజ స్వామి ఫోటో ఒకటి, పక్కన సుబ్రమణ్య స్వామి, శివుడు పార్వతి, వేంకటేశ్వర స్వామి ఫోటోలు ఉన్నాయి.

మంచి ధూప అగరువత్తి వాసన వస్తోంది. అక్కడ ఉన్న కౌంటర్ లో ఒక నడి వయస్సు ఆవిడ ఒక అడ్డ విబూది బొట్టు, దాని కింద ఒక కుంకుమ బొట్టు పెట్టుకుని, కొంచెం పెద్ద అద్దాలు, కొప్పు చుట్టూ తలలో పూలు పెట్టుకుని, వెనకాల వినపడుతున్న యం ఎస్ సుబ్బులక్ష్మి విష్ణు సహస్రనామంతో పాటు తను కూడా పాడుతోంది.

వెనకాల గదిలో ఏదో గొడవ గోడవగా ఎవరో మాట్లాడుకుంటున్నారు. ఆ మాటలు పెద్దగా బయటకు వినపడడం లేదు కానీ, వాళ్ళు కొన్నిసార్లు తమిళంలో, కొన్నిసార్లు తెలుగులో వాదించుకుంటున్నారు. ఆ గది లోపల ఒక నడి వయసు అతను తెల్ల అడ్డపంచ, నల్ల సిల్క్ కాటన్ చొక్కా, పైన ఒక కండువా వేసుకుని, నుదిటికి విబూది అడ్డ బొట్టు పెట్టుకుని ఉన్నాడు. అతనిని చూస్తే ఆ షాప్ యజమానిలాగా ఉన్నాడు. ఎదురుగా ఇద్దరు కుర్రాళ్ళు చేతులు కట్టుకుని తలవంచుకుని ఉన్నారు.

ఆయనే కుప్పుసామి, ఆ షాప్ ఓనర్. ఎక్కడో తంజావూరులో పుట్టి, సంగీతం మీద ఆసక్తితో బాగా నేర్చుకుని, తరువాత తన ఇరవయ్యో ఏట చెన్నైకి వచ్చి అక్కడ ఒక మూజికల్స్ షాప్ ఐదేళ్లు పనిచేసి, డబ్బు కూడబెట్టుకుని, కొద్దిగా తెలుగు నేర్చుకుని తిరుపతిలో తన తమ్ముడితో కలిసి మురుగన్ మూజికల్స్ మొదటి షాప్ పెట్టాడు. అటు నుంచి వచ్చిన లాభాలతో ఇప్పుడు దానికి నాలుగు బ్రాంచీలు పెట్టాడు.

మనిషి చూడడానికి మృదువుగా ఉన్నా డబ్బు దగ్గర, వ్యాపారంలో మటుకు చాలా ఖటువుగా ఉంటాడు. ఆ బయట ఉన్నావిడ కుప్పుసామి భార్య గోమతి. ఆవిడ సంగీతంలో దిట్ట, వ్యాపారంలో భర్తకు ఏమాత్రం తీసిపోదు.

కుప్పుసామి కోపంతో, ''ఆడ పావిగళ, మీరు చేసిన పనికి నాన్ తిట్లు తింటున్నాను. ఒక్క పని సరియ పణ్ణ మాటే, అంతా కుర్రవాన్ల ఆవేశం ఎక్కువ. కొంచెం బుద్ధి పెట్టి పని శేస్తే బాగుండు. ఇప్పుడు నేను ఆ పెద్ద సారుకు, ఆ కోటువానికి కాళ్ళు పట్టుకుని సర్ది చెప్పవాలే. ఎందుకురా ఇట్లా సేస్తారు? మీకు అన్నీ మంచిగా సెప్పి దానే నేను పంపినాను. హే మురుగా!'' అంటూ తల పట్టుకున్నాడు.

ఆ ఇద్దరిలో పొడవుగా ఉన్నవాడు, ''మొదలాలి, మేము అంతా సరిగానే సేసినాము. ఇంతలో ఆ బెల్ సౌండ్ వచ్చింది. అప్పుడే ఆ అజయ్ వచ్చినాడు, మేము మా ముఖాలు చూపలేదు, నీటుగా ఓడి వచ్చినాము'' అన్నాడు.

''ఆమ, ఒడిదా వచ్చినారు. సరి పోయి వేల పారు'' అంటూ వాళ్ళని పొమ్మన్నాడు కుప్పుసామి.

ఇంతలో తన మొబైల్ మోగింది.

''సార్, వణ్ణక్కమ్, చెప్పండి సార్'' అన్నాడు.

అవతలి నుంచి నాగ్ ''ఏమిటిది కుప్పుసామి? ఏం జరుగుతోంది? మీరు చేసే పని ఎంత రిస్క్ అని మీకు తెలుసు, అలాంటిది మీరు కొంచెం మంచి తెలివైన కుర్రాళ్లను పంపవలసింది. ఇంకా నయం, ఎవరికి అనుమానం రాలేదు కాబట్టి సరిపోయింది. లేదంటే, అందరం కడ్డీల వెనకాల కబడ్డీ ఆడుకోవాల్సి వచ్చేది. ఇప్పటికైనా కొంచెం జాగ్రత్త!'' అని ఫోన్ కట్ చేశాడు.

కుప్పుసామి తల మీద చేయి పెట్టుకుని కుర్చీలో కూర్చున్నాడు.

నాగ్ తన రూంలో తన టేబుల్ మీద ఉన్న ల్యాప్టాప్ తీసి, దానిలో ఇన్స్పెక్టర్ రవి పంపిన వాట్సప్ డాక్యుమెంట్స్ ఇమేజెస్ చూస్తున్నాడు. దానిలో సుమారు 215 ఇమేజెస్ ఉన్నాయి. డాక్టర్ వాటిలో కనీసం ఇప్పటికే ఒక వంద ఇమేజెస్ చూశాడు, తనకి కావలసినది మాత్రం దొరకలేదు. నాగ్ కి మెల్లిగా సహనం తగ్గుతోంది. తనకు కావలసిన డాక్యుమెంట్ దొరకపోతే చాలా రిస్క్ చేయవలసి వస్తుంది. దానికి ధన, ప్రాణ నష్టం జరగవచ్చు, ఊహించుకుంటేనే కష్టంగా ఉంది.

# Chapter 5 - First Investigation

ఏసిపి క్రాంతి, ఇన్స్పెక్టర్ గౌతమ్ ఏఎస్ఐ ఆఫీస్ కి వచ్చారు. అక్కడ రిసెప్షన్ లో కస్తూరి ఏవో ఫైల్స్ చూసుకుంటోంది.

అక్కడికి వచ్చి, ''హలో గుడ్ మార్నింగ్! నేను ఏసిపి క్రాంతి, ఈయన ఇన్స్పెక్టర్ గౌతమ్. మేము వర్మ గారి కేస్ ఇన్వెస్టిగేషన్ చేస్తున్నాము. మీ నుండి మాకు కొంత ఇన్ఫర్మేషన్ కావాలి'' అంటూ తన ఐడి కార్డ్ చూపించాడు క్రాంతి.

''గుడ్ మార్నింగ్ సార్. చెప్పండి, నేను మీకు ఏం ఇన్ఫర్మేషన్ ఇవ్వగలను?'' అంది కస్తూరి.

''మేడమ్, మీరు ఏమి అనుకోకపోతే, కెన్ వి యూజ్ ఏ మీటింగ్ రూమ్?'' అడిగాడు గౌతమ్.

''తప్పకుండా'' అని, అక్కడే ఉన్న హౌస్ కీపింగ్ బాయ్ ని పిలిచి, అక్కడ రిసెప్షన్ కొంతసేపు చూసుకోమని క్రాంతిని, గౌతమ్ ని ఆ పక్కన ఉన్న విజిటర్ మీటింగ్ రూమ్ కు తీసుకుని వెళ్ళింది.

''మేడమ్, ఆ మీటింగ్ రోజు మీ ఆఫీస్ నుంచి అక్కడ డ్యూటీకి వెళ్ళిన అందరి డీటైల్స్ కావాలి. అవసరమైతే మేము వాళ్ళని ఇంటరాగేట్ చేస్తాము. ఇట్ ఈస్ పార్ట్ ఆఫ్ అవర్ డ్యూటీ'' అన్నాడు క్రాంతి.

''మేడమ్, ఇది వరకు వర్మ గారిని కాలవడానికి ఒక తమిళ్ లేదా, మలయాళీ అతను ఇక్కడకు వచ్చినట్టు మాకు తెలిసింది. ఆ విషయంలో వర్మ గారు కాస్త డిస్టర్బ్ అయినట్టుగా కూడా తెలిసింది. మాకు ఆ వివరాలు కూడా కావాలి'' అన్నాడు గౌతమ్.

''షూర్ సార్, మీకు ఆ రోజు ఆన్ మీటింగ్ డ్యూటీ వాళ్ళ అన్నీ వివరాలు ఇస్తాను. అవును సార్, కొన్ని రోజుల క్రితం కుప్పుసామి అనే ఒక తమిళ్ అతను వర్మ సార్ అపాయింట్మెంట్ కోసం తెగ ఫోన్ చేసేవారు. వర్మ సార్ అతనిని ఎప్పుడూ కలవడానికి ఇష్టపడలేదు. ఒకసారి ఆయనే నేరుగా ఆఫీస్ వచ్చేసి నన్ను రిక్వెస్ట్ చేసి, సార్ చాంబర్ కి వెళ్ళారు. అక్కడ ఏం జరిగిందో నాకు తెలియదు కానీ, కొంతసేపటికే వర్మ సార్ ఆయనను బయటకు తీసుకుని వచ్చి వెళ్ళిపొమ్మన్నారు. ఇంకెప్పుడూ ఆయనను ఇక్కడకు అనుమతించ వద్దని చెప్పారు. నాకు అంతే తెలుసు. వర్మ సార్ కుప్పుసామిని ఎందుకు అవాయిడ్ చేశారో! ఎందుకు బయటకు పంపారో! నాకు ఇప్పటికీ తెలియదు. నేను వర్మ సార్ ని అడగలేదు'' అంది.

''ఓకే, మీ దగ్గర ఆ కుప్పుసామి అడ్రెస్, లేదా వేరే కాంటాక్ట్ ఇన్ఫర్మేషన్ ఉంటే ఇవ్వండి'' అన్నాడు క్రాంతి.

''షూర్ సార్, అది మా విజిటర్స్ బుక్ లో ఉంటుంది. నేను చూసి ఇస్తాను'' అని లేచింది కస్తూరి.

అందరూ బయట రిసెప్షన్ దగ్గరకు వచ్చారు.

''మీ సీసీటీవీలో ఆ కుప్పుసామి వీడియో ఉండి ఉండవచ్చు. మేము చూడొచ్చా?'' అనడిగాడు క్రాంతి.

''షూర్ సార్, మా సీసీటీవీ ఆపరేటర్ వినయ్ మీకు చూపిస్తాడు'' అంటూ ఇంటర్ కాంలో వినయ్ ని పిలిచింది.

కస్తూరి కుప్పుసామి అడ్రస్, వివరాలు క్రాంతి, గౌతమ్ కు ఇచ్చింది. వినయ్ కి కస్తూరి ఆ వచ్చిన ఇద్దరు పోలీస్ ల గురించి చెప్పి, వాళ్ళకు కావలసిన వీడియో రికార్డింగ్ చూపించమంది. క్రాంతి, గౌతమ్ వినయ్ తో పాటు వీడియో సర్వర్ రూంకి వెళ్ళారు. కుప్పుసామి అక్కడికి సరిగ్గా 28 రోజుల క్రితం వచ్చాడు. ఆ వివరాలు కస్తూరి విజిటర్స్ బుక్ నుంచి ఇచ్చింది. వినయ్ ఆ 28 రోజుల క్రితం వీడియో రికార్డింగ్ చూపించాడు.

ఆ వీడియోలో___ కుప్పుసామి చంకలో ఒక చిన్న బ్యాగ్ పెట్టుకుని, కస్తూరి దగ్గర మాట్లాడి లోపలికి వెళ్ళాడు. కొంతసేపటి తరువాత వర్మ కుప్పుసామిని బయటకు వెళ్ళమని చెపుతూ బయటకి వచ్చాడు. కుప్పుసామి ఏదో బ్రతిమాలుకుంటున్నాడు. వర్మ అతనిని బయటకు పంపించేసి, కస్తూరికి ఇక మీదట అతనిని రానివ్వ వద్దని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ వీడియోలో కుప్పుసామి స్పష్టంగా కనిపించలేదు కానీ, అతనిని కొద్దిగా గుర్తుపట్టవచ్చు. క్రాంతి, గౌతమ్, వినయ్ ని ఆ వీడియోను విడిగా కాపీ చేసి ఉంచమని చెప్పి బయటకు వచ్చారు. కస్తూరి మీటింగ్ రోజు అక్కడికి వెళ్ళిన స్టాఫ్ అందరి వివరాలు ప్రింట్ తీసి ఇచ్చింది. అవసరమైతే మళ్ళీ వస్తామని కస్తూరికి చెప్పి బయటకు వచ్చారు.

బయటకు వచ్చిన క్రాంతికి ఏదో గుర్తుకు వచ్చి, మళ్ళీ లోపలికి వెళ్ళాడు. గౌతమ్ వెనకాలే వెళ్ళాడు. క్రాంతి కస్తూరి దగ్గరకి వెళ్ళి, "మీరు ఇక్కడకు వచ్చిన అందరి విజిటర్స్ వివరాలు ఈ బుక్ లో వ్రాస్తున్నారు, మరి మా వివరాలు ఎందుకు వ్రాయలేదు?" అని అడిగాడు.

దానికి కస్తూరి "సార్, ఇక్కడకు వచ్చే విజిటర్స్ ఎవరినైనా కలవాలంటేనే ఈ రిజిస్టర్ లో ఎంట్రీ వేస్తాము, లేదంటే వేయము. అదీకాక మీరు పోలీస్ వాళ్ళు, వర్మ సార్ కేస్ ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారు, అందుకే నేను వ్రాయలేదు. అలాగే నిన్న ఇన్స్పెక్టర్ రవి వచ్చినప్పుడు కూడా నేను ఎంట్రీ వేయలేదు" అని అంది.

క్రాంతి, గౌతమ్ ఇద్దరు "ఇన్స్పెక్టర్ రవి" అని ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"అవును సార్, నిన్న ఆయన వచ్చి వర్మ సార్ రూమ్ చూడాలని వెళ్ళారు. ఆయన లోపల చాలాసేపు ఉన్నారు. ఆ తరువాత వెళ్ళిపోయారు. దుర్గారావు ఆయనను లోపలికి తీసుకుని వెళ్ళారు" అని అంది కస్తూరి.

వెంటనే క్రాంతి "మేము ఆ దుర్గారావును ఒక సారి కాలవచ్చునా?" అన్నాడు.

"సారి సార్, దుర్గారావు ఇవ్వాళ రాలేదు. ఆయనకి ఒంట్లో బాగోలేదని ఉదయం ఫోన్ చేసి చెప్పారు" అంది కస్తూరి.

"సరే, ఆయన ఫోన్ నెంబర్, అడ్రస్ ఇవ్వండి, మేము కలుస్తాము" అన్నాడు గౌతమ్.

కస్తూరి కంప్యూటర్ లో నుంచి దుర్గారావు వివరాలు ప్రింట్ తీసి ఇచ్చింది. అవి తీసుకుని ఇద్దరు వెళ్ళిపోయారు.

******

అజయ్ సీతానగర్ లో, ఒక రెసిడెన్షియల్ కాలనీలో ఒక చిన్న ఇండిపెండెంట్ ఇంట్లో అద్దెకి ఉంటున్నాడు. అజయ్ ఇంటికి వెళ్ళి తలుపు తీశాడు, ఇల్లు మొత్తం చిందర వందరగా ఉంది. అన్ని సామాన్లు ఎగుడు దిగుడుగా పడేసి ఉన్నాయి. అజయ్ కి అంతా అయోమయంగా ఉంది.

ఇంట్లోని హాల్, బెడ్రూం, కిచెన్ అంతా చెత్త కుప్పలాగా ఉంది. అలా ఎవరు చేశారు? ఎందుకు చేశారు? తనకు తెలియదు. హాల్ లోని గోడ మీద ఎర్రని స్ప్రే పెయింట్ తో "వర్మ నుంచి దూరంగా పో, లేదంటే ఇంకా దారుణం చూస్తావు" అని వ్రాసి, దాని పక్కన ఒక కత్తి బొమ్మ వేసి ఉంది.

అజయ్ వెంటనే కేపికి కాల్ చేసి ఇక్కడ జరిగింది చెప్పాడు. కేపి "అక్కడికి వస్తాను" అని చెప్పి ఫోన్ కట్ చేశాడు.

*****

క్రాంతి, గౌతమ్ ముందుగా వర్మ మీద కాల్పులు జరిగిన మీటింగ్ హాల్ కి వెళ్ళారు. ఆ మీటింగ్ హాల్ ప్రస్తుతం పోలీస్ ల అధీనంలో ఉంది. వాళ్ళు అక్కడి వెళ్ళగానే, అక్కడ ఉన్న కానిస్టేబుల్స్ సెల్యూట్ చేసి వాళ్ళని లోపలికి పంపించారు. వాళ్ళు ముందుగా వెళ్ళి అక్కడి మేనేజర్ ని కలిశారు. ఆ రోజు అక్కడ ఏర్పాట్లు చూసుకోవడానికి వచ్చిన వాళ్ళు, మీటింగ్ హాల్ స్టాఫ్ వివరాలు అడిగారు.

"మీటింగ్ హాల్ పనివాళ్ళు మొత్తం ఆరు మంది, ముగ్గురు మగవాళ్ళు, ముగ్గురు ఆడవాళ్ళు. వాళ్ళు అక్కడ బల్లలు ఏర్పాటు చేయడం, కుర్చీలు వేయడం, హాల్ మొత్తం శుభ్రపరచడం చేస్తారు. ఆ రోజు కూడా అవే పనులు చేసి, వాళ్ళు హాల్ వెనకాల ఉన్న గదిలో ఉన్నారు. ఇక ఏఎస్ఐ స్టాఫ్ వచ్చి వర్మ, అజయ్ కాకుండా ఎనిమిది మంది వచ్చినట్టుగా చెప్పాడు. వాళ్ళందరికీ తానే స్వయంగా టీ స్నాక్స్ సప్లయ్ చేయించినట్టు చెప్పాడు. కానీ, కస్తూరి ఇచ్చిన లిస్ట్ లో ఏడు మంది మాత్రమే ఆ రోజు మీటింగ్ డ్యూటీకి వచ్చినట్టు ఉంది.

క్రాంతి తన దగ్గర ఉన్న ఏఎస్ఐ స్టాఫ్ వివరాలు చెప్పకుండా, ఆ వచ్చిన ఎనిమిది మంది పేర్లు, వివరాలు ఇవ్వమన్నాడు.

"సార్, మేము వాళ్ళ వివరాలు ఏవి వ్రాసుకోలేదు. మేము ఈ హాల్ రెంట్ కు ఇచ్చేటప్పుడు వాళ్ళకు ఎప్పటి నుంచి ఎప్పటిదాకా అనీ, వాళ్ళకు ఇచ్చేటప్పుడు కరెంట్ మీటర్ రీడింగ్ మాత్రమే వ్రాసుకుంటాము. మిగతా విషయాలు మాకు

అవసరం ఉండదు. అసలు వాళ్ళకు రెంట్ కు ఇచ్చిన తరువాత మేము, మా స్టాఫ్ వెనకాల ఉన్న మా ఆఫీస్ వెయిటింగ్ రూమ్ కి వెళ్ళిపోతాము'' అని చెప్పాడు.

''మరి మీరు వాళ్ళకు స్నాక్స్, టీ సప్లయ్ చేశామని చెప్పారు'' అన్నాడు గౌతమ్.

''అవును, ఏఎస్ఐ స్టాఫ్ వాళ్ళు వచ్చే ఒక అరగంట ముందు ఒక లావుపాటి ఆయన బైక్ లో ఒక స్టీల్ హాట్ ప్యాక్ లో సమోసాలు, ఒక క్యాన్ లో టీ ఇచ్చి, అవి ఏఎస్ఐ కేంటీన్ నుంచి పంపినవని, ఆ వచ్చిన స్టాఫ్ కు పెట్టమని చెప్పి ఇచ్చి వెళ్ళిపోయాడు. నేను వాళ్ళు రాగానే మా స్టాఫ్ తో ఇప్పించాను. ఆ హాట్ ప్యాక్, టీ క్యాన్ ఇంకా ఇక్కడే ఉన్నాయి'' అని ఆ పక్కన ఒక టేబుల్ మీద ఉన్న హాట్ ప్యాక్, క్యాన్ ను చూపించాడు.

గౌతమ్ వాటిని చూసి ఫోటోలు తీసుకున్నాడు.

''మీరు ఆ వచ్చిన ఏఎస్ఐ స్టాఫ్ వాళ్ళను మేము చూపిస్తే గుర్తుపట్టగలరా?'' అని అడిగాడు

''తప్పకుండా గుర్తుపట్టగలను'' అన్నాడు మేనేజర్.

''సరే, మీరు మాతో పాటు ఒక సారి ఏఎస్ఐ ఆఫీస్ కి రండి. వాళ్ళను గుర్తుపట్టి చూపిస్తే చాలు'' అన్నాడు క్రాంతి.

''సరే! నేను వస్తాను, పదండి'' అంటూ లేచాడు మేనేజర్.

*******

కేపి అజయ్ ఇంటికి వచ్చాడు. తనతో పాటు కానిస్టేబుల్ శ్రీశైలం కూడా ఉన్నాడు. అజయ్ ఇంటి బయట కూర్చుని ఉన్నాడు.

''రండి కేపి, చూడండి వేసిన తాళాలు వేసినట్టే ఉన్నాయి. కానీ, ఇంట్లో మొత్తం బీభత్సం చేసి వెళ్ళిపోయారు. ఎవడో పిరికి వెధవ, నన్ను నేరుగా ఎదురుకోలేక ఇలాంటి వెధవ వేషాలు వేస్తున్నాడు'' అని అన్నాడు అజయ్.

శ్రీశైలం ఇంట్లో జరిగిన తంతు చూడడానికి హాల్ లోకి వెళ్ళాడు. కేపి, అజయ్ ఇంటి ముందు నిలుచుని ఉన్నారు.

''అజయ్, మీరు వర్రీ కావద్దు. ఇది మనం సాల్వ్ చేద్దాం, ఇలా చేసిన వాడిని పట్టుకుందాం. మీరు అంతవరకు కొంచెం జాగ్రత్తగా ఉండండి. నేను డాగ్ స్క్వాడ్ పిలిపిస్తాను'' అని ''శ్రీశైలం మన డాగ్ స్క్వాడ్ టీం వాళ్ళకు ఫోన్ చేసి ఇక్కడకు పిలిపించు'' అని శ్రీశైలం తో అన్నాడు.

''సార్, డాగ్ స్క్వాడ్ తో పని కాకపోవచ్చు. ఆ వచ్చిన వాళ్ళు ఇంట్లో మొత్తం పెప్పర్ స్ప్రే, కారం పొడి, పర్ఫ్యూమ్ స్ప్రే చేసి వెళ్ళిపోయారు'' అంటూ ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు శ్రీశైలం.

''ఐ థింక్, ఆ వచ్చిన వాళ్ళు తెలివైన క్రిమినల్స్ లాగా ఉన్నారు. లేకపోతే ఇంత ప్లాన్డ్ గా రారు. శ్రీశైలం పోనీ మన క్లూస్ టీం వాళ్ళను రమ్మని చెప్పు. కనీసం వాళ్ళు ఏ ఫింగర్ ప్రింట్స్, లేదంటే వేరే ఆధారాలు తీస్తారు'' అన్నాడు.

శ్రీశైలం తన మొబైల్ తీసి ఫోన్ లు చేయడం మొదలు పెట్టాడు.

*****

క్రాంతి, గౌతమ్, హాల్ మేనేజర్ ఏఎస్ఐ ఆఫీస్ కు వచ్చారు. గౌతమ్, కస్తూరిని ఆ రోజు హాల్ డ్యూటీకి వెళ్ళిన వాళ్ళందరిని పిలిపించమన్నాడు. కస్తూరి అందరినీ పిలిపించింది. గౌతమ్, హాల్ మేనేజర్ ను వాళ్ళను గుర్తుపట్టమన్నాడు. మేనేజర్ అక్కడ ఉన్న ఏడుగురిని చూసి, ''వీళ్ళందరూ ఆ రోజు వచ్చిన వాళ్ళే, కానీ ఆ పొడవాటి అతను ఇక్కడ లేడే?'' అని అన్నాడు.

వెంటనే క్రాంతి, ''పొడవాటి అతనా? అతను ఎవరు?'' అని అడిగాడు.

''అతనేనండి, ఆఖరులో వచ్చాడు. ఆయన పూలదండలు తేవడం వల్ల ఆలస్యం అయ్యిందని చెప్పాడు. నాకు అంతే తెలుసు, కానీ ఇప్పుడు ఇక్కడ వీళ్ళలో లేడు'' అన్నాడు మేనేజర్.

''సరే, థాంక్ యు. మీరు వెళ్ళవచ్చు, మేము మళ్ళీ మిమ్మల్ని కలుస్తాము'' అని చెప్పి అతనిని పంపించేశాడు క్రాంతి.

“కస్తూరి గారు, మీరు ఇచ్చిన ఆ లిస్ట్ లో ఉన్న ఏడు పేర్లూ ఈ ఏడుగురివే కదా! మరి ఆ ఎనిమిదవ అతను ఎవరు? మీలో ఎవరైనా అతనిని చూశారా?” అని అడిగాడు గౌతమ్.

ఆ ఏడుగురిలో ఒకరు గణేష్ ముందుకు వచ్చి, “సార్, మా ఏడు మంది ముందుగా ఏ పనులు చేయాలో మాకు అజయ్ సార్ వ్రాసి ఇచ్చారు. మేము ఆ లిస్ట్ ప్రకారమే పనులు చూసుకున్నాం. అజయ్ సార్ వర్మ సార్ తో ఉన్నారు. ఇంక ఆ ఎనిమిదో వ్యక్తి ఎవరు? అని మాకు తెలియదు” అని అంటూ తన జేబులో నుంచి ఇంకా దాచి ఉంచిన పనుల లిస్ట్ తీసి చూపాడు.

“ఒకే, మీరందరూ వెళ్ళండి. గౌతమ్ ఆ ఎనిమిదో వ్యక్తి గురించి త్వరలోనే తేలుద్దాం. ముందు మనం దుర్గారావు దగ్గరకు వెళదాము” అని బయటకు కదిలాడు క్రాంతి.

వెనకాలే గౌతమ్ కస్తూరికి థాంక్స్ చెప్పి కదిలాడు.

*****

కేపి, శ్రీశైలం అజయ్ ఇంటి దగ్గర ఉండగానే క్లూస్ టీం వచ్చింది. వాళ్ళు వచ్చి కేపితో మాట్లాడి, అజయ్ ఇంటి లోపలికి వెళ్ళి, వాళ్ళ పని మొదలుపెట్టారు. ఐదు నిముషాల తరువాత క్లూస్ టీం అతను ఒకరు వచ్చి, అజయ్ ఫింగర్ ప్రింట్స్ తీసుకుని మళ్ళీ లోపలికి వెళ్ళాడు.

ఇంతలో అజయ్ ఫోన్ మోగింది. అజయ్ కి జర్నలిస్ట్ స్వాతి ఫోన్ చేసింది. అజయ్ విసుగ్గా ఫోన్ కట్ చేశాడు. ఒక నిముషం తరువాత మళ్ళీ ఫోన్ చేసింది స్వాతి. అసలే తన ఇల్లు మొత్తం నాశనం అయ్యిందని ఒక వైపు బాధ, ఎవరు చేశారన్న ఆలోచనతో ఉన్న అజయ్ కి ఈ స్వాతి ఫోన్ తనకు విసుగు తెప్పిస్తోంది. ఇంక తట్టుకోలేక ఫోన్ ఆన్సర్ చేశాడు.

“హలో స్వాతి గారు, వర్మ గారి కేస్ లో ఎటువంటి మార్పూ లేదు. ఏమన్నా ఉంటే నేనే మీకు ఫోన్ చేసి చెప్తాను, మీరు ఊరికే నన్ను విసిగించవద్దు” అని కొంచెం విసుగుగా, కోపంగా చెప్పాడు.

“అయ్యో! సారి అజయ్ గారు, నేను మిమ్మల్ని డిస్టర్బ్ చేయాలని ఫోన్ చేయలేదు. మీకు ఒక ముఖ్యమైన విషయం చెప్పడానికి ఫోన్ చేశాను. ఆ మీటింగ్ హాల్ దగ్గర మీటింగ్ కి ముందు, మీటింగ్ అప్పుడు, తరువాత మా న్యూస్ చానెల్ ఫొటోగ్రాఫర్ కొన్ని ఫోటోలు తీశాడు. అవి మీకేమయినా ఉపయోగపడతాయేమో! అని ఫోన్ చేస్తున్నాను. మీరు చూసిన తరువాత అవి నేను టెలికాస్ట్ చేస్తాను. ఎందుకంటే, పోలీస్ లు ఈ కేస్ విషయంలో వాళ్ళ పర్మిషన్ లేదా, మీకు తెలియకుండా ఏది టెలికాస్ట్ చేయవద్దని చెప్పారు” అని అంది.

వెంటనే అజయ్ “ఓహ్! సారీ స్వాతిగారు, నేను ఏదో ఫ్రస్టేషన్ లో అలా అన్నాను. మీరు నాకు ఆ ఫోటోలు కొంచెం వాట్సప్ లో పంపండి. నేను చూసి మీకు ఫోన్ చేస్తాను” అని అన్నాడు.

“సరే అజయ్ గారు, ఇప్పుడే పంపుతాను. నాకు మీరు వాటి గురించి సాయంత్రం నాలుగు లోపల చెప్పండి” అని ఫోన్ కట్ చేసి, అజయ్ ఫోన్ కి వరుసగా పన్నెండు ఫోటోలు వాట్సప్ చేసింది స్వాతి.

# Chapter 6 - The Twist

డ్యూటీ డాక్టర్ వచ్చి వర్మను పరీక్షించాడు. అక్కడ ఉన్న కేస్ షీట్ లో ఏవో వ్రాశాడు. అక్కడి హెడ్ నర్స్ ను పిలిచి వర్మను ప్రైవేట్ రూమ్ కి మార్చమన్నాడు. అక్కడ విఐపి ప్రైవేట్ రూమ్ లు రెండవ అంతస్థులో ఉంటాయి. నర్స్ నందిని దగ్గరకు వచ్చి, "మేడమ్, పైన రూమ్ రెడీ చేసి ఇంకో అరగంటలో షిఫ్ట్ చేస్తాము, మీరు కొంచెం బైట ఉండండి" అని నందినిని, రజనీని, నిర్మలమ్మని బయటకు పంపింది.

******

క్రాంతి, గౌతమ్ ఇద్దరు పోలీస్ కార్ లో దుర్గారావు ఇంటికి వెళ్ళారు. దుర్గారావు చిన్న కూతురు లక్ష్మి వచ్చి తలుపు తీసింది. "దుర్గారావు గారు ఉన్నారా?" అనడిగాడు క్రాంతి.

"ఆ ఉన్నారండి, ఇప్పుడే పిలుస్తాను కూర్చోండి" అంటూ ఇంటిలో ఉన్న పాత ప్లాస్టిక్ కుర్చీలు చూపించి లోపలికి వెళ్ళింది లక్ష్మి.

ఆ ఇల్లు కనీసం ఒక ముప్పై సంవత్సరాల పాత ఇల్లు, ఇంకా పాతకాలం బిపిఎల్ కలర్ టివి, ఒక ఫిలిప్స్ రేడియో అక్కడ ఒక చెక్కబల్ల మీద ఉన్నాయి. ఒక గోడ మీద ఒక పెద్ద వేంకటేశ్వర స్వామి ఫోటో ఉంది. ఇంకో గోడ మీద ఫ్యామిలీ ఫోటోస్, పిల్లల ఫోటోలు ఉన్నాయి. ప్రతి ఫోటోకు అటు ఇటు ఏవో ఇంటిలో చేసిన హ్యాండ్ క్రాఫ్ట్ అలంకరణలు ఉన్నాయి. అక్కడక్కడ గోడకు రంగు పెచ్చులుగా ఊడిపోయింది. ఆ ఇల్లు మొత్తం చూస్తే ఒక అతిసరి మధ్య తరగతి ఇల్లులాగా ఉంది.

ఒక అయిదు నిముషాల తరువాత దుర్గారావు ఒక గళ్ళ లుంగీ కట్టుకుని, దాని మీద ఒక పాత చొక్కా వేసుకుని వచ్చాడు.

దుర్గారావును చూసి గౌతమ్, "దుర్గారావు గారు, ఈయన ఏసిపి క్రాంతి గారు, నేను ఇన్స్పెక్టర్ గౌతమ్. మేము వర్మగారి కేస్ గురించి కొంత సమాచారం కోసం మీ వద్దకు వచ్చాము. మేము మీ ఆఫీస్ కి వెళ్ళితే, ఇవ్వాళ మీరు లీవ్ లో ఉన్నారని చెప్పారు. అందుకే మేమే మీ అడ్రెస్ తీసుకుని ఇక్కడకు వచ్చాము" అని చెప్పాడు.

దుర్గారావు కొంచెం కష్టంగా అక్కడే ఖాళీగా ఉన్న ఇంకో కుర్చీలో కూర్చున్నాడు. లక్ష్మి లోపలి నుంచి నీళ్ళ గ్లాస్ లు క్రాంతికి, గౌతమ్ కు ఇచ్చి "సార్, మీరు కాఫీ తాగుతారా? లేక టీ తాగుతారా?" అనడిగింది.

"వద్దమ్మ, మేము ఇప్పుడే తాగి వచ్చాము" అంటూ ఆ నీళ్ళ గ్లాస్ తీసుకున్నాడు క్రాంతి.

లక్ష్మి లోపలికి వెళ్ళిపోయింది.

"నిన్న రాత్రి కాలు జారీ పడ్డాను, నడుం పట్టేసింది. అందుకే ఇవ్వాళ లీవ్ పెట్టాను. ఇంకా కొంత నొప్పిగా ఉంది. ఇంతకీ మీకు నా నుంచి ఏ సమాచారం కావాలి?" అనడిగాడు దుర్గారావు.

"మీకు, కుప్పుసామి తెలుసా? నిన్న ఇన్స్పెక్టర్ రవి వచ్చి ఏమి చేశాడు?" అనడిగాడు గౌతమ్.

"కుప్పుసామిని నేను ఒకసారి వర్మ సార్ ని కలవడానికి వచ్చినప్పుడు చూశాను. ఆయనేదో వర్మ సార్ దగ్గర డబ్బుల గురించి, తరువాత సరస్వతి వీణ గురించి మాట్లాడాడు. వెంటనే వర్మ సార్ కోపంతో ఆయనను బయటకు పంపేశారు. నాకు అంతే తెలుసు, నేను మరలా అతనిని చూడలేదు. వర్మ సార్ దగ్గర నేను గత పన్నెండు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను, ఆ ఒక్కసారే ఆయనను నేను కోపంగా చూసింది. అంతే!" అని అన్నాడు దుర్గారావు.

"మరి ఇన్స్పెక్టర్ రవి సంగతి చెప్పలేదు, ఆయన నిన్న మీ ఆఫీస్ కి వచ్చారు కదా! ఏమి చేశారు? ఎంతసేపు ఉన్నారు?" అని అడిగాడు క్రాంతి.

"నిన్న ఇన్స్పెక్టర్ రవి గారు వచ్చి, వర్మ సార్ రూమ్ చూడాలని అడిగారు. కస్తూరి చెప్తే నేను లోపలకి తీసుకు వెళ్ళి చూపెట్టాను. ఆయన వర్మ సార్ ఫైల్స్ చూడడానికి ప్రయత్నం చేశారు. కానీ, అక్కడ ఏమి లేవు. అన్నీ వర్మ సార్ డిజిటల్ లాకర్ లో పెట్టేస్తారు. రవి గారు కొంచెంసేపు వర్మ సార్ రూంలో ఉన్న బొమ్మలు, ఎగ్జిబిట్స్ చూశారు. ఆ తరువాత

కొంచెంసేపు ఆయన రూమ్ లో సోఫాలో పడుకున్నారు. కొంత సమయం తరువాత ఆయనకు ఎవరో ఫోన్ చేస్తే లేచి వెంటనే వెళ్ళిపోయారు'' అని అన్నాడు దుర్గారావు.

క్రాంతి గౌతమ్ ఒకరినొకరు చూసుకున్నారు. ఇంతలో గౌతమ్ ఫోన్ మోగింది. కేపి గౌతమ్ కు ఫోన్ చేసి, అజయ్ ఇంటి సంగతి, స్వాతి అజయ్ కి పంపిన ఫోటోల గురించి చెప్పాడు. గౌతమ్ ఆ విషయాలు క్రాంతికి చెప్పాడు.

''దుర్గారావు గారు, మాకు ఇప్పుడు వేరే అర్జెంట్ పని ఉంది. మీరు ఇప్పుడు మాకు చాలా మంచి ముఖ్యమైన విషయాలు చెప్పారు, మేము మిమ్మల్ని తరువాత కలుస్తాము. ప్రస్తుతం మేము వెళ్ళాలి, రేపు మిమ్మల్ని ఆఫీస్ లో కలుస్తాము, ఉంటాము'' అంటూ లేచాడు క్రాంతి.

గౌతమ్, క్రాంతి బయటకు వెళ్ళారు. క్రాంతి, గౌతమ్ కేపి పంపిన అజయ్ ఇంటి లొకేషన్ చూసుకుని కార్ లోకి ఎక్కారు.

*****

గంటసేపు మొత్తం చూసిన తరువాత క్లూస్ టీం వాళ్ళు కేపితో, ''సార్, ఈ ఇంటిలో అన్నీ వస్తువుల మీద అజయ్ గారి వెలిముద్రలు తప్ప ఇంకేమీ లేవు. అన్నీ వస్తువుల మీద అజయ్ వెలి ముద్రలు ఉన్నాయి. అయితే మా అనుమానం, అవి ఎవరో కావాలని పెట్టిన వెలిముద్రలు. ఎందుకంటే కొన్నిచోట్ల అవి తలక్రిందులుగా ఉన్నాయి. ఎవరో అజయ్ గారి ఫింగర్ ప్రింట్స్ రప్లికేట్ చేశారు. ఈ పని చేసినవారు చాలా తెలివైనవాళ్ళు. కాకపోతే, ఈ పని మొత్తం ఇద్దరో ముగ్గురో చేసి ఉండాలి, అందులో ఒకరు పాపం తప్పుగా చేసి అసలు విషయం మనకందించారు'' అని చెప్పారు.

ఇంతలో అక్కడికి క్రాంతి, గౌతమ్ వచ్చారు. కేపి అక్కడ జరిగిన విషయాలన్నీ చెప్పాడు. కేపి అజయ్ కి క్రాంతి ని, గౌతమ్ ను పరిచయం చేశాడు.

''అజయ్, ఈ మధ్య ఎవరికైనా మీ ఫింగర్ ప్రింట్స్ ఇచ్చారా? లేదా ఏదైనా అనుమాన సంఘటన జరిగిందా?'' అని అడిగాడు గౌతమ్.

''కొంత సమయం ముందు మీ టీం అతనికి, నేను నా ఫింగర్ ప్రింట్స్ ఇచ్చాను'' అన్నాడు అజయ్.

''అవి కాదు అజయ్, గత రెండు మూడు రోజులలో అని మా ఉద్దేశం'' అని అన్నాడు కేపి.

అజయ్ కొంతసేపు ఆలోచించి, ''నాకు తెలిసినంత వరకు నేను ఎప్పుడూ, ఎవరికీ నా ఫింగర్ ప్రింట్స్ ఇవ్వలేదు, అనుమాన సంఘటన ఏమి జరగలేదు'' అని, ఇంకా ఆలోచిస్తూనే ఉన్నాడు.

ఇంతలో అక్కడే ఉన్న క్లూస్ టీం, ప్రసాద్ ''మీరు వాడిన ఏదైనా గ్లాస్ లేదా ప్లాస్టిక్ వస్తువు ఇంకెవరికైనా ఇవ్వడం, లేదంటే ఏదైనా గ్లాస్ మీద మీ వెలిముద్రలు పడేటట్టు చేయడం జరిగిందా?'' అని అడిగాడు.

''అలాంటిది ఏది జరగలేదు, కానీ నిన్న వర్మ గారిని హాస్పిటల్ లో చేర్చిన తరువాత నందిని మేడమ్ కి నేను కాఫీ ఇస్తే వద్దన్నారు, ఆవిడ అప్పుడే లెమన్ జూస్ తాగారు. నేను ఆ కాఫీ కప్పు డస్ట్ బిన్ లో పడేసేటప్పుడు కాఫీ అంతా కింద పడింది. నేను నా చేతిలోని ఖాళీ కాఫీ కప్ అక్కడ ఉన్న హౌస్ కీపింగ్ క్లీనింగ్ అతనికి ఇచ్చి వెళ్ళిపోయాను. అదేమైనా జరిగి ఉండవచ్చునా?'' అని సందేహంగా చెప్పాడు అజయ్.

శ్రీశైలం అజయ్ చెపుతున్న అన్నీ విషయాలు తన నోట్ పుస్తకంలో వ్రాసేసుకున్నాడు.

క్లూస్ టీం ప్రసాద్, ''దేర్ ఇస్ ఎ పాసిబిలిటీ'' అంటూ... ''సరే సార్, మేము ఇంక బయలుదేరుతాం. అవసరముంటే మళ్ళీ మమ్మల్ని పిలవండి'' అని తన టీం అంతా వెళ్ళిపోయారు.

''అజయ్ గారు ఆ హాస్పిటల్ లో మీ కాఫీ గ్లాస్ తీసుకున్న హౌస్ కీపింగ్ క్లీనింగ్ అతనిని మీరు గుర్తుపడతారా?'' అని అడిగాడు గౌతమ్.

అజయ్ "కొంచెం కష్టమే, ఎందుకంటే అతను అప్పుడు ముక్కుకు నోటికి మాస్క్ పెట్టుకుని ఉన్నాడు. తల మీద క్యాప్ ఉంది. కాకపోతే అతను ఒక యభై అరవై ఏళ్ల మధ్యలో ఉంటాడు. కొద్దిగా లావుగా ఒక ఐదు అడుగులు ఎత్తు ఉండవచ్చు" అన్నాడు.

"సరే, ఆ విషయం కేపి చూసుకుంటాడు. మనం ఇప్పుడు మీకు వచ్చిన ఆ ఫోటోలు చూద్దాం" అని అజయ్ ని స్వాతి పంపిన ఫోటోలు చూపమన్నాడు క్రాంతి.

స్వాతి పంపిన పన్నెండు ఫోటోలు ఒక్కొక్కటి చూశారు. అందులో కొన్ని మీటింగ్ మొదలయ్యే ముందు ఆ స్టేజి ఫోటోలు, అందులో అక్కడ కట్టిన బ్యానర్ లు టేబుల్, కుర్చీలు, స్పీచ్ ఇచ్చే మైక్ టేబుల్ ఉన్నాయి. రెండు ఫోటోలలో వర్మ మెడలో పూలమాల ఉంది, అది అతను తీసేందుకు ప్రయత్నిస్తునట్టుగా ఉంది. పక్కనే అజయ్ ఏవో కొన్ని ఫైల్స్ పట్టుకుని ఉన్నాడు. వాళ్ళ వెనక ఒక పొడవాటి అతను ఆర్కియాలజీ వాళ్ళ ఆఫీస్ స్టాఫ్ బాయ్స్ యునిఫారం వేసుకుని ఉన్నాడు. కానీ, ఆ ఫోటో వర్మను బాగా తీయడం కోసం వెనక ఉన్న అతను కేవలం గడ్డం వరకే ఫోటోలో పడ్డాడు.

ఇంకో రెండు ఫోటోలు వర్మ స్పీచ్ ఇస్తున్నవి, ఆ తరువాత ఫోటో వర్మ స్పీచ్ తరువాత మెట్లు దిగుతున్నప్పుడు ఒక మెట్టు వెనుక వర్మకి కొంచెం పక్కన అజయ్, అతని పక్కనే సరిగ్గా వర్మ వెనుక ఆ పొడవాటి అతను పూల దండలు పట్టుకుని మెట్లు దిగుతున్నారు. అందులో ఆ పొడవాటి వ్యక్తి ముఖం కొంచెం బ్లర్ గా ఉంది, కానీ మనిషిని కొంచెం పోల్చుకోవచ్చు.

ఆ ఫోటోలు చూడగానే క్రాంతి, "ఇతను మీకు తెలుసునా?" అని ఆ పొడవాటి వ్యక్తిని చూపించి అజయ్ ని అడిగాడు.

"నో, అతను ఎవరో నాకు తెలియదు. నేను అక్కడ మీటింగ్ హడావుడిలో అతనిని గమనించలేదు, నేను ఇప్పుడే చూస్తున్నాను" అన్నాడు అజయ్.

"సార్, ఆ ఎనిమిదో వ్యక్తి ఇతనే. మనం ఇతని గురించి తెలుసుకోవాలి, లేట్ అస్ గో టు యువర్ ఆఫీస్" అని అజయ్ తో అన్నాడు గౌతమ్.

"కేపి, మీరు హాస్పిటల్ కి వెళ్ళి ఆ హౌస్ కీపింగ్ క్లీనింగ్ అతని గురించి ఆరా తీయండి. అవసరమైతే సీసీటీవీ ఫూటేజ్ చూడండి. మేము అజయ్ తో వాళ్ళ ఆఫీస్ వెళ్ళి ఇతని సంగతి తెలుస్తాము" అని అన్నాడు క్రాంతి.

శ్రీశైలం ని అజయ్ ఇంటి దగ్గర వదిలి అందరూ వెళ్ళిపోయారు.

వర్మని రెండో అంతస్థులోని ప్రైవేట్ రూమ్ లోకి మార్చారు. అంతకు ముందు రోజు ఆయనకు తగిలించిన గొట్టలు, పరికరాలు కన్నా ఇప్పుడు కొన్ని తక్కువగా ఉన్నాయి. ఆయన నాడీ, ఊపిరి, అవయవాలా పని తీరు అంతా సవ్యంగా ఉన్నదని డాక్టర్స్ రిపోర్ట్ ఇచ్చారు. ఇంక ఇప్పుడు వర్మగారు కోమా నుంచి ఎప్పుడు బయటపడాలో చూడాలి.

ఆ రూమ్ లో ఉన్న సోఫా మీద నందిని, రజనీ కూర్చుని ఉన్నారు. నిర్మలమ్మ వాళ్ళకు ఫ్లాస్క్ నుంచి కప్పులల్లో కాఫీ పోస్తోంది.

ఇంతలో రజనీ "నందిని, నేను ఇవ్వాళ ఉదయమే ముంబై నుంచి వచ్చాను. అక్కడ ఒక కొత్త క్లైంట్ పని మీద వెళ్ళాను, ఇక్కడ దిగగానే నా కార్ డ్రైవర్ వర్మ గారి సంగతి చెప్పడంతో, వెంటనే బయలుదేరి నేరుగా ఇక్కడికే వచ్చేశాను. బహుశా నేను మళ్ళీ లండన్ వెళ్ళవచ్చు. కానీ, ఈ సారి నువ్వు వర్మ గారిని వదిలి నాతో రావడం కష్టం. వర్మ గారి గొలుసులు, తాయత్తులు, చేతి రక్షలు తీసి జాగ్రత్తగా ఉంచావా? అవి ఉన్నందుకే ఆయనకు ఏమి జరగలేదు, ఆయన కొలుకొగానే అవన్నీ మళ్ళీ పూజ చేయించి ఆయనకు కట్టేయి" అని అంది.

"రజిని, నిజమే అవి ఉన్నందుకే ఆయన ఇప్పుడు ఇలా ఉన్నారు. మనం ముందు జాగ్రత్తపడడం వలన ఆయనకు ఎటువంటి కీడు జరగలేదు. నేను ఈ సారి నీతో రాకపోవచ్చు, కానీ నువ్వు లండన్ వెళ్ళితే నాకు ఒక సహాయం చేయాలి" అంది నందిని.

“నువ్వు నాకు ఆర్డర్ వేయాలి, ఇలా సహాయం చేయమని అడగకూడదు” అంది రజనీ.

నిర్మలమ్మ నందినికి రజినికి కాఫీ ఇచ్చింది. “అమ్మ, నేను మీకు కావలసిన బట్టలు, వస్తువులు అన్నీ ఆ బ్యాగ్ లో ఉంచాను. నేను ఇంటికి వెళ్ళి మీకు భోజనం తయారుచేసి తీసుకుని వస్తాను. మీకు ఇంటిని నుండి ఏమైనా కావాలంటే చెప్పండి వచ్చేటప్పుడు తెస్తాను” అని నందినితో అంది నిర్మలమ్మ.

“నిర్మలమ్మ, నువ్వు ఇంటికి రజనీతో వెళ్ళు, నాకు ఏమి కావాలో నేను రజనీకి చెప్తాను. అన్నీ రజనీ చూసుకుంటుంది. రజనీ నేను నా బెడ్రూంలో ఒక చిన్న రెడ్ కలర్ ట్రావెల్ బ్యాగ్ పెట్టాను, అది నేను అవసరమొచ్చి ఎప్పుడైనా వెళ్ళాలంటే రెడీగా ఉంచుతాను. నువ్వు అది తీసుకునిరా, అది తెచ్చిన తరువాత నేను నీకు తక్కిన విషయాలు చెప్తాను” అని అంది నందిని.

“సరే నందిని, నేను నిర్మలమ్మను ఇంటి దగ్గర దించేసి, నేను ఇంటికి వెళ్ళి ఫ్రెష్ అయ్యి రిటర్న్ లో నిర్మలమ్మను తీసుకుని వస్తాను” అంటూ చేతిలో ఉన్న కాఫీ తాగేసి, నిర్మలమ్మను రమ్మని సైగ చేసింది రజనీ.

రజనీ నిర్మలమ్మ ఇద్దరు వెళ్ళిపోయారు.

*****

క్రాంతి, గౌతమ్, అజయ్ వాళ్ళ ఆఫీస్ కు వచ్చారు. అజయ్ తన మొబైల్ లో ఉన్న ఫోటోను కస్తూరికి చూపించాడు. దానికి అతను తెలియదు అని చెప్పింది. వెంటనే వాళ్ళ ఆఫీస్ సబ్ స్టాఫ్ గణేష్ ను పిలిచారు, అతను వచ్చాడు.

“గణేష్, ఈ ఫోటోలో ఉన్న వ్యక్తిని నువ్వు గుర్తుపట్టగలవా, నీకేమైనా తెలుసునా?” అనడిగాడు అజయ్.

గణేష్ ఆ ఫోటోను కొంచెం పరికించి చూసి “సార్, ఇతను మన బెంగళూరు ఆఫీస్ లో పని చేసే కిట్టప్ప. అయినా అతను ఇక్కడికి ఎప్పుడు, ఎందుకు వచ్చాడు?” అన్నాడు.

వెంటనే క్రాంతి “అతను మీ బెంగళూరు ఆఫీస్ కిట్టప్ప అని అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు? నీకు అతను తెలుసా?” అనడిగాడు.

“నాకు అతను తెలుసు సార్, ఈ ఆఫీస్ సబ్ స్టాఫ్ అందరం ఫ్యామిలీలతో కలిసి మొన్న ఎండాకాలంలో కూర్గ్ వెళ్ళాము. అప్పుడు మేమందరం ఒక రోజు బెంగళూరు చూడడం కోసం అక్కడ ఆగాము. అప్పుడు మాకు అన్నీ తానే దగ్గర ఉండి చూసుకున్నాడు. మనిషి కొంచెం మెతక, వాళ్ళ నాన్న మా ఆఫీస్ లోనే పనిచేస్తూ చనిపోతే, అతని ఉద్యోగం ఈ కిట్టప్పకు ఇచ్చారు. పెద్దగా చదువుకోలేదు, కానీ చెప్పిన పని చెప్పినట్టు చేస్తాడు. అజయ్ సార్ ఈ కిట్టప్ప ఇక్కడకు వచ్చినట్టు మాకు తెలియదు. అసలు మేమందరం ఉండగా ఇక్కడకు తను ఎందుకు వచ్చినట్టు? వచ్చినా మమల్ని కలవకపోవడం ఏమిటి?” అని అన్నాడు గణేష్.

క్రాంతి వెంటనే “కస్తూరి గారు, కొంచెం మీ ఎంప్లాయిస్ లిస్ట్ లో ఇతని డీటైల్స్ ఏమైనా తెలుస్తాయా అని చూడండి” అనడిగాడు.

కస్తూరి తన కంప్యూటర్ లో గ్లోబల్ ఎంప్లాయిస్ డాటాబేస్ తీసి, అందులో కిట్టప్ప వివరాలు తీసింది. క్రాంతి అడగకముందే దానికి ఒక ప్రింట్ తీసి అతనికి ఇచ్చింది. అందులో కిట్టప్ప ఫోటో, అడ్రెస్ ఇంకా కొన్ని వేరే వివరాలు ఉన్నాయి.

క్రాంతి అది తీసుకుని “థాంక్ యు కస్తూరి. అజయ్ గారు మేము వెళుతున్నాము. కేపి మాకు ఫోన్ చేసిన తరువాత మిమ్మల్ని కలుస్తాము” అని గౌతమ్ తో కలిసి వెళ్ళిపోయాడు.

క్రాంతి, గౌతమ్ వెళ్ళిపోయిన తరువాత అజయ్ ఆ కిట్టప్ప గురించి ఆలోచిస్తూ అక్కడే సోఫాలో కూర్చున్నాడు.

*****

“గౌతమ్, అసలు ఈ కిట్టప్ప బెంగళూరు నుండి ఇక్కడకు ఎందుకు వచ్చాడు? నాకు తెలిసి అతనిని ఎవరో కావాలని ఇక్కడకు పంపి ఉండవచ్చు. ఈ కేస్ పోను పోను బాగా కాంప్లికేట్ అవుతోంది. మనం ఇప్పుడు కుప్పుసామి దగ్గరకు వెళ్ళి అతని సంగతి తేలుద్దాము, పదా” అని క్రాంతి అన్నాడు.

ఇద్దరు కార్ ఎక్కారు.

# Chapter 7 - Chasing the Case

క్రాంతి, గౌతమ్ కస్తూరి ఇచ్చిన అడ్రస్ పట్టుకుని మురుగన్ మూజికల్స్ అండ్ ఇన్స్ట్రుమెంట్స్ వద్దకు వచ్చారు. ఇద్దరు మఫ్టీలో ఉన్నారు కాబట్టి ఎవరికీ వాళ్ళు పోలీస్ లు అని తెలియదు. ఇద్దరు షాప్ లోపలికి వెళ్ళారు. అక్కడ గోమతి కూర్చొని ఉంది. వాళ్ళని చూడగానే "రండి సార్, మీకు ఏమి కావాలే? మా దగ్గర అన్నీ సంగీత వాయిద్యములు దొరుకుతాయి" అంటూ వాళ్ళను లోపలికి ఆహ్వానించింది గోమతి.

"మాకు కుప్పుసామి గారితో పని ఉంది, ఆయన ఉంటే పిలవండి" అన్నాడు గౌతమ్.

"అట్లనా ఆయన ఇప్పుడే వస్తారు, మీరు కూర్చోండి. పక్కన ఆకు వక్క తెచ్చుకునే దానికి పోయినాడు" అని చెప్పింది గోమతి.

క్రాంతి, గౌతమ్ అక్కడ ఉన్న అన్నీ రకాల సంగీత పరికరాలను చూస్తున్నారు. పది నిముషాల తరువాత కుప్పుసామి "*నను బ్రోచేవారెవరురా రఘువరా...*" అంటూ పాడుకుంటూ షాప్ లోపలకి వచ్చాడు.

"ఎణ్ణగో, మీ కోసం ఎవరో ఇద్దరు సారు వాళ్ళు వచ్చి ఉన్నారు" అని కుప్పుసామికి చెప్పి,

"సార్లు మా భర్త వారు వచ్చినారు" అంటూ క్రాంతిని, గౌతమ్ ని పిలిచింది గోమతి.

కుప్పుసామి క్రాంతిని, గౌతమ్ ని చూసి కొంచెం కంగారుపడ్డాడు.

"సార్, మీకు ఏమి కావాలే? తంబూర, ఫిడేలు, ఫ్లూట్, వీణ, మృదంగం, హార్మోనియం..." అంటూ లిస్ట్ చదివాడు కుప్పుసామి.

"కుప్పుసామి, మేము పోలీస్ డిపార్ట్మెంట్ నుంచి వచ్చాము. మీతో కొంచెం పని ఉంది, మీరు కొంచెం పక్కకు వస్తే మీతో మాట్లాడుతాము" అన్నాడు గౌతమ్.

"చెప్పండి సార్, నేను మీకు ఏమి సమాచారం ఇవ్వాలే? ఈ లోపల రూంలో పోయి మాట్లాడుతాము, రండి" అంటూ లోపల రూము చూపెట్టాడు కుప్పుసామి.

ముగ్గురు ఆ లోపలి రూంలోకి వెళ్ళారు, గౌతమ్ క్రాంతిని తనని పరిచయం చేసుకున్నారు.

"కుప్పుసామి మీరు విక్రాంత్ వర్మ గారిని ఎందుకు కలవాలనుకున్నారు? ఆయనకి పదే పదే మీరు ఎందుకు ఫోన్ చేసేవారు? మీరు ఈ సంగీత వాయిద్యాల వ్యాపారం చేస్తున్నారు. అలాంటిది మీకు వర్మ గారితో పని ఏమిటి?" అని అడిగాడు క్రాంతి.

"సార్, ఒక సంవత్సరం ముందు హరిద్వార్ దగ్గర ఒక పాత గుడి దగ్గర గోడ పడిపోతే, అక్కడ కొత్త గోడ కట్టేదానికి తవ్వినారు. అప్పుడు అక్కడ కొన్ని పురాతన వస్తువులు దొరికినాయి. అప్పుడు వర్మ సార్ వాటిని పరీక్షించే దానికి వెళ్ళారు. అప్పుడే అక్కడ ఆయనకు ఒక సరస్వతి వీణ దొరికిందని, అది కనీసం 1500 సంవత్సరాల ముందుదని టివి లో, పేపర్ లో చెప్పినారు. నా క్లయింట్ ఒకరు సంగీత అభిమాని, పైగా కలెక్టర్, అదే పాత పాత వస్తువులంతా పెట్టుకుంటారు, వాళ్ళన్నమాట! వాళ్ళకు అది కావాలని అడిగారు, దానికి నన్ను వెళ్ళి వర్మ సార్ ని కలవమని చెప్పారు. అందుకే నేను సార్ కు చాలాసార్లు ఫోన్ చేసినాను, ఆయనతో ఒకటి, రెండు సార్లు మాట్లాడాను. కావాలంటే ఆయనకు డబ్బులు ఇస్తామని చెప్పినాను. ఆయన నన్ను తిట్టినారు, ఆ తరువాత నా ఫోన్ తీసేదిలేదు. అప్పుడే నేను ఈ మధ్యనే కొన్ని రోజుల ముందు వాళ్ళ ఆఫీస్ కు పోతిని" అని చెప్పాడు కుప్పుసామి.

"మీరు వర్మ గారి ఆఫీస్ వెళ్ళిన రోజు ఏం జరిగింది? అది చెప్పండి, మీరు ఏది దాచకూడదు, అన్నీ వివరంగా చెప్పాలి" అన్నాడు గౌతమ్.

"అదే సార్, నేను వర్మ సార్ వాళ్ళ ఆఫీస్ వెళ్ళాను. అక్కడ రిసెప్షన్ లో పర్మిషన్ తీసుకుని లోపలికి వెళ్ళాను. సార్ కి నేనవరో తెలిసాక నన్ను అక్కడ నుంచి వెళ్ళిపొమ్మని చెప్పారు. నేను సార్ కి అయిదు లక్షలు లంచం ఇస్తాను, ఆ వీణను

మాకు అమ్మమని చెప్పాను. అందుకు వారు నన్ను ఇంకోసారి వచ్చినా, లేదా ఫోన్ చేసినా పోలీస్ కంప్లైంట్ ఇస్తాను అని చెప్పి బయటకు తోసినారు. అంతే సార్ జరిగింది, ఆ తరువాత నేను ఎప్పుడు ఆయనను కలవలేదు. కానీ ఇప్పుడు ఆయనను ఎవరో కాల్చినారు అని టివి లో చూస్తిని. నాకు దానికి సంబంధం లేదు సార్, మురుగన్ మీద ఒట్టు'' అన్నాడు కుప్పుసామి.

''నువ్వు ఆయనకు అయిదు లక్షలు లంచం ఎందుకు ఇవ్వాలనుకున్నావు?'' అనడిగాడు క్రాంతి.

''ఆ డబ్బులు నాకు మా క్లయింట్ యిచ్చినాడు సార్. వారికి ఆ సరస్వతి వీణ కావాలంట, అవి నా డబ్బులు కావు'' అన్నాడు కుప్పుసామి.

''ఎవరు మీ క్లయింట్? నాకు అతని వివరాలు కావాలి'' అన్నాడు క్రాంతి.

''సార్, వాడు ఎవరు అని నాకు తెలిసి లేదు. ఏదో ఒక ప్రైవేట్ నెంబర్ నుంచి కాల్ సేస్తాడు, డబ్బుల పాకెట్ ఎట్నో నాకు చేరేలాగా సేస్తాడు. ఈ అయిదు లక్షలు కూడా ఒక రోజు పొద్దున్నే నా ఇంటి పాల ప్యాకెట్ డబ్బాలో ఉంచినాడు. పని జరగకపోతే ఆ డబ్బు నా దగ్గరే ఉంచమన్నాడు సార్'' అని చెప్పాడు కుప్పుసామి.

''సరే కుప్పుసామి మాకు నీ ఫోన్ నెంబర్ ఇవ్వు, అవసరమైనప్పుడు నిన్ను మేము కాంటాక్ట్ చేస్తాము. మాకు తెలియకుండా నువ్వు ఊరు వదిలి పెట్టి వెళ్ళకూడదు. మేము అవసరమై పిలిచినప్పుడు ఒక గంట లోపల మమ్మల్ని కలవాలి'' అని కుప్పుసామి ఫోన్ నెంబర్ తీసుకున్నాడు గౌతమ్.

''ఎందుకైనా మంచిది నీ షాప్, మీ ఆవిడ ఫోన్ నెంబర్, నీ ఇంటి నెంబర్ కూడా మాకు ఇవ్వు'' అనడిగాడు క్రాంతి.

''సార్, ఇది మా షాప్ బిజినెస్ కార్డ్. దీనిలో మా షాప్, మా ఆవిడ మొబైల్ నెంబర్ ఉన్నాయి. మాకు ఇంటిలో ఫోన్ లేదు సార్'' అని చెరొక మురుగన్ మూజికల్స్ అండ్ ఇన్స్ట్రుమెంట్స్ బిజినెస్ కార్డ్ లు ఇచ్చాడు.

అవి తీసుకుని ''త్వరలో మళ్ళీ కలుద్దాం కుప్పుసామి'' అంటూ క్రాంతి, గౌతమ్ వెళ్ళిపోయారు.

*****

క్రాంతి తన ట్రైనింగ్ బ్యాచ్మేట్ సిద్ధార్థ్ కు ఫోన్ చేశాడు. సిద్ధార్థ్ బెంగళూరులో ఏసిపి గా ఉన్నాడు.

''సిద్ధార్థ్, ఎలా ఉన్నావు? సారీ మై ఫ్రెండ్, నేను నీ పెళ్ళికి రాలేకపోయాను. తెలుసుగా మన పోలీస్ వాళ్ళకి పెళ్ళి చేసుకోవడానికి సెలవు దొరకడమే కష్టం'' అంటూ నవ్వేశాడు క్రాంతి.

''నో వర్రీస్ మై ఫ్రెండ్, నేను అర్ధం చేసుకోగలను. అయినా నువ్వు రాకపోయినా, నువ్వు పంపిన మ్యారేజ్ గిఫ్ట్ మటుకు కరెక్ట్ గా పెళ్ళి టైంకి వచ్చింది. థాంక్ యు, ఇంతకీ ఏమిటి సంగతి? ఏమన్నా హెల్ప్ కావాలా?'' అన్నాడు సిద్ధార్థ్.

''అవును సిద్ధార్థ్, ఒక హై ప్రొఫైల్ కేస్ చూస్తున్నాను. నీకు తెలిసే ఉంటుంది ఆర్కియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా అడిషనల్ డైరెక్టర్ జనరల్ విక్రాంత్ వర్మ మీద హత్యాయత్నం. ఆ కేస్ కు సంబంధించి ఒక లీడ్ బెంగళూరులో ఉంది, అది కాస్త నువ్వు నాకు చూసి డీటైల్స్ పంపిస్తావని ఫోన్ చేశాను'' అన్నాడు క్రాంతి.

''ఓస్ అంతే కదా! నాకు వివరాలు పంపించు, నేను నీకు కావలసిన వివరాలు అన్నీ కనుక్కొని పంపిస్తాను'' అన్నాడు సిద్ధార్థ్.

''నేను నీకు ఇప్పుడే అన్నీ వాట్సప్ చేస్తాను, నేను నీకు తరువాత ఫోన్ చేస్తాను'' అని కిట్టప్ప గురించి అన్నీ వివరాలు సిద్ధార్థ్ కి వివరించాడు. ఫోన్ కట్ చేసి సిద్ధార్థ్ కి కిట్టప్ప వివరాలు పంపించాడు క్రాంతి.

*****

జగత్ సింగ్ నాగ్ ని పిలిచి ''ఏంటి డాక్టర్? ఈ మధ్య నువ్వు వేసే అన్నీ ప్లాన్ లు ఫెయిల్ అవుతున్నాయి. వర్మ చావలేదు, కోమాలో ఉన్నాడు. ఇన్స్పెక్టర్ రవి పంపిన ఆ ఫైల్స్ స్కాన్ కాపీలో మనకు కావలసిన వివరాలు లేవు, ఆ

కుప్పుసామి అన్నీ తప్పుడు ప్లాన్ లు వేస్తున్నాడు. ఇది ఇలాగే జరిగితే మనం తీసుకున్న ఆర్డర్స్ సప్లయ్ చేయలేము. డు సంథింగ్, నువ్వు దిగితే కానీ పని జరగదు, చూసుకో'' అన్నాడు.

''మీరు రిలాక్స్ అవ్వండి, ఏమి చేయాలో నేనే చూసుకుంటాను. ఇంకెవరిని నమ్మను, నాకు ఒక వారం టైం ఇవ్వండి. మీ ఆర్డర్ మొత్తం నేనే పంపిస్తాను'' అని వెళ్ళిపోయాడు నాగ్.

జగత్ సింగ్ తన టేబుల్ డ్రాలో నుంచి ఒక ఫోన్ తీసాడు. ఏదో నెంబర్ నొక్కి అన్ లాక్ చేశాడు. అందులో ఉన్న ఒక నెంబర్ కి కాల్ చేశాడు. ఫోన్ అవతల వ్యక్తి ఆన్సర్ చేయగానే ''హలో కెప్టెన్, మీరు చెప్పిన ఆర్డర్ ఇంకొక వారంలో మీకు మేము పంపిస్తాము, తక్కిన పేమెంట్ మీకు మేము మీ ఆర్డర్ షిప్ చేసిన తరువాతే ఇవ్వండి. నో ప్రాబ్లమ్'' అన్నాడు.

కెప్టెన్ ''వన్ మోర్ వీక్, ఒకే. కానీ అక్కడ జరుగుతున్నది చూస్తే ఒక వారం సరిపోయేలాగా లేదు, ఐ విల్ లీవ్ ఈట్ టు యు'' అని పోన్ కట్ చేశాడు. జగత్ సింగ్ కొంచెం టెన్షన్ గా ఉన్నాడు.

*****

హాస్పిటల్ లో కేపి, అజయ్ చెప్పిన ఆనవాలు ఉన్న హౌస్ కీపింగ్ క్లీనింగ్ వ్యక్తి కోసం అక్కడి కాంటీన్ కి వెళ్ళాడు. అక్కడ వాళ్ళని ఆ వ్యక్తి ఆచూకీ అడిగాడు. అక్కడి వాళ్ళు ''సార్ ఇక్కడ మొత్తం నలభైకి పైగా క్లీనింగ్ వాళ్ళు ఉన్నారు, అప్పుడప్పుడు కాంట్రాక్ట్ వాళ్ళు కూడా వస్తారు. మేము వాళ్ళను పట్టించుకోము, మా పని మేము చేసుకు పోతాము, వాళ్ళ పని వాళ్ళు చేసుకు పోతారు'' అని చెప్పారు.

కేపి అక్కడ సీసీటీవీ కెమెరాలు ఉన్నాయా అని చూడసాగాడు.

*****

వర్మ ఇంటిలో నిర్మలమ్మ వంట చేస్తోంది, ఇంతలో కాలింగ్ బెల్ వినపడింది.

''వస్తున్న'' అంటూ వెళ్ళి తలుపు తీసింది. అక్కడ ఎవరు లేరు కానీ, ఒక కవర్ పడేసి ఉంది. నిర్మలమ్మ అనుమానంగా అది తీసుకుని అక్కడ ఎవరు లేకపోవడం చూసి, కొంచెం భయంగా వెంటనే తలుపు వేసేసింది.

తాను మళ్ళీ వంట గదిలోకి వెళ్ళిపోయింది. కొంత సమయం తరువాత మళ్ళీ బెల్ మోగింది, ఈసారి నిర్మలమ్మ తలుపు దగ్గరకు వచ్చి ''ఎవరు?'' అని అడిగింది.

''నేనే నిర్మలమ్మ, తలుపు తీయి'' అని అంది రజనీ.

నిర్మలమ్మ తెలుపు తీసి అంతకుముందు జరిగిన సంగతి చెప్పి, అక్కడ ఉన్న ఆ కవర్ చూపించింది.

రజనీ ఆ కవర్ తీసుకుని చూసింది. దాని మీద ఎటువంటి అడ్రెస్ లేదు, ఏమి వ్రాయలేదు కూడా. కాకపోతే ఆ కవర్ లో ఏదో ఉన్నట్టుగా ఉంది. రజనీ దానిని తీసుకుని కొంచెం పరీక్షగా చూసి, అనుమానంతో వెంటనే తలుపు తీసి బయటకు విసిరింది.

అది ఇంటి ముందు వరండాలో పడి, దానిలో నుంచి ఏదో ఒక తెల్లని పొగ బయటకు వచ్చింది. వెంటనే రజనీ తన ముక్కు మూసుకుని, నిర్మలమ్మ ముక్కు మూసుకోమని లోపలికి లాక్కొని వెళ్ళిపోయింది. నిర్మలమ్మ ఏమి అర్థంకాక అయోమయంగా ఉంది.

''నిర్మలమ్మ, అది చాలా విషపూరిత గ్యాస్, మనం అది పీలిస్తే కళ్ళు తిరిగి పడిపోతాం లేదా చనిపోవచ్చు కూడా. దేవుడి దయ వల్ల మనం తప్పించుకున్నాం. జాగ్రత్త, ఇక మీదట అన్నీ గమనించు'' అంది రజనీ.

''అమ్మో! సమయానికి మీరు వచ్చారు కాబట్టి నేను బతికిపోయాను. లేకపోతే ఈ పాటికి నేను చచ్చేదానిని'' అంటూ కళ్ల నీళ్ళు పెట్టుకుంది నిర్మలమ్మ.

ఇంతలో వర్మ ఇంటిలో ల్యాండ్ లైన్ ఫోన్ మోగింది, రజనీ తీసింది.

“ఎలా ఉంది ఆ శాంపిల్? ఇక మీదట మీరందరూ చస్తూ బ్రతకాల్సిందే” అని ఒక బొంగురు గొంతుక వినపడింది. వెంటనే ఫోన్ కట్ అయ్యింది.

“నిర్మలమ్మ మనం త్వరగా బయలుదేరాలి, త్వరగా ఆ వంట ముగించి లంచ్ బాక్స్ లో పెట్టేయండి. నేను నందిని చెప్పిన రెడ్ బ్యాగ్ తెస్తాను, మనం ఇక్కడ నుంచి ఎంత త్వరగా బయలుదేరితే అంత మంచిది” అంటూ నందిని బెడ్రూం వైపు పరుగు తీసింది రజనీ.

నిర్మలమ్మ హడావుడిగా వంటగదిలోకి వెళ్ళిపోయింది. పది నిముషాలలో ఇద్దరు అన్నీ సర్దుకుని హాస్పిటల్ వెళ్ళడానికి తయారు అయ్యారు. నిర్మలమ్మ రెండు పెద్ద హాట్ బాక్స్ లల్లో వండిన పదార్థాలన్నీ సర్దేసింది. రజనీ నందిని చెప్పిన ఆ రెడ్ కలర్ బ్యాగ్ తీసుకుని ఇంటికి తాళం వేసి, రజనీ కార్ లో బయలుదేరారు.

# Chapter 8 - The Maze

హాస్పిటల్ లో కేపి సీసీటీవీ రికార్డింగ్ చూస్తున్నాడు. కాంటీన్ దగ్గర అజయ్ కాఫీ గ్లాస్ కింద పడడం, దానిని తీసి అక్కడే ఉన్న క్లీనింగ్ అతనికి అది ఇచ్చాడు. అతను ఏదో సణుగుతూ ఆ గ్లాస్ ను తన దగ్గర ఉన్న ట్రాలిలో పైన ఉన్న సంచిలో వేసుకున్నాడు. నెమ్మదిగా తన దగ్గర ఉన్న ఆ మాప్ తీసుకుని, అక్కడ కింద పడ్డ కాఫీ తుడిచి ఆ ట్రాలీ తీసుకుని వెళ్ళిపోయాడు.

ఆ వీడియోలో అజయ్ కొద్దిగా తెలిసేలాగా కనపడుతున్నాడు కానీ, ఆ క్లీనింగ్ వ్యక్తి ఆనవాలు ఏవి తెలియడం లేదు. అతని కదలికను బట్టి అతను ఒక అరవై ఏళ్ళ వ్యక్తిలాగా తెలుస్తోంది. కేపి వెంటనే అక్కడి జెనెటర్స్ మేనేజర్ ను కలిసి అతనికి ఆ వీడియో చూపించాడు. కానీ, అతను ఆ వీడియోలో ఉన్న వ్యక్తి లాంటి వాళ్ళను ఎప్పుడూ పనిలో పెట్టుకోలేదు అని చెప్పాడు. తన దగ్గర పనిచేసే వాళ్ళు కాంట్రాక్ట్ వాళ్ళు, అంతా కూడా నలభై ఏళ్ళ లోపు వాళ్ళేనని చెప్పాడు. కేపి చేసేది ఏమి లేక ఒకసారి వర్మను చూసి వెళ్ళిపోదామని అక్కడి స్టాఫ్ నర్స్ ని అడిగి, రెండో అంతస్తులోని వర్మ రూంకి వెళ్ళాడు.

అప్పుడే వచ్చిన రజనీ, నిర్మలమ్మ నందినికి అంతకుముందు వాళ్ళ ఇంటి దగ్గర జరిగిన విషయం చెపుతున్నారు. సరిగ్గా కవర్ పేలింది అన్న మాట చెపుతున్నప్పుడే కేపి ఆ రూంలోకి వచ్చాడు.

వెంటనే "ఏమిటి మేడమ్! ఏదో కవర్ పేలింది అంటున్నారు, ఏం జరిగింది?" అనడిగాడు.

రజనీ జరిగిన విషయం మొత్తం కేపికి చెప్పింది. "మేడమ్, మీరు ఎవరూ మీ ఇంటికి వెళ్ళవద్దు. నేను మీకు ఇక్కడే ప్రొటెక్షన్ ఇస్తాను, మీ ఇంటి దగ్గర ఏం జరిగిందో మేము కనిపెడతాము! ఇదంతా ఎవరో చాలా తెలివిగా చేస్తున్నారు, రోజు రోజుకి ఈ కేస్ బాగా కాంప్లికేట్ అవుతోంది. మీరు మటుకు ఇక్కడే జాగ్రత్తగా ఉండండి" అని రూమ్ బయటకు వచ్చి, తన స్టేషన్ కి ఫోన్ చేసి వెంటనే అక్కడికి ఇద్దరు కానిస్టేబుల్స్ పంపమని చెప్పి లోపలికి వచ్చాడు కేపి.

"మేడమ్, మీకు ఇక్కడ ఇద్దరు కానిస్టేబుల్స్ సెక్యూరిటీ గా ఉంటారు, మీరు భయపడవలసిందేమి లేదు. మీకు ఎప్పుడు ఏమి హెల్ప్ కావాలన్నా ఆ కానిస్టేబుల్స్ లేదా నేను రెడీగా ఉంటాము" అని చెప్పాడు కేపి.

ఒక అరగంట తరువాత ఇద్దరు కానిస్టేబుల్స్ అక్కడకు వచ్చారు. కేపి వాళ్ళను నందిని, రజనీ, నిర్మలమ్మకి పరిచేయం చేసి, వాళ్ళని అక్కడే ఉండమని చెప్పి తను వెళ్ళిపోయాడు.

*****

క్రాంతి, గౌతమ్ ఇద్దరు కూర్చుని టీ తాగుతున్నారు. వాళ్ళు కుప్పుసామి, కిట్టప్ప, అజయ్ ఇంట్లో దుమారం, వీటి గురించి మాట్లాడుకుంటున్నారు. ఇంతలో గౌతమ్ ఫోన్ మోగింది, కేపి కాల్ చేస్తున్నాడు. గౌతమ్ ఫోన్ ఆన్సర్ చేసి స్పీకర్ ఆన్ చేశాడు.

"ఏంటి కేపి, ఏమైనా క్లూ దొరికిందా? ఆ క్లీనింగ్ వ్యక్తి ఎవరని తెలిసిందా?" అనడిగాడు గౌతమ్.

కేపి హాస్పిటల్ లో తన ఇన్వెస్టిగేషన్ గురించి, వర్మ ఇంటి దగ్గర కవర్ పేలడం, నందిని వాళ్ళకు పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వడం గురించి చెప్పాడు. అది విన్న గౌతమ్, కేపిని క్రాంతి ఆఫీస్ కి రమ్మని చెప్పి ఫోన్ కట్ చేశాడు. ఇంతలో క్రాంతికి పోలీస్ కమీషనర్ మిత్ర ఫోన్ చేశాడు.

"క్రాంతి, నువ్వు త్వరగా గౌతమ్ ని తీసుకుని నా ఆఫీస్ కి రా, ఐ హావ్ సం న్యూస్ టు షేర్ విత్ యు బోత్" అన్నాడు మిత్ర.

దానికి క్రాంతి "ఎస్ సార్, మేము ఇప్పుడే బయలుదేరి వస్తాము" అని లేచాడు, గౌతమ్ క్రాంతి వెనకాల కదిలాడు.

క్రాంతి, గౌతమ్ ఇద్దరు పోలీస్ కమీషనర్ ఆఫీస్ కి బయలుదేరారు. గౌతమ్ కేపికి ఫోన్ చేసి "కేపి, ఒక అర్జెంట్ పని మీద నేను, క్రాంతి బయటకు వెళుతున్నాం. నిన్ను తరువాత కలుస్తాము, బై" అని చెప్పాడు.

మిత్ర తన ఆఫీస్ రూంలో తన ల్యాప్టాప్ ముందు కూర్చుని ఏదో రిపోర్ట్ చూస్తున్నాడు. ఇంతలో క్రాంతి, గౌతమ్ వచ్చారు.

క్రాంతి తలుపు దగ్గర నిలుచొని సెల్యూట్ చేసి ‘‘మే ఐ కం ఇన్ సార్’’ అన్నాడు.

‘‘కం ఇన్ క్రాంతి అండ్ గౌతమ్’’ అంటూ వాళ్ళని పిలిచి తన ఎదురుగా ఉన్న కుర్చీలల్లో కూర్చోమన్నాడు మిత్ర.

‘‘క్రాంతి, నాకు ఇందాకే డాక్టర్ విక్రాంత్ వర్మ గారి పెనట్రేటింగ్ ట్రామా రిపోర్ట్ వచ్చింది. ఆ రిపోర్ట్ లో ఆయనకు తగిలిన బుల్లెట్ గాయాల గురించి మనకు అన్నీ రకాల వివరాలు ఉన్నాయి. ఆ రిపోర్ట్ లో కొన్ని విస్తుపోయే విషయాలు ఉన్నాయి. ఆయనకు ముందు తగిలిన మూడు బుల్లెట్ లు డమ్మీ బుల్లెట్ లు. కానీ అవి అతి దగ్గర నుంచి వేగంగా తగలడం వలన ఆయనకు లోతయిన గాయాలు తగిలాయి. వాటి వలన పెద్దగా ప్రాణాపాయం ఉండదు కానీ, పెద్ద గాయం అయ్యే ఆస్కారం ఉంది. అది కేవలం ఆయనను బెదిరించడానికో లేదా గాయపరచాలనో ఎవరో చేసి ఉంటారు. కానీ ఆయన వెనుక తగిలిన బుల్లెట్ మటుకు ఆయనను చంపడానికే కాల్చినట్టు అనిపిస్తోంది. చూడండి ఆ రిపోర్ట్’’ అంటూ తన ల్యాప్టాప్ వాళ్ళ వైపు తిప్పాడు.

క్రాంతి, గౌతమ్ ఇద్దరు దీక్షగా మిత్ర ల్యాప్టాప్ చూస్తూ ఆ రిపోర్ట్ చదువుతున్నారు. క్రాంతి, గౌతమ్ ఆ రిపోర్ట్ చదివి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

‘‘బాయ్స్, దీనిని బట్టి చూస్తే ఇక్కడ రెండు టీమ్స్ ఉన్నట్టు తోస్తోంది. వాట్ డు యు సే?’’ అన్నాడు మిత్ర.

‘‘ఎస్ సార్, మాకు ఇప్పుడే అర్థమవుతోంది. కానీ బయట రోజు రోజుకి ఈ కేస్ కాంప్లికేట్ అవుతోంది. మేము మీకు ఒక రెండు, మూడు రోజుల్లో ఒక బ్రేక్ తో వస్తాము. మాకు మీరు ఈ రిపోర్ట్ కొంచెం పంపించండి, ఇది కాకుండా మీరు మాకు వేరే ఏమైనా చెప్పవలసినది ఉందా?’’ అన్నాడు క్రాంతి.

‘‘ఎందుకైనా మంచిది, మీరు ఇప్పటివరకు కలిసిన వాళ్ళందరిని కొంచెం వాచ్ చేయండి. వాళ్ళు వర్మ గారికి ఎంత దగ్గర వాళ్ళాయిన, వేరే వాళ్ళయిన, వి కాంట్ ఇగ్నోర్ ఎనీవన్. కీప్ మీ అప్డేటెడ్, ఈ కేస్ వివరాలు సాధ్యమైనంత వరకు ఎక్కువగా స్ప్రెడ్ చేయవద్దు, యు మే గో నౌ’’ అన్నాడు మిత్ర.

క్రాంతి, గౌతమ్ ఇద్దరు లేచి మిత్రకు సెల్యూట్ చేసి వెళ్ళిపోయారు.

*****

క్రాంతికి సిద్ధార్థ్ ఫోన్ చేశాడు.

‘‘క్రాంతి, నువ్వు చెప్పిన ఆ కిట్టప్ప గురించి మేము ఎంక్వైరీ చేశాము. అతను గత వారం రోజులుగా ఎవరికి కనపడలేదు. అతని తల్లిని, చెల్లిని వాళ్ళ మామయ్య ఇంటికి వారం క్రితం పంపించి తాను ఎక్కడికో వెళ్ళాడు. నిన్న రాత్రి ఇంటికి వచ్చాడు, ఇవ్వాళ ఉదయం సుమారు నాలుగింటప్పుడు వాళ్ళ ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎందుకు, ఏమిటి ఇంకా తెలియదు, నాకు ఏమైనా తెలిస్తే నీకు చెప్తాను, బై’’ అని ఫోన్ కట్ చేశాడు.

క్రాంతి కార్ లో తల పట్టుకుని కూర్చున్నాడు. గౌతమ్ కి అర్థంకాక క్రాంతిని చూస్తూ ఉండిపోయాడు. కొంత సమయం తరువాత క్రాంతి తేరుకుని జరిగిన విషయం గౌతమ్ కు చెప్పాడు.

‘‘గౌతమ్, ఈ కేస్ లో ప్రతి దారి మూసుకునిపోతోంది, రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. ఇంక మనం ఇలా వెళ్ళితే ఎప్పటికీ ఈ కేస్ సాల్వ్ చేయలేము. ఇప్పటి నుంచి మనం ఇద్దరం వేరు వేరుగా మన ఇన్వెస్టిగేషన్ మొదలు పెట్టాలి. రేపుదయం నువ్వు బెంగళూరు వెళ్ళు, అక్కడ సిద్ధార్థ్ ని కలిసి అక్కడ కిట్టప్ప విషయం తేల్చు. ఇక్కడ నేను తక్కిన విషయాలు తెలుసుకుంటాను. మనం ఇక్కడకు వచ్చే ముందు కేపి కలవాలని చెప్పాడు. అతనిని మన స్టేషన్ కు రమ్మని చెప్పు, లెట్స్ గో నౌ’’ అని తన కార్ స్టార్ట్ చేసి కదిలాడు క్రాంతి.

గౌతమ్ కేపి కి కాల్ చేసి క్రాంతి ఆఫీస్ కు రమ్మని చెప్పాడు.

ఒక గంట తరువాత క్రాంతి, గౌతమ్, కేపి ముగ్గరు క్రాంతి ఆఫీస్ లో కలుసుకున్నారు. కేపి వర్మ ఇంటి దగ్గర జరిగిన విషయం, హాస్పిటల్ లో క్లీనింగ్ మనిషి గురించి తెలుసుకున్న విషయాలు చెప్పాడు.

క్రాంతి బాగా ఆలోచించి, "కేపి, ఇప్పటి నుంచి నువ్వు వర్మ, హాస్పిటల్, అజయ్ కేస్ మీద వర్క్ చేయి. ఈ కేస్ కి సంబందించిన వేరే ఇన్వెస్టిగేషన్ మేము చేస్తాం. మనం రోజు ఉదయం ఎనిమిదింటికి ఇక్కడ కలుసుకుందాం. మనం ఈ కేస్ అప్డేట్స్, చేయవలసిన పనులు మాట్లాడుకుని ముందుకు కదులుదాము. వచ్చే 15 రోజుల లోపల ఈ కేస్ క్లోస్ చేయాలి. లేట్ అజ్ వర్క్ ఫోకస్డ్ అండ్ సాల్వ్ దిస్" అని అన్నాడు.

గౌతమ్, కేపి క్రాంతి చెప్పిన దానికి ఒప్పుకున్నారు.

"కేపి, యు మే లీవ్ నౌ, ఈ కేస్ గురించి నువ్వే ఒక ప్లాన్ వేసుకుని ముందుకి వెళ్ళు, రేపు ఉదయం మనం మాట్లాడుకుందాం. గౌతమ్ రేపు ఉదయం బెంగళూరు వెళుతున్నాడు, అక్కడ కిట్టప్ప అనే ఒక సస్పెక్ట్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ విషయం ఇన్వెస్టిగెట్ చేసి వస్తాడు. లేట్ అస్ మీట్ టుమారో" అన్నాడు క్రాంతి. కేపి, గౌతమ్ ఇద్దరు బయలుదేరారు.

# Chapter 9 - The Hidden Weapon

గౌతమ్ ఉదయం ఆరు గంటలకు విమానంలో బెంగళూరు బయలుదేరాడు. కేపి ఎనిమిదింటికి క్రాంతి దగ్గరకు వచ్చాడు.

“సార్, ఇవాళ నేను వర్మ గారి మీద హాస్పిటల్ లో ఎటాక్ చేసిన వాళ్ళు, అజయ్ దగ్గర వేలిముద్రలు కొట్టేసిన వాళ్ళ గురించి, వర్మ గారి ఇంటి దగ్గర ఆ స్మోక్ కవర్ గురించి ఇన్వెస్టిగేషన్ చేయాలని ప్లాన్ చేశాను. నాకు శ్రీశైలం కొన్ని లీడ్స్ ఇచ్చాడు. సో ఐ యం గోయింగ్ టు వర్క్ ఆన్ దెమ్” అన్నాడు కేపి.

“గుడ్ కేపి, నేను ఇవాళ ఆ మీటింగ్ హాల్ దగ్గర నుంచి మొదలు పెడదామనుకుంటున్నాను. ఐ నీడ్ టు గెట్ సం ఆన్సర్స్, నాకు ఏమైనా కావాలంటే మీకు ఫోన్ చేస్తాను. మీకు ఏమైనా అప్డేట్స్ ఉంటే నాకు చెప్పండి. అదర్వైస్ ఐ విల్ మీట్ టుమారో మార్నింగ్ సేమ్ టైమ్” అన్నాడు క్రాంతి. కేపి సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు.

*****

క్రాంతి నేరుగా మీటింగ్ హాల్ దగ్గరకు వెళ్ళాడు. ముందుగా అక్కడి మేనేజర్ ని కలిశాడు. అక్కడ ఆ మీటింగ్ రోజు చేసిన ఏర్పాట్ల గురించి అన్నీ అడిగి తెలుసుకుంటున్నాడు. ఇద్దరూ కలిసి హాల్ లోపల పరిశీలిస్తున్నారు. అక్కడ స్టేజ్ మెట్ల మీద ఇంకా వర్మగారి రక్తపు మరకలు ఉన్నాయి. అక్కడ క్లూస్ టీం వాళ్ళు కట్టిన రిబ్బన్ అలానే ఉంది.

మేనేజర్ క్రాంతికి అక్కడి వసతులు, లైట్ లు, మైక్ లు, స్పీకర్ లు, తదితర వన్నీ చూపిస్తున్నాడు. క్రాంతికి అక్కడ తాను ఏదో మిస్ అవుతున్నట్టుగా అనిపించింది.

“హాల్ లో ఏవైనా కెమెరాలు ఉన్నాయా?” అనడిగాడు క్రాంతి.

“లేదు సార్, ఇక్కడకు వచ్చే వాళ్ళు వాళ్ళ కెమెరాలు వాళ్ళే తెచ్చుకుంటారు మేము ఏమి ఇవ్వము” అన్నాడు మేనేజర్.

క్రాంతి కొంత నిరుత్సాహంగా చుట్టూ కలయచూశాడు. అంతలో దూరంగా రెండు కుర్చీల మీద రెండు పసుపుపచ్చ డబ్బాలు కనపడ్డాయి.

“ఆ డబ్బాలు ఏమిటి? ఎవరివి? ఇక్కడ ఎందుకు ఉన్నాయి?” అని మేనేజర్ ని అడిగాడు క్రాంతి.

“సార్, అవి ఆ మీటింగ్ జరిగిన రోజు ఎవరికైనా సందేహాలు ఉంటే అక్కడ పక్కన ఉన్న కాగితాలలో వ్రాసి, ఆ వ్రాసిన వాళ్ళ వివరాలతో ఆ డబ్బాలలో వేయమని చెప్పారు. కానీ ఆ రోజు జరిగిన హడావుడిలో వాటిని ఎవరు పట్టించుకోలేదు, అవి ఇక్కడే ఉన్నాయి” అన్నాడు మేనేజర్.

“ఒకే, ఆ డబ్బాలు రెండు నా కార్ లో పెట్టించండి, వాటి సంగతి నేను చూసుకుంటాను” అంటూ తన తల పైకెత్తి హాల్ పైకప్పు వైపు చూశాడు క్రాంతి.

అది మొత్తం రూఫ్ టైల్స్ వేసి ఉంది. ఒక చోట మటుకు ఒక టైల్ తీసి ఉంది.

“అక్కడ ఆ టైల్ ఎందుకు తీశారు? మీకేమయినా తెలుసా?” అని మేనేజర్ ని అడిగాడు క్రాంతి.

మేనేజర్ అనుమానంగా తల పైకి ఎత్తి చూసి, “లేదు సార్, నేను ఇప్పుడే చూస్తున్నాను. ఈ లైట్స్ వేసేవాళ్ళు ఏమైనా తీసారేమో! నాకు తెలియదు, అయినా నాకు చెప్పకుండా ఏమి చేయరు” అంటూ తల గోకున్నాడు మేనేజర్.

“నాకు ఆ లైట్స్ వాళ్ళు వాడే లాడర్ కావాలి, ఐ వాంట్ టు సీ అప్ దేర్” అన్నాడు క్రాంతి.

“రత్నం, ఆ లైట్ బాయ్స్ వాడే పెద్ద లాడర్ ఇక్కడకు తీసుకొని రా” అని గట్టిగా అరిచాడు మేనేజర్.

*****

గౌతమ్ బెంగళూరు ఎయిర్ పోర్ట్ లో దిగిన వెంటనే బయట సిద్ధార్థ్ కార్ లో రెడీగా ఉన్నాడు. గౌతమ్ కి ముందుగానే సిద్ధార్థ్ తన వివరాలు ఫోటో అన్నీ పంపించాడు. గౌతమ్ హైదరాబాద్ లో తన ఫ్లయిట్ ఎక్కే ముందే వీడియో కాల్ చేసి

సిద్ధార్థ్ తో మాట్లాడాడు. గౌతమ్ వెళ్ళి సిద్ధార్థ్ ని కలిశాడు. తన బ్యాగ్ కార్ లో పెట్టి ఇద్దరూ అక్కడే ఉన్న కాఫీ షాప్ లో కాఫీ తీసుకున్నారు.

“సిద్ధార్థ్, ఆ కిట్టప్ప ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడో తెలిసిందా? అసలు వారం రోజుల క్రిందట అతను హైదరాబాద్ ఎందుకు వచ్చాడు? ఏమన్నా తెలిసాయా?” అన్నాడు గౌతమ్.

“గౌతమ్, నేను ఎన్నో రకాల కేస్ లు చూశాను కానీ, ఇది కొత్తగా ఉంది. ఐ థింక్ దిస్ ఇస్ నాట్ ఎ సూసైడ్, దిస్ కెన్ బి ఏ మర్డర్. మనం వెళ్తూ దారిలో మాట్లాడుకుందాం” అంటూ తన ఖాళీ కాఫీ కప్ అక్కడ పెట్టి తన కార్ వైపు నడవసాగాడు సిద్ధార్థ్.

గౌతమ్ కొంత ఆశ్చర్యం, కలవరంగా తన ఖాళీ కాఫీ కప్ అక్కడ పెట్టి సిద్ధార్థ్ వెనుక నడిచాడు. సిద్ధార్థ్, గౌతమ్ ఇద్దరూ కార్ ఎక్కారు.

“మనం నేరుగా కిట్టప్ప వాళ్ళ ఇంటి దగ్గరకు వెళ్ళదాము, అక్కడ నుంచి తన పోస్ట్ మార్టం చేస్తున్న హాస్పిటల్ కు వెళ్దాము” అని కార్ వేగం పెంచి, “కిట్టప్ప వాళ్ళ ఇల్లు ఇక్కడకు ఒక నలభై కిలోమీటర్ ల దూరం ఉంటుంది. ఈ లోపల నేను నా ఇన్వెస్టిగేషన్ వివరాలు చెప్తాను” అన్నాడు సిద్ధార్థ్.

గౌతమ్, సిద్ధార్థ్ చెప్పే విషయాలు వ్రాసుకోవడానికి ఒక చిన్న నోట్ ప్యాడ్ తీసాడు.

“గౌతమ్ మీరు నోట్ చేసుకోవాలసిన పని ఏమి లేదు, నేను మీకు అన్నీ విషయాలు ఈ-మెయిల్ లో పంపిస్తాను. వాటితో పాటు ఫోటోలు, వీడియోలు కూడా పంపుతాను. ఎందుకు శ్రమ తీసుకుంటారు? రిలాక్స్, నేను చెప్పేది వినండి” అంటూ కార్ ను ఫ్లై ఓవర్ ఎక్కించాడు సిద్ధార్థ్.

“క్రాంతి నాకు ఫోన్ చేసి కిట్టప్ప గురించి చెప్పి వివరాలు వాట్సప్ లో పంపాడు. ముందు నేను మా కానిస్టేబుల్ బద్రప్పను అక్కడకు పంపించాను. అతను కిట్టప్ప కొన్ని రోజుల ముందు తన తల్లిని, చెల్లిని వాళ్ళ పల్లెటూరికి పంపించి, తను ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడని వచ్చి చెప్పాడు. ఆ పక్క ఇంటి వాళ్ళని కలిసి అడిగితే, కిట్టప్ప వాళ్ళు ఎవరితో పెద్దగా కలవడని, ఎవరితో కూడా అవసరం ఉంటే తప్ప మాట్లాడడని చెప్పారంట. క్రాంతి ఇచ్చిన వివరాల నుంచి నేను కిట్టప్ప ఫోన్ నెంబర్ తీసుకుని ఫోన్ చేశాను. కానీ అది ఎప్పుడూ స్విచ్ఆఫ్ అని వస్తుండేది.

నేను బద్రప్పని ఆ కిట్టప్ప గురించి కనుక్కోమని చెప్పాను. నిన్న ఉదయం బద్రప్ప అక్కడకు వెళ్ళేసరికి కిట్టప్ప ఇంటికి తాళం లేదు, అంటే తను ఊరి నుంచి వచ్చి ఉంటాడు అనుకుని తలుపు కొట్టాడు బద్రప్ప. ఎంతసేపటికి తలుపు తీయకపోయేసరికి, బద్రప్ప తలుపులు విరగ్గొట్టి లోపలికి వెళ్ళాడు. అక్కడ కిట్టప్ప ఫ్యాన్ కు ఉరి వేసుకుని చనిపోయాడు. బద్రప్ప వెంటనే నాకు ఫోన్ చేసి విషయం చెప్పి, అంబులెన్స్ కు ఫోన్ చేసి బాడీని హాస్పిటల్ కి పంపించాడు” అని చెప్పాడు సిద్ధార్థ్.

“సరే, ఇందులో అతనిది ఆత్మహత్య కాదనడానికి ఏమిటి కారణం?” అన్నాడు గౌతమ్.

“కిట్టప్ప ఇంటి సీలింగ్ కి ఊరి వేసుకున్నాడు కానీ, అతని కాళ్ళ క్రింద ఎటువంటి ఆధారం లేదు. అటువంటప్పుడు అతను ఎలా ఊరి వేసుకోగలడు? పైగా అతని కాళ్ళ రెండు బ్రొటనవేళ్ళకి ఒక రబ్బర్ బ్యాండ్ తగిలించి ఉంది. అవి చూసిన వాళ్ళు ఎవరైనా ఇట్టే చెప్పగలరు, అది ఆత్మహత్య కాదు అని” అని చెప్పాడు సిద్ధార్థ్.

గౌతమ్ ఆలోచనలో పడ్డాడు.

“ఒకవేళ కిట్టప్పను వేరే ఎవరో చంపి అక్కడ తగిలించి ఉంటే, మరి లోపల నుంచి ఎలా లాక్ చేసి ఉంది? ఒక వేళ వేరే వాళ్ళు కిట్టప్పని అక్కడ తగిలించి ఉంటే వాళ్ళు లోపాలే ఉండాలి కదా!” అన్నాడు గౌతమ్.

“వెరీ వ్యాలిడ్ క్వశ్చన్. అదే ఇప్పుడు అక్కడ మిస్టరీ, మనం వెళ్ళి చూద్దాం” అంటూ కార్ ని ఫ్లై ఓవర్ మీద నుంచి వచ్చిన ఎగ్జిట్ లో దిగి ఒక చిన్న సర్వీస్ రోడ్ మీదకు మళ్ళించాడు సిద్ధార్థ్.

*****

రత్నం ఇంకోకడి సహాయంతో నాలుగు చక్రాల మీద అమర్చిన ఒక పెద్ద నాలుగు అంతస్తుల నెచ్చెనను అక్కడకు తోసుకుని వచ్చాడు. క్రాంతి దానిని సరిగ్గా ఆ పక్కకు జరిపిన టైల్ దగ్గర నిలిపించాడు. రత్నం, ఆ వచ్చిన కుర్రాడు ఆ నెచ్చెనకు ఉన్న చక్రం తిప్పి దానిని పై కప్పు దాకా పెంచారు.

క్రాంతి చకచకా ఆ నెచ్చెన ఎక్కి, ఆ పక్కకు జరిపిన టైల్ దగ్గరకు వెళ్ళాడు. అక్కడి నుంచి చూస్తే సరిగ్గా స్టేజ్ మీద నుంచి కిందకు దిగే మెట్లుకి వాటంగా కనిపిస్తోంది. క్రాంతి ఇంకొంచెం పైకి ఎక్కి ఆ తొలిగించిన టైల్ లోపలకి తల పెట్టి చూశాడు.

"మై గాడ్, ఇక్కడ ఎవరో ఒక గన్ రిమోట్ కంట్రోల్ మిషన్ ని అమర్చి ఉంచారు. అంటే దీని సహాయంతోనే వర్మగారిని కాల్చారు" అని దానిని జాగ్రత్తగా తీసి, మెల్లిగా కిందకు తీసుకుని వచ్చాడు క్రాంతి.

మేనేజర్ కి ఒళ్ళు మొత్తం చెమటలు పట్టాయి. క్రాంతి నెచ్చెన దిగి "మీకు తెలియకుండా ఇది ఎలా జరిగింది? అంత పైకి వెళ్ళి దీనిని పెట్టాలంటే ఇంత పెద్ద నెచ్చెన కావాలి. దీనిని ఇక్కడకు తీసుకుని రావడానికి కనీసం ఇద్దరు మనుషులు కావాలి. అసలు ఇది ఇక్కడ ఎలా సాధ్యమైంది మీరే చెప్పాలి మేనేజర్ గారు" అంటూ కొంచెం గట్టిగా గర్జించి అడిగాడు.

"అయ్యో రామ! నిజంగా నాకు ఏమి తెలియదు. మీరు ఇప్పుడు అది చూపిస్తే తప్ప అసలు నేను ఎరుగను. నా మాట నమ్మండి క్రాంతి గారు, ఇదంతా నాకు ఏదో మాయ లాగా అనిపిస్తోంది" అంటూ రెండు చేతులుతో తల పట్టుకున్నాడు మేనేజర్.

రత్నం వైపు తిరిగి "దీని గురించి నీకు తెలుసా?" అనడిగాడు క్రాంతి.

"నాకేం తెల్వద్ సార్, నేను పది రోజుల తర్వాత ఇయాలనే పనికొచ్చిన. మా బిడ్డ నీళ్ళు పోసుకుందంటే నేను, మా ఇంటిది ఇడుసుపల్లి పొయ్యి నిన్న రాతిరి వచ్చినం. నేను ఇయాల పొద్దుగాలే పనిలోకొచ్చిన నాకేం తెల్వద్" అన్నాడు రత్నం.

క్రాంతి ఆ పక్కన ఉన్న కుర్రాడిని "ఏరా, నేకేమైనా తెలుసునా?" అన్నాడు.

దానికి మేనేజర్ "సార్, వాడిని నిన్ననే పనిలో పెట్టుకున్నాం. వాడు బిహారీ వాడు, ఇక్కడ మొక్కలకి నీళ్ళు పోయడం, బూజులు రాలగొట్టటం అలాంటి పనులు చేస్తాడు. వాడికి హిందీ తప్ప ఏమి రాదు, వాడికి అసలు ఏమి తెలియదు కూడా" అని చెప్పాడు.

క్రాంతి ఆ గన్, రిమోట్ మెషీన్ తీసుకుని హాల్ బయటకు వచ్చాడు. మేనేజర్ వైపు తిరిగి "నాకు ఎప్పుడు అవసరమొచ్చినా నేను ఇక్కడకు మళ్ళీ వస్తాను, లేదంటే అవసరం బట్టి మీరు మా స్టేషన్ కు రావలసి ఉంటుంది. ఈ కేస్ పూర్తి అయ్యేవరకు తప్పదు" అంటూ తన కార్ ఎక్కి వెళ్ళిపోయాడు.

# Chapter 10 - Clueless Incident

సిద్ధార్థ్ కార్ ఒక చిన్న కాలనీ లాంటి ప్రదేశంకు వచ్చి ఆగింది.

“గౌతమ్, మనం కార్ ఇక్కడ పార్క్ చేసి, కొంచెం లోపలికి నడవాలి. అవి ఇరుకు రోడ్లు, పైగా చిన్న పిల్లలు, ఆవులు, కుక్కలు తిరుగుతుంటాయి” అన్నాడు సిద్ధార్థ్.

దానికి గౌతమ్ “నో ఇష్యూస్, నడుద్దాం” అంటూ తన సీట్ బెల్ట్ తీసి కార్ దిగాడు. సిద్ధార్థ్ కూడా కార్ దిగి లాక్ చేసాడు.

ఇద్దరు కొంచెం ముందుకు వెళ్ళి ఆ పక్కనే ఒక చిన్న మట్టి రోడ్ వైపు తిరిగి ముందుకు వెళ్ళారు. సిద్ధార్థ్ చెప్పినట్టుగానే అవి చిన్న రోడ్లు, అక్కడే పిల్లలు ఆడుకుంటున్నారు. అది ఒక స్లమ్ ఏరియా లాగా ఉంది. వాళ్ళు కొంత ముందుకు వెళ్ళిన తరువాత వరుసగా ఒక ఆరు ఇళ్ళు ఉన్నాయి. అవి అన్నీ ఒకడివే. ఇంచుమించు అన్నీ ఒకేలాగా ఉన్నాయి, అన్నింటికీ ఒకే రంగు వేసి ఉంది.

అక్కడ నాలుగో ఇంటి దగ్గర బయట ఒక చిన్న కుర్చీలో కూర్చుని ఒక కానిస్టేబుల్ ఉన్నాడు. అతను సిద్ధార్థ్ ని చూడగానే లేచి సెల్యూట్ చేసాడు. “బద్రప్ప, ఈయన హైదరాబాద్ నుంచి వచ్చిన ఆఫీసర్ గౌతమ్, కిట్టప్ప కేస్ లో ఆయనకు కావలసిన హెల్ప్ చేయాలి మనం” అని చెప్పాడు సిద్ధార్థ్.

బద్రప్ప గౌతమ్ కి కూడా సెల్యూట్ చేసాడు.

“హలో బద్రప్ప, మనం లోపలికి వెళ్ళి చూద్దామా?” అన్నాడు గౌతమ్.

బద్రప్ప ఇంటి లాక్ తీసి లోపలికి వెళ్ళాడు. వెనకాలే సిద్ధార్థ్, గౌతమ్ వెళ్ళారు.

*****

కేపి నేరుగా వర్మ ఇంటి దగ్గరకు వెళ్ళాడు. అది కొంచెం హై క్లాస్ రిచ్ పీపుల్ ఉండే ఏరియా. అన్నీ కూడా ఇండిపెండెంట్ విల్లాలే, అన్నీ ఇళ్ళు బాగా విశాలంగా ఉన్నాయి. ప్రతీ ఇంటికి ఎత్తయిన గోడలు, ఇళ్ల ముందు ఒక చిన్న లాన్, పెద్ద పెద్ద గేట్లు ఉన్నాయి. వర్మ ఇంటికి ముందు ప్రహరీ గోడ, దానికి ఆనుకొని ఇంటి లోపల భాగంలో కొన్ని ఎత్తయిన అశోక చెట్లు ఉన్నాయి.

కేపి తన బుల్లెట్ బైక్ వర్మ ఇంటి ముందు ఆపి, బైక్ దిగి అటు ఇటు చూశాడు. ఆ రోడ్ అంత నిర్మానుష్యంగా ఉంది. కొంచెం దూరంలో ఒక చెట్టు కింద ఒకతను ఇస్త్రీ బండి పెట్టుకుని బట్టలు ఇస్త్రీ చేస్తున్నాడు. కేపి ఆ రోడ్ లోని ఇళ్లను గమనిస్తూ ఆ ఇస్త్రీ బండి వద్దకు వెళ్ళాడు. ఆ ఇస్త్రీ చేస్తున్నతనికి సుమారు ఒక అరవై ఏళ్లు ఉంటాయి.

కేపీని చూసి “ఏటి కావాలి మీకు?” అనడిగాడు.

“ఇక్కడ నువ్వు ఎన్ని రోజుల నుంచి ఇస్త్రీ చేస్తున్నావు? నిన్న ఇక్కడే ఉన్నావా?” అనడిగాడు కేపి.

“మీరు సుస్తే పోలిసోల్లలాగున్నారు, నేను ఈ బస్తీలో నాలుగేళ్లుగా బట్టలు ఇస్త్రీ సేస్తున్నాను. నేను నిన్న ఇక్కడ లేను, నేను రోజు ఈడిసి రోజు వస్తాను. నిన్న నేను పక్క రోడ్డులో ఉన్నాను. ఒక రోజు ఈ రోడ్డు, ఇంకో రోజు ఆ రోడ్డు, ఆదివారం సెలవు” అని బదులిచ్చాడు ఇస్త్రీ అతను.

కేపి అతనితో మాట్లాడి సమయం వృథా చేయడం ఇష్టం లేక, “సరే, పని చూసుకో” అంటూ వర్మ ఇంటి వైపు వెళ్ళాడు.

వర్మ ఇంటి దగ్గర బాగా గమనించాడు, ఆయన ఇంటి సీసీటీవీ కెమెరాలు అన్నీ బాగానే ఉన్నట్టు అనిపించింది. వెంటనే నందినికి ఫోన్ చేసాడు.

“మేడమ్, మీ ఇంటికి సీసీటీవీ రికార్డింగ్ నేను చూడాలి, అది ఎలా సాధ్య పడుతుంది?” అనడిగాడు.

“అయ్యో! ఈ హడావిడిలో పడి నేను మర్చిపోయాను, ఆ సీసీటీవీ రికార్డింగ్ నా మొబైల్ ఫోన్ లో చూడవచ్చు” అని చెప్పింది నందిని.

“సరే మేడమ్, నేను మధ్యాహ్నం లోపల హాస్పిటల్ కి వస్తాను, నేను మీ ఇంటి సీసీటీవీ రికార్డింగ్ చూడాలి. నిన్న మీ ఇంటిలోకి ఆ స్మోక్ కవర్ ఇచ్చిన వాళ్ళను నేను చూడాలి. థాంక్ యు మేడమ్” అని ఫోన్ కట్ చేసాడు కేపి.

కేపి తన బుల్లెట్ బైక్ ఎక్కి స్టార్ట్ చేసి వెనకకు తిప్పి బయలుదేరాడు. ఒక నాలుగు ఇళ్ళు దాటిన తరువాత ఎంతో విలువైన, అందమైన ఒక ఫారిన్ కార్ అక్కడ ఉంది. కేపి అంతకుముందు ఎన్నడూ అటువంటి కార్ చూడలేదు.

తన బైక్ ఆపి ఆ కార్ ని తన మొబైల్ తో ఒక ఫోటో తీసుకుని ‘డబ్బున్న వాళ్ళు ఏమైనా కొనగలరు. ఇలాంటివి కేవలం సినిమాలలోనే ఉంటాయి, ఇప్పుడు నిజంగా చూస్తున్నాను’ అనుకుంటూ వెళ్ళిపోయాడు.

*****

క్రాంతి తను మీటింగ్ హాల్ నుంచి తెచ్చిన గన్, రిమోట్ మెషిన్ తీసుకుని నేరుగా క్లూస్ టీం ప్రసాద్ దగ్గరకు వెళ్ళాడు.

“ప్రసాద్, నేను ఇవాళ ఉదయం వర్మ గారి షూటింగ్ జరిగిన మీటింగ్ హాల్ కు వెళ్ళాను. అక్కడ పైన రూఫ్ లో ఇది దొరికింది, నాకు దీనిని మీరు టెస్ట్ చేసి వర్మ గారికి ముందుపక్క తగిలిన బుల్లెట్ లు ఈ గన్ నుంచి వచ్చినవా? అని కనుక్కొని నాకు చెప్పండి. అండ్ వన్ మోర్ థింగ్, ఈ విషయం మీరు ఎవరికి తెలియనీయవద్దు” అని తను తెచ్చిన ఆ గన్, రిమోట్ మెషిన్ ప్రసాద్ కి ఇచ్చాడు క్రాంతి.

“క్రాంతి గారు, మీరు నాకు ప్రత్యేకంగా చెప్పాలా? నేను దీనిని స్టడీ చేసి మీకు అన్నీ వివరాలు చెప్తాను” అని క్రాంతి ఇచ్చిన గన్ రిమోట్ మెషిన్ తీసుకున్నాడు ప్రసాద్.

క్రాంతి వెళ్ళిపోయాడు.

*****

గౌతమ్, సిద్ధార్థ్ ఇద్దరు బద్రప్ప వెనకాల కిట్టప్ప ఇంటిలోనికి వెళ్ళారు. అది చాలా పాతకాలపు ఇల్లులాగా ఉంది. ఇంటి పైకప్పు మొత్తం మంగళూర్ పెంకులతో ఉంది. గోడలన్నీ సున్నంతో కట్టినవి, అవి వర్షాలకు తడిసి కొంచెం చెమ్మగా ఉన్నాయి. ఒక గోడ మీద కిట్టప్ప వాళ్ళ నాన్న చెన్నప్ప ఫోటో, దానికి దండ వేసి ఉంది. కొంచెం పక్కగా ఇంకో ఫోటో, కనీసం ఒక పదిహేను సంవత్సరాల ముందు దానిలాగా ఉంది. అందులో దేవప్ప, వాళ్ళావిడ, కిట్టప్ప, అతని చెల్లెలు అందరూ ఉన్నారు. దానిలో కిట్టప్ప చిన్న పిల్లవాడిలాగా ఉన్నాడు. ఆ గదిలో పైన కొయ్య దంతెలకి ఉన్న ఫ్యాన్ కి ఒక పాత లుంగీ వేలాడుతోంది.

బద్రప్ప దానిని చూపించి “నేను తలుపు పగలగొట్టి లోపలికి వచ్చినప్పుడు, కిట్టప్ప దీనికే ఉరి వేసుకుని చనిపోయి ఉన్నాడు” అని చెప్పాడు.

సిద్ధార్థ్ చెప్పినది గుర్తుకు తెచ్చుకుని చూస్తున్నాడు గౌతమ్. ఆ లుంగీ కనీసం నెల మీద నుంచి తొమ్మిది అడుగుల పైన ఉంది. కిట్టప్ప ఎత్తు ఆరడుగులు, అంటే తను ఉరి వేసుకోవాలంటే తనకు కనీసం రెండు లేదా మూడు అడుగుల బల్ల లేదా ఏదైనా వస్తువు కావాలి, కానీ ఆ ఇంటిలో అలాంటి వస్తువులు ఏవీ లేవు.

గౌతమ్, సిద్ధార్థ్ ఇద్దరు ఆ ఇంటిలో అన్నిటినీ పరికిస్తున్నారు. ఇంతలో ఇద్దరు ఒకేసారి తల పైకి ఎత్తి చూశారు, పైన ఉన్న పెంకుల మధ్య నుంచి కిందకు సూర్యరశ్మి పడుతోంది.

*****

కేపి హాస్పిటల్ కి వచ్చాడు. నేరుగా రెండవ అంతస్తులో ఉన్న వర్మ గారి రూమ్ దగ్గరకు వెళ్ళాడు.

కేపి ని చూసిన నందిని, “రండి కేపి గారు, మీరు అడిగిన ఆ సీసీటీవీ రికార్డింగ్ ఇక్కడ చూడండి” అంటూ తన మొబైల్ ఫోన్ లో చూపెట్టింది.

కేపి రెండు రోజుల ముందు రికార్డింగ్ చూశాడు. సాయంత్రం నాలుగు గంటల పదకొండు నిమిషాలకు వర్మ ఇంటి ముందు ఒక బైక్ ఆగింది. దాని మీద ఇద్దరు నల్ల బట్టలు వేసుకుని హెల్మెట్ లు పెట్టుకుని కూర్చుని ఉన్నారు. కాసేపు అక్కడ ఆగి, అటు ఇటు చూసి వెళ్ళిపోయారు.

కేపి ఆ రికార్డింగ్ లో ఆ ముందు రోజు జరిగిన రికార్డింగ్ చూశాడు. అందులో ముందు రోజు వచ్చిన అదే బైక్ వచ్చి ఆగింది. ఆ వచ్చిన వాళ్ళు ఇద్దరు ముఖాలకు హెల్మెట్ లు పెట్టుకుని ఉన్నారు. ఆ బైక్ వెనుక కూర్చున్నవాడు దిగి, తన బ్యాక్ ప్యాక్ లోపలి నుంచి ఒక తెల్లని కవర్ తీసాడు. దానిని జాగ్రత్తగా మెల్లిగా వర్మ ఇంటి ముఖద్వారం దగ్గర పెట్టాడు. కాలింగ్ బెల్ ఒత్తి ఒక్క ఉదుటున బయటకు వెళ్ళి, అప్పటికే స్టార్ట్ చేసి వెనుకకు తిప్పి పెట్టిన ఆ బైక్ ఎక్కి ఇద్దరు వెళ్ళిపోయారు.

కేపి ఆ వీడియో క్షుణ్ణంగా మూడుమార్లు చూసి, ఆ వచ్చిన వాళ్ళు అంతకుముందు హాస్పిటల్ లో సెక్యూరిటీ గార్డ్ లాల్ మీద దాడి చేసిన వాళ్ళే అని గుర్తు పట్టాడు.

‘‘థాంక్ యు మేడమ్, మీరు ఈ వీడియో కొంచెం జాగ్రత్త చేసి పెట్టండి. లేదా నాకు పంపండి, మా ఇన్వెస్టిగేషన్ కు అవసరం. ఆ వచ్చిన వాళ్ళు ఇంతకుముందు ఇక్కడ భీభత్సం చేసిన వాళ్ళే, వాళ్ళ సంగతి మేము చూసుకుంటాము. నేను ఇప్పుడు వేరే పని మీద వెళ్తున్నాను, నేను తరువాత వస్తాను. మీకు ఏమయినా అవసరం ఉంటే నాకు కాల్ చేయండి’’ అని వెళ్ళిపోయాడు కేపి.

రజనీ తాను తెచ్చిన ఎర్ర బ్యాగ్ నందినికి ఇచ్చింది. ‘‘పని మీద బయటకు వెళ్ళుతున్నాను, సాయంత్రం వస్తాను’’ అని చెప్పి వెళ్ళిపోయింది.

నిర్మలమ్మ ఆ గదిలోని సామానులు సర్దుతోంది. నందిని అక్కడ ఉన్న ఇంగ్లీష్ న్యూస్ పేపర్ తీసుకుంది.

*****

గౌతమ్, సిద్ధార్థ్ ఇద్దరు ఒకేలాగా ఆలోచిస్తున్నారు. ఇద్దరు ఒకేసారి ‘‘బద్రప్ప, మనం ఆ పైకప్పు మీదకు వెళ్ళాలి’’ అన్నారు.

‘‘అయ్యో! సార్లు, గౌతమ్ అన్నా, సిద్ధార్థ్ అన్నా ఆ బుద్ధ భగవానుడి పేర్లే. అందుకే ఇద్దరు ఒకే లాగా ఆలోచిస్తున్నారు, మాట్లాడుతున్నారు’’ అంటూ నవ్వుతూ ‘‘సరే, ఆ పైకి ఎట్లా వెళ్ళాలో నేను చూసి ఏర్పాటు చేస్తాను’’ అని బయటకు వెళ్ళాడు బద్రప్ప.

గౌతమ్, సిద్ధార్థ్ ఇద్దరు నవ్వుతూ ఒకరినొకరు చూసుకున్నారు.

*****

క్రాంతి తన స్టేషన్ లో తన కుర్చీలో కూర్చుని ఆ గన్, రూఫ్, వర్మ గారి గాయాల గురించి ఆలోచిస్తున్నాడు.

కేపి ఆ నేరాలు చేస్తున్న ఆ ఇద్దరు ఎవరు? ఎందుకు చేస్తున్నారు? ఎక్కడ ఉన్నారు? అని ఆలోచిస్తున్నాడు.

# Chapter 11 - The Awake

సమయం సాయంత్రం ఐదు కావస్తోంది.

రజనీ నందినికి ఫోన్ చేసింది.

“నందిని, నేను రావడానికి ఇంకా లేట్ కావచ్చు, అనుకోకుండా ఆఫీస్ లో ఒక పని వచ్చి పడింది, అది ఎంతకీ తేలడం లేదు. నేను నా పని పూర్తి చేసుకుని రాత్రికి ఇంటికి వెళ్ళే ముందు వస్తాను. బాగా ఆలస్యం అయితే రేపు ఉదయం వస్తాను, అవసరముంటే నాకు కాల్ చేయి” అని చెప్పి పెట్టేసింది.

ఇంతలో ఒక నర్స్ వర్మ రూమ్ కి వచ్చింది.

“చీఫ్ డాక్టర్ గారు వస్తున్నారు, ఆయన చెక్ చేసి వెళతారు. ఆయన వచ్చినప్పుడు మీరు కొంచెం బయట వెయిట్ చేయండి” అని చెప్పింది. నందిని సరే అన్నట్టుగా తల ఊపింది.

ఒక పది నిముషాల తరువాత చీఫ్ డాక్టర్ ఒక అసిస్టెంట్ తో కలిసి వచ్చారు.

నందినిని చూసి “హలో మేడమ్, వర్మగారు త్వరగా కోలుకుంటారు. నథింగ్ టు వర్రీ, లెట్ మీ చెక్ వన్ మోర్ టైమ్” అంటూ వర్మ బెడ్ దగ్గరకు వెళ్ళారు.

అక్కడే ఉన్న నర్స్ నందినిని, నిర్మలమ్మని బయటకు రమ్మని చెప్పింది. అక్కడే బయట ఉన్న కానిస్టేబుల్ లేచి నిలుచున్నాడు. లోపలికి వెళ్ళిన అసిస్టెంట్ డాక్టర్ రూమ్ కర్టన్ లాగి దగ్గరకు వేశాడు. డాక్టర్ లు ఇద్దరు లోపలే ఉన్నారు. ఏవో మాటలు వినపడుతున్నాయి. ఒక పది నిముషాలు తరువాత ఇద్దరు బయటకు వచ్చారు.

చీఫ్ డాక్టర్ “మేడమ్, హి ఈజ్ ఆల్రైట్, ఇంకో రెండు మూడు రోజులలో ఆయనకు తెలివి రావచ్చు, హి ఈజ్ రెస్పాండింగ్ వెరీ వెల్” అంటూ బయటకు వచ్చాడు.

ఆ నర్స్ వెంటనే లోపలికి వెళ్ళి వర్మ బెడ్ కొంచెం సర్దింది. డాక్టర్ లు వెళ్ళిపోయాక నందిని, నిర్మలమ్మ ఇద్దరు లోపలికి వెళ్ళారు, నర్స్ కూడా వెళ్ళిపోయింది. నిర్మలమ్మ నందినికి కప్ లో కాఫీ తెచ్చి ఇచ్చింది. నందిని నిస్తేజంగా పడుకుని ఉన్నవర్మని చూస్తూ ఉండిపోయింది.

ఒక అరగంట గడిచింది, వర్మకి తగిలించి ఉన్న అక్కడి మిషన్ లు ఒక్కసారిగా విపరీతంగా మారిపోవడం, అవి రకరకాల శబ్దాలు చేయడం మొదలు పెట్టాయి. వర్మ ఒంటి మీద నరాలు మెల్లగా ఉబ్బుతున్నాయి, ఆయన శరీరం ఎర్రగా మారుతోంది. అది చూసిన నందిని ఒక్కసారిగా లేచి అక్కడ ఉన్న ఎమర్జెన్సీ బటన్ నొక్కింది. అది వెంటనే ఒక పెద్ద సైరన్ లాగా మోగింది.

వెంటనే ఒక నలుగురు నర్స్ లు, ఇద్దరు డాక్టర్ లు పరుగెత్తుకుని వచ్చారు. వాళ్ళు లోపలి వెళ్ళి నందినిని, నిర్మలమ్మని బయటకు పంపేశారు. ఒక్క రెండు నిముషాలలో అంతా నిశబ్దం, నందినికి కంటి నుండి ధారగా నీళ్ళు వస్తున్నాయి. ఆమె కొయ్యబారిపోయి ఉంది.

*****

క్రాంతి మీటింగ్ హాల్ నుండి తెచ్చిన రెండు పసుపు డబ్బాలను తెరిచాడు. వాటిలో ఒక్కోదానిలో ఇరవై నుండి ముప్పై వరకు చీటీలు ఉన్నాయి. క్రాంతి వాటిని అన్నీ తీసి వరుసగా పేర్చాడు. అన్నీ కూడా ఒకే లాంటి కాగితాలు, వాటి మధ్యలో ఒకటి మాత్రంకొంచెం వేరేగా ఉంది. క్రాంతి దృష్టి ఆ వేరేగా ఉన్న కాగితం మీద పడింది. నేరుగా దానినే తీసాడు.

*****

వర్మ రూమ్ లోకి వెళ్ళిన డాక్టర్ లలో ఒకతను, ఒక నర్స్ బయటకు వచ్చి కొన్ని మందులు ఒక ట్రేలో, కొన్ని సిరంజీలు, పైప్ లు, తీసుకుని హడావిడిగా లోపలికి వెళ్ళిపోయారు. వారి వెనుక ఇద్దరు స్టాఫ్ బాయ్స్, ఒక పెద్ద కంప్యూటర్ లాంటి

ఒక మెషిన్ ను తోసుకుంటూ లోపలికి వెళ్ళారు. దాదాపు అరగంట తరువాత డాక్టర్ లు బయటకు వచ్చారు. వాళ్ళ ముఖంలో ఏదో తెలియని ఒక ఆనందం.

వాళ్ళని చూసిన నందిని కళ్ళు తుడుచుకుంటూ వాళ్ళని అడిగింది.

"డాక్టర్, ఏం జరిగింది? వర్మ ఇప్పుడు ఎలా ఉన్నారు?"

ఆ డాక్టర్ లలో ఒకతను చాలా ఆనందంతో, "మేడమ్ ఇట్స్ ఎ మిరాకిల్, వర్మగారికి స్పృహ వచ్చింది. ఆయన కళ్ళు తెరిచి చూశారు, హి ఈజ్ నార్మల్. ఆయనకు కొంత బడలిక ఉంది, రేపటికల్లా ఆయన మామూలుగా మాట్లాడుతారు. మేము సమయానికి వచ్చి ఆయనకు కావలసిన ట్రీట్మెంట్ ఇచ్చాము. లేదంటే వి కూడ్ హావ్ లాస్ట్ హిమ్, తృటిలో ప్రాణాపాయం తప్పింది. గాడ్ ఈజ్ గ్రేట్" అన్నాడు.

రెండో డాక్టర్, "అసలు ఇది ఎలా జరిగిందో అర్థం కావడం లేదు. రెండు గంటల ముందు రౌండ్స్ డాక్టర్ ఇచ్చిన డీటైల్స్ బట్టి ఆయనలో ఎటువంటి మార్పు లేదు. కానీ అంతలో ఏమి జరిగిందో అర్థం కావడం లేదు" అన్నాడు.

"మాకు తెలియదు, కానీ ఇందాక అరగంట క్రితం మీ చీఫ్ డాక్టర్, ఒక అసిస్టెంట్, ఒక నర్స్ తో వచ్చి ఆయనను చూసి వెళ్ళారు. ఆయనే చెప్పారు వర్మ గారికి రెండు రోజుల లోపల నార్మల్ అవుతారని, బట్ ఇంత త్వరగా అని నేను ఊహించలేదు" అంది నందిని.

"వాట్? మా చీఫ్ డాక్టర్ రావడమేమిటి మేడమ్? ఆయన అమెరికాలో ఒక మెడికల్ కాన్ఫరెన్స్ అటెండ్ అవ్వడం కోసం వారం క్రితమే అమెరికా వెళ్ళారు. ఇక్కడకు వచ్చిన వాళ్ళు ఎవరో వేరే వాళ్ళు అయ్యి ఉంటారు. మీరు వాళ్ళను చూశారా?" అనడిగాడు మొదటి డాక్టర్.

నందిని షాక్ తిన్నది.

"అదేమిటి, మరి వచ్చిన వాళ్ళు ఎవరు?" అంటూ అనుమానంగా చూస్తూ ఉండిపోయింది.

ఇంతలో లోపలి నుంచి ఒక నర్స్ "సార్, ఆ మెషీన్ నుంచి రిపోర్ట్ వచ్చింది, ఒక సారి మీరు వచ్చి చూడండి" అని చెప్పి లోపలికి వెళ్ళిపోయింది.

ఇద్దరు డాక్టర్ లు లోపలకి వెళ్ళారు. నందిని అక్కడే ఆశ్చర్యంతో ఉండిపోయింది.

*****

క్రాంతి చేతిలోకి ఆ కాగితం తీసుకుని చూశాడు. అది వేరే వాటికన్నా భిన్నంగా ఉంది. వేరే అన్ని కాగితాలు తెల్లగా ఉండి, వాటి మీద భారత పురావస్తు శాఖ వాళ్ళ చిహ్నం, దాని కింద ఒక నాలుగు పంక్తుల ప్రశ్నలు, ఆ తరువాత అన్నీ వ్రాసుకోవడానికి వీలుగా అడ్డ గీతాలు ఉన్నాయ్.

కానీ, క్రాంతి చేతిలోని కాగితం కొంచెం గులాబీ రంగులో, దాని మీద నల్లని సిరాతో ఒక శివలింగం, త్రిశూలం, ఒక నటరాజ విగ్రహం బొమ్మ, వాటి క్రింద ఒక పుర్రె ఒక కత్తి, గన్ అపాయం బొమ్మలాగా గీసి ఉన్నాయి. అది ఎవరు పంపారు?, వాళ్ళ పేరు, చిరునామా, వేరే ఎటువంటి వివరాలు లేవు.

క్రాంతి ఆ కాగితం చూస్తూ దాని అర్థం ఏమి అయ్యి ఉండవచ్చు అని ఆలోచనలో పడ్డాడు.

*****

గదిలోకి వెళ్ళిన ఒక డాక్టర్ బయటకు వచ్చి నందినిని లోపలికి రమ్మని చెప్పాడు. నందిని మారు మాట్లాడకుండా అతని వెనకాలే వర్మ ఉన్న గదిలోకి వెళ్ళింది.

వర్మ చాలా నీరసంగా ఉన్నాడు, కళ్ళు తెరిచి చూస్తున్నాడు, కళ్ళలో నీళ్ళు, పెదవి మీద చిరునవ్వు ఉన్నాయి. నందినికి కూడా కళ్ళలో నీళ్ళు ఆగడం లేదు, తెలియని ఆనందం.

అక్కడ ఉన్న ఒక డాక్టర్ ''మేడమ్, వర్మ గారికి ఎవరో ఒక పవర్ఫుల్ స్టెరాయిడ్ ని ఇంజెక్ట్ చేశారు. ఆ స్టెరాయిడ్ అతని బ్రైన్ మీద పని చేసింది. మేము సకాలంలో వర్మ గారిని ట్రీట్ చేయకపోతే ఆ స్టెరాయిడ్ ఆయన హార్ట్, కిడ్నీస్ అన్నీ ఫెయిల్ అయ్యి చనిపోయేవారు. ఆ స్టెరాయిడ్ ఇచ్చినవారు ఎవరో మెడిసిన్ తెలిసిన వాళ్ళే అయ్యి ఉంటారు. వాళ్ళకు తెలుసు ఆ స్టెరాయిడ్ వల్ల వర్మ గారు స్పృహలోకి రావచ్చు, లేదంటే చనిపోవచ్చు. అంతే కాదు, ఆ స్టెరాయిడ్ సాధారణంగా అందరికీ దొరకదు. దొరికినా దాని విలువ ఒక ఇరవయ్యి, ముప్పయి లక్షలకు తక్కువ ఉండదు. మరి అంత విలువైన స్టెరాయిడ్ ఇచ్చారంటే వర్మ గారిని ఏలాగైనా స్పృహలోనికి తేవాలని ఎవరో గట్టిగా ప్రయత్నిస్తున్నారు అని మాకు అనిపిస్తోంది. ఏది ఏమైనా, వర్మగారు రికవర్ అయ్యారు. ఇంకో రెండు రోజులు ఆయనకు కొంత ట్రీట్మెంట్ చేశాక మీరు ఇంటికి తీసుకొని వెళ్ళిపోవచ్చు'' అన్నాడు.

నందిని ఆనందం పట్టలేకపోతోంది. అప్పుడే అజయ్ అక్కడికి వచ్చాడు. నందిని రజనీకి ఫోన్ చేసింది. రజనీ హాస్పిటల్ కి ఇంకో గంటలో వస్తాను అని చెప్పింది.

వర్మకి స్పృహ వచ్చిన సంగతి అజయ్ కేపి కి ఫోన్ చేసి చెప్పాడు, కేపి చాలా ఆనందపడి ''హాస్పిటల్ కి వస్తాను'' అని చెప్పాడు.

కొరియర్ డెలివరి బాయ్ వేషంలో హాస్పిటల్ నుంచి బయటకు వస్తూ, డాక్టర్ నాగ్ జగత్ సింగ్ కి ఫోన్ చేసి వర్మ కి స్పృహ వచ్చిన సంగతి చెప్పాడు.

# Chapter 12 - The warning

బద్రప్ప ఆ బస్తి వాళ్ళను అడిగి రెండు నెచ్చెనలు, కొన్ని లావైన తాళ్ళు ముగ్గురు మనుషులని తీసుకుని వచ్చాడు. గౌతమ్, సిద్ధార్థ్ ఆ వచ్చిన వాళ్ళ సహాయంతో మెల్లిగా ఆ ఇంటి కప్పు మీదకు వెళ్ళారు. కిట్టప్ప ఉరి వేసుకున్నట్టుగా ఉన్న ప్రాంతంలోని పెంకులు కొన్ని తీసి, మరలా పేర్చినట్టుగా ఉన్నాయి. అవి కొన్ని ఎగుడుదిగుడుగా ఉన్నాయి.

అక్కడికి వచ్చిన వాళ్ళలో ఒకతను, "ఈ పెంకులు ఎవరో తీసి మరలా పెట్టినారు సారు, సూడండి వాటిలో కొన్ని మూలల్లో ఇరగిపోయినాయి" అన్నాడు.

గౌతమ్ తన మొబైల్ ఫోన్ లో అక్కడి పెంకులు, వేరే వాటిని అన్నింటినీ ఫోటోలు తీసాడు. అందరూ కిందకు దిగారు. సిద్ధార్థ్ కిట్టప్ప ఇంటి చుట్టూ ఉన్న వాళ్ళను పిలిచాడు.

"మీలో ఎంతమందికి కిట్టప్ప తెలుసు? కిట్టప్ప కుటుంబంలో వేరే ఎవరు ఉన్నారు? మీకు కిట్టప్ప, వాళ్ళ కుటుంబం గురించి ఏమి తెలిసినా మాకు చెప్పండి. మీకు ఎటువంటి భయం అక్కరలేదు, మీరు మాకు సహాయం చేయండి" అన్నాడు సిద్ధార్థ్ .

ఒక అరవయ్యి ఏళ్ల ఆవిడ ముందుకు వచ్చింది, ఆవిడ కిట్టప్ప ఉండే ఇంటికి రెండు ఇళ్ల తరువాత ఉంటుంది, పేరు చెన్నమ్మ.

"సారు నేను, కిట్టప్ప వాళ్ళ కుటుంబం దాదాపు ముప్పయి ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. కిట్టప్ప వాళ్ళు ఇక్కడకు వచ్చినప్పుడు వాడు సంవత్సరం బిడ్డ. వాడి చెల్లి పుట్టినప్పుడు కాన్పు చేసింది నేనే. వాళ్ళ అమ్మ చాలా నీరసంగా ఉండేది. వాళ్ళ నాన్న ఆ పాత వస్తువులు, తవ్వకాలు చేసే అపీసులో పని చేసేవాడు. ఒకరి విషయం వాళ్ళకు అనవసరం. ఎవరైనా మాట్లాడిస్తే మాట్లాడే వాళ్ళు, లేకుంటే వాళ్ళ పని వాళ్ళది. కిట్టప్ప మెతక మనిషి, అందరినీ నమ్ముతాడు, ఆడి సెల్లెలు బాగా తెలివైన పిల్ల.

ఆళ్ళ బాబు ఆపీసు పని మీద వెళ్ళుతూ కారు గుద్దుకొని సచ్చిపోయాడు, అందుకే ఆ ఉద్యోగం ఆ కిట్టప్పకు ఇచ్చారు. వారం క్రితం కిట్టప్ప మేనమామ ఇక్కడికి వేస్తే, ఆయనతో పాటే కిట్టప్ప వాళ్ళ అమ్మ, సెల్లీని పంపేశాడు. ఆడు ఆ రోజు రాత్రి ఎక్కడికో వెళ్ళిపోయాడు, ఇప్పుడు సుస్తే ఇట్టా సచ్చిపోయాడు" అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది చెన్నమ్మ.

"చెన్నమ్మ, నీకు ఎవరి మీదైనా అనుమానం ఉందా? నీకు అనుమానం వచ్చే విషయాలు ఏమైనా ఉన్నాయా?" అనడిగాడు గౌతమ్.

"నేను రోజు ఆ బయటనే నా నులక మంచం వేసుకొని పడుకుంటాను. మొన్న రాత్రి ఎవరో ఆ వెనుక వైపు నుంచి నలుగురు వచ్చారు, కానీ ఆ చీకటిలో నాకు కనపడలేదు. ఇంతలో సన్నగా వర్షం మొదలయ్యింది, నేను మంచం తీసుకుని లోపలికి వెళ్ళిపోయాను. నాకు ఇంకేం తెలియదు" అంది చెన్నమ్మ.

"కిట్టప్ప బాడీ మీరు హ్యాండ్ ఓవర్ చేసుకుని పోస్ట్మార్టంకు పంపినప్పుడు, అతడు వానలో తడిసినట్టుగా ఏమైనా ఆనవాలు దొరికాయా?" అని సిద్ధార్థ్ ని అడిగాడు గౌతమ్.

"సార్, మేము కిట్టప్ప శవం కిందకు దింపినప్పుడు అతని బట్టలు కాస్త తడిగానే ఉన్నాయి" అని చెప్పాడు బద్రప్ప.

"సిద్ధార్థ్ మనం కిట్టప్ప ఆఫీస్ వెళ్ళి, అక్కడ అతని గురించి తెలుసుకుందాం" అన్నాడు గౌతమ్.

"బద్రప్ప, ఇక్కడి విషయాలు నువ్వు చూసుకో, కిట్టప్ప ఇంటిలో ఏమైనా క్లూస్ దొరుకుతాయమో చూడు. మేము కిట్టప్ప ఆఫీస్ వెళ్ళి అక్కడి విషయాలు తెలుసుకుని సాయంత్రం వస్తాము, అవసరమైతే నాకు కాల్ చేయి" అని చెప్పి గౌతమ్ తో కలిసి వెళ్ళిపోయాడు సిద్ధార్థ్.

*****

మొహెంజదారో ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్పోర్ట్స్ ఆఫీస్ లో జగత్ సింగ్, నాగ్ ఎదురెదురుగా కూర్చుని ఉన్నారు. ఇంతలో జగత్ సింగ్ పర్సనల్ మొబైల్ ఫోన్ మోగింది, కెప్టెన్ అని స్క్రీన్ మీద కనపడుతోంది.

జగత్ సింగ్ ఆలోచిస్తూ ఏదో ఇంటర్వ్యూ కి సిద్దమవుతున్న వాడిలాగా సర్దుకుని మొబైల్ ఆన్సర్ చేశాడు.

''నమస్తే కెప్టెన్, పనులు జరుగుతున్నాయి కానీ అనుకున్నంత వేగంగా జరగడం లేదు. ఇందాకే ఆ వర్మ కి స్పృహ వచ్చింది, ఇంకో రోజులో ఇంటికి వెళ్తాతాడు. అప్పుడు మన పని చాలా సులభంగా చేసుకోవచ్చు'' అన్నాడు.

అవతల వైపు నుంచి ఆ కెప్టెన్ అనే వ్యక్తి ఏమి మాట్లాడాడో తెలియదు కానీ జగత్ సింగ్ ముఖ కవళికలు రంగు మారిపోయాయి.

''సరే సార్, నేను మీకు అన్నీ త్వరలోనే చెప్తాను'' అని ఫోన్ పెట్టేసాడు. నాగ్ జగత్ సింగ్ ను చూస్తున్నాడు.

''నాగ్, కెప్టెన్ నాకు వార్నింగ్ ఇచ్చాడు. ఇంకో వారంలో మనం అనుకున్నది జరగకపోతే అందరం తీవ్రంగా నష్టపోతాము. ఈ విషయంలో ఎవరి ప్రాణాలైనా పోవచ్చు. నాగ్, నాకు అప్పుడే చావాలని లేదు, పని త్వరగా ముగించు, అవసరమైతే ఏమైనా చేయి. పర్యవసానం నేను చూసుకుంటాను'' అన్నాడు జగత్ సింగ్.

''సార్, ఇంకా ఆలస్యం చేసి ఉపయోగం లేదు, నేను ఇవాళే ప్లాన్ మారుస్తాను. ఇంకో రెండు రోజులల్లో మీరు అడిగినది మీ చేతికి దక్కుతుంది'' అంటూ వేగంగా తాను కూర్చున్న కుర్చీలో నుంచి లేచి, వెనక్కు తిరిగి చూడకుండా విసురుగా బయటకు వెళ్ళాడు.

జగత్ సింగ్ తల పట్టుకుని కూర్చున్నాడు, ఇంటర్కమ్ లో ఏదో నెంబర్ నొక్కి నాకు ఒక మంచి అల్లం టీ తీసుకురా అని పెట్టేశాడు.

*****

క్రాంతికి క్లూస్ టీం ప్రసాద్ ఫోన్ చేసి, తన దగ్గర ఉన్న ఆ రిమోట్ కంట్రోల్ గన్ గురించి ఏదో విషయం తెలిసిందని, ఒకసారి రమ్మని చెప్పాడు. క్రాంతి ఒక గంటలో వస్తానని ఫోన్ పెట్టేశాడు.

*****

హాస్పిటల్లో వర్మ కొంచెం నీరసంగా కనిపిస్తున్నారు, అయినా ఓపిక తెచ్చుకుని నందినితో ఏదో మాట్లాడుతున్నారు. నిర్మలమ్మ రూమ్ బయటకు వచ్చి నిలుచున్నది. అంతలో అజయ్ వెనకాలే కేపి వర్మ రూమ్ వైపుకి వస్తున్నారు.

అజయ్ కేపీని చూసిన నిర్మలమ్మ ''సార్ బాగా నీరసంగా ఉన్నారు, మేడమ్ సార్ తో మాట్లాడుతున్నారు, కొంచెం ఆగండి. మేడమ్ మనల్ని పిలుస్తారు'' అంది.

సరే అన్నట్టుగా అజయ్, కేపీ తల ఊపి అక్కడే పక్కన ఉన్న కుర్చీలలో కూర్చున్నారు.

*****

మురుగన్ మ్యుజికల్స్ లోపల గదిలో కుప్పసామి మళ్ళీ తన పని వాళ్ళను తిడుతున్నాడు, ''ఏమి సేస్తిరి? నేను మీకు ఏమి సెప్పి ఉంటిని మీరు ఏమి సేస్తిరి? ఎన్నాడా ఉంగలకు పైత్యం పూడిచిరుకా? ఆండవా! వీళ్ళు నన్ను సర్వనాశనం సేసేస్తారు, ఒక్క పని కూడా సరిగా సేయారు'' అంటూ తల బాదుకుంటున్నాడు.

అక్కడ ఉన్న వాళ్ళల్లో కొంచెం పొడవుగా ఉన్నవాడు ''సారు, మేము అంతా బాగానే సేస్తిమి. టైం దా సరిలేదు, అయినా మా ముఖం ఎవరు సూడలేదు, అందుకే మేము సేఫ్, మనం సేఫ్'' అన్నాడు.

''వాయి మూడు రా వెధవ'' అంటూ కోపంగా అరిచాడు కుప్పసామి.

ఆ మాటలకు అక్కడ ఉన్న ఆ ఇద్దరు బెదిరిపోయారు.

“డాక్టర్ సార్ ఫోన్ సేసినారు, వర్మ రేపు హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళుతున్నాడు. మనకు ఎల్లుండి సాయంత్రం అంజి మణి దాకా టైం ఉన్నది, ఆ లోపల మనం వర్మ దగ్గర నుంచి డాక్టర్ సార్కు కావలసినది తెచ్చి ఇచ్చి వేస్తాము, ఆ తరువాత మనకు వాళ్ళకు ఏ సంబంధం ఉండదు. ఏమంటారు!” అంటూ గదమాయించాడు.

వాళ్ళు మౌనంగా తల ఊపారు.

*****

హాస్పిటల్ లో కూర్చున్న కేపీ తన మొబైల్ ఫోన్ లో తాను వర్మ ఇంటి దగ్గర చూసిన కార్ ఫోటో చూస్తున్నాడు. అజయ్ వర్మను కలవాలన్న తపనతో కొంచెం అసహనంగా ఉన్నాడు. ఇంతలో అతని ఫోన్ మోగింది, జర్నలిస్ట్ స్వాతి ఫోన్ చేస్తోంది. విసుగుగానే ఫోన్ ఆన్సర్ చేశాడు.

“హలో స్వాతి గారు, చెప్పండి” అని అన్నాడు.

“సార్ అజయ్ గారు, ఒక ఇన్ఫర్మేషన్ కోసం నేను ఫోన్ చేశాను. మూడు రోజుల క్రితం తమిళనాడు చిదంబరం దగ్గర ఉన్న తిరువేటకాలం అనే పల్లెటూరిలో ఒక వెయ్యి సంవత్సరాల ఆలయం నుండి రెండు పంచలోహాల విగ్రహాలు దొంగతనం జరిగింది. ఇక్కడ విశేషమేమిటి అంటే, ఆ రెండు విగ్రహాలు ఆరు నెలల క్రితం వర్మగారు వాటి వయస్సు, వాటి ధాతువులు నిర్ణయిస్తూ వాటికి సర్టిఫికేట్ జారీ చేశారు. వాటిని అరుదైన అపురూపమైన సంపదగా వర్ణించారు. వాటి గురించి మీకు ఏమైనా తెలిస్తే నాకు కొంచెం చెప్పండి, నేను ఒక న్యూస్ ఆర్టికల్ రాసుకుంటాను” అంది స్వాతి.

అజయ్ కోపంగా “స్వాతి గారు, ఆ విషయాలు మేము బయట పెట్టకూడదు. అయినా మీరు నాకు ఇలాంటి విషయాల కోసం కాల్ చేయవద్దు, అసలే నేను ఎన్నో విషయాలతో బిజీగా ఉన్నాను. మీరు అడిగిన విషయాలు నాకు ఏమైనా తెలిస్తే నేనే మీకు కాల్ చేస్తాను” అని ఫోన్ కట్ చేశాడు.

“ఏమిటి అజయ్, జర్నలిస్ట్ స్వాతి నా, ఏం ఇన్ఫర్మేషన్ కావాలంట?” అన్నాడు కేపీ.

“ఏదో, ఎక్కడో తమిళనాడులో ఏదో గుడిలో కొన్ని విగ్రహాలు దొంగతనం జరిగాయంట, వాటి మీద ఏదో ఆర్టికల్ వ్రాస్తున్నాను కొన్ని వివరాలు ఏవో కావాలని అడిగింది” అన్నాడు అజయ్.

“దానికి మీరు ఎలా సహాయం చేయగలరు?”

“ఆ పోయిన విగ్రహాలు ఒక ఆరు నెలల క్రితం వర్మ సార్ సర్టిఫై చేసిన విగ్రహాలు. అందుకే వాటి గురించి నాకు ఏమైనా తెలుసా అని నాకు ఫోన్ చేసింది, అవి అన్నీ కాన్ఫిడెన్షియల్ అని చెప్పాను” అన్నాడు అజయ్.

ఇంతలో నందిని రూమ్ బయటకు వచ్చింది.

“వర్మ గారు చాలా నీరసంగా ఉన్నారు. మీరు లోపలికి వెళ్ళి చూడవచ్చు కానీ ఆయనను రకరకాల ప్రశ్నలు అవి అడిగి బాధ పెట్టవద్దు” అంది నందిని.

కేపీ, అజయ్ వర్మ ఉన్న గదిలోకి వెళ్ళారు.

# Chapter 13 - The Bubble Burst

గౌతమ్, సిద్ధార్థ్ ఇద్దరు బెంగళూరులోని భారత పురావస్తు శాఖ ఆఫీస్ కు వెళ్ళారు. అక్కడ వాళ్ళు రిసెప్షన్ లో కిట్టప్ప వివరాలు అడిగారు. అక్కడ ఉన్న రిసెప్షనిస్ట్ చంద్రిక వాళ్ళను కొంత సమయం అక్కడ కూర్చోమని చెప్పి ఎవరికో ఇంటర్కాంలో సిద్ధార్థ్, గౌతమ్ వచ్చారన్న సంగతి చెప్పింది.

కొంత సమయం తరువాత అక్కడకి ఒకతను వచ్చి, "జెంటిల్మెన్, ప్లీజ్ కం విత్ మీ" అని ఆఫీస్ లోపలికి తీసుకుని వెళ్ళాడు.

ఆఫీస్ లోపల ఒక పెద్ద కాన్ఫరెన్స్ రూమ్ లోకి వెళ్ళారు. అక్కడ వీళ్ళకన్నా ముందే ఇంకో ఇద్దరు కూర్చుని ఉన్నారు. అందులో ఒకతను సూట్ వేసుకుని ఉన్నాడు. లోపలికి వచ్చిన గౌతమ్, సిద్ధార్థ్ లను తీసుకుని వచ్చిన వ్యక్తి పరిచయం చేశాడు. ముందుగా తన పేరు త్రినాధ్ అని, అతను అక్కడ కిట్టప్ప పని చేసిన డిపార్ట్మెంట్ మేనేజర్ అని చెప్పాడు.

తరువాత అక్కడ కూర్చున్న వాళ్ళల్లో ఒకతను లేచి, "హలో జెంటిల్మెన్, నా పేరు దయానంద్. నేను ఈ ఆఫీస్ ఇంచార్జ్ అండ్ అడ్మిన్ డిపార్ట్మెంట్ హెడ్ ని" అని పరిచయం చేసుకున్నాడు.

త్రినాధ్ సూట్ వేసుకున్న వ్యక్తిని చూపించి, "ఆయనను అందరూ చక్రవర్తి అని పిలుస్తారు, పూర్తి పేరు ఆనంద్ చక్రవర్తి పురుషోత్తమ్. సార్ ఏఎస్ఐ లో అడిషనల్ డైరెక్టర్ జనరల్, ఢిల్లీ నుంచి వచ్చారు. మా ఆఫీస్ మైసూర్ లో ఉంటుంది, కానీ అన్నింటికీ వీలుగా ఉంటుందని నాలుగు సంవత్సరాల ముందర ఇక్కడ ఈ ఆఫీస్ అపారేషనల్ ఆఫీస్ గా తెరిచారు. ఇక్కడ మేము కేవలం ఇరవయ్యి మంది స్టాఫ్ మాత్రమే ఉంటాము, ఒక కొత్త ప్రాజెక్ట్ కోసం చక్రవర్తి సార్ ఇక్కడకు వచ్చారు" అని చెప్పాడు.

సిద్ధార్థ్ తనని గౌతమ్ ను అక్కడ ఉన్నవాళ్ళకు పరిచయం చేశాడు. అందరూ ఎదురెదురుగా కూర్చున్నారు.

గౌతమ్: నైస్ మీటింగ్ యు మిస్టర్ చక్రవర్తి, వర్మగారు రిటైర్ అయిన తరువాత మీరే భారత పురావస్తు శాఖకు డైరెక్టర్ జనరల్ అవుతారని మొన్న వార్తలలో చూశాను, అడ్వాన్స్ కంగ్రాచులేషన్స్.

దయానంద్: యు ఆర్ రైట్ గౌతమ్, వర్మ సార్ కోమాలో ఉన్నందుకు చక్రవర్తి సార్ ఇప్పుడు వర్మ సార్ కి డిప్యూటీగా ఉన్నారు.

చక్రవర్తి: ఇట్స్ ఒకే, మిస్టర్ గౌతమ్ అండ్ సిద్ధార్థ్ మీరు ఏ పని మీద వచ్చారు?

సిద్ధార్థ్: జెంటిల్మెన్ కమింగ్ టు ది పాయింట్, కిట్టప్ప చనిపోవడం అందరికీ చాలా బాధకరమైన విషయం. కానీ మా ఇన్వెస్టిగేషన్ లో అతనిది ఆత్మహత్య కాదు, అది ఒక హత్య అని అనుమానిస్తున్నాము. అతని గురించి మీకు తెలిసిన వివరాలు మాకు చెప్పండి.

చక్రవర్తి: చూడండి సిద్ధార్థ్, కిట్టప్ప చనిపోవడం బాధకరమైన విషయమే. కానీ అతను డ్యూటీ ఆఫ్ టైమ్ లో చనిపోయాడు, పైగా అతను రెండు వారాల లీవ్ పెట్టి వెళ్ళాడు. అతను ఏ గోడవలలో ఇరుక్కుని చనిపోయాడో మాకు తెలియదు, కానీ అతనికి మా సంస్థ నుంచి రావలసిన అన్నీ బెన్ఫిట్స్ ఇస్తాము.

గౌతమ్: మీరు చెప్పినది సరే, కానీ అతను లీవ్ పెట్టి వర్మ గారి ఫంక్షన్ కి డ్యూటీలో ఎందుకు హైదరాబాద్ వెళ్ళాడు? వర్మ గారి మీద హత్యాయత్నంలో కిట్టప్ప ఒక ప్రైమ్ సస్పెక్ట్, ఒక ముఖ్య దోషి. మేము దాని గురించి తెలుసుకోవడం కోసమే ఇక్కడకు వచ్చాము.

సిద్ధార్థ్: కిట్టప్ప ఎవరితో కలిసేవాడు? ఆఫీస్ లో అతని ప్రవర్తన ఎలా ఉండేది? అతనిని బయట వాళ్ళు ఎవరైనా కలవడానికి వచ్చేవారా? ఇలా మాకు చాలా ప్రశ్నలు ఉన్నాయి. వి వాంట్ ఆన్సర్స్.

చక్రవర్తి: ఇప్పుడు మేము ఒక ముఖ్యమైన మీటింగ్ లో ఉన్నాము. మీరు సాయంత్రం 5.30 తరువాత వస్తే త్రినాధ్, దయానంద్ మీకు అన్నీ వివరాలు ఇస్తారు, నౌ ప్లీజ్ ఎక్స్క్యూస్ అజ్.

గౌతమ్ సిద్ధార్థ్ ఒకరినొకరు చూసుకున్నారు.

"సరే చక్రవర్తి గారు, మేము సాయంత్రం 5.30కి వస్తాము. త్రినాధ్ గారు మీ ఇద్దరినీ మేము ఇక్కడే మీ ఆఫీస్ లోనే కలుస్తాము" అని సిద్ధార్థ్ చెప్పి, ఇద్దరు బయటకు వెళ్ళిపోయారు.

***

హాస్పిటల్ లో వర్మ నీరసంగా పడుకుని ఉన్నారు. మాటలు అతి కష్టంగా వస్తున్నాయి. కేవలం కుడి చేయి మాత్రమే ఆడిస్తూ ఏవో సైగలు చేస్తున్నారు.

ఆయనకు దగ్గరగా నందిని ఉంది, ఆమె తన చెవి వర్మ గారికి దగ్గరగా పెట్టి ఆయన చెప్పేది విని అక్కడ ఉన్న అజయ్, కేపీ కి చెపుతోంది.

నందిని: అజయ్... వర్మ గారు నిన్ను జాగ్రత్తగా ఉండమని చెపుతున్నారు. ఆయనను చంపాలని అనుకున్న వాళ్ళు నిన్ను కూడా దెబ్బ తీయవచ్చు అని ఆయన అనుమానం.

ఆయన అనుమానం మీరిద్దరు కలసి ఆఖరుగా చేసిన దక్షిణ భారత ఆలయాలలోని విగ్రహాలు, సంపదలు పరిశోదన వాటికి ఆయన ఇచ్చిన సర్టిఫికేట్స్ అని అనుమానిస్తున్నారు. దాని వెనుక ఒక పెద్ద జాతీయ, అంతర్జాతీయ ముఠాలు ఉండి ఉండవచ్చు అని అనుకుంటున్నారు.

అజయ్: ఆ పని ముగిసి దాదాపు సంవత్సరం అయ్యింది కదా! కానీ ఇప్పుడు జరిగినదానికి ఏమిటి సంబంధం?

నందిని: రెండు వారాల ముందు ఎవరో కెప్టెన్ అనే వ్యక్తి మా ఇంటి లాండ్ లైన్ కు ఫోన్ చేసి ఆ దక్షిణ భారత ఆలయాలలోని విగ్రహాలు, సంపదలకు సంబంధించిన వివరాలు కావాలని, ఇవ్వకపోతే చంపేస్తాను అని బెదిరించాడు.

కానీ వర్మ గారు అది ఏదో ప్రాంక్ కాల్ అని ఎవరో కావాలని ఆటపట్టిస్తున్నారు అని అనుకున్నారు. అలాగే మొన్న ఆయన మీటింగ్ కు వచ్చే రోజు ఉదయం 6 గంటలకు కూడా మరలా అదే వ్యక్తి అలాగే ఫోన్ చేసి బెదిరించాడు, వర్మ గారు దమ్ముంటే నేరుగా వచ్చి మాట్లాడమని ఫోన్ పెట్టేశారు. ఇవన్నీ చూస్తే ఇది వాళ్ళ పనే అని అనుకుంటున్నారు.

అజయ్, కేపీ ఇద్దరు ప్రశ్నార్థకంగా ఒకరినొకరు చూసుకున్నారు.

*

క్రాంతి హడావిడిగా క్లూస్ టీం ఆఫీస్ కి వెళ్ళాడు. అక్కడ ప్రసాద్ ఏదో పనిలో చాలా బిజీగా ఉన్నాడు. క్రాంతి రావడం చూసి వెంటనే లోపల్నుంచి అక్కడ కూర్చోమని సైగ చేసి చెప్పాడు ప్రసాద్.

క్రాంతి అక్కడే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. కొంతసేపటికి ప్రసాద్ ఒక పాత కీపాడ్ నోకియా ఫోన్ పట్టుకుని వచ్చాడు. ఇంకో చేతిలో ఆ రిమోట్ కంట్రోల్ తుపాకి ఉంది. క్రాంతి ని లోపలి గదిలోకి తీసుకుని వెళ్ళాడు.

ప్రసాద్: క్రాంతి, ఈ రిమోట్ తుపాకి ఎవరో చాలా తెలివిగా తయారు చేశారు. దీనిలో ఒక ఈ-సిమ్ అమర్చారు. అంటే అది ఒక డిజిటల్ సిమ్ కార్డ్. దానికి మన ఫోన్ లో లాగా చిన్న కార్డ్ పెట్టవలసిన పని లేదు, ఈ తుపాకీని అక్కడ అమర్చి కరెక్ట్ గా వర్మ వచ్చే సమయానికి ఎవరో ఆ ఈ-సిమ్ కి ఫోన్ చేసి అది పేల్చే లాగా ఏర్పాటు చేశారు.

ఇందులో వాడిన సర్క్యూట్, చిప్స్ అన్నీ కూడా చైనావి, పిల్లలు ఆడుకునే ఎయిర్ గన్ తీసుకుని తయారు చేశారు. రబ్బర్ బుల్లెట్ లు అయినా, దీనిలో ఉన్న చిన్న బాటరీ, ఆ సర్క్యూట్ వల్ల కొంచెం వేడి ఎక్కి కొద్దిగా కాలిపోయింది.

చిత్రం ఏమిటంటే, ఇది తయారు చేసినవాడు ముందుగానే దీని పని అవ్వగానే దీనిలోని ఈ-సిమ్ ను డియాక్టివేట్ చేశాడు. అంటే అది ఎవరిది అనే విషయం మనకు తెలుసుకోవడం కష్టం. నేను అది ఎలా పని చేస్తుందో నీకు చూపిద్దామని ప్రయత్నం చేస్తున్నాను.

క్రాంతి: అంటే దీనిని ఉపయోగించిన వాడు ఆ తుపాకి పేలినప్పుడు ఆ మీటింగ్ హాల్ లోనే ఉండి ఉంటాడా?

ప్రసాద్: ఉండి ఉండవచ్చు, లేకపోవచ్చు. ఎందుకంటే, అది కేవలం ఆ ఈ-సిమ్ నెంబర్ కి ఫోన్ చేస్తే అది పని చేస్తుంది. కానీ నా ఉద్దేశ్యం ప్రకారం, దానిని వాడిన వాడు అక్కడే ఉండి ఉంటాడు. ఎందుకంటే వర్మ ఖచ్చితంగా ఆ తుపాకి గురిపెట్టిన చోటికి రాగానే దానిని పేల్చాలి కాబట్టి.

క్రాంతి: హ, నిజమే.

క్రాంతి ఫోన్ మోగింది. కమిషనర్ మిత్ర ఫోన్ చేస్తున్నారు.

క్రాంతి: జై హింద్ సార్, చెప్పండి.

మిత్ర: క్రాంతి తీగ లాగావు, డొంక కదిలింది. మనం ఊహించిన దానికన్న మన ఎదురుకోబోయేది చాలా పెద్ద కేస్. నువ్వు నీ పని అవ్వగానే మా ఇంటికి రా, ఇది చాలా ముఖ్యమైన కేస్. మనం పర్సనల్ గా మాట్లాడుకోవాలి అని ఫోన్ పెట్టేశాడు.

క్రాంతి, ప్రసాద్ చెప్పేది వింటున్నాడు కానీ కమిషనర్ మిత్ర ముందు మెదులుతున్నాడు. మెదడులో ఎన్నో ప్రశ్నలు మెదులుతున్నాయి.

# Chapter 14 - The Open Case

సాయత్రం 5.30 అయ్యింది సిద్దార్ధ్, గౌతం ఇద్దరూ భారత పురావస్తు శాఖ ఆఫీస్ కు వెళ్లారు. రిసెప్షన్ లో చంద్రిక అప్పుడే ఇంటికి వెళ్ళడానికి సిద్ధమవుతుంది. సిద్దార్ధ్, గౌతం రావడం చూసి, "మీకోసం త్రినాధ్ గారు కాన్ఫరెన్స్ రూమ్ లో ఉన్నారు. మీరు అక్కడికి వెళ్ళండి" అని చెప్పింది.

సిద్దార్ధ్, గౌతం ఇద్దరూ లోపలికి వెళ్లారు.

త్రినాధ్: వెల్కం బ్యాక్ జెంటిల్మెన్. చక్రవర్తిగారు పని మీద వెళ్లిపోయారు, దయానంద్ ఇప్పుడే వస్తారు, మీరు కూర్చోండి.

గౌతం: చక్రవర్తి గారు ఇక్కడే బెంగళూర్ లో ఉన్నారా? లేక ఢిల్లీ వెళ్లిపోయారా?

త్రినాధ్: లేదు, ఆయన ఇక్కడే ఉన్నారు. ఏదో పర్సనల్ పని మీద బయటకు వెళ్లారు.

అంతలో దయానంద్ వచ్చి సిద్దార్ధ్, గౌతం లను విష్ చేసి, త్రినాధ్ పక్కనే కూర్చున్నాడు.

గౌతం: మాకు కిట్టప్ప గురించి మీకు తెలిసిన అన్నీ వివరాలు చెప్పండి. అతడు అసలు ఇక్కడ సెలవు పెట్టి హైదరాబాద్ ఎందుకు వెళ్ళాడు? డ్యూటిలో ఉన్నట్టుగా, అక్కడ ఉండి వర్మ గారిని ఎందుకు షూట్ చేశాడు? ఇక్కడ అతనిని ఎవరు ఎందుకు చంపారు? అన్నది అంతా ఒక మిస్టరీ గా ఉంది.

త్రినాధ్: నాలుగేళ్ల క్రిందట ఈ ఆఫీస్ ఇక్కడ పెట్టినప్పుడు మైసూర్ నుంచి చెన్నప్పను, అదే కిట్టప్ప వాళ్ళ నాన్నను కూడా, ఇక్కడకు ట్రాన్స్ఫర్ చేశాము. అంత వరకు వారం అయిదు రోజులు అక్కడ పని చేసి శని ఆది వారాలకు ఇక్కడకు వచ్చి వెళ్ళేవాడు.

చెన్నప్ప మా ఆఫీస్ లో డ్రైవర్. కొన్ని సార్లు నేను దయానంద్ మైసూర్ నుంచి వీకెండ్ ఇక్కడకు వచ్చే వాళ్ళం. అప్పుడు తానే మా కార్ డ్రైవ్ చేస్తూ ఉండేవాడు. అలాగే ఒకసారి మేము ఆఫీస్ పని మీద మైసూర్ నుంచి రావాలని ఆఫీస్ కార్ కి పెట్రోల్ వేయించమని చెన్నప్పను పంపాము. ఆ రోజే తాను పెట్రోల్ పట్టించి వెనక్కు వచ్చేటప్పుడు తనకు కార్ లోనే ఫిట్స్ వచ్చి అక్కడ ఎదురుగా వున్న లారీని గుద్ది అక్కడిక్కడే చనిపోయాడు. డ్యూటి అప్పుడు చనిపోయాడు కాబట్టి, అతని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని మేము అర్జీ పెడితే చక్రవర్తి గారు కిట్టప్పకు ఇక్కడ ఆఫీస్ బాయ్ గా ఉద్యోగం ఇప్పించారు.

సిద్దార్ధ్: అయ్యో..! మరి అంతకు ముందు ఎప్పుడు చెన్నప్పకు ఫిట్స్ రాలేదా?

దయానంద్: చెన్నప్ప ప్రతిరోజూ తాగేవాడు. చనిపోయే కొన్నిరోజుల ముందు ఒకటే ఆయాసం వచ్చేది కానీ, చలి వలన అని అనుకునే వాళ్ళం. మాకు తెలిసినంతవరకు చెన్నప్పకు ఎన్నడూ అలా ఫిట్స్ రాలేదు, అదే మొదటి ఆఖరి సారి కుడా.

గౌతం: సరే, కిట్టప్ప గురించి చెప్పండి.

త్రినాధ్: కిట్టప్ప వట్టి అమాయకుడు. ఏ పనైనా రెండు మూడు సార్లు చెప్పాలి. లేకపోతే వాడికి అర్ధం కాదు. వాడు ఎక్కువగా ఎవరితో మాట్లాడే వాడు కాదు, వాడికి ఎవరూ స్నేహితులు కూడా లేరు. పనిలో ఉంటే ఈ ఆఫీసులో ఉంటాడు, లేదంటే ఇల్లు, అంతే. వాడికి వేరే ధ్యాస లేదు. ఇక్కడ వాడికి పని లేకపోతే వెనక పక్కన ఉన్న ఆ కిచెన్ లో ఒక మూల టేబుల్ మీద కూర్చుని ఉండేవాడు. పొద్దున్నే 8.30 కి వచ్చి ఆఫీస్ మొత్తం బల్లలు, కుర్చీలు శుభ్రంగా తుడిచి టీ మెషిన్ నుంచి టీ తీసుకుని, ఆ లోపల కూర్చునేవాడు. వాడు రెండు వారాల లీవ్ అప్లై చేశాడు. ఎందుకు? అని అడిగితే 'దేవుడిని చూసి వస్తాను అని చెప్పాడు' కానీ, వాడే దేవుడి దగ్గరకు వెళతాడని అనుకోలేదు. వాడు చావు మీదకు తెచ్చుకునే అంత వాడు కాదు. పైగా వాడు వర్మ గారి మీద మర్డర్ అటెంప్ట్ చేశాడంటే చాలా ఆశ్చర్యంగా ఉంది.

సిద్దార్ధ్: పోనీ కిట్టప్పని ఎవరైనా ప్రేరేపించి ఉంటారా? వాడికి ఏదైనా ఆశ చూపించి, మభ్యపెట్టి?

దయానంద్: అదంతా అవ్వడానికి అవకాశం లేదు. ఎందుకంటే, వాడికి రోజు చేసే పనులు కూడా మళ్ళీ మళ్ళీ చెప్పి చేయించుకోవాలి.

"సరే, మేము ఇప్పటికి వెళతాము మాకు ఏదైనా సమాచారం కావాలంటే, మళ్ళీ వస్తాము. బాయ్, టేక్ కేర్.." అని సిద్దార్థ్ అన్నాడు.

గౌతం సిద్దార్థ్ ఇద్దరు లేచారు. త్రినాథ్, దయానంద్ ఇద్దరు వాళ్ళను సాగనంపారు.

రాత్రి 8.45 దాటింది క్రాంతి కమిషనర్ మిత్ర ఇంటికి వచ్చాడు. మిత్ర ఇంట్లో హాల్ లో సోఫాలో మిత్ర పక్కన, ఇంకో సోఫాలో మేఘ కూర్చుని ఉన్నారు.

క్రాంతి మిత్రకు సెల్యూట్ చేసి, మేఘను ఆశ్చర్యంగాను, అనుమానంగాను చూస్తున్నాడు.

క్రాంతి: సార్..! ఈ అమ్మయి మేఘ కదూ.. వర్మ సార్ కేసులో ఎఫ్ఐఆర్ ఇచ్చినది తనేకదా!

మేఘ క్రాంతిని ఒక చిరునవ్వుతో చూసింది. మిత్ర తనకు వస్తున్న నవ్వు ఆపుకుంటున్నాడు.

మిత్ర: క్రాంతి, యు ఆర్ అబ్సల్యూట్లీ కరెక్ట్, ఈ అమ్మయి మేఘ, వర్మ గారి మీద ఎటాక్ జరిగినప్పుడు వచ్చి పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్ ఇచ్చినది తనే. మేఘ మన కోసం పనిచేస్తోంది. దేశంలో ఎన్నో ప్రదేశాల నుంచి విలువైన విగ్రహాలు, కళాఖండాలు, చారిత్రత్మామిక ప్రసిద్ది వున్న వస్తువులు, అపురూపమైన తాళపత్ర గ్రంధాలు, మరి ఇంకెన్నో విలువైనవి, విలువ కట్టలేని వస్తువులు మన భారత దేశం దాటి బయట దేశాలకు దొంగతనంగా వెళుతున్నాయి. అవి ఎలా జరుగుతున్నాయి? వాటి వెనుక ఎవరు ఉన్నారు? అంత సంపద ఇంత నిఘా కన్నులు కప్పి ఎలా బయటకు వెళుతుందో.. తెలుసుకోవడం కోసం నేను మేఘను నియమించాను. తను ఒక స్టూడెంట్ కాబట్టి, ఎవరూ ఆమెను అనుమానించరు. అట్లాగే మనకు కావలసిన సమాచారం మొత్తం తను సేకరించి మనకు ఇస్తుంది.

క్రాంతి: వెల్కం అండ్ థాంక్స్ మేఘ. మీరు చేస్తున్న పనికి కృతజ్ఞతలు.

మేఘ: సార్! నాకు మన దేశం అన్నా, ఈ దేశ సంపద, చరిత్ర అన్నా.. చెప్పలేనంత ఇష్టం. దాని కోసం నేను ఎంత రిస్క్ అయినా చేస్తాను, నేను జవాను లేదా మీలా పోలీస్ కాకపోవచ్చు కానీ, ఒక బాధ్యత కలిగిన పౌరురాలిని. నా దేశం పట్ల నా దేశ భక్తి ఇలా చూపిస్తున్నాను అంతే!

మిత్ర: నేను మేఘ కాలేజ్ ఫంక్షన్ కు వెళ్ళినప్పుడు చూశాను. తనకున్న దేశభక్తి ఆశయం మనకు ఉపయోగ పడుతుందని, తనని ఈ పనిలో మనకు సహాయపడమని అడిగాను. ఇప్పుడు తను మనకు కావలసిన ఎన్నో విషయాలు సేకరించిది.

క్రాంతి: సార్! ఇందులో మేఘ కాకుండా ఇలా మనకు సహాయపడే వాళ్ళు ఇంకా ఎవరైనా ఉన్నారా?

మిత్ర (నవ్వుతూ): బాగానే ఆలోచించావు క్రాంతి. ఇంకో వ్యక్తి కూడా ఉన్నారు. వాళ్ళను నీకు త్వరలో పరిచయం చేస్తాను. అవసరం అనిపిస్తే వాళ్ళను మనకు సహాయ పడమని చెప్తాను. ప్రస్తుతం వారు ఇంకో పనిలో చాలా బిజీగా ఉన్నారు. ఒకే లెట్ అజ్ డిస్కస్.

***

బద్రప్ప కిట్టప్ప ఇంటి దగ్గర కాపలా ఉన్నాడు. కొద్దిగా చలిగా ఉంది. బద్రప్ప మెల్లిగా తన జేబులోనుంచి ఒక బీడీ తీసి వెలిగించాడు. తనకు ఎప్పుడైనా అలా బీడీ తాగడం ఇష్టం. ఇంతలో అక్కడకి ఒక తాగిన వ్యక్తి వచ్చాడు. అతను తాగిన మందు కంపు కొడుతోంది, బాగా తూలిపోతున్నాడు. నేరుగా బద్రప్ప దగ్గరకు వచ్చి "నాకు ఇస్తాను అన్న వెయ్యి ఇవ్వు, నిన్న ఇచ్చిన వెయ్యి సరిపోలేదు, లేకపోతే నువ్వు నిన్న ఇక్కడకు ఏమి తెచ్చావు, ఎక్కడ తగిలించావు నేను అందరికీ చెపేస్తాను" అంటూ తూలి పడిపోయాడు.

బద్రప్ప తాగుతున్న బీడీ కిందపడేసి ఆ పడిపోయిన వాడిని మెల్లిగా లేపి అటు ఇటు చూశాడు. ఎవరు కనపడలేదు. వెంటనే, కిట్టప్ప ఇంట్లో నుంచి ఒక పెద్ద తాడు తెచ్చి ఆ తాగుబోతు రెండు చేతులు వెనక్కు పెట్టి కట్టేశాడు. కాళ్ళు కూడా కట్టేశాడు. నోటికి గుడ్డ కట్టి కిట్టప్ప ఇంట్లో పడుకోపెట్టాడు. వెంటనే సిద్దార్థ్ కి ఫోన్ చేసి అక్కడ జరిగినది చెప్పాడు.

హాస్పిటల్ లో ఇద్దరు సీనియర్ డాక్టర్స్ వర్మ రూమ్ కి వచ్చారు. ఆయనను పరీక్షించి ఇంకో రోజు తరువాత డిశ్చార్జ్ చేస్తాము అని చెప్పారు. ఆయనకు ఒక ఇంజెక్షన్ ఇచ్చి నిద్రపోమ్మని చెప్పారు. నందిని, కేపీ, అజయ్ రూమ్ బయటకు వచ్చారు, నిర్మలమ్మ వర్మ రూమ్ గుమ్మం దగ్గర కూర్చుంది.

కేపి: మేడమ్, అసలు ఆ కెప్టెన్ ఎవరు? వర్మ గారికి ఎందుకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. అసలు ఏమి జరుగుతోంది.

నందిని: కేపి గారు, వర్మ గారు అజయ్ కలిసి ఒక సంవత్సరం క్రిందట మన దక్షిణ భారత దేశంలో ఉన్న పురాతన ఆలయాలు, గుళ్ళు, గోపురాలు, పురాతన వస్తువులు, గ్రంధాలు, ఇంకా ఎన్నో వాటి విశిష్టత, వాటి గొప్పతనం గురించి పరిశోధనలు చేశారు. వాటిలో చాలా వాటికి UNESCO గుర్తింపు తేవాలని వారి తాపత్రయం. దానికి కేంద్ర ప్రభుత్వం కూడా ఆమోదం తెలిపింది. వర్మ గారు మొత్తం 817 వస్తువులకు అంచనాలు తేల్చారు. అవి అపురూపమైనవి, అరుదైనవిగా గుర్తించారు. వాటి విలువ కోట్లలో ఉంటుంది. ఇలాంటి వస్తువులు సేకరించడంలో ప్రపంచంలో ఎంతో మంది ఉన్నారు. వాళ్ళు కొంతమంది ద్రోహులతో చేతులు కలిపి, వాటిని దొంగలిస్తున్నారు. బహుశా ఆ కెప్టెన్ కూడా ఒకడు అయివుంటాడు.

అజయ్ “దొంగ వెధవలు, ఎంతకూ తెగించారు” అంటూ ఆవేశంగా లేచాడు.

# Chapter -15 The Reveal

బద్రప్ప చెప్పిన విషయాలు సిద్దార్థ్, గౌతంకు చెప్పాడు. ఇద్దరు కిట్టప్ప ఇంటికి బయలుదేరారు. గౌతం ఆలోచిస్తున్నాడు, 'ఆ తాగి వచ్చిన వ్యక్తి ఎవరై ఉంటాడు' అని. ఇంతలో తేరుకుని, ''సిద్దార్థ్, ఇప్పుడు మనం ఆ త్రినాధ్, దయానంద్ తో మాట్లాడాము కదా! మీకు ఏం అనిపిస్తోంది?'' అని అన్నాడు.

సిద్దార్థ్: త్రినాధ్ కొంచెం నమ్మేటట్టు ఉన్నాడు కానీ, ఆ దయానంద్ ఏదో దాస్తున్నాడు అని అనిపించింది. వీళ్లిద్దరికంటే ఆ చక్రవర్తి చాలా పెద్ద ఇగోయిస్ట్ లాగా ఉన్నాడు. చాలా నిక్కచ్చిగా మాట్లాడుతున్నాడు.

గౌతం: అవును. నేను అదే అబ్సర్వ్ చేశాను. ఆ చక్రవర్తికి, కాబోయే డైరెక్టర్ జనరల్ అని అహం అనుకుంటాను. ఆ నేను ఇంకొకటి కూడా గమనించాను. ఆ చక్రవర్తికి, దయానంద్ కొంచెం ఎక్కువ సన్నిహితుడు అనుకుంటాను. ఆయనను అంటిపెట్టుకుని ఉంటున్నాడు.

సిద్దార్థ్: బాగానే పట్టారు గౌతం, నేను అదే అబ్సర్వ్ చేశాను. చూద్దాం మనకు వీళ్ళు చెప్పినది ఎంత వరకు ఉపయోగపడుతుందో..!

ఇద్దరు మాట్లాడుతూ అరగంటలో కిట్టప్ప ఇంటి దగ్గరకు వచ్చారు. ఇద్దరు కార్ దిగి అక్కడ నుంచి కిట్టప్ప ఇంటి దగ్గరకు నడుస్తున్నారు. చీకటిగా ఉంది, పైగా సన్నగా వర్షం పడుతోంది.

మిత్ర ఇంటిలో మేఘ, క్రాంతి, మిత్రా ముగ్గురు కూర్చుని ఉన్నారు. మిత్ర తన లాప్టాప్ తీశాడు.

''క్రాంతి ఇవ్వాళ్ళ నాకు తమిళనాడు ఐజి పాండ్యన్ కాల్ చేశారు. మూడు రోజుల క్రితం చిదంబరం దగ్గర ఒక పురాతన ఆలయంలో రెండు పంచలోహాల విగ్రహాలు దొంగలించారు. వాటి విలువ కనీసం ఒక కోటి రూపాయలు ఉండవచ్చు. ఇలాంటివి గత సంవత్సర కాలంలో చాలానే జరిగాయి. ఇవి అన్నీ మారుమూల ఎక్కువ జనసందోహం లేని చోట, పురాతన ఆలయాలలో ఎటువంటి భద్రత, లేదా సిసిటివి లేని చోట జరుగుతున్నాయి. ఇందులో ట్విస్ట్ ఏమిటంటే, వీటిలో చాలా మటుకు గత సంవత్సర కాలంలో వర్మ గారు అజయ్ వెళ్ళి పరీక్షించినవే.

వాటికి వర్మగారు వాటి వయస్సు, వాటి ధాతువులు నిర్ణయిస్తూ, వాటికి సర్టిఫికేట్ జారీ చేశారు. ఇప్పుడు వర్మ గారిపై హత్యయత్నం, ఇవన్నీ చూస్తుంటే వీటన్నిటికీ ఏదో సంబంధం ఉండి ఉంటుంది అని అనిపిస్తోంది. అందుకే నేను మేఘ సహాయం తీసుకుంటున్నాను'' అని అన్నారు మిత్ర.

క్రాంతి: ఆశ్చర్యంగా ఉన్నది. అంటే అజయ్ కి కూడా ప్రమాదం ఉందని అనుకుంటున్నారా? ఇప్పటికే ఆయన ఇంటిమీద ఒక సారి దాడి జరిగింది.

మిత్ర: ఉండవచ్చు, లేకపోవచ్చు. ఎందుకంటే, అజయ్ కేవలం ఒక అసిస్టెంట్ హోదాలో వర్మ గారికి సహాయకుడిగా మాత్రమే వెళ్ళాడు. అంతకు మించి అజయ్ చేసినది ఏమి లేదు బట్, ఆ దుండగులకి అవన్నీ అనవసరం కాబట్టి, మీరు అజయ్ కి తెలియకుండా ఆయనకు ప్రొటెక్షన్ ఇవ్వండి.

సిద్దార్థ్, గౌతం కిట్టప్ప ఇంటి దగ్గరకు వెళ్ళేటప్పటికి అక్కడ బద్రప్పను ఎదిరిస్తూ మరో ఇద్దరు ఉన్నారు. సిద్దార్థ్, గౌతం రావడం చూసి వాళ్ళు పక్కకు తప్పుకున్నారు.

సిద్దార్థ్: బద్రప్ప ఏమిటి ఇక్కడ గొడవ? ఎవరు వీళ్ళు? మీకు ఇక్కడ ఏమి పని, ఏమి కావాలి? అని అక్కడ ఉన్నవాళ్ళని కొంచెం గట్టిగా అడిగాడు.

బద్రప్ప: సార్! వీళ్ళు ఇంకెవరితోనో కలిసి తాగడానికి వెళ్లారంట, ఆ మూడో అతను తాగి వీళ్ళకు డబ్బులు ఎగ్గొట్టి పారిపోయి ఇక్కడ ఇస్తానని చెప్పడంట. అతనిని వెతుకుంటూ ఇక్కడకు వచ్చి అతని కోసం నాతో గొడవ పడుతున్నారు. అసలు ఇక్కడకు ఎవరు రాలేదంటే వినటం లేదు.

సిద్దార్థ్: ఏయ్, మీరు ముందు ఇక్కడనుంచి వెళతార లేదంటే న్యూసెన్స్ కేసు కింద మిమ్మల్ని అరెస్ట్ చేయమంటారా!? అని బిగ్గరగా అన్నాడు. వెంటనే ఆ వచ్చిన వాళ్ళు దణ్ణం పెట్టి వెళ్లిపోయారు.

గౌతం: బద్రప్ప, వీళ్ళు వచ్చినది నువ్వు లోపల కట్టిపడేసిన వ్యక్తి కోసమే అనుకుంటాను. అసలు అతను ఎవరు?

బద్రప్ప: అవును సార్, వాళ్ళు వచ్చింది నేను కట్టి పడేసిన వ్యక్తి కోసమే. అతను నాకు ఎవరో తెలియదు, కానీ మన కేసుకి అతనికి ఏమైనా సంబంధం ఉన్నదేమో అని కట్టి లోపల పడేశాను.

సిద్దార్థ్: బద్రప్ప తలుపు తీయి. మనం లోపలికి వెళ్ళి అతనిని చూద్దాం.

బద్రప్ప: సరే సార్.

బద్రప్ప, కిట్టప్ప ఇంటి తలుపులు తెరిచాడు, బయట వర్షం పెద్దగా పడుతోంది. ఇంట్లో కట్టి పడేసిన వ్యక్తి కాళ్ళు చేతులు గింజుకుంటున్నాడు. తన కట్లు వదిలించు కోవడం కోసం.

హాస్పిటల్ లో అజయ్ ఆవేశాన్ని తగ్గిస్తూ కేపీ అజయ్ భుజం పట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టాడు.

కేపీ: అజయ్ మీరు ఆవేశ పడవద్దు. మా పోలీసులు వాళ్ళ సంగతి చూసుకుంటారు. మీరు స్తిమితంగా ఉండండి.

అజయ్: లేకపోతే ఏంటిది కేపీ గారు, వాళ్లెవరో మా ఉద్యోగాలను కూడా సరిగ్గా చేసుకోనివ్వడంలేదు. దేవుడి లాంటి వర్మ గారిని గాయ పరిచారు, ఇప్పుడు ఎక్కడో దొంగతనాలకు వర్మ గారికి లింక్ పెడుతున్నారు.

కేపీ: కూల్ డౌన్ అజయ్, అన్నీ త్వరలోనే తెలిపోతాయి.

ఇంతలో అక్కడకి హెడ్ నర్స వచ్చింది. ''వర్మ సార్ ని, రేపు ఉదయం డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు. మీరు రేపు ఉదయం హాస్పిటల్ బిల్ కట్టేయండి. రేపు ఉదయం నేను వచ్చి మీకు అన్నీ వివరాలు చెప్తాను'' అని చెప్పి వెళ్ళిపోయింది.

కేపీ: నందిని గారు, మీకు ఈ రాత్రి ఇక్కడ ఎటువంటి ఇబ్బంది కలగకుండా రేపు వర్మ సార్ ఇంటికి వెళ్ళే వరకు నేను మీకు సెక్యూరిటీ ఏర్పాటు చేస్తాను. నేను మా పెద్ద ఆఫీసర్స్ తో మాట్లాడి మీ ఇంటి దగ్గర ఒక రెండు మూడు రోజుల వరకు సెక్యూరిటీ పెట్టిస్తాను.

నందిని: అవసరం ఉంటేనే చూడండి. ఇప్పటికే మేము మీకు ఎంతో శ్రమ కలిగించాము.

కేపీ ఎవరికో ఫోన్ చేసి వెంటనే ఇద్దరు కానిస్టేబుల్స్ ను హాస్పిటల్ కు పంపమని చెప్పాడు.

గౌతం, సిద్దార్థ్, బద్రప్ప, కిట్టప్ప ఇంటిలోకి వెళ్ళి తలుపు గొళ్ళెం పెట్టారు. బద్రప్ప ఆ కట్టేసిన వ్యక్తి నోటికి కట్టిన గుడ్డను పక్కకు తొలిగించాడు.

ఆ వ్యక్తికి తను తాగిన మైకం కొద్దిగా తగ్గి, గట్టిగా అరుస్తూ ''ఎవరు మీరు? నన్నేందుకు ఇలా కట్టేశారు? ఇక్కడకు బబ్లూ వస్తాను, నాకు డబ్బులు ఇస్తాను అని చెప్పాడు. మోసం, అంతా మోసం'' అని అంటుంటే, సిద్దార్థ్ ఆ వ్యక్తికి చెంప మీద ఒకటి గట్టిగా ఇచ్చాడు.

''అరవకు, నీకు ఏ ఆపద రాలేదు. మేము అడిగిన వాటికి సరిగ్గా జవాబులు చెప్తే ఆ బబ్లూ ఇచ్చేదీ మేమే ఇస్తాము, లేదంటే ఒక సంవత్సరం నిన్ను జైల్ కు పంపుతాము'' అని అన్నాడు సిద్దార్థ్.

ఆ వ్యక్తి వెంటనే మౌనంగా తల ఊపి ఊరుకున్నాడు.

గౌతం: అసలు నువ్వు ఎవరు? ఆ బబ్లూ ఎవరు? నీకు ఈ ఇంటితో పని ఏమిటి? అన్నీ వివరంగా చెప్పు, లేదంటే తెలుసుగా ఏమి జరుగుతుందో.

ఆ వ్యక్తి "సార్, నాకు ముందు తాగడానికి కొన్ని నీళ్ళు ఇవ్వండి, మీరు అడిగినవన్ని వివరంగా చెప్తాను" అని అన్నాడు. బద్రప్ప ఒక గ్లాసులో నీళ్ళు తెచ్చి ఆ వ్యక్తికి తాగించాడు.

సిద్దార్థ్: ఇప్పుడు చెప్పు.

ఆ వ్యక్తి: సార్ నా పేరు కేశవ, నేను ఒక ఆటో డ్రైవర్ ని. మొన్న రాత్రి నేను ఆటో స్టాండలో ఉన్నప్పుడు ఆ బబ్లూ గాడు ఇంకో ఇద్దరితో వచ్చి నా ఆటో ఎక్కి ఇక్కడకు తీసుకు వచ్చాడు.

బబ్లూ గాడితో ఉన్న వాళ్ళలో ఒకడు అప్పటికే చచ్చేటట్టు ఉన్నాడు. నేను నా ఆటో ఎక్కవద్దు అంటే, నాకు వెయ్యి రూపాయలు ఇచ్చి మరీ ఇక్కడకు తీసుకుని వచ్చాడు. అప్పుడు అక్కడ ఆటో స్టాండ్ లో నా ఒక్కడి ఆటో నే ఉన్నది.

రాత్రి ఒంటి గంట దాటింది. సాధారణంగా ఆ సమయంలో ఎక్కువ పాసింజర్స్ రారు, ఎవరైనా బాగా తాగేసి లేదా సెకండ్ షో సినిమా చూసి వచ్చే వాళ్ళు మాత్రమే వస్తారు.

ఇక్కడకు వచ్చాక తెలిసింది ఆ చావుబతుకుల మధ్య ఉన్నవాడు చచ్చిపోయాడని, నేను గొడవ పెడితే నన్ను తంతానని చెప్పి ఇవ్వాళ్ళ వచ్చి ఇంకో వెయ్యి తీసుకోమన్నాడు. అందుకే వచ్చాను, అంతకుమించి నాకు ఏమి తెలియదు సార్.

గౌతం: నువ్వు ఆ బబ్లూ గాడిని ఎక్కడ ఆటో ఎక్కించుకున్నావు? అసలు వాడు బబ్లూ అని నీకు ఎట్లా తెలుసు?

కేశవ: సార్, నేను వాడిని యంజి రోడ్డులో బ్రిగేడ్ స్ట్రీట్ మూలమీద ఎక్కించుకున్న. బబ్లూ గాడు అక్కడ జేబులు కొడుతూ, కొత్త సినిమాల టిక్కెట్లు బ్లాక్ లో అమ్ముతూ ఉంటాడు. నాకు అంతే తెలుసు సార్.

సిద్దార్థ్: బద్రప్ప, నువ్వు ఈ కేశవ అడ్రసు, ఆధార్ కార్డ్, ఫోను నెంబర్, మిగతా అన్నీ వివరాలు తీసుకుని పంపించు. కేశవా, నువ్వు మాకు ఎప్పుడు అవసరం అయితే అప్పుడు రావాల్సి ఉంటుంది. నిన్ను నమ్మి ఇప్పుడు పంపిస్తున్నాను, నువ్వు చెప్పింది తప్పు అని తెలిస్తే నిన్ను జైల్ లో వేస్తాను.

కేశవ: సార్! నా బిడ్డల మీద ప్రమాణం. నేను నిజమే చెప్పాను, నన్ను నమ్మండి సార్. మీరు ఎప్పుడు చెప్తే అప్పుడు మీ ముందు ఉంటాను సార్ అంటూ, ఏడుపు ముఖం పెట్టాడు.

సిద్దార్థ్: సరే, నువ్వు అన్నీ వివరాలు బద్రప్పకు ఇచ్చి వెళ్ళు.

బద్రప్ప, కేశవ కట్లు విప్పి తన దగ్గర అన్నీ వివరాలు తీసుకుని పంపించాడు.

సిద్దార్థ్: బద్రప్ప, రేపు ఉదయం నువ్వు ఆ బబ్లూ గాడి వివరాలు తెలుసుకో.

గౌతం: సిద్దార్థ్, ఇప్పుడు కేశవ చెప్పిన లొకేషన్ మనం సాయంత్రం వెళ్ళిన ఆఫీస్ కు దగ్గర అనుకుంటాను కదా?

సిద్దార్థ్: అవును గౌతం, మీరు చెప్పినది కరెక్ట్. ఇదేదో తేల్చవలసిన విషయం. వి విల్ డీల్ దిస్ టుమారో.

గౌతం: సరే, ఇంక ఇవాల్టికి మనం రెస్ట్ తీసుకుందాం, రేపు కలుద్దాం.

సిద్దార్థ్: పదండి, మిమ్మల్ని నేను గెస్ట్ హౌస్ లో డ్రాప్ చేసి వెళతాను.

గౌతం: సరే పదండి, బద్రప్ప గుడ్ జాబ్. మంచి లీడ్ దొరికింది, గుడ్ నైట్.

బద్రప్ప: గుడ్ నైట్ సార్లు.

# Chapter - 16  Welcome home

ఉదయం 8:30 అయ్యింది. ఒక డాక్టర్, నర్స్ వర్మ రూంలోకి వచ్చారు. రూమ్ బయట ఇద్దరు కానిస్టేబుల్స్ వాళ్ళను పరీక్షించి లోపలికి పంపారు. నందిని.. వర్మకి సూప్ తాగిస్తుంది. ముందు రోజు కన్నా, వర్మ ఇవ్వాళ కొంచెం మేలుగా కనిపిస్తున్నారు. మనిషికి నీరసం ఇంకా తగ్గలేదు. మాట ముందు రోజు కన్నా కొంచెం మేలుగా ఉంది. ఎడమ చేయి మటుకు ఇంకా స్వాధీనంలోకి రాలేదు, కుడి చేయి కొద్దిగా ఎత్తగలుగుతున్నారు.

ఆ వచ్చిన డాక్టర్ అక్కడ వర్మ బెడ్ కు ఉన్న రిపోర్ట్ కార్డ్ తీసి చూశారు. తరువాత వర్మకి తగిలించి ఉన్న మానిటర్ లను చూశాడు. ఆయనేదో రిపోర్ట్ రాసుకున్నాడు. నర్స్ కి ఏవో కొన్ని సూచనలు ఇచ్చాడు.

తరువాత "మేడమ్, వర్మ గారిని పది గంటలకు డిశ్చార్జ్ చేస్తాము. ఈలోపు మీరు వేరే ఫార్మాలిటీస్ అన్నీ చూసుకోండి. నేను కింద బిల్లింగ్ డిపార్ట్మెంట్ వాళ్ళకు చెప్తాను. ఈ సిస్టర్ వర్మ సార్ కి డ్రెస్సింగ్ చేసి, క్లీన్ చేసి రెడీ చేస్తారు. ఒక ఇంజెక్షన్ ఇవ్వవలసి ఉంటుంది. అది మీరు వెళ్ళే ముందు నేను వచ్చి ఇస్తాను" అన్నాడు.

కొంత సమయం తరువాత ఆ వచ్చిన డాక్టర్, నర్స్ వెళ్ళిపోయారు.

నందిని, రజనీకి కాల్ చేసింది.

"రజనీ, ఇప్పుడు ఇంకో గంటలో వర్మ గారిని డిశ్చార్జ్ చేస్తారు. ఇక్కడ నాకు నీ అవసరం కొంచెం ఉంది. నువ్వు రాగలవా?" అంది.

రజనీ: సరే, నేను ఇంకో అరగంటలో హాస్పిటల్ కు వస్తాను. అవును.. నువ్వు నన్ను ఆ రోజు తీసుకురమ్మన్న ఆ రెడ్ కలర్ బ్యాగ్ నా దగ్గరే ఉండిపోయింది. తీసుకురమ్మంటావా?

నందిని: బాగా గుర్తు చేశావు, ఆ బాగ్ కూడా తీసుకురా.

***

బద్రప్ప మఫ్టీలో బ్రిగేడ్ స్ట్రీట్ వెళ్ళాడు. అక్కడ ఒక టీ స్టాల్ ముందు నిలబడి ఒక బీడీ వెలిగించి, ఒక టీ ఆర్డర్ ఇచ్చాడు. ఇంతలో ఒకతను వచ్చి సిగరెట్ వెలిగించుకోవడం కోసం బద్రప్పను అగ్గిపెట్టె అడిగాడు. బద్రప్ప అగ్గిపెట్టె ఇచ్చి మెల్లిగా ఆ టీ షాప్ వాడితో, ఈ నిప్పు అడిగిన వాడితో మాట కలిపాడు.

బద్రప్ప: కల్కి సినిమా రిలీజ్ అవుతోంది, నాకు పది టిక్కెట్ లు కావాలి. ఇక్కడ బబ్లూ మాత్రమే ఇప్పించగలడని విన్నాను, అతనిని ఎక్కడ కలవవచ్చు?

టీ షాప్ అతను: రాత్రి తాగింది దిగితే ఏ పదకొండుకో.. పన్నెండుకో.. ఇక్కడకు వస్తాడు. లేదంటే, సాయంత్రం బార్ కి వెళ్ళేముందు వస్తాడు. ఆడికి చేతిలో డబ్బులు ఉంటే మనిషి కనపడడు, లేదంటే వీధి కుక్కలాగా ఇక్కడే తిరుగుతాడు.

బద్రప్ప: మరి నా అదృష్టం ఎలా ఉందో ఇప్పుడు!

ఆ నిప్పు అడిగిన వ్యక్తి: నాకు తెలిసి బబ్లూ ఇంక బ్లాక్ టిక్కెట్ లు అమ్మడు. ఎందుకంటే, వాడు ఏదో జాక్పాట్ కొట్టాడు. మొన్ననే రెండు లక్షలు పెట్టి కొత్త బుల్లెట్ బండి కొన్నాడు. నాకు నిన్న మస్తాన్ బిరియాని కొట్టు దగ్గర కొత్త బండి మీద కనపడి చెప్పాడు.

బద్రప్ప: అయ్యో రామ! కనీసం తనెక్కడ ఉంటాడో తెలిస్తే, వెళ్ళి ఏదో ఒక రకంగా బతిమిలాడి నాకు కావలసిన టిక్కెట్ లు ఏర్పాటు చేసుకునేవాడిని. ఇప్పుడు ఏం చేయాలో! అంటూ తల పట్టుకున్నాడు.

ఆ నిప్పు అడిగిన వ్యక్తి: నీకు నిజంగా ఆ టిక్కెట్లు అంత అవసరమా? రేపు కాకపోతే ఎల్లుండి లేదా ఒక వారం తరువాత చూడు అన్నాడు వెటకారంగా.

బద్రప్ప: నువ్వు ఊరుకో, నీకెందుకు? తెలిస్తే చెప్పు లేదంటే లేదు. నాకు ఆ టిక్కెట్లు చాలా అవసరం, అవి లేకుంటే నా ఉద్యోగం ఊడిపోతుంది.

ఆ నిప్పు అడిగిన వ్యక్తి: ఊరికే అన్నాలే, పద నేను తీసుకెళతాను. నీ అదృష్టం బబ్లూ ఉంటే నీకు టిక్కెట్లు దొరుకుతాయి, లేదంటే లేదు. పద నేను తీసుకు వెళతాను.

***

రజనీ హాస్పిటల్ కి వచ్చింది. చేతిలో నందిని రెడ్ బాగ్ కూడా ఉంది. వర్మ రూమ్ దగ్గరకి వెళ్ళింది.

రజనీని చూసిన నందిని, "రజనీ, నువ్వు ఇక్కడ వర్మ గారి దగ్గర ఉండు. నేను వెళ్ళి బిల్ కట్టేసి వస్తాను" అని వెళ్ళింది.

ఒక అరగంట తరువాత నందిని బిల్ పే చేసి వచ్చింది. అప్పుడే అజయ్, కేపీ వచ్చారు.

కేపీ: వర్మ గారిని ఇవ్వాళ్ళ డిశ్చార్జ్ చేస్తారని వచ్చాము. అంతా రెడినా.. మేడమ్?

నందిని: ఇప్పుడే నేను బిల్ పే చేసి వచ్చాను. ఇంక డాక్టర్, నర్స్ వచ్చి డిశ్చార్జ్ చేయటమే మిగిలింది.

రజనీని, నిర్మలమ్మని ముందుగా ఇంటికి వెళ్ళి అన్నీ ఏర్పాట్లు చేయమని చెప్పింది నందిని. నిర్మలమ్మ అక్కడ ఉన్న వస్తువులు, బట్టలు అన్నీ సర్దింది. రజనీ, నిర్మలమ్మను తీసుకుని వర్మ ఇంటికి బయలుదేరింది.

***

క్రాంతికి మిత్రా చెప్పిన విషయాలు, ఆ విగ్రహాల దొంగతనాలు, ఇక్కడ వర్మ మీద హత్యాయత్నం, ఎందుకో తనకు ఇవన్నీ ఒకదానికి ఒకటి ముడిపడి ఉన్నట్టు అనిపించింది. ఇంతలో కేపీ ఫోన్ చేశాడు.

క్రాంతి: జై హింద్ కేపీ, చెప్పండి ఏమిటి అప్డేట్.

కేపీ: సార్ జై హింద్, ఇంకొంచెం సేపట్లో వర్మ గారు హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అవుతారు. హీ ఇస్ డూయింగ్ వెల్ నౌ. నేను ఆయనతో పాటు వాళ్ళ ఇంటికి వెళ్ళి మీ దగ్గరకు వస్తాను.

క్రాంతి: గుడ్ న్యూస్ కేపీ, మీరు వచ్చేముందు నాకు కాల్ చేయండి.

***

బద్రప్ప ఆ వ్యక్తి తో వెళుతున్నాడు.

బద్రప్ప: ఇంతకీ నీ పేరు ఏమిటో? నీకు బబ్లూ ఎలా తెలుసు?

ఆ వ్యక్తి: నన్ను అందరూ బంటి అని పిలుస్తారు. అసలు పేరు బాలు, బబ్లూ నాకు బార్ లో పరిచయం. నేను ఈగల్ బార్ లో సప్లయర్ ని.

ఇద్దరూ సన్న సందుల మధ్య నుంచి వెళుతున్నారు. కొంచెం ముందుకు వెళ్ళిన తరువాత అన్నీ ఇరుకు రేకులు ఇళ్ళు ఉన్నాయి. వాటిలో కొన్ని కింద మామూలు ఇళ్ళు దానిపైన ఒక రేకుల షెడ్ లాంటి ఇళ్ళు ఉన్నాయి. వాటిలో ఒక ఇంటి ముందు కొత్త బుల్లెట్ బండి ఉంది.

బాలు అక్కడ ఆగి, "ఇదే బబ్లూ ఉండే ఇళ్ళు, నేను పైకి రాను. నేను బబ్లూ ఇళ్ళు నీకు చూపించాను అని తెలిస్తే, నన్ను చావగొడతాడు. నువ్వు వెళ్ళి నీ పని చేసుకో, నేను పోతాను. సరే ఇంత దూరం వచ్చాను నీకు బబ్లూ ఇళ్ళు చూపించాను. నాకు ఏమైనా డబ్బులు ఇవ్వు" అన్నాడు.

బద్రప్ప: సరే, మంచి సహాయం చేశావు. ఇదిగో నీ కష్టం నాకు అక్కరలేదులే. ఇదిగో ఈ వంద తీసుకుని వెళ్ళు, మిగతాది నేను చూస్కుంటాను అని బాలుకి ఒక వంద రూపాయలు ఇచ్చాడు.

బాలు తృప్తిగా వెళ్ళిపోయాడు. బద్రప్ప వెంటనే తన మొబైల్ ఫోన్ లో సిద్దార్థ్ కి తన లొకేషన్ షేర్ చేశాడు. మెసేజ్ లో "బబ్లూ స్పాట్" అని పంపాడు.

***

హాస్పిటల్లో ఇద్దరు డాక్టర్ లు, ఇద్దరు నర్స్ లు వచ్చారు. వర్మని రెడీ చేసి ఒక వీల్ చైర్ లో కూర్చోపెట్టారు. పక్కన నందిని, అజయ్, కేపీ నడుస్తున్నారు.

అజయ్: మేడమ్, నేను ఆఫీస్ నుంచి పెద్ద కార్ తెచ్చాను. సార్ ను ఇంటికి అందులోనే తీసుకుని వెళదాము. మీరు కిందకి వచ్చే లోపల నేను కార్ తెస్తాను. అని ముందుగా వెళ్ళిపోయాడు.

వర్మతో పాటు కేపీ, నందిని, ఇద్దరు కానిస్టేబుల్స్, ఇద్దరు నర్స్ లు, ఇద్దరు డాక్టర్ లు అక్కడ లిఫ్ట్ ఎక్కారు.

అజయ్ తీసుకు వచ్చిన పెద్ద సెవన్ సీటర్ కార్ లోకి వర్మను జాగ్రత్తగా ఎక్కించారు. పక్కనే నందిని కూర్చుంది. ఒక కానిస్టేబుల్ ముందు సీట్ లో అజయ్ పక్కన కూర్చున్నాడు. ఇంకో కానిస్టేబుల్ వెనుక సీట్ లో కూర్చున్నాడు. అజయ్ కార్ ని వర్మ ఇంటికి వెళ్ళడానికి నడుపుతున్నాడు.

ఒక అరగంట ప్రయాణం తరువాత వర్మ ఇంటికి చేరుకున్నారు. నిర్మలమ్మ వర్మ గారికి హారతి ఇచ్చి దిష్టి తీసింది. నందిని మెల్లిగా వర్మను వీల్ చైర్ మీద కూర్చుపెట్టి ఇంటి లోపలికి తీసుకుని వెళ్ళింది. అజయ్ కార్ ను ఇంటిముందర పక్కగా పార్క్ చేశాడు. ఇద్దరు కానిస్టేబుల్స్ వర్మ ఇంటి లోపల పోర్టిగో దగ్గర ఉన్న కేన్ సోఫాలో కూర్చున్నారు. కేపీ తన బైక్ మీద వచ్చి బయట పార్క్ చేసి వర్మ ఇంట్లోకి వెళ్ళాడు.

నిర్మలమ్మ కేపీ, అజయ్, కానిస్టేబుల్స్ కి టీ తెచ్చి ఇచ్చింది. ఇంతలో ఇంటి బయట ఒక బైక్ మీద ఇద్దరు నల్ల దుస్తులు వేసుకుని హెల్మెట్స్ పెట్టుకుని వచ్చారు. ఆ సందు మొత్తం నిశబ్దంగా, ఖాళీగా ఉంది. ఆ బైక్ వెనుక కూర్చున్నవాడు.. ఒక కాగితంలో రాయి చుట్టి వర్మ ఇంటి లోపలకి విసిరాడు. అది వెళ్ళి ఒక కానిస్టేబుల్ కాలికి తగిలింది. అది చూసి హడావుడిగా ఆ బైక్ డ్రైవ్ చేయబోయాడు ఆ బైక్ డ్రైవర్.

కానిస్టేబుల్ వెనుకకు తిరిగి గట్టిగా అరుస్తూ బయటకు వచ్చాడు. వెనకాలే రెండో కానిస్టేబుల్, కేపీ, అజయ్ పరిగెత్తుకు వచ్చారు.

# Chapter – 17 The Capture

బద్రప్ప మెసేజ్ చూసిన సిద్దార్థ్ వెంటనే గౌతమ్ గెస్ట్ హౌస్ కి వెళ్ళి, తనతో పాటు బద్రప్ప పంపిన లొకేషన్ చేరుకున్నాడు. బద్రప్ప మెసేజ్ పంపినప్పటి నుండి సిద్దార్థ్, గౌతమ్ రావడానికి నలబై నిముషాలు పట్టింది. బద్రప్ప అక్కడే టెన్షన్ తో ఒక కట్ట బీడీలు పీల్చేశాడు.

సిద్దార్థ్ గౌతమ్ లను చూసి "సార్లు త్వరగా రండి, వాళ్ళు ఇంకా పైననే ఉన్నారు. ఇక్కడ నేను ఎవరు వస్తారో, ఎవరు వెళ్ళిపోతారో అన్న టెన్షన్ లో ఉన్నాను. పదండి, ఆ పైన రూమ్ లో బబ్లూ ఉన్నాడు" అన్నాడు బద్రప్ప.

సిద్దార్థ్: గౌతమ్, మనం గన్స్ రెడీగా పెట్టుకుందాము. అవసరమైతే తప్ప వాడకూడదు. బద్రప్ప ముందు నువ్వు పైకి వెళ్ళు, నీ వెనకాలే మేము వస్తాము. అక్కడ పరిస్థితి ముందర వెళ్ళి చూడు.

బద్రప్ప: అయ్యో సారు, నేనా? నా దగ్గర కనీసం ఒక్క చిన్న ఆయుధం కూడా లేదు. ముందు నేను వెళ్ళాలా? సరే ఇక్కడకు ముందు వచ్చినది నేనేగా! అందుకు నేనే వెళతాను.

ముందు బద్రప్ప, వెనకాలే సిద్దార్థ్, గౌతమ్ ముగ్గురు అక్కడ ఉన్న చెక్క మెట్లు ఎక్కి మేడ మీదకు వెళ్ళారు. ఆ మేడ మీద అన్నీ పనికిరాని చెత్త సామాన్లు, పాత కార్, బైక్ టైర్ లు, పగిలిపోయిన, విరిగిపోయిన సామాన్లు, రెండు పెద్ద నీళ్ళ డ్రమ్ములు, ఇంకో పక్క ఒక పెద్ద కుప్పగా పోసిన కాళీ మందు సీసాలు ఉన్నాయి. అక్కడ ఉన్న రూమ్ తలుపు కొంచెం దగ్గర వేసి ఉంది, లోపల తిరుగుతున్న ఫ్యాన్ శబ్దం పెద్దగా వినిపిస్తోంది. ముందు రోజు కురిసిన వర్షం వలన అక్కడ అంతా తడిగా, అక్కడక్కడా కొన్ని నీళ్ళు నిలిచి ఉన్నాయి.

బద్రప్ప మెల్లిగా ఆ రూమ్ తలుపు తోశాడు. లోపల ఆరడుగుల బబ్లూ చిరిగిన బనియన్, షార్ట్ వేసుకుని నేల మీద చాప మీద బోర్లా పడుకుని నిద్రపోతున్నాడు. అక్కడ ఇంకెవరూ కనపడలేదు. బద్రప్ప, సిద్దార్థ్, గౌతమ్ లను రమ్మని చేయి ఊపి పిలిచాడు. సిద్దార్థ్, గౌతమ్ ఇద్దరు లోపలికి వెళ్ళారు.

***

బైక్ స్టార్ట్ చేసి పారిపోతున్న వాళ్ళు తొందరలో అక్కడ పక్కన ఉన్న ఫుట్ పాత్ గట్టు తట్టుకున్నారు. ఆ కుదుపులో వెనక కూర్చున్న వాడు పడిపోయాడు. అది గమనించని డ్రైవ్ చేస్తున్నవాడు బైక్ ని వేగంగా ముందుకు నడిపాడు. ఇంతలో వెనకాల పరిగెత్తుకు వచ్చిన ఆ ఇద్దరు కానిస్టేబుల్స్.. ఆ కింద పడ్డవాడిని ఒడిసి పట్టుకుని బంధించారు.

వెనకాలే కేపీ, అజయ్ వచ్చి ఆ దొరికిన వాడిని గట్టిగా పట్టుకున్నారు. ఇంతలో ఒక కానిస్టేబుల్ పరుగున వెళ్ళి, వర్మ ఇంట్లో నుండి ఒక తాడు పట్టుకువచ్చి వాడిని కట్టేశాడు. కొంత దూరం వెళ్ళిన ఆ బైక్ వాడు వెనుకకు చూసి, భయపడి బైక్ వేగంగా నడుపుతూ వెళ్ళిపోయాడు.

***

ఆలోచనల మధ్య ఎక్కడ ఆరంభించాలో తెలియక అటు ఇటు తిరుగుతున్నాడు క్రాంతి. అంతలో ఏదో గుర్తుకు వచ్చిన వాడిలాగా, పరుగున తన లాప్టాప్ దగ్గరకు వెళ్ళాడు. దానిలో నేషనల్ డేటాబేస్ తీశాడు.

గత సంవత్సరం రోజులలో గుళ్ళు, గోపురాలు, ఆలయాలు, మండపాలు వాటిలో జరిగిన దొంగతనాలు వాటి వివరాలు వెతుకుతున్నాడు. క్రాంతికి ఆ కంప్యూటర్ ఇచ్చిన విషయాలు చూసి ఆశ్చర్యం కలిగింది. ఆ దొంగతనాలు ఎక్కువ శాతం దక్షిణ భారతదేశంలో, అందులోనూ తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లోనే ఉన్నాయి. వాటిలో కూడా ఎక్కువ ఇత్తడి, రాగి, వెండి, బంగారం వస్తువులు, శిల్పాలు, మూర్తులు, కలిశాలు, గంటలు ఇలా చాలా ఉన్నాయి. క్రాంతి ఆ దొంగతనలు జరిగిన ప్రదేశాల పేర్లు, అవి దొంగతనంకు గురైన తేదీలు అన్నీ ఒక పెద్ద పట్టి తయారుచేశాడు.

***

రూంలోకి వెళ్ళిన సిద్దార్థ్, గౌతమ్, బద్రప్ప అక్కడి పరిసరాలు అన్నీ పరీక్షగా చూస్తున్నారు. గౌతమ్ తన గన్ గురిపెట్టి ఆ క్రింద పడుకుని ఉన్న బబ్లూని కాలితో అతని కాలి మీద తట్టి లేపాడు.

బబ్లూ: ఎవర్రా అది? ఎందుకు లేపుతున్నారు? పొండి రా అని అరిచాడు.

గౌతమ్: అరిచింది చాలు ఇంక లేయి, చాలా పని ఉంది.

బబ్లూ (ఇంకా బోర్లా పడుకునే): ఎవడ్రా అది? చెపితే వినకుండా నాతోనే పరాచికాలా? నేనుగాని లేచానంటే నీ పని సరి అంటూ, నేరుగా తిరిగి మెల్లిగా కళ్ళు తెరిచాడు.

తనకు ఎదురుగా గురిపెట్టి ఉన్న తుపాకి, దాని వెనుక ఉన్న వ్యక్తిని చూసి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు.

గౌతమ్: లేచి కూర్చో, పిచ్చి వేషాలు వేస్తే ఇందులో బుల్లెట్ నీ తలలో ఉంటుంది. లే.. అంటూ గట్టిగా గదమాయించాడు.

బబ్లూ భయంగా లేచి అక్కడ మూలకు అనుకుని కూర్చున్నాడు. ఆ వచ్చిన వ్యకి ఒకరు కాదు, ఇంట్లో మొత్తం ముగ్గురు ఉన్నారని, వాళ్ళ వాలకం ప్రకారం వాళ్ళు పోలీసులు అని బబ్లూ అర్థం చేసుకున్నాడు.

బబ్లూ: సార్ నేను ఇప్పుడు బ్లాక్ టిక్కెట్ లు అమ్మటం లేదు సార్. ఒట్టు, నేను త్వరలో బైక్ రిపైర్ షాప్ పెట్టాలనుకుంటున్నాను. ఇంతకీ మీరు ఎందుకు వచ్చారు సార్? అంటూ కొంచెం భయంగా అడిగాడు.

సిద్దార్థ్: అవును, సినిమా టిక్కెట్లు బ్లాక్ లో అమ్మితే రోజుకు అయిదు ఆరు వందలు తప్ప ఏమి వస్తుంది? అందుకే ఈ మధ్య హత్యలు మొదలు పెట్టవనుకుంటాను.

బబ్లూకి విషయం అర్థమయ్యింది. ఎలా పారిపోవాలా అని చూస్తున్నాడు. అంతలో గౌతమ్ బబ్లూ ఎడమ చేయి మీద తన కాలు గట్టిగా అదిమిపెట్టి, బద్రప్పను చూసి బబ్లూని కట్టేయమన్నాడు. బద్రప్ప అక్కడ పైకప్పు దగ్గర ఉన్న ఒక తాడు, అక్కడే ఉన్న ఒక పెద్ద లెదర్ బెల్ట్ తీసుకుని బబ్లూ చేతులు వెనక్కు పెట్టి కట్టేశాడు. గౌతమ్, సిద్దార్థ్, బబ్లూ ని మెల్లిగా లేపి, తమతో క్రిందకు తీసుకుని వెళ్లారు.

అక్కడ ఆ సంఘటన చూసిన కొందరు వచ్చి అల్లరి చేయడానికి ప్రయత్నం చేశారు. సిద్దార్థ్ గాలిలోకి ఒకసారి గన్ కాల్చాడు. ఆ దెబ్బకి వచ్చిన వాళ్ళు అందరూ పారిపోయారు. సిద్దార్థ్ గౌతమ్ బబ్లూ ను లాక్కుని తీసుకుని వెళ్ళి తమ కార్ లో పడేసి, బద్రప్పను వాడితో కూర్చుపెట్టి కార్ తీసుకుని వెళ్ళిపోయారు.

***

కేపీ, క్రాంతికి ఫోన్ చేశాడు.

''సార్, ఇక్కడ వర్మ గారిని క్షేమంగా ఇంటికి తీసుకుని వచ్చాము. ఆయన లోపల సేఫ్ గా ఉన్నప్పుడు, ఇద్దరు దుండగులు బైక్ మీద వచ్చి ఇంటిలోకి ఒక రాయి విసిరారు. వాళ్ళలో ఒకడు దొరికాడు, ఇక్కడే కట్టి పడేశాము. వీడు అంతకుముందు హాస్పిటల్ దగ్గర గొడవ చేసిన వాళ్ళలో ఒకడు అనుకుంటాను'' అన్నాడు.

క్రాంతి: గుడ్, మీరు అక్కడ వర్మ గారి ఇంటి దగ్గర సెక్యూరిటీ పెట్టి, ఆ దొరికిన వాడిని మన సేఫ్ హౌస్ కు తీసుకురండి. వాడిని మనం ఇక్కడ విచారిద్దాం అని ఫోన్ కట్ చేశాడు.

కేపీ పోలీస్ స్టేషన్ కి ఫోన్ చేసి ఒక పోలీస్ జీప్, ముగ్గురు పోలీస్ లను పిలిపించాడు. వాళ్ళు ఒక అరగంటలో అక్కడికి వచ్చారు.

కేపీ, ఆ వచ్చిన పోలీస్ లు ఆ దొరికిన వాడి ముఖానికి ముసుగు వేసి జీప్ ఎక్కించారు.

అజయ్: కేపీ, నేను కూడా మీతో వస్తాను.

కేపీ: సారీ అజయ్, ఇది కాన్ఫిడెన్షియల్. మీరు వర్మ గారి దగ్గర ఉండండి. అవసరమైతే నేను వస్తాను, లేదా మిమ్మల్ని నేను పిలుస్తాను అని వెళ్ళిపోయాడు.

అజయ్, అక్కడ ఉన్న ఇద్దరు కానిస్టేబుల్స్ వర్మ ఇంటిలోపలికి వెళ్ళిపోయారు.

***

క్రాంతి తన లిస్ట్ తీసుకుని ల్యాప్టాప్ మూసేసి, సేఫ్ హౌస్ కు బయలుదేరాడు.

గౌతమ్, బబ్లూ ను తీసుకుని సిద్దార్థ్ పోలీస్ స్టేషన్ కు వెళ్ళారు.

సిద్దార్థ్: ముందు వీడిని ఇంటరాగేషన్ కు రెడీ చేయండి. క్విక్, మనకు అసలే టైం లేదు.

ఆ వచ్చిన ముగ్గురు పోలీస్ లు బబ్లూని తీసుకుని వెళ్ళి, ఒక కుర్చీలో సంకెళ్ళు వేసి కూర్చోపెట్టారు. కాళ్ళు కదపకుండా కట్టేశారు. అంతవరకు మామూలుగా ఉన్న బబ్లూ ఒక్కసారిగా ఏడవడం మొదలు పెట్టాడు.

***

మొహెంజదారో ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్పోర్ట్స్ ఆఫీస్ లో జగత్ సింగ్, డాక్టర్ నాగ్ ఎదరెదురుగా కూర్చుని ఉన్నారు.

జగత్ సింగ్: నాగ్, వర్మ హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్ళాడు. ఇంక ఆలస్యం చేయకూడదు, మనకు కావలసింది తీసుకురండి. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యింది.

డాక్టర్ నాగ్: సార్, మీరు నాకు చెప్పినది గుర్తు ఉంది, నేను ఆ పని మీదే ఉన్నాను. ఇవాళ రాత్రి లోపల మన పని అయిపోతుంది అని లేచి తన మొబైల్ లో ఎవరికో ఫోన్ చేస్తూ బయటకు వెళ్ళిపోయాడు.

# Chapter – 18 The Truth Unfold

డాక్టర్ నాగ్ ఫోన్ చేసి "చిన్నా.. ఎట్టి పరిస్థితిల్లోనూ ఇవాళ మనం ఆ వర్మ దగ్గర నుంచి మనకు కావలసినది తీసుకోవాలి, ఇంక ఆలస్యం చేయకూడదు" అన్నాడు.

అవతలి వ్యక్తి చిన్న "అన్న, అనవసరంగా ఆ కుప్పుసామి మనిషి ఒకడు వర్మ ఇంటి దగ్గర పోలీస్ లకు దొరికిపోయాడు. వాడు ఏమి చెప్తాడో అని నేను ఆలోచిస్తున్నాను" అన్నాడు.

నాగ్ కు పట్టరాని కోపం వచ్చింది.

"ఆ కుప్పుసామి గాడిని నమ్మడం నా బుద్ధి తక్కువ. ఇప్పుడు గోటితో పోయేదానిని గొడ్డలి దాకా తీసుకుని వచ్చాము. నువ్వు జాగ్రత్త, నేను వాడి సంగతి చూసుకుంటాను" అని ఫోన్ పెట్టేశాడు.

***

గౌతమ్, సిద్దార్థ్.. బబ్లూను ఉంచిన గదిలోకి వచ్చారు. అప్పటికే అక్కడ ముగ్గురు కానిస్టేబుల్స్ లాఠీలు పట్టుకుని ఉన్నారు.

సిద్దార్థ్: బబ్లూ, నువ్వు ఆ కిట్టప్పను ఎందుకు చంపావు? అతనిని చంపమని నీకు డబ్బులు ఎవరు ఇచ్చారు? ఉన్నది ఉన్నట్టు చెప్పు, లేదంటే ఎలా చెప్పించాలో మా వాళ్ళకు బాగా తెలుసు.

బబ్లూ (కొద్దిగా ఏడుస్తూ): సార్, అంతా నా తలరాత. నేను ఆ కిట్టప్పని చంపాలని అనుకోలేదు, వాడే తొందరపడి చచ్చిపోయాడు.

గౌతమ్: ఏంటా డొంక తిరుగుడు! సరిగ్గా చెప్తావా..? లేక..

బబ్లూ: సార్ చెప్తాను. ఒక పది రోజుల ముందు నేను బ్రిగేడ్ రోడ్ లో, ఒక షాప్ ముందు ఒకతని జేబు కొట్టాను. ఆయన పర్స్ లో ఒక పదివేలు వరకు డబ్బులు ఉన్నాయి, ఏవో కార్డ్ లు ఉన్నాయి. నేను డబ్బులు తీసుకుని ఆ పర్స్ పక్కనే ఉన్న చెత్త డబ్బాలో పడేశాను. సరిగ్గా అప్పుడే ఒకతను నా చేయి గట్టిగా పట్టుకుని పక్కకు లాక్కుని వెళ్ళాడు. 'జేబులు కొట్టడం ఎన్ని రోజులు చేస్తావు? ఒకేసారి ఒక జాక్పాట్ కొట్టు' అని, నాకు ఒక సలహా ఇచ్చి పక్కనే ఉన్న బార్ లో కలవమని వెళ్ళిపోయాడు. నేను ఆ బార్ లోకి వెళ్ళాను.

***

క్రాంతి కార్ సేఫ్ హౌస్ కి చేరుకుంది. అప్పటికే అక్కడికి కేపీ, ఆ పట్టుకున్న వ్యక్తిని తీసుకుని ముగ్గురు కానిస్టేబుల్స్ తో సహా వచ్చాడు.

లోపల నిటారుగా ఉన్న ఒక స్తంభానికి, ఆ వ్యక్తిని చేతులు పైకి పెట్టి గొలుసులతో కట్టేశారు. కాళ్ళు కదల్చకుండా ఉండేందుకు వెనకాలే ఉన్న గోడకు ఉన్న రింగులకు గొలుసులు వేసి కట్టేశారు. వాడు బిక్కుబిక్కుమని భయంతో వణుకుతున్నాడు.

లోపలికి వచ్చిన క్రాంతి ఆ కట్టేసినవాడికి ఎదురుగా ఉన్న ఒక చెక్క బల్ల మీద కూర్చున్నాడు. అతని పక్కన కేపీ నిలుచుని ఉన్నాడు.

క్రాంతి (గంభీరంగా): నీ పేరు ఏమిటి? ఎవరు నువ్వు? అసలు వర్మ ఇంటికి నీకు సంబంధం ఏమిటి? ఆయన ఇంటిలోకి నువ్వు ఆ రాయి ఎందుకు విసిరావు? నిన్ను ఎవరు పంపించారు? ఇంతకుముందు నువ్వు, ఆ పారిపోయిన వాడు హాస్పిటల్ లో కూడా సెక్యూరిటీ అతనిని, నర్స్ లను కూడా ఇబ్బంది పెట్టారు. అన్నీ వివరంగా చెప్పు, లేదంటే నువ్వు ఇంటికి కాదు పైకి పోతావు.

ఆ కట్టేసిన వ్యక్తి: చెప్తాను సార్, నన్ను మీరు తరవాత ఇడిసేస్తాను అని చెప్పండి, అన్నీ వివరంగా చెప్తాను.

కేపీ: ముందు నువ్వు చెప్పు, ఆ తరువాత ఇడవాలో లేక నిన్ను జైలు లో మడవాలో ఆలోచిస్తాము.

క్రాంతి: కేపీ ముందు వాడిని చెప్పనిద్దాం, నువ్వు చెప్పు.

ఆ కట్టేసిన వ్యక్తి: సార్, నా పేరు పళని, నాది తమిళనాడు లోని తుత్తుకుడి. నేను పాత సామన్లకు మాట్లు వేస్తూ ఉండేవాడిని. నాకు 17 సంవత్సరాలు ఉన్నప్పుడు, మా ఊరికి ఒకతను వచ్చి నాకు మంచి డబ్బులు వచ్చే ఉద్యోగం ఇస్తాను అని చెప్పి తిరుచునాపల్లికి తీసుకుని వెళ్ళాడు. నాకు చేతినిండా డబ్బులు ఇచ్చి, రోజు ఆ చుట్టూ పక్కల ఉన్న అన్నీ ఊర్లు తిరిగి, అక్కడ ఉన్న అన్ని పెద్ద, చిన్న గుళ్ళు, దేవాలయాలు చూసి రావడం చేయమన్నాడు.

కేపీ: ఇంట్రెస్టింగ్.. గుళ్ళు, దేవాలయాలు చూడాడానికి నీకు డబ్బులు ఇచ్చి మరీ పంపించారా? అదేం ఉద్యోగం?

పళని: అదే సార్, నేను వెళ్ళే ప్రతి గుడి, దేవాలయం అక్కడ ఉన్న అన్ని విగ్రహాలు, గంటలు, కలశాలు, వేరే పాతకాలం దీపాలు, ఇంకేమైనా సరే, అన్నీ వివరాలు తెలుసుకుని ఆ గుడికి, దేవాలయంకు జనం ఎప్పుడు వస్తారు, ఎప్పుడు ఖాళీగా ఉంటుంది, ఇంకేమీ సేస్తారు, అన్నీ వివరాలు రాసుకుని వచ్చి ఆ సార్ కు ఇవ్వాలే. నాలాగే పని చేసేవాళ్ళు ఇంకో ముగ్గురు ఉన్నారు.

మేము ఇచ్చిన వివరాలు తీసుకుని ఆ గుడిలో, దేవాలయంలో ఉన్న విగ్రహాలు, వస్తువులు వాళ్ళు దొంగతనం సేసి, వాటిలాగే కొత్తవి సేసి అమ్ముకుంటారు. మళ్ళీ ఆ విగ్రహలు ఎక్కడో దొరికితే పోలీస్ వాళ్ళు తీసుకుని వెళతారు.

క్రాంతి: మరి నువ్వు ఇక్కడ హైదరాబాద్ లో ఏం చేస్తున్నావు? నిన్ను ఇక్కడకు ఎవరు తీసుకువచ్చారు.

పళని: నాకు 22 ఏళ్లు వచ్చేటప్పటికి నేను దొంగతనం సేసి గుడిలోని విగ్రహాలు ఎత్తుకుని వచ్చేవాడిని. అప్పుడు నా మీద నాలుగు కేస్ లు పెట్టారు. అప్పుడే మురుగన్ మూసికల్స్ కుప్పసామి వాళ్ళ మామగారు, అదే సార్ గోమతి అమ్మ వాళ్ళ అప్ప నన్ను కుప్పసామితో ఇక్కడకు పంపించాడు. నేను ఇక్కడ వచ్చి మూడు సంవత్సరాలు అయ్యింది. ఇక్కడ నేను డెలివరి బాయ్ గా ఉన్నాను. ఎక్కువ పని లేదు అని మాకు ఇక్కడ ఈ పని సేయమని కుప్పసామికి ఎవరో ఫోన్ సేసి సెప్పినారు. కుప్పసామికి భయం అయినా తప్పదు. అందుకే మేము ఆయన కోశం ఇవన్నీ సేస్తున్నాం. ఎందుకు, దేనికి, ఏమి తెలియదు.

క్రాంతి అక్కడ నుంచి లేచి కేపీని పిలిచాడు.

ఇద్దరు బయటకు వెళ్ళి, “వీళ్ళ వెనుక ఏదో ఒక పెద్ద గ్యాంగ్ ఉంది. అది ఎవరు అని తెలిసేవరకు వీడిని ఇక్కడ ఉంచండి, కొట్టవద్దు. నార్మల్ గానే ట్రీట్ చేయండి” అని వెళ్ళిపోయాడు.

***

బబ్లూ: నేను బార్ లోకి వెళ్ళేసరికి అక్కడ అంతా కొంచెం చీకటిగా ఉంది. నా చేయి పట్టుకున్న అతను అక్కడ ఒక మూల కూర్చుని ఉన్నాడు. నేను నేరుగా అతని దగ్గరకు వెళ్ళాను. అతను నాకు కిట్టప్ప ఫోటో ఇచ్చాడు, దాని వెనుక అతని వివరాలు అన్నీ ఉన్నాయి. నేను కిట్టప్పకి ఆయన ఇచ్చిన మందు నేను తాగకుండా మొత్తం వాడితో తాగించి, వాడి ఇంటి దగ్గర వదిలేస్తే నాకు అయిదు లక్షలు ఇస్తాను అని చెప్పాడు. నేను డబ్బుకు కక్కుర్తి పడి ఆయన చెప్పిన దానికి ఒప్పుకున్నాను. ఆయన నాకు అడ్వాన్స్ గా రెండు లక్షలు డబ్బులు ఇచ్చాడు. మిగతాది పని అయ్యాక ఇస్తాను అని చెప్పాడు. నేను ఇంకేం వివరాలు ఆడగకూడదు అని చెప్పాడు.

సిద్దార్థ్: నీకు ఆ ఫోటో డబ్బులు ఇచ్చిన అతనిని గుర్తు పట్టగలవా?

బబ్లూ: కష్టం సార్, అతను నల్ల కళ్ళద్దాలు పెట్టుకుని హుడి టీ షర్ట్ వేసుకుని ఉన్నాడు. ముఖం సరిగ్గా కనపడకుండా గుబురు మీసాలు, గడ్డం ఉంది.

గౌతమ్: సరే, నువ్వు కిట్టప్పకి మందు ఎక్కడ తాగించావు? అంత రాత్రి కిట్టప్పని ఎందుకు తీసుకుని వెళ్ళావు? అసలు తను ఎలా చనిపోయాడు?

బబ్లూ: కిట్టప్ప తను పని చేస్తున్న ఆఫీస్ నుంచి రాత్రి ఎనిమిది గంటలకు బయటకు వస్తాడు. అక్కడ నుంచి నేరుగా రోజు అక్కడ ఉన్న ఒక చాట్ సెంటర్ లో చాట్ తింటాడు. అటు తరువాత యం.జీ రోడ్ లో బస్ ఎక్కి వాళ్ళ ఇంటికి వెళతాడు. ఇది అతని దినచర్య. ఆ వివరాలు కూడా నాకు ఆ గడ్డం వ్యక్తే చెప్పాడు. అనుకున్నట్టుగా నేను మాటు వేసి ఒక రోజు కిట్టప్పను గమనించాను. అన్నీ ఆ గడ్డం వ్యక్తి చెప్పినట్టుగానే చేశాడు ఆ కిట్టప్ప. ఇది చాలా సులువైన పని అనుకున్న. కిట్టప్ప ఆఫీస్ నుంచి బయటకు రాగానే.. నేను, నా స్నేహితుడు చిట్టి అతనిని మాటలలో దింపి, అక్కడ మూల మీద ఉన్న పాత హోటల్ బిల్డింగ్ కి తీసుకుని వెళ్ళాం. ఆ హోటల్ గత ఆరు నెలలుగా మూసేసి ఉంది. మేం అప్పుడప్పుడు ఆ హోటల్ వెనుక నుంచి వెళ్ళి అక్కడ తాగుతాం. అలాగే ఆ రోజు నేను, చిట్టి, కిట్టప్పను అక్కడకు తీసుకుని వెళ్ళి, వాడికి ఆయన ఇచ్చిన మందు తాగించాం. దాదాపు రాత్రి పన్నెండు దాటింది. ముగ్గురం కిందకు వచ్చి అక్కడ ఉన్న కేశవ ఆటో మాట్లాడుకుని కిట్టప్ప ఇంటికి వెళ్ళాము. ఆటో ఎక్కినప్పుడు కిట్టప్ప బాగా మత్తుగా తూలుతున్నాడు. వాళ్ళింటికి వెళ్ళేసరికి గుండె పట్టి చచ్చిపోయాడు. అక్కడే ఆ కేశవ గొడవ పెట్టాడు. వాడికి సర్ది చెప్పి రెండు వేలు ఇచ్చాను. తక్కిన డబ్బులు తరువాత ఇస్తాను అని చెప్పి, వాడిని పంపించేశాను.

సిద్దార్థ్: అది సరే, మరి కిట్టప్ప చనిపోతే వాడి ఇంట్లో ఎందుకు ఊరి వేశావు?

బబ్లూ: ఆ కిట్టప్ప సచ్చిపోతే మళ్ళీ అందరూ ఆరా తీస్తారు అని, వాడిని నేను, చిట్టిగాడు కిట్టప్ప ఇంటి పై కప్పు నుంచి ఉరి వేసుకున్నట్టుగా వేలాడదీసి వెళ్ళిపోయాము.

అది విన్న సిద్దార్థ్, గౌతమ్ ఇద్దరు ఆలోచనతో బయటకు వచ్చారు.

# Chapter 19 - In Depth

క్రాంతి: కేపీ, నేను మన దేశంలో ఆలయాలల్లో జరిగిన దొంగతనాల లిస్ట్ మన నేషనల్ డాటాబేస్ నుంచి తీశాను. ఇప్పుడు ఈ పళని చెప్పింది వింటే, దానికి దీనికి ఏదో సంబంధం ఉన్నట్టు అనిపిస్తుంది.

కేపీ: సార్, మీరు చెప్పింది చూస్తే.. మనం ఈ కేస్ లో ఇంకా లోతుగా విచారించి ఒక నిర్ణయానికి రావడం మంచిది. ఇది అంత పెద్ద విషయం అయితే కనుక మనం దీని వెనుక ఉన్న వారెవరో, అసలు జరిగిన అన్నీ దొంగతనాలకు వాళ్ళే కారణమా? లేక ఇలాంటివి అనేక గ్రూప్ లు ఉన్నాయా? అని మనం తేల్చాలి.

క్రాంతి: బాగా చెప్పారు కేపీ, మనం ఈ కేస్ తేలుద్దాం.

అప్పుడే క్రాంతికి సిద్దార్థ్ ఫోన్ చేశాడు.

క్రాంతి (ఫోన్ తీసుకుని): సిద్దార్థ్, ఎలా ఉన్నావు? మా గౌతమ్, నువ్వు కేస్ సాల్వ్ చేశారా? ఇక్కడ మాకు కొన్ని మంచి లీడ్స్ దొరికాయి.

సిద్దార్థ్: క్రాంతి, ఇక్కడ మేము మొత్తం మీద కిట్టప్ప హత్య ఎలా జరిగింది అన్న విషయం తెలుసుకున్నాం కానీ, దాని వెనుక ఉన్నది ఎవరు అని ఇంకొక్క రోజులో తెల్చేస్తాము. ఐ థింక్ వి ఆర్ గోయింగ్ టు సాల్వ్ దిస్ మిస్టరీ.

క్రాంతి: గ్రేట్ న్యూస్ సిద్దార్థ్, త్వరలో మనం ఈ కేస్ సాల్వ్ చేసి కలుద్దాం. థాంక్ యు ఫర్ ఆల్ ద హెల్ప్ అని ఫోన్ కట్ చేశాడు.

***

డాక్టర్ నాగ్ కోపంతో ఊగిపోతున్నాడు. కుప్పుసామికి ఫోన్ చేస్తే తీయడం లేదు. త్వరపడి మురుగన్ మూజికల్స్ కు వెళ్ళడం అంతా మంచిది కాదు. ఇప్పుడు పోలీస్ లు అక్కడ నిఘా పెంచి ఉండవచ్చు అని ఆలోచించి, మళ్ళీ చిన్నకు ఫోన్ చేశాడు.

చిన్న: అన్న, నువ్వు నాకు ఇలా ఇన్నిసార్లు ఫోన్ చేయకు. నాకు అప్పచెప్పిన పని గుర్తు వుంది. నాకు ఏమైనా విషయాలు తెలిస్తే నేనే నీకు ఫోన్ చేస్తాను. నేను మన లక్ష్యం కోసం నా ప్రయత్నం నేను చేస్తాను అని ఫోన్ కట్ చేశాడు.

అనుకున్న ఏ పని సక్రమంగా జరగకపోవడం వలన నాగ్ కి కోపం బీపీ పెరిగిపోతోంది. వెంటనే తన జేబులోనుంచి ఒక టాబ్లెట్ తీసుకుని మింగాడు. పక్కనే ఉన్న ఒక కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాడు.

***

సిద్దార్థ్: గౌతమ్, ఆ గుబురు మీసాలు గడ్డం వ్యక్తి ఎవరై ఉంటారు? నా అనుమానం ప్రకారం అతనికి, ఇక్కడి భారత పురావస్తు శాఖ ఆఫీస్ లో వాళ్ళ ఎవరితోనైనా ఏదో సంబంధం ఉండాలి. లేకుంటే ఎక్కడో చిన్న ఉద్యోగం చేసుకుంటున్న కిట్టప్ప మీద ఇంత ఖర్చు చేసి వర్మను హత్య చేయడం కోసం పంపడం, తరువాత కిట్టప్పను చంపడం కోసం ఇంత ఖర్చు చేయడం.. నాకు ఏదో ఎక్కడో మనం తెలుసుకోలేకపోతున్నాం అని అనిపిస్తుంది.

గౌతమ్: నిజమే సిద్దార్థ్, మనం ఒక సారి బబ్లూ చెప్పిన ఆ బార్ దగ్గర మాటు వేసి, ఆ గుబురు గెడ్డం మీసాల వ్యక్తి ఏమైనా వస్తాడేమో చూస్తే ఎలా ఉంటుంది? ఒక వేళ దొరకితే అతనిని మనం ఇంటరాగేట్ చేస్తే అసలు విషయం బయట పడవచ్చు కదా!

సిద్దార్థ్: గుడ్ ఐడియా, మనం ఇవాళ సాయంత్రం బబ్లూ చెప్పిన బార్ దగ్గర వేచి చూద్దాం.

***

డాక్టర్ నాగ్ అసహనంగా కూర్చుని ఉన్నాడు. ఇంతలో తన ఫోన్ మోగింది. కుప్పుసామి కాల్ చేస్తున్నాడు.

నాగ్: ఏం కుప్పుసామి, నేను అన్నిసార్లు ఫోన్ చేసినా, నువ్వు ఫోన్ తీయడం లేదు. ఏమనుకుంటున్నావు?

కుప్పసామి: డాక్టర్ సార్, మా పళనిని పోలీస్ వాండ్రు పట్టుకునేశారు. వాడు అసలే చాలా భయస్థుడు, వాడికి ఎట్లా మాట్లాడాలో తెలియదు. వాడు ఏమి సేపుతాడో..! దాని వలన మాకు ఏమి కస్టమ్ వస్తాదో..! అని భయంతో మేము మా ఇంటి నుంచి వచ్చి శంకరపల్లి దగ్గర మాకు తెలిసిన వాళ్ళు ఉంటే, అక్కడకు వచ్చినాము. ఇవాళ షాపు కూడా తీయలేదు.

నాగ్: ఏడిసావు, నువ్వు ఇలాంటివి ఏమైనా చేయాలంటే ముందు నన్ను అడగాలి. అసలు నేను చెప్పినది ఏమిటి? నువ్వు చేసినది ఏమిటి? నీ కుర్రాళ్లను నేను మధ్యాన్నం తరువాత వెళ్ళమని చెప్పాను, వాళ్ళు పొద్దున్నే వెళ్ళడం ఒక పెద్ద తప్పు. వాడు, పళని గాడు దొరికిపోవడం ఇంకా పెద్ద తప్పు. నిన్ను పోలీస్ లు ఏమైనా అడిగితే నా పేరు బయటకు వస్తే అదే నీకు ఆఖరి క్షణం, గుర్తు పెట్టుకో. నా పవర్, నెట్వర్క్ నీకు బాగా తెలుసు, జాగ్రత్త. ముందు నువ్వు వెళ్ళి ఏమి తెలియని వాడిలాగా షాప్ తెరిచి కూర్చో అని ఫోన్ కట్ చేశాడు.

***

క్రాంతి తీసిన నేషనల్ డాటాబేస్ లిస్ట్ మిత్రాకు పంపాడు. మిత్ర దానిని మేఘకు ఇచ్చి భారత పురావస్తు శాఖ వాళ్ళ లిస్ట్ లో వాటి వివరాలు తీయమని చెప్పాడు. మేఘ ఆ లిస్ట్ తీసుకుని తన పని మొదలు పెట్టింది.

***

సాయంత్రం అయిదు గంటలకు సిద్దార్థ్, గౌతమ్ ఇద్దరు ఐటి ఉద్యోగులలాగా జీన్స్ ప్యాంట్ లు, టీ షర్ట్ లు వేసుకుని.. భుజానికి చెరొక బాక్పాక్ వేసుకుని బబ్లూ చెప్పిన ఆ బార్ దగ్గర నిలుచున్నారు. ఎవరికి అనుమానం రాకుండా ఉండేందుకు వాళ్ళు ఇద్దరు ఏదో కంప్యూటర్ ప్రోగ్రామ్ గురించి మాట్లాడుతూ నిలుచున్నారు.

కొంత సమయం తరువాత ఒక ఐదున్నర అడుగుల వ్యక్తి నల్ల అద్దాలు పెట్టుకుని తలను కప్పుకునే విధంగా ఒక కోట్ వేసుకుని ఉన్నాడు. అతనికి గుబురు గడ్డం, మీసాలు ఉన్నాయి. అతనిని చూసిన గౌతమ్, సిద్దార్థ్ కు చూపించాడు.

''అతనిని అప్పుడే అనుసరించవద్దు, అసలు ఆ వ్యక్తి మనకు కావలసిన వ్యక్తో కాదో మనకు ఎలా తెలుస్తుంది, కొంచెం వేచి చూద్దాం'' అని సిద్దార్థ్, గౌతమ్ కు చెప్పి, ఇద్దరు ఆ పక్కనే ఉన్న ఒక చెప్పులు అమ్మే షాప్ లోకి వెళ్ళారు.

ఆ షాప్ అద్దాలలోనుంచి చెప్పులు చూస్తున్నట్టుగా ఆ వ్యక్తిని వాళ్ళు గమనిస్తున్నారు. ఇంతలో అక్కడికి ఒక ఆటో వచ్చి ఆగింది. అందులోనుంచి దయానంద్ దిగాడు. ఆటో వాడికి డబ్బులు ఇచ్చి పంపించేసి, మెల్లిగా ఆ బార్ వైపు వెళ్ళాడు.

షాప్ లోనుంచి అదంతా గమనిస్తున్న సిద్దార్థ్, గౌతమ్ ఒకరి ముఖం ఒకరు చూసకున్నారు. గౌతమ్ ముఖానికి ఒక మాస్క్ పెట్టుకుని మెల్లిగా షాప్ లోనుంచి బార్ వైపు వెళ్ళాడు. అక్కడ దయానంద్ ఆ గడ్డం వ్యక్తికి షేక్ హ్యాండ్ ఇవ్వడం చూసి మెల్లిగా వెనుకకు వచ్చి సిద్దార్థ్ కు విషయం చెప్పాడు.

సిద్దార్థ్: గౌతమ్, మనం ఇద్దరం ఒకే చోట ఉండడం అంతా మంచిది కాదు. నేను ఇక్కడ ఉంటాను, మీరు ఈ రోడ్ కు అటువైపు ఉండండి. మనం వాళ్ళను, ముఖ్యంగా ఆ గడ్డం వ్యక్తిని పట్టుకోవాలి.

గౌతమ్: షూర్ సిద్దార్థ్.. మీరు ఇక్కడ ఉండండి, నేను ఆ ఎదురు వైపు ఉన్న సెల్ ఫోన్ షాప్ దగ్గర ఉంటాను. వాళ్ళను గమనించి, అవసరమయితే ఆ గడ్డం వ్యక్తిని పట్టుకుంటాను.

సిద్దార్థ్: గుడ్, వెయిట్ ఫర్ మై సిగ్నల్.

గౌతమ్ మెల్లిగా రోడ్ కు అవతలి వైపు ఉన్న సెల్ ఫోన్ షాప్ దగ్గరకు వెళ్ళాడు.

***

క్రాంతి: కేపీ, ఇప్పుడు ఆ కుప్పసామి ఎక్కడ ఉన్నాడో తెలుసుకోండి. ముందు అతనిని పట్టుకోవాలి, అతను మనకు చాలా కీలకమైన సమాచారం ఇవ్వగలడు.

కేపీ: తప్పకుండా సార్, నేను ఇప్పుడే అతనిని ట్రేస్ చేస్తాను అంటూ తన ఫోన్ తీసుకుని పక్కకు వెళ్ళాడు.

***

వర్మ ఇన్ని రోజుల తరువాత ఇంటికి రావడం ఆనందంగా ఉంది కానీ, తనకు జరిగిన దానికి తాను ఇంక నడవలేకపోవచ్చు అన్న విషయం తెలుసుకుని చాలా బాధపడ్డాడు. వర్మను శాంతపరుస్తోంది నందిని. అప్పుడే అజయ్ వచ్చాడు.

వర్మ: అజయ్, నీకు చాలా ఋణ పడి ఉన్నాను. నువ్వు చేసిన సహాయం నేను మరువలేను. ఆ రోజు నువ్వే లేకుంటే నేను ఏమైపోయేవాడినో! అంటూ కళ్లల్లో నీళ్ళు పెట్టుకున్నాడు.

అజయ్: సార్, మీరు అలా అనవద్దు, నేను నా బాధ్యతగా అది చేశాను. మీరంటే నాకు చాలా గౌరవం, అభిమానం. ఇంతకీ మీ మీద ఈ ఎటాక్ చేసింది ఎవరై ఉంటారు? అసలు దేనివలన ఇంతకు తెగించారు.

వర్మ: లెట్ అస్ నాట్ డిస్కస్ ఎబౌట్ దట్. నా వల్ల నీకు ఏమైనా కీడు జరగవచ్చు, నువ్వు కొంత కాలం నానుండి దూరంగా ఉండు. వీలైతే లాంగ్ లీవ్ తీసుకుని ఎక్కడికైనా వెళ్ళు, ఇక్కడ అంతా సద్దుమణిగాక తిరిగి రావచ్చు. ఆ కెప్టెన్ మనుషులు అంతా మంచి వాళ్ళు కారు, వాళ్ళు మనలో ఒకరిగా ఉండే మనకు ద్రోహం చేస్తారు. జాగ్రత్త! అంటూ ఆయాస పడుతున్నాడు.

అజయ్: సార్, మీరు ఆవేశపడవద్దు. ఆ కెప్టెన్ ఎవరు? ఆ వివరాలు నాకు చెప్పండి, వాడికి తగిన బుద్ధి చెప్తాను.

వర్మ గుండె మీద చేతితో మెల్లిగా రాస్తూ, కొంచెం నీళ్ళు తాగించింది నందిని.

వర్మ: నాకు ఆ కెప్టెన్ ఎవరో తెలియదు కానీ, వాడు ఎంత కిరాతకుడో నాకు అర్థమైయ్యింది. వాడు నాకు ఫోన్ చేసి రెండు సార్లు వార్నింగ్ ఇచ్చాడు. నేను దానిని పట్టించుకోలేదు కానీ, వాడు చెప్పింది చేశాడు.

అజయ్: ఇంతకీ ఆ కెప్టెన్ కు మీ దగ్గర నుంచి ఏమి కావాలంట? మీ దగ్గర అంత విలువైనది ఏమి ఉంది?

వర్మ ఏదో చెప్పాలని ప్రయత్నం చేస్తున్నాడు, ఇంతలో అతనికి బాగా దగ్గు వచ్చింది. నందిని మళ్ళీ నీళ్ళు తాగించింది. వర్మకు ఆయాసం చాలా ఎక్కువగా ఉంది.

నందిని: అజయ్, ఆయనను ఎక్కువ ఇబ్బంది పెట్టకు. ఆయన ఈ విషయం వస్తే చాలా ఎమోషనల్ గా మారుతున్నారు. ఆయన ఇవ్వాళే ఇంటికి వచ్చారు, ఈ విషయం మనం తరువాత కూడా ఆయనను అడగవచ్చు. కొంచెం ఆయనను విశ్రాంతి తీసుకోనివ్వు.

అజయ్ (కొంచెం ఇబ్బందిగా): సరే మేడమ్, నేను ఆ కార్ ఆఫీస్ లో పెట్టి రేపు వస్తాను, సార్ జాగ్రత్త! అని వెళ్ళిపోయాడు.

అప్పుడే క్రాంతి లోపలికి వచ్చాడు.

# Chapter 20 – The progress

అజయ్ వెళ్ళిపోవడం చూసి కేపీ, "అజయ్, వెళ్ళిపోతున్నాడు, మళ్ళీ వస్తాడా?" అని నందినిని అడిగాడు.

నందిని "అజయ్ కార్ ఆఫీస్ లో పెట్టి రేపు వస్తానని వెళ్ళిపోయాడు" అని చెప్పింది.

కేపీ: ఓకే, నందినిగారు మీ వీధిలో ఆ ఎదురుగా ఉన్న విల్లా ముందు ఒక ఖరీదైన ఫారిన్ కార్ ఆగి ఉంది. అది ఎవరిది? అలాంటి కార్ నేను ఇది వరకు ఎప్పుడు చూడలేదు, ఇక్కడే చూస్తున్నాను.

నందిని: ఆ ఇల్లు ఒక ఎన్ ఆర్ ఐ ది, మూడు నెలల క్రితం దానిని ఇక్కడ ఎవరో బిజినెస్ మ్యాన్ కొన్నాడు, దానికి చాలా ఖర్చు పెట్టి రీమోడెల్ చేయించాడు. ఆయనదే ఆ కార్, నాకు ఇంతే తెలుసు అంతకుమించి వాళ్ళు ఎవరు? ఏమిటి? అని తెలియదు. ఈ విషయాలు కూడా నాకు మా నిర్మలమ్మ చెపితే తెలిసాయి.

కేపీ: అంతా పెద్ద విల్లా, రీమోడెలింగ్, అలాంటి ఫారిన్ కార్ ఉన్నాయంటే అతను చాలా పెద్ద బిజినెస్ మ్యాన్ అయి ఉంటాడు. సరే మేడమ్, వర్మ సార్ ని రెస్ట్ తీసుకోమనండి, నేను వెళుతున్నాను. మీకు ఏమైనా అవసరం అయితే నాకు కాల్ చేయండి, ఇక్కడ ఆ ఇద్దరు కానిస్టేబుల్స్ మీకు కాపలా ఉంటారు. దయచేసి వాళ్ళకు ఇవాళ భోజనం మటుకు పెట్టండి. నేను రేపు వస్తాను అని వెళ్ళిపోయాడు.

***

రోడ్ కు అటు, ఇటు సిద్దార్థ్, గౌతమ్ వేచి చూస్తున్నారు. ఒక అరగంట తరువాత దయానంద్ బయటకు వచ్చి ఒక ఆటో మాట్లాడుకుని ఎక్కి వెళ్ళిపోయాడు. ఆ గడ్డం వ్యక్తి బయటకు రాలేదు.

సిద్దార్థ్, గౌతమ్ కు రమ్మని సిగ్నల్ ఇచ్చి తను ఆ బార్ వైపు నడిచాడు. గౌతమ్ కూడా రోడ్ దాటి ఆ బార్ వైపు నడిచాడు. ఇద్దరు బార్ లోపలికి వెళ్ళారు.

అక్కడ పెద్ద శబ్దంగా ఏదో ఇంగ్లీష్ మ్యూజిక్ వస్తోంది. బార్ మొత్తం చిన్న వెలుగులో అంతా చీకటిగా ఉంది. ఒక్కో టేబుల్ దగ్గర నలుగురు, ఐదుగురు కూర్చుని, రకరకాల మత్తు పదార్థాలు తాగుతున్నారు. కొందరు పగలపడి నవ్వుతున్నారు, కొందరు చాలా సీరియస్ గా ఏదో పక్క వాళ్ళకు చెపుతున్నారు. కొంతమంది మత్తుగా పాటలు పాడుతున్నారు. తినే వాళ్ళు తింటున్నారు, తాగే వాళ్ళు తాగుతున్నారు.

ఒక మూల టేబుల్ దగ్గర ఆ గడ్డం వ్యక్తి ఒక్కడే కూర్చుని ఉన్నాడు. అతని ముందు ఒక వాటర్ బాటిల్, గ్లాస్ లో సగం మందు ఉంది. అతడు దానిని తీక్షణంగా చూస్తున్నాడు. సిద్దార్థ్, గౌతమ్ అక్కడకు చేరుకున్నారు.

***

కుప్పుసామి, గోమతి ఇద్దరు వచ్చి మెల్లిగా తమ మురుగన్ మూజికల్స్ షాప్ షట్టర్ తీస్తున్నారు. కుప్పుసామి ఫోన్ మోగింది, ఫోన్ తీసి చూశాడు కుప్పుసామి. కేపీ కాల్ చేస్తున్నాడు.

కుప్పుసామి: సార్, వణక్కమ్. ఏమి సార్ ఫోన్ సేసినారు?

కేపీ: కుప్పుసామి ఎక్కడ ఉన్నావు?

కుప్పుసామి: సార్, ఇయాల మాకు తెలిసిన వాళ్ళ ఇంట్లో పూజ ఉంటే అక్కడికి పోయేసి ఇప్పుడే వచ్చినాము సార్. షాప్ ఇప్పుడుదా తీస్తిమి, సెప్పండి సార్.

కేపీ: సరే, నాకు నీతో కొంచెం పని ఉంది, నువ్వు పోలీస్ స్టేషన్ కు రా.

కుప్పుసామి (అనుమానంగా): ఆ, ఎందుకు సార్? నాతో మీకు ఏమి పని ఉంది సార్?

కేపీ: చెప్పింది చెయ్యి, ఎక్కువ అడగకు. మా స్టేషన్ కు రా అని ఫోన్ కట్ చేశాడు.

కుప్పుసామి: హా మురుగా! అనుకున్నంతా అయ్యింది, ఆ కేపీ పోలీసువాడు రమ్మని చెపుతున్నాడు అంటూ దిగులుగా షాప్ ముందర మెట్ల మీద కూర్చున్నాడు.

గోమతి: ఏన్నాంగో, మీరు ఏమి బాధ పడవద్దు, నేను కూడా మీతో వస్తుంది, ఆ కేపీ వానికి నేను సమాధానం సేపుతాను. మీరు అక్కడ సుమ్మ కూర్సొండి.

కేపీ: సరి, అట్నే కానీ.

***

నందిని వర్మ తినడానికి వీలుగా అన్నం కలిపి ఒక బౌల్ లో పెట్టి ఇచ్చింది. వర్మ మెల్లిగా స్పూన్ పెట్టి తింటున్నాడు. అప్పుడే నిర్మలమ్మ వచ్చింది.

నిర్మలమ్మ: అమ్మ, ఇవాళ ఇంట్లో అన్నీ పనులు అయిపోయినాయి, బయట ఉన్న కానిస్టేబుల్స్ కి కూడా అన్నం వండేసాను. నేను వెళుతున్నాను, మళ్ళీ రేపు ఉదయం త్వరగా వస్తాను. మా చిన్నదానికి జ్వరంగా ఉన్నది, దానిని డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళాలి.

నందిని, నిర్మలమ్మకి ఒక పదేహేను వందల రూపాయలు ఇచ్చింది.

నందిని: నిర్మలమ్మ నువ్వు ఈ డబ్బులు కావాలంటే వాడుకో. ఒక వేళ డబ్బులు మిగిలితే రేపు వచ్చేటప్పుడు ఏమైనా కూరగాయలు తీసుకుని రా.

నిర్మలమ్మ: అలాగే అమ్మ, నాకు ఏమి ఖర్చు ఉండదు. అంతా నా పెద్ద కూతురే చూసుకుంటుంది. వెళ్లొస్తానమ్మ అని వెళ్ళిపోయింది.

నందిని రజనీ కి ఫోన్ చేసింది.

***

బార్ లోకి వెళ్ళిన సిద్దార్థ్, గౌతమ్ ఆ గడ్డం వ్యక్తి ముందు నిలుచుని చూస్తున్నారు. ఆ వ్యక్తి ఎటువంటి స్పందన లేకుండా అక్కడ అలాగే కూర్చుని ఉన్నాడు.

గౌతమ్ కి అనుమానం వచ్చి అతనిని ‘‘హలో మిస్టర్’’ అని పిలిచాడు.

అతని వద్ద నుండి ఎటువంటి స్పందన లేదు. సిద్దార్థ్ అతనిని తట్టి చూశాడు. అతను అలా ఆ పక్క కుర్చీలోకి ఒరిగిపోయాడు. అతను ప్రాణంతో లేడు అని తెలుసుకున్నారు గౌతమ్, సిద్దార్థ్.

సిద్దార్థ్: ఈ బార్ మేనేజర్ ఈ టేబుల్ వైటర్ ఎవరు ఇటు రండి. నేను ఏసిపి సిద్దార్థ్ అని గట్టిగా అన్నాడు.

వెంటనే అక్కడికి ఆ బార్ మేనేజర్, ఆ టేబుల్ వైటర్ వచ్చారు. సిద్దార్థ్ వాళ్ళని ప్రశ్నిస్తున్నాడు.

సిద్దార్థ్: ఇతను ఇక్కడ ఏమి ఆర్డర్ ఇచ్చాడు? ఈయన ఇప్పుడు చనిపోయాడు. ఇతనితో పాటు ఇంకెవరైనా ఉన్నారా? లేక ఈయనతో పాటు ఇంకెవరైనా ఇంతకు ముందు కలిసి వెళ్ళారా?

బార్ మేనేజర్: సార్ ఈయన మా రెగ్యులర్ కస్టమర్. దాదాపు మూడు సంవత్సరాల నుండి వస్తున్నారు. ఇది ఆయన పెర్మినెంట్ టేబుల్, రోజు ఇక్కడే కూర్చుంటారు. ఆయనకు ఎవరు స్నేహితులు లేరు, ఆయన ఒక్కడే వచ్చి తాగి వెళ్ళిపోతారు.

బార్ వైటర్: సార్, ఆయన ఎప్పటి లాగానే ఇవాళ కూడా రెండు లార్జ్ విస్కీ ఆర్డర్ ఇచ్చారు, దానితో పాటు ఉడకపెట్టిన పల్లీలు అడిగారు అంతే.

గౌతమ్: ఇవాళ ఆయనతో పాటు ఇంకెవరైనా రావడం చూశావా? మాట్లాడడం, పోనీ కలవడం.

బార్ వైటర్: సార్ నేను నాలుగు టేబుల్స్ చూసుకోవాలి, చాలా బిజీ. ఈ సార్ ఆర్డర్ తీసుకుని వెళ్ళాను తెచ్చి ఇచ్చాను, నాకు అంతే తెలుసు. నేను ఆర్డర్ తీసుకున్నప్పుడు ఇచ్చినప్పుడు ఆయన ఒక్కరే ఉన్నారు.

సిద్దార్థ్: ఇక్కడ సి.సి.టివి కేమెరాలు ఉన్నాయా? మేము చూడాలి.

బార్ మేనేజర్: సారీ సార్, సి.సి.టివి కేమెరాలు కేవలం బార్ బయటనే ఉన్నాయి, లోపల లేవు.

సిద్దార్థ్: డామిట్, సి సి.టివి కేమెరాలు లేకుండా ఎలా బార్ నడుపుతున్నారు?

బార్ మేనేజర్: సార్, అవసరం అనిపించలేదు. మా ఓనర్ పెట్టించలేదు.

సిద్దార్థ్: సరే, ఆ బయట సి.సి.టివి ఫుటేజ్ చూపించు.

బార్ మేనేజర్: రండి సార్ చూపిస్తాను.

సిద్దార్థ్: గౌతమ్ మీరు ఇక్కడే ఉండండి, నేను మన వాళ్ళకు ఫోన్ చేసి పిలుస్తాను. మీరు అంబులెన్స్ కు ఫోన్ చేయండి.

***

కుప్పుసామి, గోమతి పోలీస్ స్టేషన్ ముందు ఆటో దిగి లోపలికి వచ్చారు. అక్కడ స్టేషన్ లో ఒక హెడ్ కానిస్టేబుల్ దగ్గరకు వెళ్ళారు.

కుప్పుసామి: సార్, నా పేరు కుప్పుసామి. నన్ను కేపీ సార్, అదే కృష్ణ ప్రసాద్ సార్ పిలిపించారు. కొంచెం ఆయన ఎక్కడ ఉన్నారో చెపుతారా?

హెడ్ కానిస్టేబుల్: మీరు అక్కడ కూర్చోండి, సార్ పని మీద బయటకు వెళ్ళారు, వస్తారు.

కుప్పుసామి: సరే సార్, అని గోమతితో వెళ్ళి అక్కడ ఉన్న బల్ల మీద కూర్చున్నారు.

***

నందిని ఫోన్ చేసి రజనీని ఇంటికి పిలిచింది.

నందిని: రజనీ, నాకెందుకో ఎవరిని చూసినా అనుమానంగా ఉంది. ఎవరు మనవాళ్ళో, ఎవరు ఆ కెప్టెన్ మనుషులో అర్థం కావడం లేదు. పోను పోను నాకు అందరి మీద అనుమానం పెరిగిపోతోంది.

రజనీ: నందిని, అలా అనవసరంగా బాధపడకు. నా మాట విని కొన్ని రోజుల పాటు ఇంటికి ఎవరిని అనవసరంగా రానివద్దు, వర్మ గారు బాగా రికవర్ అయిన తరువాత మనం ఆలోచిద్దాం.

నందిని: అజయ్, వర్మ గారితో పని చేసినందుకు తనకు కూడా ఏమైనా జరగవచ్చు. అందుకే వర్మ గారు అజయ్ ను లాంగ్ లీవ్ తీసుకోమని చెప్పారు.

రజనీ: గుడ్, అది అతనికి మంచిది. సరే నన్ను అర్జెంట్ గా రమ్మని చెప్పావు ఎందుకు?

నందిని: ఏమి లేదు, ఈ రెడ్ బాగ్ మళ్ళీ నువ్వు తీసుకుని వెళ్ళు. నేను చెప్పేంత వరకు దీనిని తీసుకుని రాకు.

రజనీ: ఏమిటిది నందిని? ఈ బాగ్ ఎప్పుడు కాళీగా ఉంటుంది కానీ, దానిని తీసుకురమ్మంటావు. మళ్ళీ తీసుకుని వెళ్ళమంటావు, ఏమిటిదంతా?

నందిని: నీకు నేను తరువాత చెప్తానులే, వర్మ గారు ఇప్పుడు నిద్రపోతున్నారు. ఎప్పుడైనా తీరికగా అన్నీ మాట్లాడుకుందాం, నేను చెప్పినది మటుకు నువ్వు గుర్తు పెట్టుకో, ఈ బాగ్ జాగ్రత్త. సరే ఇంకా నువ్వెళ్ళు, మళ్ళీ ఆలస్యమతుంది.

రజనీ.. ఆ రెడ్ బాగ్ తీసుకుని వెళ్ళిపోయింది.

# Chapter 21 - The loop

ఒక పది నిముషాల్లో ముగ్గురు పోలీసులతో పాటు ఒక అంబులెన్స్ వచ్చింది. ఆ వచ్చిన పోలీస్ లు గౌతమ్ కు సెల్యూట్ చేశారు. హాస్పిటల్ బాయ్స్ వచ్చి అక్కడ ఉన్న ఆ గడ్డం వ్యక్తిని ఒక స్ట్రెచర్ మీదకు చేర్చారు. ఇద్దరు పోలీసులు ఆ స్ట్రెచర్ తో పాటు అంబులెన్స్ దగ్గరకు వెళ్ళారు. అప్పుడే బార్ బయటకు వచ్చిన సిద్దార్థ్ కు, ఆ పోలీసులు సెల్యూట్ చేశారు.

సిద్దార్థ్: వెంటనే ఇతనిని హాస్పిటల్ కు తీసుకువెళ్ళి ట్రీట్మెంట్ చేయించండి అదృష్టం ఉంటే, బతుకుతాడు లేకుంటే పోస్టుమార్టం చేయించండి.

ఆ పోలీసులు మళ్ళీ సిద్దార్థ్ కి సెల్యూట్ చేసి అంబులెన్స్ లోకి.. ఆ గడ్డం వ్యక్తిని ఎక్కించి దానితో పాటు వెళ్ళిపోయారు.

గౌతమ్, సిద్దార్థ్ ఇద్దరూ లోపల ఉన్న సిసిటివి రికార్డింగ్ చూస్తున్నారు. దయానంద్ బార్ లోకి వెళ్ళేటప్పుడు ఆ గడ్డం వ్యక్తి అక్కడే ఉన్నాడు. ఇద్దరూ ఒకరికొకరు షేక్ హ్యాండ్ ఇచ్చుకున్నారు. తరువాత ఎవరి మటుకు వారు లోపలకి వెళ్ళారు. లోపలికి వెళ్ళినవారు లోపల మళ్ళీ కలిశారా? లేక విడివిడిగా ఉన్నారా? అన్న విషయం తెలియలేదు.

సిద్దార్థ్ బార్ మేనేజర్ ని పిలిచి: ఈ వీడియోలో కనపడే వ్యక్తి, ఈ గడ్డం వ్యక్తి లోపల ఒకరినొకరు కలిశారా?

బార్ మేనేజర్: సారి సార్, నేను ఆ అయిదో నెంబర్ టేబుల్ దగ్గర వాళ్ళు ఎక్కువ గొడవ చేస్తుంటే, ఏమయ్యిందో అని అక్కడకు వెళ్ళాను. వాళ్ళలో ఒకడు కొంచెం మత్తు ఎక్కువై ఒక గ్లాస్ పగలగొట్టాడు, దానికి ఆ టేబుల్ వైటర్ అతను కొంచెం వాదులాడుకున్నారు. నేను వాళ్ళకు సర్ది చెప్పి కిచెన్ లోకి వెళ్ళాను, నాకు అంతే తెలుసు.

ఇంతలో ఇంకో వైటర్ వచ్చి "సార్ ఇతను వేరే టేబుల్ దగ్గర కూర్చున్నాడు, ఆ గడ్డం వ్యక్తితో కాదు. ఆయనకు నేనే ఒక బీర్ ఇచ్చాను, ఆయన అది తాగి వెంటనే డబ్బులు చెల్లించి చిల్లర కూడా తీసుకోకుండా వెళ్ళిపోయాడు" అని చెప్పాడు.

సిద్దార్థ్, గౌతమ్ ఇద్దరు ఒకరినొకరు చూసుకున్నారు.

సిద్దార్థ్ బార్ మానేజర్ తో "మేము మళ్ళీ వస్తాము, అంతవరకు మా కానిస్టేబుల్ ఇక్కడే ఉంటాడు, మీరు ఇవాళ్టికి బార్ క్లోజ్ చేయండి" అని అన్నాడు.

బార్ మేనేజర్: సరే సార్, అలాగే కానివ్వండి. మేము ఇంకో అరగంటలో బార్ క్లోజ్ చేస్తాము.

సిద్దార్థ్, గౌతమ్ ఇద్దరు బయటకు వెళ్ళారు.

***

కేపీ అప్పుడే పోలీస్ స్టేషన్ లోకి వచ్చాడు. కేపీని చూసి కుప్పుసామి, గోమతి ఇద్దరు లేచి నిలుచున్నారు. కేపీ వాళ్ళను చూసి, తన రూమ్ లోకి రమ్మన్నాడు. అందరూ లోపలికి వెళ్ళారు.

కేపీ: ఏం కుప్పుసామి, మీ మ్యూజిక్ దరువు తాళం తప్పుతోంది. మ్యూజిక్ ఇన్స్ట్రుమెంట్స్ అమ్మడం తగ్గించి.. దోపిడీలు, దొంగతనాలు, మర్డర్ ల బిజినెస్ మొదలుపెట్టవా?

కుప్పుసామి: సార్.. మీరు ఏమి సెపుతున్నారో నాకు అర్థం అవ్వడంలేదు.

కేపీ: నిన్ను లోపలేసి అర్థమయ్యేటట్టు చేయమంటావా?

గోమతి: అయ్యో సారు! మేము ఏదో సంగీతం మీద ఉన్న ఇష్టంతో వ్యాపారం సేసుకుంటున్నాం, మీరు ఏమి ఏమి సెపుతున్నారు సారు.

కేపీ: మీ దగ్గర పనిచేసే పళని మాకు దొరికాడు, వాడు ఇప్పటివరకు చేసిన అన్నీ వెధవ పనుల చిట్టా మొత్తం మా చేతికి ఇచ్చాడు. అది చాలా? లేక మిమ్మల్ని లోపల వేసి ఎంక్వైరీ చేమంటారా?

గోమతి: అయ్యో మురుగా, నేను ఎంత సెప్పినా వినకుండా మా అప్ప ఆ పళనిని మా దగ్గర పనిలో పెట్టాడు, వాడు ఇట్లాంటి వెధవ పనులు సేస్తాడు అని మేము యోసికలే సారు.

కేపీ: నేను వాడు వెధవ పనులు చేశాడు అని మాత్రమే చెప్పాను, నీకేం తెలుసు వాడు ఏమి ఏమి చేశాడో చెప్పు.

అక్కడే ఉన్న కానిస్టేబుల్ తో కేపీ: ఇదిగో ఈశ్వర్, దుర్గావతిని రమ్మని చెప్పు, ఈవిడతో తనైతేనే సరిగ్గా మాట్లాడుతుంది.

ఈశ్వర్: ఎస్ సార్, ఇప్పుడే పిలుస్తాను అని, బయటకు వెళ్ళాడు.

కేపీ: కుప్పుసామి నువ్వు ఇక్కడ కూర్చో, మీ ఆవిడతో మా దుర్గావతి మాట్లాడుతుంది.

కుప్పుసామి భయపడుతూ అక్కడ కూర్చున్నాడు. ఒక లావుపాటి ఎత్తుగా ఉన్న ఒక ఆడ పోలీస్ కానిస్టేబుల్ లోపలికి వచ్చింది. చేతిలో లాఠీతో చూడడానికే కొంచెం గంభీరంగా ఉన్నది.

దుర్గావతి: సార్ పిలిచారంట.

కేపీ: అవును దుర్గావతి, ఈవిడను తీసుకువెళ్ళి కొంచెం ఆ పళని గురించి విచారించు.

దుర్గావతి: సరే సార్. రండమ్మా నాతో పాటు అని, గోమతిని తనతో తీసుకుని వెళ్ళింది.

***

నాగ్ మళ్ళీ ఫోన్ చేశాడు, ఇప్పుడు తను చేసినా ఫోన్ ఎంగేజ్ వస్తోంది. విసుగుగా ఫోన్ పక్కన పెట్టాడు. కొద్ది సేపటి తరువాత నాగ్ ఫోన్ మొగుతోంది. చిన్న కాలింగ్ అని కనపడుతోంది. నాగ్ ఫోన్ కాల్ తీశాడు.

నాగ్: ఏమిటి చిన్న, ఈ మధ్య నీ ఫోన్ కూడా ఎంగేజ్ వస్తోంది ఏమిటి సంగతి?

చిన్న: లేదు అన్న, నేను మన పని గురించే ఇంకొకరి దగ్గర కొంత సమాచారం కోసం ఫోన్ మాట్లాడుతున్నా. చెప్పండి.

నాగ్: సరే సరే, ఆ పళని గాడు దొరికాడు. ఇప్పుడు ఆ కుప్పుసామి, వాడి భార్య ఇద్దరూ పోలీస్ స్టేషన్ లో ఉన్నారు. వాళ్ళు ఏమి వాగి ఇరుక్కుంటారో అని నాకు టెన్షన్ గా ఉంది. నువ్వు ఏదైనా చేయి.

చిన్న: మీరు రిలాక్స్ అవ్వండి అన్న, నేను ఏమి చేయాలో చూస్తాను. ఏది కాకపోతే కెప్టెన్ కు పని అప్పచెప్తాను, ఆయన తన పలుకుబడి, పనితనం ఉపయోగించి ఏమైనా చేయగలరు.

నాగ్: సరే చూడు కానీ, మనకు మట్టి అంటకూడదు అని ఫోన్ పెట్టేశాడు.

***

రజనీ తన ఇంటికి వెళ్ళింది, సోఫాలో కూర్చుని ఆలోచిస్తోంది 'నందిని నా దగ్గర ఏ విషయం దాచలేదు కానీ, ఈ రెడ్ బాగ్ విషయం ఏమిటో నాకు అంతు పట్టడంలేదు. నాతో పాటు తను ఇది వరకు ఫారిన్ టూర్ వచ్చినప్పుడు కూడా రెండు మూడు సార్లు ఆ రెడ్ బాగ్ చూశాను. ఏదో తన బాగ్ అనుకున్నా కానీ, దీనికి అంత ఇంపార్టెన్స్ ఏమిటో! ఏది ఏమైనా తను నన్ను నమ్మి నాకు ఇచ్చిందంటే చాలా ఇంపార్టెంట్ అనుకుంటాను. తానే నాకు అన్నీ వివరంగా చెప్తాను అన్నదిగా. చూద్దాం నేను దానిని భద్రంగా దాచి పెడతాను' అని అనుకుంటూ కిచెన్ లోకి వెళ్ళింది.

బయట ఎవరో బెల్ కొడుతున్నారు.

రజనీ: ఇంత ఆలస్యంగా నా ఇంటికి ఎవరు వస్తారు? సంథింగ్ ఫిషి.

వెంటనే తన మొబైల్ లో ఒక యాప్ తీసి, ఇంటి అన్నీ తలుపులు లాక్ చేసింది. తన మొబైల్ మెయిన్ తలుపు సిసిటివి కెమెరాను ఫోకస్ చేసింది. ఎవరో తెలియని ఇద్దరు వ్యక్తులు ఇంటి ముందు ఉన్నారు. వాళ్ళు బెల్ కొడుతున్నారు. రజనీ వాళ్ళను చూసి వెంటనే తన ఇంట్లో ఉన్న పానిక్ బటన్ ఒత్తింది. అంతే అది పెద్ద శబ్దం చేస్తూ, ఇంటి చుట్టూ పెద్ద పెద్ద లైట్ లు వెలగడం మొదలు అయ్యింది. వెంటనే ఆ వచ్చిన వాళ్ళు ఇద్దరూ పరిగెత్తి వెళ్ళిపోయారు. కొంతసేపటి తరువాత పానిక్ బటన్ ఆఫ్ చేసి, వెంటనే కేపీకి ఫోన్ చేసి అక్కడ జరిగింది చెప్పింది రజనీ.

కేపీ: గుడ్ మేడమ్. మీరు సేఫేగా, మీకు ఏమైనా హెల్ప్ కావాలంటే నాకు చెప్పండి, నేను మా పెట్రోలింగ్ వాళ్ళను మీ ఏరియాలో తిరగమని చెప్తాను. మీరు రిలాక్స్ అవ్వండి అని ఫోన్ కట్ చేశాడు.

***

సిద్దార్థ్ ఫోన్ మొగుతోంది. ఫోన్ ఆన్సర్ చేశాడు.

సిద్దార్థ్ ఫోన్ లో "సార్ నేను డాక్టర్ ప్రదీప్, ఈ గడ్డం వ్యక్తి హాస్పిటల్ కి వచ్చే ఒక పది, పదిహేను నిముషాల ముందే కార్డియాక్ అరెస్ట్ తో చనిపోయాడు. మేము పోస్టుమార్టం చేస్తున్నాం, రేపు ఉదయం మీకు రిపోర్ట్ పంపుతాము" అని ఫోన్ పెట్టేశాడు.

సిద్దార్థ్ తల పట్టుకున్నాడు. పక్కనే ఉన్న గౌతమ్ కు విషయం చెప్పాడు.

గౌతమ్: ఈ కేస్ సాల్వ్ అయ్యింది అనుకుంటే మళ్ళీ మొదటికి వచ్చింది. ఇప్పుడు మనకు ఏది త్రోవ?

సిద్దార్థ్: మనం దయానంద్ ను కలిసి విషయం తెలుసుకోవాలి, రేపు మొదటి పని అది. ఆ పని అయ్యేలోపల ఈ గడ్డం వ్యక్తి పోస్ట్ మార్టం రిపోర్ట్ వస్తుంది.

ఇద్దరు మెల్లిగా నడుచుకుంటూ దూరంగా పార్క్ చేసిన వాళ్ళ కార్ దగ్గరకు వెళ్ళారు.

# Chapter 22 - The Poison

మర్నాడు ఉదయాన్నే కాఫీ తాగుతూ తన ఇంటి బయట వేసిన న్యూస్ పేపర్ తీసుకున్నాడు సిద్దార్థ్.

మెయిన్ పేజ్ లో హెడ్లైన్ "నగరంలోని ప్రముఖ బార్ లో వ్యక్తి మరణం, హత్యగా భావిస్తున్న పోలీసులు."

ఆ వార్త చూడగానే సిద్దార్థ్ కి చాలా కోపం వచ్చింది.

'ఈ పత్రికల వాళ్ళకి ఏది దొరికినా దానిని పెద్ద వార్త చేసి ముద్రిస్తారు' అని అనుకుంటూ గౌతమ్ కి ఫోన్ చేశాడు.

గౌతమ్: గుడ్ మార్నింగ్ సిద్దార్థ్, నేను ఇంకో పది నిముషాలలో రెడీగా ఉంటాను.

సిద్దార్థ్: గౌతమ్, మీరు ఇవాళ న్యూస్ పేపర్ చూశారా? నిన్న బార్ డెత్ గురించి వేశారు, దీనిని అనవసరంగా ఈ న్యూస్ పేపర్ వాళ్ళు ఎక్కువ చేసి ప్రచురిస్తున్నారు. నేను ఒక అరగంటలో మీ దగ్గరకు వస్తాను, బి రెడీ.

సిద్దార్థ్ తో మాట్లాడుతూ గౌతమ్ టీవి ఆన్ చేశాడు, అందులో కూడా నిన్నటి బార్ ని చూపిస్తూ, ఒక న్యూస్ యాంకర్ "ఇక్కడే ఆ మరణం జరిగింది కానీ, పోలీసులు దానిని ఒక హత్యగా భావిస్తున్నారు" అని చెపుతోంది.

గౌతమ్: సిద్దార్థ్, టీవి న్యూస్ లో కూడా అదే చూపిస్తున్నారు. మన కొంచెం త్వరపడాలి అని ఫోన్ కట్ చేశాడు.

***

రాత్రంతా పోలీస్ స్టేషన్ లో కుప్పుసామి, గోమతి ఉన్నారు. ఇద్దర్ని వేరే వేరే గదులలో ఉంచి తెల్లవారి నాలుగు గంటల వరకు పోలీసులు ప్రశ్నించారు. ఆ తరువాత వాళ్ళను ఆ గదులలోనే నిద్రపోమ్మన్నారు. ఉదయాన్నే కేపీ పోలీస్ స్టేషన్ కు వచ్చాడు.

దుర్గావతి: జై హింద్ సార్, రాత్రి నేను ఆ గోమతిని రకరకాలుగా ప్రశ్నించాను. ఆమె చెప్పేది ఒక్కటే, ఆ పళని తనకు వాళ్ళ నాన్న ద్వారా తెలుసు. వాళ్ళ ఊరిలో వాడు జులాయిగా తిరుగుతుంటే, వాడిని వీళ్ళ దగ్గర పనిలో పెట్టాడని. అంతకుమించి ఆ పళని గురించి తనకు ఏమి తెలియదు అని చెప్పింది కానీ, వాడు ఇక్కడ చేస్తున్న పనులు ఏమైనా తెలుసా అంటే, దానికి వాడు ఎప్పుడూ ఏదో ఒక సాకు చెప్పి పని ఎగ్గొట్టి బయట తిరుగుతాడని, వాడికి తోడుగా మంచివాడైన ప్రభాకర్ ని కూడా తిప్పుతాడు అని చెప్పింది.

కేపీ: ఆ ప్రభాకర్ వివరాలు తీసుకోండి, వాడికి ఫోన్ చేసి ఇక్కడకు రప్పించండి.

దుర్గావతి: సరే సార్ అని సెల్యూట్ చేసి వెళ్ళిపోయింది.

ఈశ్వర్ రాత్రి మరో ఇద్దరు కానిస్టేబుల్స్ తో కలిసి కుప్పుసామిని విచారించారు. ఈశ్వర్ కేపీ వద్దకు వచ్చాడు.

ఈశ్వర్ కేపీ కి సెల్యూట్ చేసి: జై హింద్ సార్, రాత్రి మేము ఆ కుప్పుసామిని విచారించాము అని అంతా దుర్గావతి చెప్పినట్టుగానే తను కూడా చెప్పాడు.

కేపీ: హు, అంటే ఇద్దరు ఇక్కడకు వచ్చేముందు బాగా ప్రిపేర్ అయ్యారు. సరే, వాళ్ళకి తినడానికి ఏమైనా ఇచ్చి, వాళ్ళను ఇవాళ ఇక్కడే ఉండనివ్వండి. నేను ఏం చేయాలో తరువాత చెప్తాను, ఆ రెండోవాడు ప్రభాకర్ ను పిలిపించమని చెప్పాను. వాడు వస్తే నాకు చెప్పండి అని తను బయటకు వెళ్ళిపోయాడు.

***

సిద్దార్థ్, గౌతమ్ ఇద్దరు భారత పురావస్తు ఆఫీస్ కు వెళ్ళారు. అప్పుడే అందరూ ఆఫీస్ కు వస్తున్నారు.

వాళ్ళను చూసిన రిసెప్షనిస్ట్ చంద్రిక "సార్, గుడ్ మార్నింగ్ ఇలా వచ్చారు ఎవరు కావాలి?" అంది.

సిద్దార్థ్: గుడ్ మార్నింగ్, మేము ఇవాళ దయానంద్ గారిని కలవాలి, కొంచెం పిలిపిస్తారా?

చంద్రిక: దయానంద్ గారు ఇంకా రాలేదు, మీరు ఇక్కడ కూర్చోండి. ఆయన వచ్చే టైమ్ అయ్యింది అని అక్కడ ఉన్న సోఫా చూపించింది.

సిద్దార్థ్, గౌతమ్ అక్కడ కూర్చున్నారు.

ఒక పదిహేను నిముషాల తరువాత దయానంద్ ఆఫీస్ కు వచ్చాడు. గౌతమ్, సిద్దార్థ్ లను చూశాడు.

దయానంద్: గుడ్ మార్నింగ్ జెంటిల్ మెన్, ఏమిటి ఇలా వచ్చారు?

సిద్దార్థ్: గుడ్ మార్నింగ్, మేము మీ కోసమే వచ్చాము. కెన్ వి మీట్ అండ్ డిస్కస్ నౌ?

దయానంద్: షూర్, పదండి నా ఆఫీస్ లో కూర్చుని మాట్లాడుకుందాం. చంద్రిక మా ముగ్గురికి కాఫీ పంపమని చెప్పండి అని సిద్దార్థ్, గౌతమ్ ను తీసుకుని లోపలికి వెళ్ళాడు.

***

నందిని, రజనీకి ఫోన్ చేసి రమ్మని చెప్పింది. రజనీ మధ్యాన్నం వస్తానని చెప్పింది.

***

కేపీ నేరుగా వర్మ ఇంటి ముందు తన బైక్ ఆపాడు. అక్కడ నుంచి ఆ ఇంటికి ఎదురుగా కొంత దూరంలో ఉన్న విల్లా దగ్గరకు వెళ్ళాడు. ఆ ఫారిన్ కార్ ఆ విల్లా లోపల పార్క్ చేసి ఉంది. దాని పక్కన మరో రెండు ఖరీదైన కార్ లు ఉన్నాయి. ఇంటి లోపలికి వెళ్ళాలని ప్రయత్నం చేశాడు కానీ, అక్కడ ఒక పెద్ద జర్మన్ షేపర్డ్ కుక్క ఉంది. అది కేపీని చూసి అరవడం మొదలు పెట్టింది. అంతలో ఒక పనివాడు వచ్చి దానిని ఊరుకో బెట్టి "సార్, ఎవరు కావాలి మీకు?" అని అడిగాడు.

కేపీ: నేను పోలీస్ ఇన్స్పెక్టర్ కృష్ణ ప్రసాద్, నేను ఈ ఇంటి యజమానిని కలవాలి.

పనివాడు: సార్ యోగా చేయడానికి వెళ్ళారు. మీరు లోపల కూర్చోండి, ఆయన ఇప్పుడు వచ్చేస్తారు అంటూ తలుపు తెరిచి లోపలికి తీసుకుని వెళ్ళాడు.

***

దయానంద్ ఆఫీస్ రూమ్ లో సిద్దార్థ్, గౌతమ్ దయానంద్ కు ఎదురుగా కూర్చున్నారు. వాళ్ళకు అప్పుడే ఒక ఆఫీస్ బాయ్ కాఫీ తెచ్చి ఇచ్చాడు.

సిద్దార్థ్: దయానంద్ గారు, మేము నిన్న సిటీలో జరిగిన ఒక మరణం హత్యగా భావిస్తున్నాం, దాని గురించి మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగాలి.

దయానంద్: ఇంట్రెస్టింగ్, సిటీలో ఎక్కడో జరిగిన ఒక మరణం మీరు హత్యగా భావించి, నన్ను ప్రశ్నలు అడగడం విచిత్రం.

గౌతమ్ : ఎస్ ఇంట్రెస్టింగ్.. ఎందుకంటే, ఆ మరణం, హత్య జరిగే ముందే మీరు అక్కడ ఉన్నారు. ఆ చనిపోయిన వ్యక్తిని కలిశారు. అందుకే మేము ఇక్కడకు వచ్చాము.

దయానంద్: మీరు ఏమి మాట్లాడుతున్నారు? నేను కలవడం ఏమిటి? ఆ వ్యక్తి చనిపోవడం ఏమిటి?

సిద్దార్థ్ తన మొబైలు ఫోన్ లో ఆ ముందు రోజు బార్ ద్వారం దగ్గర దయానంద్, ఆ గడ్డం వ్యక్తి షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడం చూపించాడు.

సిద్దార్థ్: ఇప్పుడు చెప్పండి, ఆ చనిపోయిన వ్యక్తి ఆ గడ్డం వ్యక్తే.

దయానంద్: ఓ మై గాడ్, ఇతను చనిపోయాడా? వాట్ ఏ సర్ప్రైస్. అతను ఎవరో నాకు తెలియదు కానీ, నేను రెగ్యులర్ గా వెళ్ళే ఆ బార్ లో ఎప్పుడు ఒకే చోట కూర్చుని ఒక్కడే తాగుతాడు. నాకు అంతవరకే తెలుసు. మేము కొన్ని సంవత్సరాల నుంచి అదే బార్ వెళ్ళడం వలన ఆయనకు నేను, నాకు అతను అలా షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటాము అంతే. అంతకుమించి మాకు ఎటువంటి పరిచయం లేదు. నాకు కనీసం అతని పేరు కూడా తెలియదు.

సిద్దార్థ్ ఫోన్ మోగింది, దానిని రెండు సార్లు కట్ చేశాడు. అయినా మరలా మోగింది.

దయానంద్: మీకు ఎవరో కాల్ చేస్తున్నారు, ఇంపార్టెంట్ అనుకుంటాను. యు కన్ టేక్ ది కాల్.

సిద్దార్థ్ మళ్ళీ ఫోన్ కట్ చేసి, ''థాంక్ యు, మాకు ఎటువంటి వివరాలు కావాలన్న మీ దగ్గరకు మళ్ళీ వస్తాము. థాంక్ యు ఫర్ ది కాఫీ'' అని గౌతమ్ తో కలిసి బయటకు వెళ్ళిపోయాడు.

సిద్దార్థ్ కు డాక్టర్ ప్రదీప్ ఫోన్ చేస్తున్నాడు, ఆన్సర్ చేశాడు సిద్దార్థ్.

''సార్, నేను డాక్టర్ ప్రదీప్. నిన్న చనిపోయిన ఆ గడ్డం వ్యక్తి గురించి మీతో మాట్లాడాలి, మీరు హాస్పిటల్ కు రండి.''

సిద్దార్థ్: షూర్, ఒక గంటలోపు అక్కడకు వస్తాను అని ఫోన్ కట్ చేశాడు.

సిద్దార్థ్: గౌతమ్ మనం హాస్పిటల్ కు వెళ్ళాలి, డాక్టర్ ప్రదీప్ ఫోన్ చేశారు.

***

గోమతి దగ్గర ప్రభాకర్ ఫోన్ నెంబర్ తీసుకుని కాల్ చేసింది దుర్గావతి. మూడు సార్లు చేసినా వాడు తీయలేదు.

దుర్గావతి, గోమతితో: ఆ ప్రభాకర్ ఎక్కడ ఉంటాడు? వాడి అడ్రస్ చెప్పు.

గోమతి: వాడు నాగోల్ దగ్గర వాళ్ళ ఫ్రెండ్ ఇంట్లో ఉంటాడు, నాకు అంతే తెలుసు.

దుర్గావతి ఆ ఫోన్ నెంబర్ ఈశ్వర్ కు ఇచ్చింది, ''సార్, ఆ ప్రభాకర్ ఫోన్ తీయడం లేదు. గోమతిని అడిగితే, వాడు నాగోల్ దగ్గర ఉంటాడు అంటోంది. మీరు చూడండి సార్ వాడి విషయం'' అంది.

ఈశ్వర్: సరే నేను చూసుకుంటాను.

***

రజనీ వర్మ ఇంటికి వచ్చింది, బయట కేపీ బైక్ చూసింది. తను లోపల ఉండవచ్చు అనుకుని లోపలికి వెళ్ళింది.

***

సిద్దార్థ్, గౌతమ్ హాస్పిటల్ కు వెళ్ళారు. అక్కడ డాక్టర్ ప్రదీప్ ను కలిశారు.

డాక్టర్ ప్రదీప్: రండి సిద్దార్థ్, గౌతమ్. నిన్న వచ్చిన ఆ గడ్డం వ్యక్తి పేరు జార్జ్ పింటో, గోవా నుంచి వచ్చి ఇక్కడ ఉంటున్నాడు. అక్కడ గోవాలో బార్ లో గిటార్ వాయించేవాడు. అక్కడ ఒక డ్రగ్ కేస్ లో అరెస్ట్ చేస్తే, ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించి, ఇక్కడకు మూడు సంవత్సరాల క్రితం వచ్చాడు. ఇక్కడ కొంతమందికి గిటార్ నేర్పిస్తూ జీవితం గడుపుతున్నాడు. రోజు ఆ బార్ కి వెళ్ళి తాగడం అలవాటు. ఇక ఆయన మరణానికి కారణం మీథైల్ మెర్క్యురీ తో కలిసిన ఏదో డ్రగ్ అని అనుకుంటున్నాము. ఇదివరకు చనిపోయిన ఆ కిట్టప్ప బాడీ లోనూ మేము అదే కనిపెట్టాము. బహుశా మీరు బిజీగా ఉండి ఆయన పోస్ట్ మార్టం రిపోర్ట్ చూడలేదు అనుకుంటాను అంటూ కిట్టప్ప, జార్జ్ పోస్ట్ మార్టం రిపోర్ట్స్ ఇచ్చాడు.

సిద్దార్థ్, గౌతమ్ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

సిద్దార్థ్: డాక్టర్, మా పోలీస్ ల కన్నా మీకే ఎక్కువ విషయాలు తెలిసాయి. అది ఎలా?

ఇంతలో వెనకనుంచి ఒక డాక్టర్ వచ్చి ''సార్, ఆ మీథైల్ మెర్క్యురీ ఆ జార్జ్ చేతులకు కూడా ఉంది, మేము ఇప్పుడే కనిపెట్టాము'' అన్నాడు.

సిద్దార్థ్, గౌతమ్ ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు.

# Chapter 23 - The First Break

విల్లా లోపలికి వెళ్ళిన కేపీ అక్కడ విజిటర్స్ కోసం ఉన్న సోఫాలో కూర్చున్నాడు. అక్కడే ఉన్న న్యూస్ పేపర్ తీసి చదువుతున్నాడు. ఇంతలో ఇంటి బయట ఎవరో వచ్చిన శబ్దం వచ్చింది. 'ఆ ఇంటి యజమాని అనుకుంటా' లోపలికి వచ్చే శబ్దం వచ్చింది.

అంతలో ఆ పనివాడు వచ్చి కేపీకి "మా సార్ వచ్చారు, మిమ్మల్ని కలుస్తారు" అని చెప్పాడు.

లోపలికి జగత్ సింగ్ వచ్చాడు. కేపీను చూసి "నమస్తే! నా పేరు జగత్ సింగ్, నేను మొహెంజదారో ఇంపోర్ట్స్ యాండ్ ఎక్స్పోర్ట్స్ ఓనర్ ని. చెప్పండి, మీకు నేను ఎలా సహాయపడగలను? మీ వివరాలు ప్లీజ్?" అన్నాడు.

కేపీ: నమస్తే, నా పేరు కృష్ణ ప్రసాద్. అందరూ నన్ను కేపీ అంటారు. నేను సైబరాబాద్ పోలీస్ ఇన్స్పెక్టర్ ని. అక్కడ ఎదురుగా ఉన్న డాక్టర్ విక్రాంత్ వర్మ గారి కేస్ ఇన్వెస్టిగేట్ చేస్తున్నాను. రొటీన్ గా ఇక్కడ ఉన్న అన్ని ఇళ్ళ వాళ్ళని కలుస్తున్నాను, అందుకే మీ దగ్గరకు వచ్చాను.

జగత్ సింగ్: వెరీ గుడ్.. నేను ఈ విల్లా కొనుక్కుని, దీనిని రిమోడెల్ చేయించి మూడు నెలల క్రితమే వచ్చాను. నాకు ఈ వీధిలో ఎవరు తెలియదు కానీ, నేను విన్నాను. ఆ ఎదురు ఇంట్లో ఉన్నది భారత పురావస్తు శాఖలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ విక్రాంత్ వర్మ అని.

కేపీ: మీది బిజినెస్ ఇంపోర్ట్స్ యాండ్ ఎక్స్పోర్ట్స్, అంటే ఏం చేస్తారు? ఏ ఏ వస్తువులు మీరు ఇంపోర్ట్స్, ఎక్స్పోర్ట్స్ చేస్తారు?

ఇంతలో ఆ పనివాడు ఇద్దరికీ ఖరీదైన కప్ లలో గ్రీన్ టీ తెచ్చి ఇచ్చాడు.

జగత్ సింగ్: ప్లీజ్ హావ్ సం గ్రీన్ టీ. మేము అనేక రకాల ఇంపోర్ట్స్ ఎక్స్పోర్ట్స్ చేస్తాము. ఫుడ్ ఐటంస్, ఇంట్లోని వస్తువులు, మెడిసిన్స్, విదేశాల నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్ళే వాళ్ళ ఇంటి సామానులు, యాంటీక్స్, ఆర్ట్ వర్క్స్, శిల్పాలు, మరెన్నో.. యు నేమ్ ఈట్ వి డూ దట్.

కేపీ: యాంటీక్స్, ఆర్ట్ వర్క్స్, శిల్పాలు అని అన్నారు. అవి లీగల్ గానే కదా! తెలుసుకోవడం కోసం అడుగుతున్న.

జగత్ సింగ్: ఆఫ్కోర్స్.. మేము చేసే ప్రతి ఇంపోర్ట్ ఎక్స్పోర్ట్ లీగల్ క్లియరెన్స్ ఉండాలి. ప్రతీ దానికి ఒరిజినల్ బిల్లు, దానిని అమ్మేవాళ్ళు, కొనేవాళ్ళ అన్నీ వివరాలు పక్కగా ఉన్నాకే మేము తీసుకుంటాం, లేకుంటే రిజెక్ట్ చేస్తాం.

కేపీ: మీకు మంచి టేస్ట్ ఉన్నట్టు ఉంది, ఇల్లు చాలా అద్భుతంగా ఉంది. ముఖ్యంగా బయట ఆ ఫారిన్ కార్ భలే ఉంది, నేను అలాంటిది ఎప్పుడు చూడలేదు.

జగత్ సింగ్ నవ్వుతూ: ఈ విల్లాను ఇంత అందంగా డిజైన్ చేసింది నా భార్య. ఇప్పుడు మా అబ్బాయి దగ్గరకి అమెరికా వెళ్ళింది. నాకు కార్స్ అంటే చాలా ఇష్టం. ఒక రెండు నెలల క్రితమే ఆ కార్ ను నేను జర్మని నుంచి ఇంపోర్ట్ చేసుకున్నా..కస్టమైజెడ్ వెర్షన్ బుగాటి సేన్టోడెసి, ఇది నా చేతికి వచ్చేసరికి 100 కోట్లు అయ్యింది. ఇలాంటివి మన దేశంలో కేవలం 8 మాత్రమే ఉన్నాయి.

కేపీ: వావ్! అంటే మీరు సూపర్ రిచ్. గుడ్ టూ నో యు సార్, మళ్ళీ ఎప్పుడైనా కలుద్దాం. నేను ఇంక వెళ్ళాలి, నైస్ మీటింగ్ యు.

కేపీ అక్కడి నుండి వెళ్ళిపోయాడు. జగత్ సింగ్, నాగ్ కి కాల్ చేసి కేపీ సంగతి చెప్పాడు.

***

ఈశ్వర్, ప్రభాకర్ ను మొత్తానికి ఫోన్ లో పట్టాడు.

"నువ్వు ఎక్కడ ఉన్నా సరే ఒక అరగంటలో తార్నాక పోలీస్ స్టేషన్ కు రావాలి. మీ బాస్ కుప్పుసామి, ఆయన భార్య గోమతి, నీ దోస్త్ పళని అందరూ మా దగ్గరే ఉన్నారు" అన్నాడు.

ప్రభాకర్: సార్, నాకు భయం వచ్చింది. అందుకే ఫోన్ తీయలేదు, వస్తాను సార్, నాన్ అరమణిల తార్నాక పోలీస్ స్టేషన్ వస్తాను. అని ఫోన్ పెట్టేశాడు.

ఈశ్వర్ తార్నాక పోలీస్ స్టేషన్ కి ఫోన్ చేసి, ప్రభాకర్ వివరాలు ఇచ్చాడు. ప్రభాకర్ ని తీసుకుని సైబరాబాద్ పోలీస్ స్టేషన్ కు రావాలని చెప్పాడు.

***

సిద్దార్థ్, గౌతమ్ లను చూసి డాక్టర్ ప్రదీప్ "మీరు ఆశ్చర్య పోవడం నిజమే. మీరు అనుకున్నట్టు మాకు ఆ జార్జ్ వివరాలు ఎలా తెలిసాయంటే, అతని పర్స్ లో అతని ఆధార్ కార్డ్ ఉంది. దానిలో అతని పేరు అడ్రస్ ఉన్నాయి, మా దగ్గర హెడ్ నర్స్ గా పనిచేస్తున్న మేరీది గోవానే. అందుకే ఆమెను పిలిపించి అడిగాము. తెలిసిన విషయం ఏమిటి అంటే, గతంలో ఈ జార్జ్, ఆ మేరీ భార్యాభర్తలు. జార్జ్ చెడు సావాసాలు చేస్తున్నాడని ఇద్దరూ పోట్లాడుకుని విడిపోయారు. ఆ తరువాత మేరీ బెంగళూరు వచ్చేసి, ఇక్కడ హెడ్ నర్స్ గా చేరింది. వాళ్ళు విడిపోయిన తరువాత మేరీ జార్జ్ ని చూడడం ఇదే. ఇప్పుడు మాకు ఆ జార్జ్ వివరాలన్నీ ఆ మేరీనే చెప్పింది. అంతకుమించి ఏమి లేదు" అన్నాడు.

సిద్దార్థ్: వరల్డ్ ఇస్ స్మాల్.. ఏది ఏమైనా మనకు కొంత ముఖ్యమైన సమాచారం దొరికింది. మేము ఇక్కడ నుంచి ముందుకు ఎలా వెళ్ళాలో చూస్తాము. మేము మిమ్మల్ని తరువాత కలుస్తాము, వెళ్ళి వస్తాము. మీరు తక్కిన ఫార్మాలిటీస్ అన్నీ కంప్లీట్ చేయండి.

సిద్దార్థ్, గౌతమ్ వెళ్ళిపోయారు.

***

కేపీ, వర్మ ఇంటికి వెళ్ళాడు. రజనీ కేపీని చూసి "మీ బైక్ బయట ఉంది. మీరు ఎక్కడికి వెళ్ళి వస్తున్నారు?" అని అడిగింది.

కేపీ తను ఎక్కడకు వెళ్ళింది, ఏం వివరాలు తెలిసాయో మొత్తం చెప్పాడు.

కేపీ: వాళ్ళ మీద కూడా ఒక కన్ను వేసి ఉంచాలి. నాకు ఎందుకో కొంచెం అనుమానంగా ఉంది.

రజనీ: ఎవరు ఎలాంటి వాళ్ళో మనం చెప్పలేం. అయినా మీ పోలీస్ వాళ్ళకు అన్నీ ఇట్టే తెలిసిపోతాయి.

అందరూ నవ్వుకున్నారు.

***

సిద్దార్థ్, గౌతమ్ ఇద్దరూ బబ్లూ దగ్గరకు వెళ్ళారు. బబ్లూకి జార్జ్ ఫోటో చూపించారు.

గౌతమ్: ఇతనేనా నీకు డబ్బులు ఇచ్చింది? కిట్టప్పకి తాగించడానికి ఆ మందు బాటిల్ ఇచ్చింది?

బబ్లూ ఆలోచిస్తూ: సార్, ఇతనే అనుకుంటా సార్. నన్ను షాప్ దగ్గర పట్టుకుంది, పని అప్పచెప్పింది, డబ్బులు ఇచ్చింది. కానీ నేను సరిగ్గా చెప్పలేకపోతున్నా. అప్పుడు అతను హుడ్డి ఉన్న కోటు వేసుకున్నాడు, పైగా నల్ల కళ్ళద్దాలు పెట్టుకున్నాడు.

గౌతమ్ తన దగ్గర ఉన్న బార్ లోపలికి వెళ్ళే ముందు జార్జ్ వీడియో చూపించాడు. బబ్లూ అతనే అని ఖచ్చితంగా చెప్పాడు.

సిద్దార్థ్: సరే, ఆవేశపడకు. మేము ఇతని సంగతి చూస్తాము, అతని సంగతి చూసిన తరువాత నీ సంగతి చెప్తాం.

బబ్లూ: సార్, నేను ఏ పాపం ఎరుగను. డబ్బుకు కకుర్తి పడి అతను చెప్పినట్టు చేశాను, అంతే! అంటూ ఏడుపు ముఖం పెట్టాడు.

సిద్దార్థ్: సరే సరే.. ఎడవకు నీ బాడీకి, ఫేస్ కి అది సెట్ అవ్వదు.

సిద్దార్థ్, గౌతమ్ పోలీస్ సీల్ చేసిన ఆ బార్ దగ్గరకు వెళ్ళారు. అక్కడ కొంతమంది క్లూస్ టీం వాళ్ళు, ఆ బార్ మేనేజర్ ఉన్నారు.

సిద్దార్థ్ క్లూస్ టీం వాళ్ళతో: మీకు ఆ టేబుల్ మీద ఉన్న గ్లాస్ లు లేదా అక్కడ ఉన్న వేరే వాటి శాంపిల్స్ ఏమైనా తీసుకున్నారా? నాకు వాటి రిపోర్ట్స్ కావాలి.

అక్కడ క్లూస్ టీం వ్యక్తి ‘‘సార్, మీకు సాయంత్రం అయిదు లోపల రిపోర్ట్ పంపిస్తాము’’ అని చెప్పాడు.

సిద్దార్థ్: థాంక్ యు.

గౌతమ్: సిద్దార్థ్, మీ దగ్గర ఉన్న ఆ సి.సి.టీవి రికార్డింగ్ ఒకసారి చూపించండి.

ఇద్దరూ ఆ వీడియో చూస్తున్నారు. దాయానంద్ ఆ బార్ దగ్గరకు నడుస్తూ వస్తున్నాడు. మధ్యలో జేబులో చేతులు పెట్టుకుని నడుస్తున్నాడు. బార్ దగ్గరకు వచ్చి ఆ గడ్డం అతనిని కలిసి షేక్ హ్యాండ్ ఇచ్చాడు, ఇద్దరూ లోపలికి వెళ్ళారు. అదే వీడియో మూడు సార్లు చూశారు కానీ, వాళ్ళకు అనుమానం వచ్చేటట్టు ఏమి కనపడలేదు.

గౌతమ్: సిద్దార్థ్, మనం ఈ మొబైల్ ఫోన్ లో చూస్తే అర్థం కావడం లేదు, వి ఆర్ మిస్సింగ్ సంథింగ్. మనం ఈ వీడియో పెద్ద టీవి లో చూద్దాం పదండి.

సిద్దార్థ్: అవును మీరు అన్నది సరిగ్గా ఉంది. పదండి మనం మీ గెస్ట్ హౌస్ వెళ్ళి అక్కడ చూద్దాం.

***

ప్రభాకర్ ఆయాసపడుతూ తార్నాక పోలీస్ స్టేషన్ కు వచ్చాడు. అక్కడ మూర్తి అనే కానిస్టేబుల్ ప్రభాకర్ ను తీసుకుని సైబరాబాద్ పోలీస్ స్టేషన్ కు వెళ్ళాడు. అక్కడ ఈశ్వర్ కి, ప్రభాకర్ ను అప్పచెప్పి వెళ్ళిపోయాడు.

ఈశ్వర్: ఏం ప్రభాకర్! నీకు నీ ఫ్రెండ్ పళనికి ఇచ్చిన ట్రీట్మెంట్ ఇవ్వాలా? లేక నువ్వే అన్నీ చెపుతావా?

ప్రభాకర్: సార్, ముందు నేను మా సార్ కుప్పుసామి, గోమతి అమ్మను చూడాలి.

ఈశ్వర్: వాళ్ళు బాగానే ఉన్నారు, లోపల రెస్ట్ తీసుకుంటున్నారు. ఇక్కడ నీ పని అయ్యాక వాళ్ళని చూపిస్తాను.

ప్రభాకర్: ఏమి చెప్పాలి సార్? నాకు ఏమి తెలియదు.

ఈశ్వర్: నీ మొత్తం వివరాలు చెప్పు, ఇక్కడ ఏమి పని చేస్తున్నావు? పళనికి నీకు ఉన్న వేరే వ్యాపారం ఏమిటి?

ప్రభాకర్: సార్, అంతా చెప్తాను. నన్ను మీరు ఏమి చేయరు కదా! అంటూ ఏడ్చాడు.

ఈశ్వర్: నువ్వు అంతా నిజమే చెపితే, నిన్ను ఏమి చేయం. ఇవాళ్ళే ఇంటికి పంపిస్తాము.

ప్రభాకర్: సరే సార్.

***

సిద్దార్థ్, గౌతమ్ ఇద్దరూ గెస్ట్ హౌస్ కి వెళ్ళారు, అక్కడ గౌతమ్ రూమ్ లో టీ. వి. కి సిద్దార్థ్ మొబైల్ కనెక్ట్ చేశాడు. బార్ దగ్గర నుంచి తెచ్చిన సి.సి.టీవి రికార్డింగ్ ప్లే చేశారు. అందులో దాయానంద్ ఆటో దిగి బార్ లోపలికి వెళ్ళే ముందు జేబులో చేతులు పెట్టి తీయడం, ఆ తీసేటప్పుడు చేతికి తెల్లని గ్లౌస్ ఉండడం చూసి సిద్దార్థ్, గౌతమ్ ఇద్దరు ఆశ్చర్యపోయారు. అదే వీడియో వాళ్ళు కనీసం పదిసార్లు చూశారు, ఇద్దరికీ ఒక విషయం అర్థమయ్యింది.

# Chapter 24 - Digging Deep

ఈశ్వర్, ప్రభాకర్ వచ్చిన సంగతి కేపీ కి ఫోన్ చేసి చెప్పాడు. కేపీ వచ్చే లోపల, ఆ ప్రభాకర్ వివరాలు అన్నీ తెలుసుకోమని చెప్పాడు.

ఈశ్వర్: ప్రభాకర్, ఇప్పుడు చెప్పు అన్నీ వివరంగా.

భయంతో ప్రభాకర్ వణికిపోతున్నాడు. భయం భయంగా మాట్లాడుతున్నాడు.

ప్రభాకర్: సార్, నాది తంజావూరు. అక్కడ మాకు ఒక కూల్ డ్రింక్ షాప్ ఉంది, అది బృహదీశ్వరాలయం కు దగ్గర ఉంది. అక్కడికి రోజు చాలా మంది టూరిస్ట్ లు వస్తారు, మాకు బిజినెస్ బాగానే ఉన్నది. అప్పుడు ఒకతను వచ్చి నాకు కొన్ని చిన్న చిన్న ఇత్తడి, రాగి బొమ్మలు, కాయిన్స్ ఇచ్చి నీకు ఇష్టమొచ్చిన ధరకు అమ్ముకో, నాకు సాయంత్రం 500 రూపాయలు ఇచ్చేయి అని చెప్పాడు, సరేలే డుడ్డు తరువాత ఇస్తాము కదా అని తీసుకుంటి. అదే రోజు అవి నేను వెయ్యి రూపాయలకు ఫారిన్ వాళ్ళకు అమ్మాను, అది నాకు బాగా లాభం అని అనిపించి రోజు ఆయన దగ్గర బొమ్మలు కాయిన్స్ తీసుకుని అమ్మే వాడిని. తరువాత కొంచెం పెద్ద సరుకు ఇచ్చేవాడు. అప్పుడు నాకు మొత్తం రోజుకు 5000 వచ్చేది ఆయనకు 2000 ఇచ్చేవాడిని. ఇట్లా మూడు నెలలు జరిగింది. ఒక రోజు ఆయన వచ్చి నన్ను 'ఇంకా పెద్ద బిజినెస్ చేసుకో నాతో రా' అని తీసుకుని వెళ్ళాడు.

***

సిద్దార్థ్, గౌతమ్ పది సార్లు ఆ వీడియో చూసి సరిగ్గా దయానంద్ చేతులు తన జేబ్ లో పెట్టి తీయడం మెల్లిగా ఆపి ఆపి చూశారు. అంతవరకు చేతికి గ్లౌస్ లేని దాయానంద్ అప్పుడు ఆ గ్లౌస్ ఎందుకు వేసుకున్నట్టు, అతనికి షేక్ హ్యాండ్ ఇచ్చి లోపలికి వెళ్ళడం చూశారు. అంటే ఆ గ్లౌస్ లోనే ఏదో మర్మం ఉన్నదని వాళ్ళకు తోచింది. వెంటనే వాళ్ళిద్దరూ అక్కడి నుండి బార్ దగ్గరకు వెళ్ళారు.

బార్ వద్ద బార్ మేనేజర్ అక్కడి క్లూస్ టీం వాళ్ళతో ఉన్నాడు.

సిద్దార్థ్: మేనేజర్, మీరు ఆ రోజు బార్ లో పని చేసిన వైటర్స్ ను పిలిపించండి, మేము కొన్ని ప్రశ్నలు అడగాలి.

మేనేజర్: సార్ మొత్తం ఆరుగురు, అందరూ ఇక్కడే ఉన్నారు. ఆ పక్కన కూర్చుని ఉన్నారు, పిలుస్తాను ఉండండి.

***

కేపీ: నందిని మేడమ్, నేను ఒక ముఖ్యమైన పని మీద వెళ్ళాలి. మీకు ఇవాళ కూడా ఆ ఇద్దరు కానిస్టేబుల్స్ ఇక్కడే ఉంటారు. మీకు ఎటువంటి భయం లేదు, ఏమైనా అవసరం ఉంటే నాకు ఫోన్ చేయండి. అన్నట్టు అజయ్ వస్తే నాకు ఫోన్ చేయమని చెప్పండి.

నందిని: థాంక్ యు కేపీ, మీరు మాకు ఇంత హెల్ప్ చేస్తున్నారు. మీరు వెళ్ళి రండి, అజయ్ వస్తే నేను మీకు కాల్ చేయమని చెప్తాను.

కేపీ వర్మ ఇంటి బయటకు వెళుతూ, అజయ్ కి కాల్ చేశాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉన్నది అని మెసేజ్ వచ్చింది. కేపీ ఆలోచిస్తూ ఫోన్ కట్ చేసి, తన బైక్ ఎక్కి పోలీస్ స్టేషన్ కు వెళ్ళాడు.

***

మేఘ, మిత్ర ఆఫీస్ కు వచ్చి అక్కడ బయట ఉన్న ఒక కానిస్టేబుల్ ద్వారా మిత్రాకు కబురు పంపింది. రెండు నిముషాల తరువాత మేఘను, మిత్రా ఆఫీస్ లోపలికి ఆ కానిస్టేబుల్ పంపించాడు. లోపలికి వెళ్ళిన మేఘ, ఫోన్ లో మాట్లాడుతున్న మిత్రాను చూసింది. ఆయన మేఘను కూర్చోమని కుర్చీ చూపించాడు. కొంత సమయం తరువాత మిత్రా ఫోన్ పెట్టేశాడు.

మేఘ: నమస్తే సార్, మీరు నాకు ఇచ్చిన ఆ లిస్ట్ నేను పురావస్తు శాఖ వాళ్ళ లిస్ట్ రెండు కంపెర్ చేసి చూశాను. అందులో దాదాపు 85% మ్యాచ్ అవుతున్నాయి. అందులో చాలా వస్తువులు వర్మ సార్ సర్టిపై చేసిన వస్తులే.

మిత్రా: ఇంట్రెస్టింగ్, అందులో రికవర్ అయినవి ఏమైనా ఉన్నాయా?

మేఘ: పురావస్తు శాఖ వాళ్ళ రిపోర్ట్ ప్రకారం కేవలం మూడు వస్తువులే లభించాయి. మరి మీ పోలీస్ శాఖ వివరాలు నాకు తెలియదు.

మిత్రా: ఓకే, నేను క్రాంతిని అడిగి తెలుసుకుంటాను. గుడ్ జాబ్.. ఇంతకి ఆ దొరికిన వస్తువులు ఏమిటో!

మేఘ: రెండు 7వ శతాబ్దంకు చెందిన పంచలోహాల గోపుర కలిశాలు, 13వ శతాబ్దంకు చెందిన కంచు గంట.

మిత్రా: అవి ఏ ప్రాంతంకు చెందినవి?

మేఘ: కలిశాలు కుంభకోణం ప్రాంతంకు సంబంధించినవి, గంట తంజావూరు దగ్గర ఒక ఆలయంకు చెందినది.

మిత్రా: ఆ రెండు వస్తులు ఎప్పుడు దొంగలింపబడ్డాయి? ఎప్పుడు దొరికాయి?

మేఘ: కలిశాలు 2001 లో దొంగలింపబడ్డాయి, అవి 2020లో దొరికాయి. గంట 2004 లో దొంగలించారు, అది 2017 లో దొరికింది.

మిత్రా: వెరీ గుడ్ జాబ్ మేఘ. ఆ మొత్తం రిపోర్ట్ నాకు ఇచ్చి నువ్వు వెళ్ళు, నేను నీకు తరువాత కాల్ చేస్తాను, మనం మళ్ళీ కలుద్దాం.

మేఘ: థాంక్ యు సార్, ఐ విల్ వెయిట్ ఫర్ యువర్ కాల్.

మేఘ ఆ రిపోర్ట్స్ అక్కడ పెట్టి వెళ్ళిపోయింది. మిత్ర, క్రాంతికి ఫోన్ చేసి విషయం చెప్పి కలవమని చెప్పాడు.

***

మేనేజర్ పిలుపుకి ఆ ఆరుగురు బార్ వైటర్ లు వచ్చారు. సిద్దార్థ్, దాయానంద్ ఫోటోను తన మొబైల్ లో చూపించి "ఆ ముందు రోజు ఆయనకు సప్లయ్ చేసింది ఎవరు?" అని అడిగాడు.

ఆ ఆరుగురిలో ఒకడు "సార్, నేనే సార్ ఆయనకు సప్లయ్ చేసింది" అని ముందుకు వచ్చాడు. "నేను మీకు ఆ రోజే చెప్పాను కదా సార్! అతను వేరే టేబుల్ దగ్గర కూర్చున్నాడు, ఆ గడ్డం వ్యక్తి తో కాదు. ఆయనకు నేనే ఒక బీర్ ఇచ్చాను. ఆయన అది తాగి వెంటనే డబ్బులు చెల్లించి చిల్లర కూడా తీసుకోకుండా వెళ్ళిపోయాడు" అని.

సిద్దార్థ్: ఆ గుర్తుకు వచ్చింది, నువ్వు ఒక్కసారి మాతో రా మాకు కొంత సమాచారం కావాలి అని ముగ్గురు బార్ లోపలికి వెళ్ళారు.

గౌతమ్ ఆ వైటర్ తో: నీ పేరేమిటి?

వైటర్: సురేష్ సార్.

సిద్దార్థ్: సురేష్, బాగా గుర్తు తెచ్చుకుని చెప్పు. ఆయన లోపలికి నేరుగా వచ్చి ఇక్కడే కూర్చున్నాడా?

సురేష్: లేదు సార్, ఆయన లోపలికి వచ్చి నేరుగా వాష్ రూమ్ కి వెళ్ళారు. ఆ తరువాత వచ్చి ఇక్కడ కూర్చున్నారు. ఆ తరువాతే నేను ఆయనకు బీర్ ఇచ్చాను.

గౌతమ్: అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?

సురేష్: సార్, ఆ సార్ నాకు సుమారు రెండు సంవత్సరాలుగా తెలుసు కానీ, ఆయన పేరు తెలియదు. ఎప్పుడు ఇక్కడే కూర్చుంటారు. ఒక వేళ ఈ టేబుల్ ఖాళీ లేకపోతే వెంటనే వెళ్ళిపోతారు. ఆయన ఎప్పుడు ఒకే ఆర్డర్, ఒక బీర్ తాగి ప్రతీసారి రెండు వందలు ఇస్తారు. 180 బీర్, 20 నాకు టిప్పు. అలాంటిది నిన్న 500 ఇచ్చి, చిల్లర కూడా తీసుకోకుండా వెళ్ళిపోయారు. అది ఇంకా నా దగ్గరే ఉంది.

గౌతమ్: సరే.. ఆ నోటు మాకు ఇవ్వు, నీకు వేరే 500 ఇస్తాను అని సురేష్ కి 500 ఇచ్చి, తన దగ్గర నోటు జాగ్రత్తగా తన హ్యాండ్ కర్చీఫ్ లోకి తీసుకున్నాడు.

సిద్దార్థ్, క్లూస్ టీమ్ వాళ్ళను పిలిచి వాష్ రూమ్ లో శాంపిల్స్ తీసుకుని, అక్కడ ఏమైనా ఆధారాలు దొరుకుతాయా అని చూడమన్నాడు. ముగ్గురు బయటకు వచ్చారు. గౌతమ్ తను తీసుకున్న ఆ 500 నోటు అక్కడ క్లూస్ టీం వాళ్ళకు ఇచ్చి, దానిని కూడా చెక్ చేయమని చెప్పాడు.

***

ప్రభాకర్, ఈశ్వర్ కి వివరాలు చెపుతున్నాడు. ఈశ్వర్, ప్రభాకర్ చెప్పే విషయాలు అన్నీ కూడా తన మొబైల్ ఫోన్ లో రికార్డ్ చేస్తున్నాడు.

ప్రభాకర్: పెద్ద బిజినెస్ అని చెప్పి నాకు రోజు డబ్బులు ఇచ్చి ఆ చుట్టుపక్కల ఉన్న గుళ్ళు గోపురాలు, ఆలయాలు వెళ్ళి.. అక్కడ ఉన్న వస్తువులు, సంపద, వచ్చే జనం, అన్నీ వివరాలు తెలుసుకోమని చెప్పారు, నేను అట్లానే సేసి వాళ్ళకు సేప్పేవాణ్ణి. కొన్ని రోజుల తరువాత ఇంకొంత మందితో నన్ను పంపించి ఆ గుళ్ళ నుంచి వస్తువులు దొంగిలించేవాళ్ళం. మాకు దుడ్డు బాగానే ఇచ్చేవాళ్ళు. ఆ తరువాత ఇంకా పెద్ద బిజినెస్ అని ఇక్కడకు తీసుకు వచ్చి, నన్ను కుప్పుసామి సార్ దగ్గర పనిలో పెట్టారు. అక్కడే నేను పళనిని కలిశాను, అప్పుడు తెలిసింది వాడు నాలాగానే వేరే ఊరిలో అదే పని సేసినాడు అని.

ఈశ్వర్: ఇంతవరకు బాగానే ఉంది. మరి ఇక్కడ ఆ హాస్పిటల్ లో వాళ్ళను కొట్టడం, వర్మ గారి ఇంటి దగ్గర పొగ బాంబ్ వేయడం, ఇప్పుడు ఆ రాయి వేయడం ఏమిటి?

ప్రభాకర్: అవి మాకు తెలియదు సార్.. అవన్నీ మా కుప్పుసామి సార్ చెపితే సేసినాము, ఆయనకు ఎవరు సెప్పినారు నాకు తెలియదు.

ఈశ్వర్: సరే, నువ్వు ఇక్కడే ఉండు. కేపీ సార్ వచ్చిన తరువాత ఆయనతో మాట్లాడి చెప్తాను.

ప్రభాకర్: సార్ మా కుప్పుసామి సార్, గోమతి అమ్మ ఎక్కడ సార్?

ఈశ్వర్: కేపీ సార్ వచ్చిన తరువాత కనిపిస్తారులే అని ఆ రూమ్ లో ప్రభాకర్ ను పెట్టి తాళం వేసి తను బయటకు వెళ్ళాడు.

## Chapter 25 – Connecting The Dots

నందిని కేపీ కి కాల్ చేసింది "కేపీ గారు, మీకు అజయ్ ఏమైనా కాల్ చేశాడా, పోనీ కలిశాడా?".

కేపీ: లేదు నందినిగారు, నేను ఉదయం కాల్ చేసినప్పుడు అతని ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది.

నందిని: వర్మ గారి ఆఫీస్ నుంచి కస్తూరి ఫోన్ చేసింది, ఇవాళ్ళ అజయ్ ఆఫీస్ కు రాలేదు అని, అతని ఫోన్ నాట్ రీచబుల్ అని చెప్పింది. అజయ్ మా ఇంటికి రాలేదు, అతనికి ఏమైనా అయ్యిందేమో అన్న అనుమానంతో మీకు కాల్ చేస్తున్న.

కేపీ: డోంట్ వర్రీ మేడమ్, నేను చూస్తాను. మీకు నేను తరువాత చెప్తాను, అని ఫోన్ కట్ చేశాడు.

పోలీస్ స్టేషన్ వెళుతున్న కేపీ అజయ్ ఇంటి వైపు మళ్ళాడు.

జగత్ సింగ్ చెప్పిన వివరాల ప్రకారం నాగ్ కేపీ ని గమనిస్తున్నాడు, కేపీ అజయ్ ఇంటి వైపు వెళ్ళడం చూశాడు. తను వెంటనే ఎవరికో ఫోన్ చేసి "కేపీ అజయ్ ఇంటి వైపు వెళుతున్నాడు జాగ్రత్త, మనం అనుకున్నట్టుగా మన ప్లాన్ వర్క్ అయ్యింది, అక్కడ మీరు చూసుకోండి" అని చెప్పాడు.

బెంగళూరు పురావస్తు శాఖ ఆఫీస్ లో చక్రవర్తి దాయానంద్ ను పిలిచాడు.

చక్రవర్తి: ఏం జరుగుతోంది దయానంద్? మీరు రెగ్యులర్ గా వెళ్ళే ఆ బార్ లో ఎవరో చనిపోయారంట అది హత్య అని పోలీసులు అనుమానిస్తున్నారు, అదే విషయం సిద్దార్థ్, గౌతమ్ వచ్చి మిమల్ని అడిగారంట?

దాయానంద్: అదేం లేదు సార్, నథింగ్ టు వర్రీ, ఆల్ సేఫ్, అతనేవరో చనిపోయిన సమయంలో నేను ఆ బార్ లో ఉన్నందుకు వాళ్ళు నన్ను కాజువల్ గా ప్రశ్నించారు అంతే, అంతకు మించి ఇంకేం లేదు.

చక్రవర్తి: జాగ్రత్తగా చూసుకోండి, ఏమైన జరిగితే మనకు మన సంస్థకు చెడ్డ పేరు వస్తుంది.

దాయనంద్: ఒకే సార్, ఐ విల్ మానేజ్, నేను చూస్కుంటాను అని వెళ్ళిపోయాడు.

క్లూస్ టీమ్ వాళ్ళు సిద్దార్థ్ ను రమ్మని చెప్పారు. సిద్దార్థ్, గౌతమ్ క్లూస్ టీం ఆఫీస్ కు వెళ్ళారు.

సిద్దార్థ్: మమల్ని పిలిచారు, మీ టీమ్ కు ఏమైనా ఆధారాలు దొరికాయ?

అప్పుడే క్లూస్ టీమ్ చీఫ్ వచ్చాడు "హాయ్, నా పేరు పరుశురామ్, నేను ఇక్కడ చీఫ్ ని"

సిద్దార్థ్: నైస్ మీటింగ్ యు పరుశురామ్, మీ గురించి నేను చాలా మంచి విషయాలు విన్నాను, గ్లాడ్ టు మీట్ యు, ఇతను హైదరాబాద్ నుంచి వచ్చారు, గౌతమ్"

గౌతమ్: నైస్ మీటింగ్ యు పరుశురామ్.

పరుశురామ్: ఆ బార్ లో చనిపోయిన వ్యక్తికి ఎవరో మిథైల్ మెర్క్యురీ సైనైడ్ తో కలిపి ఇచ్చారు, మేము ఆ చనిపోయిన వ్యక్తి తిన్న బాయిల్డ్ పీ నట్స్ లో కనిపెట్టాము. అతను తాగిన మందులో ఎటువంటిది కలపలేదు.

సిద్దార్థ్: థాంక్ యు వెరీ మచ్, మీరు మాకు చాలా ముఖ్యమైన విషయం చెప్పారు. వి విల్ ఫైండ్ ది కల్ప్రిట్. గౌతమ్ మనం వెంటనే బార్ దగ్గరకు వెళ్ళాలి. పరశురామ్ మిమ్మల్ని మేము తరువాత కలుస్తాము అని వెళ్ళిపోయారు.

బార్ దగ్గర సిద్దార్థ్ వైటర్ సురేష్ ను కలిశాడు.

సిద్దార్థ్: సురేష్, నువ్వు మాతో రా, నువ్వు మేము చెప్పే వరకు పోలీస్ స్టేషన్ లో ఉండు, మేము ఒక ముఖ్యమైన పని మీద వెళుతున్నాము అని చెప్పి సురేష్ ను తమ కార్ లో పోలీస్ స్టేషన్ లో వదిలి వాళ్ళు భారత పురావస్తు ఆఫీస్ కు వెళ్ళారు.

***

అజయ్ ఇంటి దగ్గరకు వెళ్ళిన కేపీ అక్కడ ఇంటికి తాళం వేసి ఉండడం చూశాడు, ఇంటి ముందు వేసిన పాల ప్యాకెట్ పేపర్ అలానే ఉన్నాయి ఎవరు తీసినట్టు లేదు. కేపీ అక్కడ 'ఎవరైనా ఉన్నారా' అని అడిగి తెలుసుకుందాము అని చూస్తున్నాడు. ఇంతలో ఒకడు సైకిల్ మీద అజయ్ ఇంటి ముందుకు వచ్చి ఆగాడు.

కేపీ: ఎవరు నువ్వు, నీకు ఈ ఇంటి అతను తెలుసునా?

ఆ వ్యక్తి: సార్ నేను రంగా పక్క వీధిలో లాండ్రీ నాది, ఈ సార్ ఇవ్వాళ్ళ బట్టలు ఇస్తాను అంటే వచ్చాను.

కేపీ: నీకు ఇవ్వాళ్ళ బట్టలు ఇస్తాను అని ఎప్పుడు చెప్పాడు? నువ్వు అతనిని ఆఖరి సారి ఎప్పుడు చూసావు?

రంగా: నిన్న మధ్యాన్నం మూడింటికి చూశాను, అప్పుడు ఆయన ఎవరితోనో ఒక పెద్ద కార్ ఎక్కుతున్నారు, రేపూ రా బట్టలు ఇస్తాను అని చెప్పారు, వాళ్ళు ఆ టీ కొట్టు దగ్గర ఆపి టీ తాగి వెళ్ళిపోయారు.

కేపీ: సరే, నువ్వు వెళ్ళు నేను కనుకుంటానులే, అని అజయ్ ఇంటి ముందు తన బైక్ పెట్టి ఆ టీ కొట్టు దగ్గరకు వెళ్ళాడు.

***

సిద్దార్థ్, గౌతమ్ రావడం చూసి చంద్రిక "సార్ మళ్ళీ వచ్చారు, ఈ సారి కూడా దయానంద్ గారి కోసమేనా, లోపల ఉన్నారు" అని చెప్పింది.

సిద్దార్థ్: అవును, కొంచెం పిలుస్తారా?

చంద్రిక: షూర్, అని ఇంటర్కామ్ లో దయానంద్ కు చెప్పింది.

దయానంద్ బయటకు వచ్చాడు.

దయానంద్: చెప్పండి సిద్దార్థ్, హౌ కన్ ఐ హెల్ప్ యు.

గౌతమ్: దయానంద్ గారు, మేము ఆ మృతుడి విషయంలో ఒక విలువైన విషయం తెలుసుకున్నాం, మాకు మీ హెల్ప్ కావాలి, మీరు మాతో రండి, ప్లీజ్.

దయానంద్: ఒకే, కానీ నేను మూడు గంటలకు ఒక మీటింగ్ అటండ్ అవ్వాలి ఆ లోపల అయితే నాకు ప్రాబ్లెమ్ లేదు.

సిద్దార్థ్: షూర్, ఆ లోపల నేనే మిమ్మల్ని ఇక్కడ దింపుతాను, బట్ వి నీడ్ యు.

దయానంద్: చంద్రిక చక్రవర్తి గారికి చెప్పు, నేను వెళ్ళివస్తాను అని సిద్దార్థ్, గౌతమ్ తో కలిసి వెళ్ళాడు.

***

టీ షాప్ దగ్గర ఒక నలుగురు కూర్చుని టీ తాగుతున్నారు, అందులో ఒకడు సిగరెట్ తాగుతున్నాడు, వాడు విదిల్చిన బూడిద పక్కన టీ తాగుతున్న వాడి టీ లో పడింది. వాళ్ళిద్దరూ మాట మాట పెంచుకుని కొట్టుకునే వరకు వెళ్ళారు, అక్కడే ఉన్న కేపీ వాళ్ళను వారించి ఊరుకోబెట్టాడు. ఆ సమయంలో ఎవరో వేనుకనుండి కేపీ తల మీద గట్టిగా పిడి గుద్దు గుద్దారు, అంతే కేపీ కళ్ళు తిరిగి పడిపోయాడు, వెంటనే అక్కడ ఉన్నవాళ్ళు కేపీని టీ షాప్ వెనకాల ఉన్న ఇంటిలోకి తీసుకుని వెళ్ళి అతని చేతులు కాళ్ళు కట్టేసి నోటికి ఒక గుడ్డ కట్టి పెట్టారు, కేపీ స్పృహ కోల్పోయి ఉన్నాడు.

ఈశ్వర్, కేపీ కోసం ఎదురు చూసి ఎంతసేపటికీ కేపీ రాకపోయే సరికి తానే కుప్పసామి, గోమతి, ప్రభాకర్ కు భోజనం తెప్పించి పెట్టాడు.

***

దయానంద్ ను తీసుకుని సిద్దార్థ్ నేరుగా పోలీస్ స్టేషన్ కు వెళ్ళాడు, అక్కడ దాయానంద్ బార్ వైటర్ ను చూసి వాడి కోసమే తనను పిలిచి ఉంటారనుకుని లోపలికి వెళ్ళాడు. అక్కడ ముందుగానే సిద్దంగా ఉన్న నలుగురు పోలీసులు దాయానంద్ ను బలవంతంగా ఒక కుర్చీలో కూర్చోబెట్టి చేతులకు కుర్చీకి సంకెళ్ళు వేశారు, కాళ్ళు కదపకుండా కుర్చీకి కట్టేశారు. ఆ హఠాత్ పరిణామంకు దాయానంద్ ఆశ్చర్యపోయాడు.

దాయానంద్: సిద్దార్థ్, ఏమిటిది, నన్ను కట్టేస్తారేమిటి?

సిద్దార్థ్: జస్ట్ కట్టేసామంతే, కొట్టలేదు, మీరు మేము అడిగిన వాటికి నిజం చెపితే మీరు వెళ్ళిపోవచ్చు, లేకుంటే మీకు ఇవ్వాళ ఇక్కడే విడిది.

దాయానంద్: వాట్ ఆర్ యు టాకింగ్, ఇది సరైన పద్దతి కాదు.

గౌతమ్: దాయానంద్, ఊరికే అరవ వద్దు. అని ఎదురుగా ఉన్న టివిలో దయానంద్ బార్ లోకి వెళ్ళడం, జేబులో గ్లాస్ వేసుకోవడం స్లో మోషన్ లో చూపించాడు. అది చూసిన దాయానంద్ వణికిపోయాడు.

సిద్దార్థ్: ఇప్పుడు చెప్పండి దయానంద్, వాట్ ఇస్ దట్? ఏమిటది? మీరు ఏం చేశారక్కడ?

దయానంద్: సారి, నన్ను క్షమించండి, అది అది..

సిద్దార్థ్: మీ పని అయ్యిపోయింది మీరు ఇంక ఇప్పుడు నిజం చెప్పండి, లేదంటే మీకు మా పోలీస్ లాఠీలు సమాధానం చెపుతాయి.

దాయానంద్: లేదు, ప్లీజ్ నేను నిజం చెప్తాను.

గౌతమ్: ఒకే చెప్పండి, అంటూ అక్కడ ఉన్న వీడియో కెమెరా ఆన్ చేశాడు.

సిద్దార్థ్: మీరు ఇప్పుడు చెప్పేది ప్రతి ఒక్కటి అక్కడ రికార్డ్ అవుతుంది, కాబట్టి ఒళ్ళు దగ్గార పెట్టుకుని నిజం చెప్పండి.

దయానంద్: మా బాస్ కెప్టెన్, ఆయన ఇక్కడ భారత దేశంలోని అపురూపమైన శిల్పాలు, పురాతన వస్తువులు విదేశాలకు దొంగతనంగా అమ్మేస్తాడు, వాటిలో మాకు భాగం ఇస్తాడు. అయితే దాదాపు ఒక సంవత్సరం క్రితం వర్మ ఒక పెద్ద పురాతన నిధిని కనిపెట్టడాని తెలిసింది, ఆయన దాని విషయం ఎంతో రహస్యంగా ఉంచాడు, దానిని కేవలం సెంట్రల్

టూరిజం మరియు ఘనుల శాఖ మంత్రులకు చెప్పాడు. వాళ్ళు దానిని ఈ దేశ సంపదగా బద్ర పరచాలని నిశ్చయం చేశారు, ఆ నిధిలో అనేకమైన చంద్రగుప్తుని కాలంకు సంబధించిన అపురూప వస్తువులు వున్నాయని మాకు తెలిసింది, అందులోనిదే ఆ పాఖసోయ, వర్మ ఆ పాఖసోయ గురించి ఏదో కొంత సమాచారం చెప్పాడు కానీ అసలు ఆ నిధి ఎక్కడ ఉన్నది చెప్పలేదు. అందుకే ఆయనను మా కెప్టెన్ బెదరించాడు వినలేదు. అందుకే అతనిని మేము అవి వట్టి మాటలు కాదు నిజంగానే భయం పెట్టాలని అతనిని టార్గెట్ చేశాము, అయితే ఆ అపవాదు మాకు అంటకుండా ఉండడం కోసం మేము కిట్టప్పని వాడుకున్నాం. వాడు ఒక మూర్ఖుడు, వాడు ఏమి చేస్తాడులే అని అనుకున్నాం కానీ వాడు మాకు ఎదురతిరిగి వాడి చెల్లీలీ పెళ్ళి కోసం పాతిక లక్షలు కావాలని లేకుంటే జరిగింది పోలీసులకు చెప్తానని అన్నాడు. అందుకే నేను ఎన్నో రోజులనుంచి బార్ లో చూస్తున్న ఆ జార్జ్ ని అతని నేర చరిత్రని తెలుసుకున్న అతనికి కిట్టప్పని చంపమని చెప్పాను, వాడు బద్ధకస్థుడు వాడు ఆ మతిలేని బబ్లూ కి ఆ పని అప్ప చెప్పాడు. మొత్తానికి ఆ కిట్టప్ప చచ్చాడు, కానీ ఆ బబ్లూను మీరు పట్టుకున్నారు అని తెలిసి వాడు నోరు విప్పితే ఈ జార్జ్ దొరుకుతాడు అనుకుని నేనే అతనికి మిథైల్ మెర్క్యురీ లో కొంచెం సైనైడ్ కలిపి నా గ్లౌస్ కి పూసుకుని అతనికి షేక్ హ్యాండ్ ఇచ్చాను, పాపం అది తెలియని జార్జ్ ఆ చేతితో ఆ పల్లీలు తిన్నాడు, పోయాడు.

సిద్దార్థ్ (కోపంగా): మరి ఆ గ్లౌస్ ఏం చేశావు?

దాయానంద్: నేను అతనికి షేక్ హ్యాండ్ ఇచ్చి నేరుగా వాష్ రూమ్ కి వెళ్ళి ఆ గ్లౌస్ తీసి అక్కడ టాయ్లెట్ లో వేసి ఫ్లష్ చేశాను, ఆ తరువాత నేను చాలా సేపు సోప్ తో నా చేతులు కడుక్కుని సానిటైజర్ రాసుకున్నాను.

గౌతమ్: మీ స్వార్ధం కోసం ఒక అమాయకుడిని బలి చేశారు కదరా!

సిద్దార్థ్: అది సరే, ఇంతకీ ఆ కెప్టెన్ ఎవరు?

దాయానంద్: ఆ విషయం నాకు తెలియదు, కేవలం అతడు ఒక ప్రైవేట్ నెంబరనుంచి కాల్ చేస్తాడు, ఏమి చేయాలో చెపుతాడు అంతే, నేను ఎప్పుడు అతనిని చూడలేదు.

గౌతమ్ : సరే ఆ కెప్టెన్ నీకు డబ్బులు ఎలా ఇస్తాడు?

దాయానంద్: ఫోన్ చేసి ఏదో ఒక లొకేషన్ చెప్తాడు, అక్కడకు వెళ్ళితే అక్కడ ఆయన చెప్పిన ఆనవాళ్ళ ప్రకారం డబ్బులు ఉంటాయ్, తీసుకుంటాను.

# Chapter 26 – The Big Picture

దయానంద్ చెప్పిన విషయాలు విన్న సిద్దార్థ్, గౌతమ్ ఆశ్చర్యపోయారు.

దయానంద్: మీరు అడిగినవన్ని చెప్పానుగా, ఇంక నన్ను వదలండి.

సిద్దార్థ్: మీరు చేసినది, చేస్తున్నది ఏమైనా దేశ సేవా? హత్యలు, దేశ సంపద దోచుకోవడం, రెండు నేరాలే, మీకు తగిన శిక్ష పడుతుంది, అంతవరకు మీరు ఇక్కడ మా అతిథి, ఆయనకు కొంచెం మర్యాదలు చేయండి. అని అక్కడ ఉన్న పోలీసులకు చెప్పి గౌతమ్ తో బయటకు వచ్చాడు.

బయట కూర్చున్న బార్ వైటర్ సురేష్: సార్, ఆ సారు వచ్చారుగా, నేను వెళ్ళవచ్చునా?

గౌతమ్: వెళ్ళు సురేష్, అవసరం ఉన్నప్పుడు నిన్ను పిలుస్తాను, అక్కడ హెడ్ కు నీ వివరాలు ఇచ్చి వెళ్ళు.

సిద్దార్థ్ క్రాంతి కి ఫోన్ చేశాడు, “క్రాంతి, చాలా ప్రాయస తరువాత ఈ కిట్టప్ప కేస్ ఇప్పుడు ఒక మలుపు తిరిగి మనకు కావలసిన విషయాలు లభిస్తున్నాయి. గౌతమ్ మొత్తం కేస్ వివరాలు అన్నీ నీకు డాక్యుమెంట్ తయారు చేసి వివరంగా పంపుతారు. మొత్తానికి కిట్టప్పని చంపింది ఎవరు, ఎందుకు అన్నది తెలిసింది, కానీ తెలియాలిసింది వీటన్నిటికీ మూల పురుషుడు ఎవరు అన్నది. త్వరలోనే అది కూడా తెలుసుకుని నీకు వివరాలు తెలుపుతాను”

క్రాంతి: గ్రేట్ జాబ్ సిద్దార్థ్, ఈ కేస్ లో నువ్వు మాకు, గౌతమ్ కు చాలా సహాయ పడ్డావు, వి ఓవ్ యు ఏ లాట్, నీకు చాలా ఋణపడిపోయాం.

సిద్దార్థ్: నథింగ్, ఇది నా ఉద్యోగ ధర్మం, నేరస్తులను పట్టుకోవడమే మన ఉద్యోగ ధర్మం. నాకు చేతనైనది నేను చేశాను అంతే. నీకు మళ్ళీ కాల్ చేస్తాను. ఫోన్ కట్ చేశాడు.

***

సాయంత్రం కావొచ్చినా ఇంకా కేపీ రాకపోవడం, కనీసం కాల్ చేయకపోవడంతో ఈశ్వర్ కేపీ కి కాల్ చేశాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ అని వస్తోంది, అనుమానం వచ్చి కేపీ టేబుల్ మీద ఉన్న వర్మ ఫైల్ తీసుకుని అందులో నందిని ఫోన్ నెంబర్ తీసుకుని ఫోన్ చేశాడు.

ఈశ్వర్: మేడమ్, నా పేరు ఈశ్వర్, నేను కేపీ సార్ దగ్గర కానిస్టేబుల్ గా పని చేస్తున్న, సార్ మీ దగ్గరకు ఏమైనా వచ్చార? ఆయన ఇంతవరకు స్టేషన్ కు రాలేదు, కనీసం ఫోన్ చేయలేదు.

నందిని: కేపీ ఉదయం వచ్చారు. ఆ తరువాత మధ్యానం నేను ఫోన్ చేసి అజయ్ ఆఫీస్ వెళ్ళలేదు, ఇక్కడికి రాలేదు అని చెప్పాను. సరే నేను చూస్తాను అని చెప్పారు. అంతే, ఆ తరువాత నాకు తెలియదు.

ఈశ్వర్: సరే మేడమ్, థాంక్ యు, నేను తెలుసుకుంటాను. ఫోన్ పెట్టేశాడు.

ఈశ్వర్, క్రాంతి కి ఫోన్ చేసి కేపీ విషయం చెప్పాడు. క్రాంతి, ఈశ్వర్ ని కేపీ ఇంటి దగ్గరకు, ఆ తరువాతే అజయ్ ఇంటి దగ్గరకు వెళ్ళి చూడమన్నాడు.

క్రాంతి మిత్రా పంపిన మేఘ తయారు చేసిన లిస్ట్ చూశాడు, తన మొబైల్ లో అది మొత్తం చూడడం కస్టంగా ఉన్నది అని ఇంటికి వెళ్ళి కంప్యూటర్ లో చూడాలనుకుని బయలుదేరాడు.

ఈశ్వర్, అజయ్ ఇంటి అడ్రస్ తీసుకుని బయలుదేరాడు. ముందుగా కేపీ ఇంటికి వెళ్ళాడు. అక్కడ వాళ్ళ అమ్మ “కేపీ ఉదయమే వెళ్ళిపోయాడు ఇంతవరకు రాలేదు, ఫోను చేయలేదు” అని చెప్పింది. ఈశ్వర్, అజయ్ ఇంటి వద్దకు బయలుదేరాడు.

నందిని, రజనీ ఇద్దరు వర్మ దగ్గర కూర్చుని కాఫీ తాగుతున్నారు. వర్మకు ఇప్పుడు కొంచెం శక్తి వచ్చింది, వీల్ చైర్ లో కూర్చుని కొంత సేపు మాట్లాడగలుగుతున్నాడు. నిర్మలమ్మ తన చిన్న కూతురికి ఒంట్లో బాగలేదని ఈ రోజు కూడా మధ్యాన్నం వెళ్ళిపోయింది. కేపీ పెట్టిన ఆ ఇద్దరు కానిస్టేబుల్స్ ఇంటి బయట కూర్చుని ఉన్నారు.

వర్మకి కొంత ఉపశమనం కలిగించాలని నందిని, రజనీ ఇద్దరు ఏవో కొన్ని ఆయనకు ఇష్టమైన సినిమా పాటలు పాడుతున్నారు. వర్మ తన కుడి చేతితో తన వీల్ చైర్ మీద తాళం వేస్తూ ఆ పాటలను ఆనందిస్తున్నాడు.

అజయ్ ఇంటి దగ్గరకు వచ్చిన ఈశ్వర్ కేపీ బైక్ అక్కడ ఉండడం చూశాడు, ఆ ఇంటికి తాళం కూడా వేసి ఉంది, అనుమానం వచ్చి తను ఇంటి దగ్గరకు వెళ్ళలేదు. తను యూనీఫార్మ్ లో కాకుండా మఫ్టీలో ఉన్నందువలన తను ఎవరు అని వేరే ఎవరికి తెలిసే అవకాశం లేదు. తను వచ్చిన స్కూటీ మెల్లిగా అటు, ఇటు తిప్పి ఆ టీ షాప్ దగ్గరకు వెళ్ళాడు.

స్పృహలోకి వచ్చిన కేపీ తనన్ని ఎవరో బలంగా తలమీద కొట్టి కట్టేసి అక్కడ బంధించారని అర్థమయ్యింది. ‘ఇంతకీ అజయ్ ఏమైనట్టు? తను క్షేమంగానే ఉన్నాడా? తనన్ని ఎందుకు కట్టేశారు? ఆ కొట్టి కట్టినవాళ్ళు ఎవరు?’ ఇలా రకరకాల ఆలోచనలతో సతమతమవుతున్నాడు.

టీ షాప్ దగ్గర ఈశ్వర్ తప్ప ఎవరు లేరు,

ఈశ్వర్: అన్న ఒక టీ ఇవ్వు, ఆ ఇంట్లో అజయ్ సార్ లేడు, ఊరు గాని వెళ్ళాడా? నేను వాళ్ళ ఆఫీస్ కార్ డ్రైవర్ ను, మొన్న కార్ తీసుకుని వెళ్ళాడు. దానిలో ఆయన చిన్న బ్యాగ్ ఒకటి ఉంది అది తీసుకు వచ్చాను, ఇద్దమంటే లేడు, ఇంటికి తాళం వేసి ఉంది. నీకేమైనా తెలుసా?

టీ షాప్ అతను: నాకు తెల్వద్, ఊరోళ్ళ సంగతి తెల్సుకోనికే నా తాన టైమ్ లేదు. ఈ చాయి తీసుకో. అని టీ గ్లాస్ ఇచ్చాడు.

ఈశ్వర్: అరే, ఎందన్న కోపగిస్తున్నావ్, ఆ సార్ బ్యాగ్ ఇచ్చేసి పోదాం అనుకున్న, ఇప్పుడు మళ్ళీ ఆయన ఆఫీస్ వస్తే ఇవ్వాలి లేకుంటే నాదగ్గరే పెట్టుకోవాలి, మళ్ళీ ఇంత దూరం రావడం నా వల్ల కాదు.

ఇంటి లోపల ఉన్న కేపీ కి ‘బయట ఎవరో మాట్లాడుతున్నారు’ అని అర్థమయ్యింది, మెల్లిగా పాకుతూ తలుపు దగ్గరకు వచ్చాడు.

టీ షాప్ అతను: ఆయన లేకుంటే నీ తాననే పెట్టుకో, లేకుంటే మీ ఆఫీస్ లో పెట్టుకో, నాకెందుకు టీ పది రూపాయలు.

ఈశ్వర్: సరే అన్న, నీకు పది రూపాయలు ఇస్తాను, టీ బాగుంది, అవును అజయ్ సార్ ఏదో పోలీస్ కేస్ లో ఇరుక్కునాడంట నిజమేనా? మా ఆఫీసు లో అనుకుంటున్నారు. నేను రోజు బయట తిరుగుతా కాబట్టి నాకు తెలియలేదు.

కేపీ బయట ఉన్నది ఈశ్వర్ అని గుర్తు పట్టాడు. తను కొంచెం బలం తెచ్చుకుని తన కాళ్ళ తో తలుపు మీద గట్టిగా తన్నాడు. ఈశ్వర్ కి అనుమానం వచ్చింది. వెంటనే తన ఫోన్ నుంచి క్రాంతి కి లొకేషన్ షేర్ చేశాడు.

ఈశ్వర్: ఏంటన్న ఇంట్లో ఏమిటి ఆ శబ్దం?

టి షాప్ అతను: లోపల ఒక పెద్ద కుక్కని కట్టి ఉంచాములే, అదే అనుకుంటా.

అక్కడే ఉన్న ఆ రోజు ఈనాడు పత్రిక తీసుకుని మెల్లిగా చదవడం మొదలుపెట్టాడు ఈశ్వర్.

ఈశ్వర్ మెసేజ్ చూసిన క్రాంతికి ఎందుకో అనుమానం వచ్చింది, వెంటనే తన గన్ తీసుకుని మఫ్టీలో ఈశ్వర్ షేర్ చేసిన లొకేషన్ కు బయలుదేరాడు. ఈశ్వర్ అంచనా ప్రకారం క్రాంతి బయలుదేరితే అక్కడకు రావడానికి కనీసం నలభై నుంచి అరవై నిముషాలు పడుతుంది. అంతవరకు అక్కడ ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాడు. చటుక్కున తనకు ఒక ఆలోచన వచ్చింది.

***

సిద్దార్థ్, గౌతమ్ ఆ కెప్టెన్ ఎవరై ఉంటారు అని ఆలోచిస్తున్నారు.

గౌతమ్: ఎవరయినా విదేశీయులు అయ్యి ఉండవచ్చు అనుకుంటాను.

సిద్దార్థ్: ఉండవచ్చు, లేదా ఎవరైనా బడా బాబులు ఉండవచ్చు.

గౌతంమ్: ఎస్, పాసీబుల్.

సిద్దార్థ్: అసలు వీళ్ళు దొంగతనం చేయడం సరే, వీటిని మన దేశం బయటకు ఎలా పంపుతున్నారు? కస్టమ్స్, ఎక్సైజ్, బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ వీటిని ఎలా దాటుకుని వీటిని బయటకు పంపుతున్నారో అర్థం కావడం లేదు. దీని వెనుక ఏదో పెద్ద కుట్ర ఉన్నట్టు అనిపిస్తోంది.

***

ఈశ్వర్ కొంత సమయం టీ తాగుతూ ఆ పేపర్ చదివాడు, తరువాత పేపర్ పక్కన పెట్టి టీ గ్లాస్ గట్టు మీద పెట్టి షాప్ అతనితో, ‘‘అన్న, మా తమ్ముడు ఇంట్లో చిన్న చిన్న స్వీట్స్, మురుకులు, బిస్కెట్లు చేస్తాడు, వాడు వాటిని నీలాంటి చిన్న చిన్న షాప్ ల వాళ్ళకు ఇస్తాడు. అవి మీకు రూపాయికి ముప్పై పైసలు లాభం వస్తుంది, నువ్వు ఎక్కువ కొంటె నీకు నలభై పైసల లాభం ఉంటుంది. నీకు రేపు కొన్ని తెచ్చి ఇవ్వమంటావా?’’

టీ షాపు అతను: నాకు వాటితో పాటు చిన్న సమోసాలు కూడా కావాలి, మీ తమ్ముడు ఇవ్వగలడా?

ఈశ్వర్: తప్పకుండా ఇస్తాడు, వాడికి అన్నీ చేయడం తెలుసు, ఇప్పుడిప్పుడే వాడు ఎక్కువ ఆర్డర్ లు తీసుకుంటున్నాడు. నీ పేరు నెంబర్ ఇవ్వన్నా, వాడికి ఇస్తాను, వాడు నీతో మాట్లాడుతాడు.

టి షాప్ అతను: నా పేరు యాదగిరి, నెంబర్ దూకణం మీద రాసుంది సూసుకో.

ఇంతలో దూరంగా క్రాంతి కార్ రావడం చూశాడు ఈశ్వర్, క్రాంతి కి కనపడేటట్టు తను రోడ్డు మీదకు వెళ్ళి షాప్ ఫోటో తీసుకున్నాడు. క్రాంతి ఈశ్వర్ ని చూసి కొంత దూరంగా కార్ ఆపి దిగి మెల్లిగా నడిచి వచ్చాడు.

# Chapter 27 – The Red Bag

ఈశ్వర్ ని చూసిన క్రాంతి ఏమి తెలియని వాడిలాగా టీ షాప్ దగ్గరకు వచ్చాడు. టీ షాప్ అతనిని “ఇక్కడ అజయ్ అనే అతను ఎక్కడ ఉంటాడు? ఆయన అడ్రస్ ఇక్కడ మీ దగ్గర అడిగితే చెప్తారని తెలిసింది”.

యాదగిరి: నాది చాయి, పాన్ దూకణం. పోస్ట్ ఆఫీస్ కాదు ఎవరేడుంటాడో చెప్పనీకి.

ఇంతలో ఈశ్వర్ కలగచేసుకుని “సార్, మీరు ఆ అజయ్ గారి గురించే వచ్చారా? నేను వాళ్ళ ఆఫీస్ కార్ డ్రైవర్ ని, అజయ్ సార్ లేరు, నేను ఆయన కోసమే వచ్చాను” అని అన్నాడు. బయట ఈశ్వర్ కు తోడుగా క్రాంతి వచ్చాడని కేపీ కి అర్ధమయ్యింది. వెంటనే తన కాళ్ళతో ఆ తలుపు మీద గట్టిగా తన్నడం మొదలుపెట్టాడు. ఆ శబ్దం విన్నాడు క్రాంతి.

క్రాంతి: ఏమిటా శబ్దం? లోపల ఎవరున్నారు?

యాదగిరి: ఎవ్వర్ లేరు, లోపల ఒక కుక్కను కట్టి పెట్టినం, గది శాన ఖతర్నాక్ కుక్క.

క్రాంతి: అవునా! కుక్క అయితే అరవాలి, లేదా కాళ్ళ గోర్లతో గీకాలి కదా, కానీ ఇలా ఒక మనిషి లాగా తన్నదు, సరే ఏది ఒక సారి చూద్దాం అంటూ ఆ తలుపు దగ్గరకి వెళ్ళాడు.

యాదగిరి: ఓయి. ఆగు, ఏడికి పోతున్నావ్?

క్రాంతి తన గన్ తీసి యాదగిరికి చూపించి: ఈశ్వర్, ముందు వీడిని బంధించు, నేను లోపల ఏమిటో చూస్తాను.

యాదగిరి అక్కడ జరిగిన దానికి ఆశ్చర్యపోయాడు, ఆ వచ్చిన వాళ్ళిద్దరూ ఒకరికి ఒకరు తెలుసు పైగా పోలీసులు అని అర్ధం అయ్యింది. భయంతో వెనక్కు తగ్గాడు. ఈశ్వర్ తన దగ్గర ఉన్న సంచిలోనుంచి సంకెళ్ళు తీసి యాదగిరిని బంధించాడు. క్రాంతి ఆ ఇంటి తలుపుకు ఉన్న తాళం పగలగొట్టి తలుపు తెరిచాడు, లోపల తాళ్ళతో కట్టేసిన కేపీ కనపడ్డాడు. వెంటనే క్రాంతి, కేపీ కట్లు విప్పాడు.

క్రాంతి, కేపీ, ఈశ్వర్, యాదగిరని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

***

పాటలు వింటూ సంతోషంగా ఉన్న వర్మ తనకు నిద్ర వస్తోందని నందినికి చెప్పాడు. నందిని వర్మ వీల్ చైర్ ను బెడ్ దగ్గరకు తీసుకుని వెళ్ళి వర్మను పడుకోపెట్టింది.

నందిని: రజనీ, ఎలాగూ ఇంత సేపు ఉన్నావు, డిన్నర్ తినేసి వెళ్ళు, నిర్మలమ్మ డిన్నర్ తయారు చేసే పెట్టింది.

రజనీ: సరే, డిన్నర్ తిన్నకే వెళతానులే. ఇప్పుడు టైమ్ ఉందిగా ఆ రెడ్ బాగ్ గురించి చెప్పు.

నందిని: సరే చెప్తాను, పద మనం పైన రూమ్ కి వెళ్ళి మాట్లాడుకుందాం అని ఇద్దరు మెడ మీద ఉన్న గదికి వెళ్లారు.

***

సిద్దార్థ్, గౌతమ్ ఇద్దరు ఆ కెప్టెన్ ఎవరా అని తెగ ఆలోచిస్తున్నారు.

సిద్దార్థ్: ఇన్ని పురాతన వస్తువులు, గుళ్ళు, ఆలయాలు వీటి సంగతి తెలిసి వాటిలోని వస్తులుదొంగతనంగా అమ్ముతున్నారు అంటే దయానంద్ గురించి ఆ శాఖలో ఉండే వాళ్ళ గురించి బాగా తెలిసిన వాడే అయింటాడు ఆ కెప్టెన్.

గౌతమ్: నిజమే, లేకపోతే ఇన్ని వస్తులు ఏవి ఎక్కడ ఉన్నాయో మామూలు వాళ్ళకు తెలిసే అవకాశం లేదు.

సిద్దార్థ్: ఒకవేళ అదే అయ్యింటే దయానంద్ కు ఆ కెప్టెన్ ఎవరో తెలిసే ఉండాలి, తెలిసి మనకు చెప్పడం లేదేమో?

గౌతమ్: మనం దయానంద్ ను ఇంటరాగేట్ చేస్తే చెపుతాడేమో?

సిద్దార్థ్: నిజమే, కానీ మనం దయానంద్ ను ఒక అనుమానస్తుడుగానే పట్టుకున్నాం, అతనిని ఇంటరాగేట్ చేయడానికి అఫిసియల్ జుడీష్యల్ ఆర్డర్ కావాలి, అరెస్ట్ చేయాలి.

గౌతమ్: మనకు తను చెప్పిన విషయాలన్నీ మనం వీడియో రికార్డ్ చేసాముగా అది మనం సాక్ష్యంగా పెట్టి అతనిని అరెస్ట్ చేసి మిగతా విషయాలు చెప్పిదాం.

సిద్దార్థ్: గుడ్ ఐడియా, నేను ఇప్పుడే జడ్జ్ గారికి ఆ వీడియో చూపించి పర్మిషన్ తీసుకుంటాను, కమాన్ లెట్ అజ్ గో.

సిద్దార్థ్, గౌతమ్ ఆ వీడియో కెమెరా రికార్డింగ్ తీసుకుని జడ్జ్ దగ్గరకు బయలుదేరారు.

***

యాదగిరిని, క్రాంతి, కేపీ ఇంటిలోపలికి తీసుకుని వెళ్ళారు. ఈశ్వర్ బయట టీ షాప్ దగ్గర కూర్చున్నాడు.

కేపీ: మధ్యాన్నం నేను ఇక్కడకు వచ్చినప్పుడు ఉన్న వాళ్ళు ఎవరు, నన్ను తల మీద కొట్టింది ఎవరు? ఇక్కడ లోపల కట్టి లోపల ఎందుకు బంధించారు? అసలు ఎవరు వాళ్ళంతా? వాళ్ళకు నీకు ఏమిటి సంబంధం?

యాదగిరి బిక్క ముఖం పెట్టి: వాళ్ళు ఎవరో నాకు తెల్వదు, వాళ్ళు నా దగ్గరకు వచ్చి నువ్వు వస్తావని నిన్ను వాళ్ళు ఎట్లయినా బంధించాలని నాకు చెప్పారు, నేను ఒప్పుకోలే. కానీ వాళ్ళు నన్ను బెదిరించి వాళ్ళకు సహాయ పడమని చెప్పింద్రు, నేను భయపడి గట్లనే సేసినా.

క్రాంతి: ఇంతకీ ఆ అజయ్ ఏమైనట్టు?

యాదగిరి: ఆ అజయ్ బాబు ను వాళ్ళే మధ్యాన్నం ఒక పెద్ద కార్ లో బలవంతంగా ఎక్కించుకుని పోయింద్రు.

క్రాంతి: సరే, నేను చెప్పినట్టు చేయి, లేకపోతే జీవితాంతం జైల్ లో చిప్ప కూడు తింటావు. నువ్వు వెళ్ళి నీ షాపు మామూలుగా నడుపుకో, ఈ తలుపు ముందులాగానే తాళం పెట్టు, బయట మా ఈశ్వర్ ఉంటాడు, వాళ్ళు వస్తే నువ్వు వాళ్ళను ఏదో ఒకటి చెప్పి కూర్చోపెట్టు, మేము వాళ్ళ సంగతి చూస్కుంటాము.

యాదగిరి: సరే సార్, మీరు చెప్పినట్టుగానే చేస్తా.

క్రాంతి ఈశ్వర్ కి మొత్తం అర్ధమయ్యే లాగా చెప్పి కేపీని తీసుకుని వెళ్ళిపోయాడు. ఈశ్వర్ మళ్ళీ ఆ టీ షాప్ ముందు కూర్చున్నాడు. యాదగిరి టీ కాస్తున్నాడు.

***

నందిని, రజనీ మేడ మీద గదిలో కూర్చున్నారు. రజనీ అంతకు ముందు ఇచ్చిన నందిని రెడ్ బాగ్ తీసుకుని వచ్చింది.

నందిని: నువ్ ఈ రెడ్ బ్యాగ్ గురించే కదా నన్ను అడిగింది, చెప్తాను విను. ఇది మామూలు బ్యాగ్ కాదు. వర్మ గారు దీనిని ప్రత్యేకంగా ఇటలీ లో తయారు చేయించారు. దీనిలోపాల ఒక రహస్య అర ఉంది, దానిలో వర్మ గారు ఒక సేఫ్ లాకర్ యొక్క డిజిటల్ కీని ఒక సన్నని ప్లాస్టిక్ షీట్ లాగా చేసి లోపల పెట్టారు. ఆ లాకర్ తెరవాలంటే ఆయన దగ్గర ఒక స్పెషల్ కి తరువాత ఈ బ్యాగ్ కు ఉన్న ఈ పెండెంట్ ఉపయోగించాలి. ఇవన్నీ ఆయన కొన్ని రోజుల క్రితం కనిపెట్టిన ఒక పెద్ద నిధికి సంబంధించినవి, అది మన దేశ ప్రెసిడెంట్ సమక్షంలో టూరిజం పురావస్తు శాఖ మంత్రి, ఘనుల శాఖ మంత్రికి అప్పగించాలి. అంతవరకు దానిని భద్రంగా దాచాలి.

రజనీ: వర్మ గారు ఇంత రిస్క్ ఎందుకు తీసుకున్నట్టు? ఆయన ఆ నిధి విషయం ప్రభుత్వానికి చెప్పవలసింది. ఆయనకు ఈ ధుస్థితి కూడా ఈ నిధి కోసమే ఎవరైనా చేసిండవచ్చు.

నందిని: నిజమే కానీ ఆయన ఆ నిధి ఈ దేశ ప్రభుత్వానికి, ప్రజలకు దక్కాలి అది ప్రభుత్వానికి దక్కేవరకు ఆయనదే బాధ్యత లేదంటే దీనిని దేశ ద్రోహులు విదేశాలకు అమ్మేస్తారు అని అంటారు.

రజనీ: మరి ఆ నిధి కనిపెట్టగానే దానిని ప్రభుత్వానికి అప్పచెప్పవలసింది.

నందిని: అవును, కానీ దాని గురించిన సమాచారం, ఆ వస్తుల విలువ, అవి మొత్తం ఎన్ని వస్తులున్నాయి ఇలాంటి సమాచారం మొత్తం ఆయన వేరే ఎవరికి చెప్పకుండా ఆయనే తయారు చేసి ఆ లాకార్ లో ఉంచారు, అది ప్రభుత్వానికి ఇచ్చే సమయంలో వర్మ గారు ఈజిప్ట్ కాన్ఫరెన్స్ వెళ్ళారు, వచ్చిన వారంలో ఇది జరిగింది.

రజనీ: అది సరే నందిని, వర్మ గారు అంతా పెద్ద నిధి కనిపెడితే ఆయనతో పని చేసిన వాళ్ళు, పని వాళ్ళకు ఆ విషయం తెలిసే ఉంటుంది కదా, మరి అందులో రహస్యం ఏముంది.

నందిని: వర్మ గారు ఆ నిధి ఉన్నదన్న విషయం కొన్ని తాళపత్ర గ్రంధాలలో సేకరించారు, ఆ తరువాత ఎవరికి తెలియకుండా ఒక్కరే వెళ్ళి దానికి సంబధించిన స్థలం కనిపెట్టారు. ఆ విషయం తెలుసుకోవడం కోసం ఆయన ఆఫీస్ వాళ్ళే చాలా మంది పోటీపడ్డారు. కానీ వర్మగారు ఎవరికి లోంగే మనిషి కాదు. ఇప్పుడు అర్ధమయ్యింద ఆ రెడ్ బ్యాగ్ ఎంత విలువైనదో.

రజనీ: వర్మ గారు సాధ్యమైనంత త్వరగా ఆ నిధి వివరాలు ప్రభుత్వానికి ఇచ్చేస్తే మంచిది, ఆ తరువాత మీరు ప్రశాంతంగా ఉండవచ్చు.

ఇద్దరు నవ్వుకున్నారు.

నందిని టీవీ ఆన్ చేసింది. టీవీ లో న్యూస్ చానెల్ వస్తోంది. న్యూస్ రిపోర్టర్ స్వాతి చెపుతోంది "ఆంధ్ర తమిళనాడు సరిహద్దుల్లోని కర్పగవరం ఊరిలో వెయ్యి సంవత్సరాల పురాతన వినాయక విగ్రహం చోరికి గురి అయ్యింది" అంటూ ఆ పల్లెటూరి గుడి ముందు నిలుచుని న్యూస్ చెపుతోంది.

నందిని: చూడు ఈ దొంగతనాలు ఆగడం లేదు.

రజనీ: దీని వెనుక ఏదో ఒక పెద్ద ముఠా ఉన్నట్టు ఉంది, వాళ్ళంతా దొరకే వరకు ఇలాంటి వార్తలు మనం విని చూడవలసి వస్తుంది.

# Chapter 28 – Face to Face

క్రాంతి కేపీ ఇద్దరు క్రాంతి కారులో వెళుతున్నారు. కేపీ ఇంకా తలనొప్పితో బాధపడుతున్నాడు.

క్రాంతి: కేపీ, అసలు ఏమి జరిగింది, ఎంతో అప్రమత్తంగా వుండే నువ్వు అలా ఎలా వాళ్ళకు దొరికిపోయావు.

కేపీ క్రాంతికి జరిగిన విషయం మొత్తం చెప్పాడు. అప్పుడే క్రాంతికి మిత్ర ఫోన్ చేశాడు.

మిత్ర: క్రాంతి, ఇప్పుడే టివి న్యూస్ లో చెపుతున్నారు ఆంధ్ర తమిళనాడు సరిహద్దుల్లోని కర్పగవరం ఊరిలో వెయ్యి సంవత్సరాల పురాతన వినాయక విగ్రహం చోరికి గురి అయ్యింది అని. నాకు సెంట్రల్ నుండి ప్రెషర్ పెరుగుతోంది. ఏది ఏమైనా మనం ఈ కేసు సాధ్యమైనంత త్వరగా తేల్చాలి.

క్రాంతి: సార్, ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి మనకు కొన్ని కీలకమైన విషయాలు తెలిసాయి, త్వరలో మనం దీనిని తేల్చేస్తాము అన్న నమ్మకం వచ్చింది.

మిత్ర: గుడ్, కానీ ఇంక ఎక్కువ టైమ్ లేదు మనకు, మనం ఆలస్యం చేస్తే ఆ నేరస్థులు ఇంకెన్ని ఘోరాలు చేస్తారో.

క్రాంతి: సార్, మీకు ఇంకో వారం రోజులల్లో ఈ కేసు వెనుక వున్న వారినందరిని పట్టుకుంటాం.

మిత్ర: ఒకే, అల్ ది బెస్ట్. ఫోన్ పెట్టేశాడు.

క్రాంతి: కేపీ, ఇందాకే నాకు బెంగళూరు నుంచి సిద్దార్థ్ ఫోన్ చేశాడు, ఆ కిట్టప్పని చంపిన వాళ్ళ వివరాలు, కారణం తెలిసాయని, కానీ వీటన్నిటికీ వెనుక వున్న వాడు ఎవడు అనేది ఇంకా తెలియలేదు.

కేపీ: ఇంత వరకు వచ్చామంటే ఇంక మిగతా వివరాలు కూడా త్వరలో మనకు తెలుస్తాయని అర్థమవవుతోంది.

టి కొట్టు దగ్గర ఈశ్వర్ కూర్చుని వున్నాడు. యాదగిరి తన కొట్టు సర్దుకుంటున్నాడు. ఇంతలో ఒకడు వచ్చి "అన్న, ఆ పొగరుబోతు కుక్క గురించి అడిగి రమ్మన్నాడు".

యాదగిరి: అది కొంచెం సేపు గొడవ సేసింది, ఆ తరువాత సప్పుడుగాకుండా వూకున్నది.

ఆ వచ్చిన వాడు: అయితే సరే అన్నకు చెప్తాను, నాకొక టి ఇవ్వు, తాగి పోత.

ఈశ్వర్ అదే అదనుగా ఆ వచ్చిన వాడిని వెనుకనుండి పట్టుకుని వాడి నోరు నొక్కి గట్టిగా కట్టేశాడు. వెంటనే యాదగిరి ఇంటి తలుపు తెరిచాడు వాడిని లోపల పడేశారు. ఈశ్వర్ క్రాంతికి ఫోన్ చేసి అక్కడ జరిగింది చెప్పాడు. వెంటనే క్రాంతి పోలీస్ స్టేషన్ కు ఫోన్ చేసి కొంత మంది పోలీసులను ఆ టి షాపు దగ్గరకు వెళ్ళి ఆ రౌడీలు వచ్చే వరకు ఆగి వాళ్ళను పట్టుకోమని చెప్పాడు.

****

సిద్దార్థ్ చూపించిన వీడియొ చూసిన జడ్జ్ వెంటనే దయానంద్ ను అరెస్ట్ చేసి ఎంక్వైరీ చేయమని ఆర్డర్ ఇచ్చాడు. అది తీసుకుని సిద్దార్థ్ గౌతం పోలీస్ స్టేషన్కు వెళ్లారు.

పోలీస్ స్టేషన్లో దయానంద్ తనను విడవమని అక్కడ వున్న పోలీసులను అడుగుతున్నాడు. వాళ్ళు సిద్దార్థ్ వచ్చిన తరువాత ఒక మాట చెప్పి వదిలేస్తాము అని అన్నారు.

పోలీస్ స్టేషన్ వచ్చిన సిద్దార్థ్ ను గౌతంను చూశాడు దయానంద్.

దయానంద్: ఇదిగో సిద్దార్థ్, నన్ను వదిలేయి లేక పోతే నీకు మంచిది కాదు, నాకు ఒక సారి ఫోన్ ఇవ్వు, ఇప్పుడే నీ పని చెప్తాను. మా సార్ చక్రవర్తి గారికి ఫోన్ చేస్తాను, ఆయనే అన్నీ చూసుకుంటారు,

సిద్దార్థ్: అవును, నువ్వు ఒక సత్య హరిశ్చంద్రుడివి నిన్ను కాపాడడానికి ఆ చక్రవర్తి వస్తాడు. మాట్లాడకుండా కూర్చో, ఇప్పుడు కొంత సేపటి తరువాత మనం ఒక మీటింగ్కు వెళదాము. ఆ తరువాత నిన్ను వదిలేస్తాము.

దయానంద్: మరి ఆలస్యం ఎందుకు, పదండి ఆ మీటింగ్ ఏదో పెట్టండి తేల్చేస్తాను.

గౌతం: అంత తొందర వద్దు, మీటింగ్ రూమ్ రెడి అవుతోంది, కాస్త ఆగాలి.

***

ఒక అరగంట తరువాత టీ షాపు దగ్గరకు ఆ రౌడీల గ్యాంగ్ లీడర్ వచ్చాడు, "ఏం యాదగిరి, మా పోరగాడు ఈడీకి వచ్చిండా? ఈడ గా లోపాట వున్న కుక్క సంగతి ఆర్సుకోమని గాడిని పంపినా, గాడు ఇంతవరకు పత్త లేడు."

యాదగిరి: లేదు మల్లేశన్నా, మీ పోరగాడు ఎవడు ఈడీకి రాలే, నువ్వెవడిని పంపినవో, యాడికి పంపినవో?

లోపల వున్న వాడికి బయట మల్లేశ్ వచ్చాడని గుర్తించి తలుపు తన్నడం మొదలు పెట్టాడు.

మల్లేశ్ "గా కుక్కకు ఇంకా పొగరు తగ్గలేదు లే, ఇప్పుడు సూడు నేను దానిని ఏం సేస్తనో". అంటూ తలుపు దగ్గరకు వెళ్ళాడు. అదను చూసి ఈశ్వర్ అప్పటికే అక్కడకు వచ్చి వేచి వున్న పోలీసులను రమ్మని చేయి ఊపి చెప్పాడు. అంతే అమాంతం పది మంది పోలీసులు వచ్చి మల్లేశ్ ను బంధించారు. తరువాత లోపల కట్టి పడేసిన వాడిని కూడా తీసుకుని వాళ్ళ జీప్ లో ఎక్కించుకుని తీసుకు వెళ్లారు. ఈశ్వర్ క్రాంతి కి అక్కడ జరిగినదంతా ఫోన్ చేసి చెప్పాడు.

***

సిద్దార్థ్ గౌతం దయానంద్ ను లోపల వున్న ఒక గదిలోకి తీసుకు వెళ్లారు, అక్కడ గది మధ్యలో ఒక కుర్చీ దానికి పైన వేలాడుతున్న ఒక లైట్ గదిలో మూలన ఒక నీటి కుండ, దానికి పక్కన రెండ్ పొడవాటి చెక్క బల్లలు వున్నాయి. అవి చూసిన దయానంద్ "ఏమిటి మీటింగ్ ఇక్కడ?" అని అన్నాడు.

సిద్దార్థ్: నీకు ఇంతకన్నా స్పెషల్ రూమ్ అవసరం లేదు.

సిద్దార్థ్ మాట ముగించే లోపాలే ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చి దయానంద్ ను ఆ కుర్చీలో బలవంతంగా కూర్చోబెట్టి చేతులు వెనకకు పెట్టి కట్టేశారు, కాళ్ళు కదపకుండా కింద కుర్చీ కోళ్లకు కట్టేశారు.

సిద్దార్థ్: దయానంద్, మాకు ఇప్పుడు నిన్ను అరెస్ట్ చేసి విచారించడానికి జడ్జ్ పర్మిషన్ ఉంది. నువ్వు పిచ్చి వేషాలు వేయకుండా అన్నీ వివరంగా చెప్పు, అప్రూవర్ గా మారు, లేదంటే, తక్కిన నీ జీవిత కాలం మొత్తం చిప్ప కూడు తింటావు.

దయానంద్ మెల్లిగా భయంతో వణుకుతున్నాడు: నాకేమీ తెలియదు, తెలిసినదంతా చెప్పాను.

గౌతం: నువ్వు తెలిసినవి చెప్పావు, అలాగే ఇంకా బాగా తెలిసినవి మా నుంచి దాస్తున్నవని మాకు తెలిసిపోయింది, ఇప్పుడు చెప్పు, అసలు వర్మను చంపడం కోసం ఆ కిట్టప్పను ఎందుకు పంపావు, వర్మను చంపితే మీకు వచ్చే లాబం ఏమిటి? మీరు ఏమి చేయాలనుకున్నారు?

దయానంద్: చెప్తాను, నా ప్రణాల మీదకు వచ్చాక ఇంక ఆగను, మీకు అంతా చెప్తాను. వర్మ త్వరలో రిటైర్ అవుతాడు ఆ తరువాత అతని స్థానంలోకి ఇంకెవరూ వస్తారో తెలియదు అది సెంట్రల్ గవర్నమెంట్ ఇస్టం, కానీ ఆయన ఇప్పుడు చనిపోతే వెంటనే ఆ పదవిలోకి చక్రవర్తి వస్తారు. అప్పుడు ఆయన మా కెప్టెన్ చెప్పినట్టు మాకు ఆ నిధి ఆచూకీ తెలుస్తుంది అప్పుడు మా పనులు తెలికవుతాయి, కానీ ఆ వర్మకి నూకలు చెల్లలేదు, చావకుండా బతికిపోయాడు, అందుకే ఆ కెప్టెన్ ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేసి వర్మను చంపాలని చూశాడు, కానీ సాధ్యం కాలేదు.

సిద్దార్థ్: అంటే మీరు చేసే ఈ పనులలో ఆ చక్రవర్తి కూడా వున్నాడన్న మాట.

దాయనంద్: అవును, ఆ కెప్టెన్ మన దేశం నుంచి బయటకు పంపే ఆ అమూల్యమైన వస్తువులకు నకిలీ వస్తువులు తయారు చేయించేది ఆ చక్రవర్తే, ఆయనకు అసలైన వాటికి అచ్చు గుద్దినట్టు వుండే నకిలీలు చేయిస్తాడు, అసలు ఏది నకిలి ఏది అని కనుక్కోవడం చాలా కస్టం.

గౌతం: దేశద్రోహుల్లారా! మీరు ఏం చేస్తున్నారో మీకు అర్ధమవుతోందా అసలు, మన దేశ సంపద బయట వాళ్ళకు అమ్ముకుంటున్నారు.

దాయానంద్: తెలుసు, మన సంపద అని అనుకోవాడమే కానీ ఎన్నడైనా దానికి విలువనిచ్చామా? అది కనపడక పోతే మీడియాలో దాని గురించి రాజకీయ లాభం కోసం వాడుకున్నారే కానీ ఎన్నడూ ఎవడు దేశ సంపద అని చూడలేదు. అయిన ఈ దేశ సంపద మన దేశం నుండి బయటకు పోవడం ఏమి కొత్త కాదు, కోహినూర్ వజ్రం, నెమలి సింహాసనం, ఇంకా ఎంతో విలువైన సంపద కొన్ని శతాబ్దాల నుంచి జరుగుతోంది, ఎవరు వాటికి ఎదురు చెప్పలేదు, పట్టించుకోలేదు, మన పూర్వీకులు ఎంతో అమూల్యంగా చూసే ఎన్నో తాళపత్ర గ్రంథాలు, వేదాలు, ఉపనిషదులు, భాష్యాలు ఇలా ఎన్నో ఎన్నెన్నో ఎక్కడో ఆటకమీద చెదలు పడుతుంటే వాటిని మనం ఎన్నడూ పట్టించుకోలేదు, వాటిని దొంగగానో దొరగానో తీసుకుపోయి ఎవడో ఒక తెల్లవాడు అందులో వున్నాదానిని అర్థం చేసుకుని వాడు చెపితే వాడిని ప్రశంసించటమే మనకు తెలుసు, కానీ ఆ తెల్లవాడు చెప్పింది మన గ్రంధల నుంచే అని మటుకు మనం ఆలోచించము. మేము చేసేది అదే, ఆ వస్తువులకు ఎవరు సరైన విలువ కట్టి ఇస్తారో వాళ్ళకి ఆ వస్తువు అమ్ముతున్నాం, అది మా వ్యాపారం, దానిలో తప్పేమిటి.

సిద్దార్థ్: అది మన భారత దేశంలో ఎన్నో శతాబ్దాల నుండి వున్న సంపద, అప్పట్లో వాటి విలువ తెలియక ఎవరో తీసుకుని వెళ్ళితే చూస్తూ ఊరుకున్నారు, కానీ ఇప్పుడు అలా కాదు, ఇప్పుడు మనది అనుకుంటే దానిమీద ఎవడి కన్ను పడిన వాడి అంతు చూస్తాము.

దయానంద్: గుడ్, బాగా చెప్పావు, ఇప్పుడు ఇక్కడ పుట్టి, ఇక్కడ గాలి పీల్చి, ఇక్కడ తిండి తిని, ఇక్కడే చదువుకున్న విజ్ఞానవంతులు విదేశాలకు వలస వెళ్ళి అక్కడ అడ్డమైన చాకిరీ చేసి నాలుగు డబ్బులు సంపాయిస్తున్నారు, అదే ఆ కష్టం ఇక్కడ పడితే మన దేశం బాగుపడుతుంది అన్న అభిప్రాయం లేదు. ఇది కూడా ఒక రకమైన సంపద దోచుకోవడమే లేదా అమ్ముకోవడమే, దానికి లేని తప్పు దీనికి ఏమిటి.

గౌతం: నువ్వు చేసే వెధవ పనికి తెలివిగా సంజాయిషీ చెప్పకు. ఇక్కడ నుంచి విదేశాలకు వెళ్ళే వాళ్ళ వలన మన దేశ గౌరవం ఖ్యాతి పెరుగుతాయి, దేశానికి విదేశీ మారక ద్రవ్యం – ఫారిన్ ఎక్స్ఛేంజి జరుగుతుంది.

దయానంద్ గట్టిగా నవ్వాడు: మరి మేము చేసేది అదే, మాకు ఫారిన్ ఎక్స్ఛేంజి వస్తుంది.

సిద్దార్థ్: గౌతం చెప్పింది లీగల్ గా, మీరు చేసేది ఇల్లీగల్, అందుకే మీరు దేశే ద్రోహులు, శిక్షార్హులు.

దయానంద్: మాటి మాటికి దేశ ద్రోహులు అనకు. ఇక్కడ పండిన పంట విదేశాలకు అమ్ముకుంటున్న రైతు లాగానే ఇక్కడి వస్తువులను మేము విదేశాలకు అమ్ముకుంటున్నాము. మేము ఏ తీవ్రవాదం చేయడం లేదు, ఎవరిని చంపడం లేదు.

సిద్దార్థ్: నువ్వు ఎన్నైనా చెప్పు, మతి మాలి మాటలు మీరుతున్నావు, తెలివి అనుకోకు. నువ్వు నీ గ్యాంగ్ చేసేది ముమ్మాటికి దేశ ద్రోహమే, తప్పుడు పనే. నీకు ఇంక మూడింది.

సిద్దార్థ్ గౌతం ఇద్దరు అక్కడ అంతా వరకు రికార్డ్ అయిన వీడియొ కేమర తీసుకుని బయటకు వచ్చారు. సిద్దార్థ్ సైబర్ సెక్యూరిటీ వాళ్ళకు ఫోన్ చేసి చక్రవర్తి కి సంబంధించిన అన్నీ వివరాలు తెలుసుకుని తనకు పంపమని చెప్పాడు.

# Chapter 29 – Turn In The Tunnel

దొరకడు, తెలివిగా తప్పించుకుంటాడు అనుకున్న మల్లేశ్ పోలీసులకు దొరికాడన్న విషయం నాగ్ కు తెలిసింది. వెంటనే చిన్నకు ఫోన్ చేశాడు.

నాగ్: చిన్న, మన మల్లేశ్, వాడి దగ్గర పనిచేసే ఇంకో వెధవ ఇద్దరు పోలీసులకు దొరికిపోయారు. మన పని అయ్యేదాక నువ్వు జాగ్రత్తగా వుండు. ఎవరిని అంతా తేలికగా నమ్మకు, నువ్వు ఇవ్వాళో రేపో సమయం చూసుకుని బయటకు వచ్చి నువ్వు అనుకున్నట్టుగా నీ పని చేసేయి.

చిన్న: అన్న, నువ్వు నాగురించి దిగులు పడకు, నేను ఎప్పుడు ఒక ప్లాన్ పని చేయకపోతే నా రెండో ప్లాన్ రెడీగా పెట్టుకుంటాను. నేను మనం అనుకున్నట్టుగా మన పని ముగించేస్తాను. నా మొదటి ప్లాన్ సరిగ్గా పని చేయలేదు, ఇప్పుడు నా రెండోది ఆఖరిది వాడుతాను.

నాగ్: గుడ్, అల్ ది బెస్ట్.

ఫోన్ ఆఫ్ చేసి, నాగ్ ఏమి చేయాలో ఆలోచిస్తున్నాడు. తను జగత్ సింగ్ కు మాట ఇచ్చాడు తన పని చేసి చూపిస్తాను అని. జగత్ సింగ్ టర్కి లో వుండే జాన్సన్, విల్సన్ ఓనర్స్ జెడబ్ల్యూ సన్స్ అండ్ యాంటిక్స్ వాళ్ళకు మాట ఇచ్చాడు, మొత్తం పదిహేను వేల కోట్ల డీల్. ఇందులో జగత్ సింగ్ తో పాటు, కెప్టెన్, దయానంద్, చక్రవర్తికి కూడా వాటాలు వున్నాయి. ఇప్పటికే ముందు అనుకున్న డెలివేరి టైమ్ కు రెండు వారాలు ఎక్కువ పట్టింది. పైగా తను వేసే అన్నీ పథకాలు బెడిసి కొడుతున్నయి. ఆ జాన్సన్ విల్సన్ ఇద్దరు కిరాతకులు, వాళ్ళ పని జరిగితే ఇస్తామన్న దానికన్నా రెట్టింపైనా ఇస్తారు, అదే పని జరగలేదు అంటే ప్రాణాలు తీస్తారు, వాళ్ళతో వ్యాపారం అంటేనే అతివృష్టి అనావృష్టి అని నాగ్ కు తెలుసు.

నాగ్ ఫోన్ మొగుతోంది, చక్రవర్తి ఫోన్ చేస్తున్నాడు. ఫోన్ తీసుకున్నాడు నాగ్.

చక్రవర్తి: ఉదయం ఆ పోలీస్ సిద్దార్థ్, గౌతం ఆఫీసు కు వచ్చి దయానంద్ ను తీసుకుని వెళ్లారు. వాళ్ళు దయానంద్ ను అరెస్ట్ చేసి వుండవచ్చును, ఆ దయానంద్ కు మెదడుకన్నా నాలుక వేగంగా పని చేస్తుంది వాడు ఆ పోలీసుల దగ్గర ఏమి వాగి చస్తాడో, జాగ్రత్త, మనం ఇప్పుడు కొంచెం అప్రమత్తంగా వుండాలి. ఆ జాన్సన్ విల్సన్ కు ఏమి వివరిస్తావో, ఒప్పిస్తావో, ఇప్పుడున్న పరిస్థితిలో మరో నెల రెండు నెలల వరకు మనం అసలు ఈ పనిని వాయిదా వేయాలి, నువ్వు ముందు ఈ విషయం ఆ జగత్ సింగ్ కు చెప్పు. అని ఫోన్ పెట్టేశాడు.

***

అనుకోని విధంగా తను పోలీసులకు దొరికిపోయినందుకు మల్లేశ్ భయపడుతున్నాడు.క్రాంతి, కేపీ ఇద్దరు మల్లేశ్ ను ప్రశ్నిస్తున్నారు.

మల్లేశ్: సార్ నన్ను ఇడిసేయండ్రి, నాకేమీ తెల్వద్, గా సార్ చెప్తే పైసలకి ఆశ పడి గిట్ల సేసిన.

క్రాంతి: సరే కానీ, నీ పేరెంటి? నువ్వు అసలు ఎవరి కోసం ఎవరి దగ్గర పని చేస్తున్నావు, నువ్వు నిజం చెప్పకపోతే నీతో ఎట్లా నిజం చెప్పించాలో నాకు తెలుసు. అంటూ పక్కనే వున్న లాఠీ తీసుకున్నాడు.

మల్లేశ్: చెప్తా సార్, కొట్టకుండ్రి. నా పేరు మల్లేశ్, నేను గా నాగేందర్ సార్ గదె నాగ్ అని పిలుస్తారు గదా ఆయన తాననే పని జేస్త.

కేపీ: ఆ నాగేందర్ అలియాస్ నాగ్ ఎవరు? ఆయనేమి చేస్తుంటాడు? ఎక్కడ వుంటాడు?

మల్లేశ్: నాగ్ సార్ ఒక డాక్టర్, గాయన గా జగత్ సింగ్ సార్ తాన పని జేస్తడు.

కేపీ: అంటే ఆ మొహెంజదారో ఇంపోర్ట్స్ యాండ్ ఎక్స్పోర్ట్స్ ఓనర్ జగత్ సింగెనా?

మల్లేశ్: అవును సార్, గాయనే.

కేపీ: క్రాంతి సార్, నేను మీకు చెప్పానుకదా, ఆయనే ఆ జగత్ సింగ్, ఐ ఆల్రెడీ సస్పెక్టెడ్ హిమ్.

క్రాంతి: అది సరే కానీ, అసలు అజయ్ ని ఎందుకు కిడ్నాప్ చేశారు?

మల్లేశ్ గట్టిగా నవ్వాడు: అంటే సార్, మీరు గూడ నమ్మిండ్రు లే. మేము అసలు ఆ అజయ్ సార్ ను కిడ్నాప్ చేయలే, గదంతా ఆ నాగ్ సార్ ప్లాన్, మాకు చెప్పినట్టు జేసినం, గంతనే.

కేపీ: ప్లాన్ ఏమిటి? మీరు కిడ్నాప్ చేయకపోతే అసలు ఇప్పుడు అజయ్ ఎక్కడ వున్నట్టు?

మల్లేశ్ నవ్వుతూనే వున్నాడు. "సార్, ఆ అజయ్ సార్ ఎవరనుకుంటున్నర్, ఆయన ఆ నాగ్ సార్ వాలా స్వంత తమ్ముడు చిన్న, ఆయనను మేమెందుకు కిడ్నాప్ చేస్తాం సార్".

క్రాంతి కేపీ ఇద్దరు అవాక్కయ్యరు.

క్రాంతి: ఓ మై గాడ్, వీ ఆర్ ఇన్ ఏ బిగ్ ప్రాబ్లమ్. కేపీ వెంటనే నువ్వు నందిని గారికి ఫోన్ చేసి అలర్ట్ గా వుండమని చెప్పు, నువ్వు వెంటనే వర్మ గారింటికి వెళ్ళు, నేను అక్కడకి మన ఫోర్స్ పంపుతాను.

కేపీ: ఐ కాంట్ బిలీవ్ దిస్, అజయ్ ఆ నాగ్ తమ్ముడా? అంటే.. సార్ నేను ఇప్పుడే వెళుతున్న. అని వెళ్ళిపోయాడు.

క్రాంతి అక్కడ వున్న ఇద్దరు కానిస్టేబుల్స్ ను పిలిచి మల్లేశ్ ను లాకప్ లో వుంచమని, మిత్రాకు ఫోన్ చేశాడు.

క్రాంతి: జై హింద్ సార్, ఐ థింక్ వి సాల్వ్ డ్ ది కేస్, మీకు రెపటికల్లా అన్నీ వివరంగా చెప్తాను, నేను ఇప్పుడు అర్జెంట్ గా వెళ్ళాలి. అని ఫోన్ పెట్టేశాడు.

కేపీ నందిని కి ఫోన్ చేశాడు "మేడమ్, అజయ్ ఏమైనా వచ్చాడా"?

నందిని: లేదు కేపీ గారు, నేనే మీకు ఫోన్ చేసి అడుగుదాము అని అనుకుంటున్నా.

కేపీ: సరే ఒక వేళ్ళ వస్తే వుండమని చెప్పండి, నేను వస్తున్న. నేను వచ్చే వరకు అజయ్ ని వర్మ గారిని కలవనీయవద్దు. ఎందుకు అని అడగకండి, నేను వచ్చి చెప్తాను. అని ఫోన్ పెట్టేశాడు.

కేపీ వేగంగా వర్మ ఇంటికి బయలుదేరాడు.

నందినికి ఏదో తెలియని అనుమానం మొదలయ్యింది. వెంటనే వర్మ వున్న రూముకి వెళ్ళింది, వర్మ నిద్ర పోతున్నారు. వెంటనే నందిని ఆ రూమ్ లాక్ చేసి బయటకు వచ్చి పేపర్ చదువుకుంటుంది, వరండాలో ఇద్దరు కానిస్టేబుల్స్ కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

***

దయానంద్ చెప్పిన వాంగ్మూలం వీడియొ రికార్డ్ సిద్దార్థ్ అక్కడి జడ్జ్ కి చూపించాడు. జడ్జ్ అది చూసి "ఇదిచాలా పెద్ద నేరం, దేశ ద్రోహం, నేను మీకు ఇప్పుడే ఆర్డర్ ఇస్తాను, వెళ్ళి ఆ చక్రవర్తిని కూడా అరెస్ట్ చేయండి" అని చక్రవర్తి అరెస్ట్ ఆర్డర్ అప్పుడే ఇచ్చాడు.

సిద్దార్థ్ కి సైబర్ డిపార్ట్మెంట్ వాళ్ళు చకరవర్తి కి సంబంధించిన వివరాలు పంపించారు. సిద్దార్థ్ గౌతం అవి చూసి ఆశ్చర్యపోయారు.

జడ్జ్ ఇచ్చిన అరెస్ట్ ఆర్డర్ తీసుకుని సిద్దార్థ్ గౌతం పురావస్తు శాఖ ఆఫీసుకు వెళ్లారు. అక్కడ వాళ్ళను చంద్రిక ఆపి ఎందుకు వచ్చారు అని అడిగేలోపున వాళ్ళు లోపలికి నేరుగా చక్రవర్తి రూంకి వెళ్లారు. అక్కడ ఆయన త్రినాధ్ మరి ఇంకొంతమంది తో మీటింగ్ లో వున్నాడు, సిద్దార్థ్ గౌతం ఇద్దరు ఎవరిని లెక్క చేయకుండా లోపలికి వెళ్ళి జడ్జ్ ఇచ్చిన ఆర్డర్ చూపించి చక్రవర్తిని అరెస్ట్ చేశారు. అక్కడ ఏమి జరుగుతోందో ఎవరికి అర్ధం అవ్వలేదు. అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

చక్రవర్తి: వాట్ ఇస్ దిస్ నాన్సెన్స్, నన్నెందుకు మీరు అరెస్ట్ చేస్తున్నారు?

సిద్దార్థ్: వివరాలు స్టేషన్ కి వెళ్ళాక చెప్తాను, పదండి.అంటూ తీసుకెళ్ళి పోలీస్ కార్ ఎక్కించాడు.

చక్రవర్తి దయానంద్ అన్నీ వీళ్ళకి చెప్పేశాడు అని నిర్ణయించుకుని మెల్లగా విషయం నాగ్ కి కార్ లో వెనుక కూర్చుని మెసేజ్ చేశాడు. తన ఫోన్ని వెంటనే కింద పడేసి తన కాలితో దానిని ముక్కలు ముక్కలుగా విరగకొట్టాడు. గౌతం చక్రవర్తి చేస్తున్నది చూసి వారించబోయాడు, సిద్దార్థ్ వద్దు అని అపాడు.

***

అజయ్ తన బైక్ వర్మ ఇంటి ముందు ఆపి లోపలికి వచ్చాడు, బయట వున్న కానిస్టేబుల్స్ అజయ్ ని ఆపకుండా లోపలికి పంపారు. హాలులో సోఫాలో కూర్చుని పేపర్ చదువుకుంటున్న నందిని అజయ్ ని చూసింది.

నందిని: హాయ్ అజయ్, ఏమైపోయావు, ఫోను చేస్తే నాట్ రిచబుల్ అని వస్తోంది, ఎక్కడికి వెళ్ళావు? ఆర్ యు ఆల్ రైట్?

అజయ్: అదొక పెద్ద కథ వదిలేయండి, సార్ని కొంచెం అర్జెంట్గా కలవాలి.

నందిని: వర్మ గారు నిద్ర పోతున్నారు, ఒక అరగంట లో లేస్తారు, ఆయన వేసుకునే మాత్రల వలన ఎప్పుడంటే అప్పుడే నిద్ర పోతున్నారు, కాఫీ టి ఏమైనా తాగుతావా?

అజయ్ కొంత అసహనంగా: వద్దు లెండి, నేను ఇక్కడ వర్మ సార్ కోసం వెయిట్ చేస్తాను, వీలైతే మీరు సార్ని నిద్ర లేపగలరా? కొంచెం అర్జెంట్.

నందిని: వద్దు అజయ్, ఆయన రాత్రి కూడా సరిగ్గా నిద్ర పోలేదు, నడుము నొప్పి అని చాలా సార్లు లేచారు, ఎట్లాగూ ఇంకొంచెం సమయం తరువాత లేస్తారు, ఇంతకీ నువ్వు ఏమైపోయావో చెప్పలేదు.

అజయ్ తనకు వస్తున్న కోపం అణుచుకుని: నన్ను ఎవరో కొంత మంది రౌడీలు కిడ్నాప్ చేశారు, నేను వాళ్ళ కళ్ళుగప్పి తప్పించుకుని బయట పడ్డాను.

నందిని: ఓ మై గాడ్, నీకు ఏమి కాలేదుకదా? కేపీ కి చెప్పక పోయావా? ఆర్ యు ఆల్ రైట్?

అజయ్: ఐ యం ఒకే, నా దగ్గర ఫోన్ లేదు, అసలు ఎవరు నన్ను ఎందుకు కిడ్నాప్ చేశారో తెలియడం లేదు.

అప్పుడే అక్కడకు కేపీ తన వెనుక వున్న ఏడు మంది పోలీసులు వచ్చారు.

కేపీ: ఎస్ అజయ్, నిన్ను ఎవరు ఎందుకు కిడ్నాప్ చేశారో నేను చెప్తాను చిన్న.

కేపీ కి అంతా తెలిసిపోయిందని అజయ్ కి అర్థమైయ్యింది. వెంటనే తన దగ్గర అప్పటివరకు దాచుకున్న గన్ తీసి నందిని కి గురి పెట్టాడు.

అజయ్: కేపీ బి కేర్ఫుల్, మీరు అడుగు ముందుకు వేస్తే నేను నందిని గారిని షూట్ చేస్తాను.

క్రింద హాలులో ఏదో గోడవగా వుండేటప్పటికి మెడ మీద నిద్ర పోతున్న రజనీ మెల్లిగా క్రిందికి వస్తోంది, అక్కడ అజయ్ నందినికి గన్ గురిపెట్టడం చూసింది. వెంటనే ఆ మెట్ల మీద వున్న ఒక ఫ్లవర్ వాజ్ తీసి బలంగా అజయ్ మీదకు విసిరింది, అది వెళ్ళి అజయ్ తలకు బలంగా తగలడంతో తన చేతిలోని గన్ కింద పడిపోయింది, తను కూడా కింద పడిపోయాడు, అదే అదనుగా కేపీ అక్కడ వున్న పోలీసులు అజయ్ మీద పడి తనని పట్టుకున్నారు.

# Chapter 30 – The Confession

క్రింద పడివున్న అజయ్ మీద ఒక్క సారిగా కేపీ మిగిలిన పోలీసులు పడ్డారు వెంటనే అజయ్ రెండు చేతులు వెనుకకు మడిచి సంకెళ్ళు వేశారు.

కేపీ: గుడ్ జాబ్ రజనీగారు, అజయ్ నువ్వు ఇంత కిరాతకుడివి అని నేను ఎన్నడూ అనుకోలేదు. దేవుడి లాంటి వర్మ గారిని నందిని గారిని ఎంత మోసం చేశావు, నీకసలు ఇలాంటి నీచమైన ఆలోచన ఎలా వచ్చింది?

అజయ్: కేపీ, అనవసరంగా సమయం వృథా చేయకు, నీకు నేను సమాధానం చెప్పాల్సిన పని లేదు, నన్ను వదిలేయి నువ్వు, అందరూ బతికి బాగుపడి పోతారు, లేదా నాశనం అయ్యిపోతారు.

కేపీ: చింత చచ్చినా పులుపు చావలేదు, నిన్ను ఇప్పుడు మేము సంకెళ్ళు వేసి బందించాం, అరెస్ట్ చేశాము, ఇంకా నీకు పొగరు, అహం తగ్గలేదు, నీ శాపనార్ధలు ఏమి పనికి రావు ఇప్పుడు.

పక్కనే వున్న పోలీసులతో కేపీ: ముందు అజయ్ ని స్టేషన్ కి తీసుకుని వెళ్ళండి, ఇక్కడ ఒక నలుగురు వర్మ గారికి నందిని గారికి సెక్యూరిటీ గా వుండండి. మేడమ్, మీరు ఏమి భయపడకండి వీ విల్ టేక్ కేర్ ఆఫ్ ఎవ్రీథింగ్. వర్మ గారు జాగ్రత్త. అంటూ బయటకు వెళ్ళాడు.

***

సిద్దార్థ్ గౌతం చక్రవర్తిని పోలీస్ స్టేషన్ కు తీసుకుని వచ్చారు. నేరుగా చక్రవర్తి ని ఇంటరాగేషన్ రూమ్ కు తీసుకుని వెళ్లారు.

సిద్దార్థ్: చక్రవర్తి గారు, మీరు ఒక వున్నతమైన ప్రభుత్వ సంస్థలో వున్నతమైన పదవిలో వున్నారు, అలాంటిది ఇంత నీచమైన పని చేయాలని మీకు ఎలా అనిపించింది.

చక్రవర్తి: మీరు నన్ను అపార్ధం చేసుకుంటున్నారు. నేను ఎటువంటి తప్పు చేయలేదు, అసలు మీరు నన్ను ఎందుకు ఇలా అరెస్ట్ చేశారో నాకు తెలియదు, ఐ విల్ ఫైల్ ఏ క్రిమినల్ కేస్ ఆన్ యు, నన్ను ఇలా బలవంతంగా తీసుకువచ్చి నా పరువు తీశారు, దీనికి మీరు భారీ మూల్యం చెల్లిస్తారు.

గౌతం: చేసినదంతా చేసి ఇప్పుడు ఇలాంటి కబుర్లు చెప్పవద్దు. మీ గురించి మీరు చేసే వెధవ పనుల గురించి మీ అసిస్టెంట్ దయానంద్ మాకు అన్నీ చెప్పాడు. ఇంక ఇప్పుడు మీరు ఏమి దాచలేరు, అన్నీ వివరంగా త్వరగా చెప్తే మంచిది.

చక్రవర్తి: ఆ దయానంద్ ఒక పెద్ద ఫ్రాడ్, నేను తనకి ప్రమోషన్ ఇవ్వలేదని నా మీద పగ పట్టి నన్ను ఇలా ఇరికించాడు. ఐ డోంట్ నో ఎనీథింగ్.

సిద్దార్థ్: అంటే మీరు ఆ జగత్ సింగ్ తో కలిసి దొంగతనంగా విగ్రహాలు దేశం బయటకు పంపడం అబద్దామా, మీరు నకిలీ విగ్రహాలు చేయించడం అన్నీ ఆ దయానంద్ చెప్పిన కట్టు కథలు అంటారు అంతే కదా.

చక్రవర్తి: ముమ్మాటికి, నేను అలా ఎందుకు చేస్తాను, నాకు దానితో ఏమిటి లాభం? నేను ఎన్నటికీ అలా చేయను.

గౌతం: అవును మీరు ఎన్నడూ అలా చేయరు, కానీ మీ ఆస్తి మటుకు రెండువందల కోట్లు ఎలా వచ్చిందో మీకు తెలియదు, మీరు మీ భార్య, కొడుకు పేరుమీద పెట్టిన ఆస్తులు మీకు అలా ఊరికే వచ్చేసాయా? ఎన్ని దొంగ పనులు చేస్తే వచ్చాయో చెప్పండి.

సిద్దార్థ్: అంతే కాదు, మీరు వాడిన మీ లాప్టాప్, హార్డ్ డిస్క్, దొంగ మెయిల్ అక్కౌంట్లు, మీ మొబైలు కాల్ డాటా మొత్తం మా సైబర్ డిపార్ట్మెంట్ వాళ్ళు సాదించి మీరు చేసిన అన్నీ దొంగ పనుల వివరాలు మాకు ఇచ్చారు. మీరు సుమారు ఒక నూటయబ్బై కి పైగా విగ్రహాలు, ఇతర వస్తువులు నకిలీ చేయించినట్టు మాకు తెలిసింది. ఇప్పటికైనా నిజం ఒప్పుకోండి లేదంటే మేము ఒప్పించాల్సివస్తుంది.

చక్రవర్తి తల దించుకుని దిగులుగా కూర్చున్నాడు.

వర్మ ఇంటి నుండి అజయ్ ని పోలీసులు బయటకు తీసుకు వచ్చారు, అప్పటికే అక్కడ నాగ్ మనుషులు నలుగురు తమ దగ్గర వున్న తుపాకులతో ఆ పోలీసుల మీద కాల్పులు చేశారు, ఒక కానిస్టేబుల్ కు భుజం మీద బుల్లెట్ గాయం అయ్యింది, ఆ హఠాత్ పరిణామంకు కేపీ తను కూడా తన గన్ తీసి ఆ దుండగుల మీద ఎదురు కాల్పులు కాల్చాడు. ఆ దుండగులు అందరూ పారిపోయారు, అజయ్ ను పోలీస్ జీప్ ఎక్కించారు, కేపీ అంబులన్స్ పిలిపించి ఆ గాయ పడ్డ కానిస్టేబుల్ ను హాస్పిటల్ పంపాడు. కేపీ క్రాంతి కి ఫోన్ చేసి వెంటనే జగత్ సింగ్ ను, నాగ్ ను అరెస్ట్ చేయించమని చెప్పి, అక్కడ జరిగిన వివరాలన్నీ చెప్పాడు. పది నిముషాల తరువాత క్రాంతి ఒక పది మంది పోలీసులు అక్కడికి వచ్చారు. అందరూ వర్మ ఇంటికి ఎదురుగా వున్న జగత్ సింగ్ ఇంటికి వెళ్లారు.

జగత్ సింగ్ ఇంటిలో ఎవరు లేరు, బయట ఒక తోట మాలి మొక్కలకు నీళ్ళు పోస్తున్నాడు.

క్రాంతి: ఓయి మాలి, ఈ ఇంట్లో వాళ్ళు ఎక్కడ?

మాలి: నాకు తెల్వద్ సార్, వాళ్ళు ఒక గంట ముందే బయటకు పోయింద్రని ఆ సెక్యూరిటీ చెప్పిండు, వాడు చాయ్ తాగనీకే పోయిండు.

క్రాంతి పోలీసులను లోపలికి వెళ్ళి చూడమని చెప్పాడు. అందరూ లోపలికి వెళ్లారు. కేపీ అక్కడ ఆ బుగాటి కారు లేకపోవడం చూసి “సార్ వాళ్ళు ఆ బుగాటి కారులోనే వెళ్ళి వుంటారు, అది ఇక్కడ లేదు”. అని చెప్పాడు.

క్రాంతి వెంటనే కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేసి ఆ బుగాటి కారు వివరాలు చెప్పి, అది ఎక్కడ కనపడ్డ వెంటనే ఆ కారును ఆ కారులోని వారిని పట్టుకోమని చెప్పాడు.

కేపీ బయటకు వచ్చి ఆ మాలిని పిలిచాడు, “నువ్వు, ఇక్కడ ఎన్ని రోజులనుంచి పని చేస్తున్నావు?”.

మాలి కంగారుగా తడబడుతూ: నాలుగు సంవత్సరాల నుంచి, కాదు కొన్ని రోజుల నుంచి ఈడనే పనిజేస్తున్న. అని నాలిక కర్చుకున్నాడు.

కేపీ “కనిస్టేబుల్స్, వెంటనే ఇతనిని అరెస్ట్ చేయండి”, అని ఆ మాలి చేయి గట్టిగా పట్టుకున్నాడు, ఆ మాలి కేపీ చేయి విదిలించి పారిపోవడానికి ప్రయత్నం చేశాడు, కానీ అప్పటికే అతని చుట్టూ పోలీసులు వచ్చి అతనిని అదుపులోకి తీసుకున్నారు.

క్రాంతి: కేపీ, ఇతనిని ఎందుకు అరెస్ట్ చేశారు?

కేపీ: సార్, ఇతనే ఆ నాగ్, నాగేందర్. ఇతను మాలి కాదు.

క్రాంతి: ఎలా కనిపెట్టారు?

కేపీ: సార్, మొదటిది జగత్ సింగ్ ఈ ఇంటికి వచ్చి కేవలం మూడు నెలలు అయ్యింది, అంతకు ముందు ఈ ఇల్లు దాదాపు ఒక సంవత్సరం ఎటువంటి ఆలనపాలన లేకుండా గడ్డి, పిచ్చి మొక్కలు మొలిచి వుండేవి. రెండవది, పాపం నాగ్ మాలి గెటప్ వేశాడు కానీ పొరపాటున తన చేతికి వున్న ఆ కాస్ట్లీ వాచ్ తీయడం మరచిపోయాడు.

క్రాంతి: కనిస్టేబుల్స్, ఇతనిని కూడా స్టేషన్ తీసుకుని వెళ్ళండి, అక్కడ అన్న తమ్ముళ్ళు ఇద్దరు కలిసి వుండవచ్చు.

కేపీ: నాగ్, ఇంతకీ మీ బాస్ ఆ జగత్ సింగ్ ఎక్కడ? మీ గ్యాంగ్ లీడర్ ఆ కెప్టెన్ ఎవరు, ఎక్కడ?

నాగ్ బదులు ఇవ్వకుండా నవ్వుతున్నాడు.

క్రాంతి: నాగ్, నువ్వు నిజం చెప్పకపోతే జీవితంలో మళ్ళీ నువ్వు నవ్వకుండా వుండేటట్టు చేస్తాను, తీసుకుని వెళ్ళండి.

నాగ్ ని పోలీస్ వ్యాన్ ఎక్కించారు.

క్రాంతికి పోలీస్ కంట్రోల్ రూమ్ వాళ్ళు ఫోన్ చేసి “సార్, ఆ బుగాటి కార్ దొరికింది, అదుపులోకి తీసుకున్నారు, ఓఆర్ఆర్ మీద బెంగళూర్ వైపు వెళుతుంటే టోల్ గెట్ దగ్గర అదుపులోకి తీసుకున్నారు”.

క్రాంతి: థాంక్ యు, వాళ్ళని నేను మన టాస్క్ ఫోర్స్ పంపించి ఇక్కడకు తెప్పిస్తాను, అంతవరకు వాళ్ళను ఆ కారు లోనే అక్కడే వుంచండి. అని చెప్పి ఫోన్ కట్ చేశాడు.

***

చక్రవర్తి జగత్ సింగ్, నాగ్ లతో కలిసి ఆ జాన్సన్ విల్సన్ లకు అనేక పురాతన వస్తువులు, విగ్రహాలు, గంటలు, కలిశాలు, మరి ఇంకెన్నో చాలా పురాతన ఆలయాల నుంచి దొంగలించి వాటికి నకిలీ వస్తువులు తయారు చేయించి అమ్మినట్టు ఒప్పుకున్నాడు, కానీ దాని వెనుక వున్న అసలైనా వ్యక్తి ఆ కెప్టెన్ అని అతనే మూలం అని చెప్పాడు. తనకి ఆ కెప్టెన్ ఎవరు అన్నది తెలియదని చెప్పాడు. మొత్తం అన్నీ కూడా ఆ నాగ్ చూసుకునేవాడని చెప్పాడు.

సిద్దార్థ్: మీరు నకిలీ వస్తువులు చేయించి అమ్మితే మరి అసలైనవి ఏమైనట్టు? ఒక వేళ మీరు అసలు వస్తువులు అమ్మితే నకిలీ వస్తువులు ఎందుకు చేయించినట్టు? కొంచెం వివరంగా చెప్పండి చక్రవర్తి.

చక్రవర్తి: ముందుగా ఆ కుప్పుసామి వాళ్ళ మనుషులు రెక్కి నిర్వహించి ఎక్కడ ఏ విగ్రహాలు, వస్తువులు వున్నాయో ఆ నాగ్ మనుషులకు చెపుతారు, వాళ్ళు ఆ వస్తువుల ఫోటోలు నాకు ఆ జాన్సన్ విల్సన్ కు పంపుతారు. జాన్సన్ విల్సన్ ఒక నెల లోపల ఆ వస్తువులకు గిరాకీ తెస్తారు, ఆ వెంటనే ఆ అసలైన వస్తువును కుప్పుసామి మనుషులు దొంగిలిస్తారు దానిని నాకు చూపిస్తే నేను దానికి నా పర్యవేక్షణ లో నకలు చేయిస్తాను, దీనికి చాలా నైపుణ్యం కావాలి అందుకు ఆ పళని గాడి మేనమామ తమిళనాడులో తుత్తుకుడి దగ్గర ఎవరికి అనుమానం రాకుండా వుండేందుకు ఇత్తడి బిందెలకు మాట్లు వేసే వాడిలాగా వుండి అక్కడ నకిలీ వస్తువులు చేసేవాడు, వాడు ఎంతో నేర్పరి, వాడు చేసిన విగ్రహాలు, అసలు ఏది నకిలీ ఏది అని చూసి తెలుస్కోవడం చాలా కష్టం. ఆ నకిలీ వస్తువును నేను రెప్లిక అని సర్టిఫికేట్ ఇస్తాను కాబట్టి అది అమ్మడానికి, దేశం బయటకు పంపడానికి ఎటువంటి అడ్డు వుండదు, కానీ మేము ఆ సర్టిఫికెట్ చూపించి అసలైన వస్తువు అమ్మేస్తాము, ఆ తరువాత ఒక సంవత్సరం ఆ నకిలీ వస్తువు దాచి దాని గురించి పోలీసులు సోదిస్తే మేమే దానిని వాళ్ళకు దొరికేలాగా చేస్తాము, లేదా ఆ నకిలిని కూడా అమ్మేస్తాము.

గౌతం: ఓ మై గాడ్, సరే కానీ మీరు ఆ వర్మ గారిని ఎందుకు చంపాలని అనుకున్నారు?

చక్రవర్తి: మేము చేస్తున్న ఈ విగ్రహాల అక్రమ వ్యవహారం వర్మ కి తెలిసిపోయింది. ఆయన ఒకసారి నన్ను పిలిచి మందలించారు కూడా, ఆ తరువాత నాగ్ ప్లాన్ ప్రకారం వర్మ రిటైర్ అయ్యేలోపాల ఆయనను చంపేస్తే ఆ ప్లేస్ కి నేను వెళతాను, అప్పుడు మాకు అసలు అడ్డు వుండదు అని ఆయనను టార్గెట్ చేశాము. కానీ ఆ వెధవ కిట్టప్ప చేసిన చిన్న తప్పు వలన ఆ వర్మ బతికిపోయాడు. వర్మ స్థానంలోకి నేను వెళితే వర్మ కనిపెట్టిన ఆ కొత్త నిధి వివరాలు కూడా మాకు తెలుస్తాయి దానిని ఆల్రెడీ నాగ్, జగత్ సింగ్ ఆ జాన్సన్ విల్సన్ కు పెద్ద మొత్తంకు వ్యాపారం కుదుర్చుకున్నారు. ఇప్పుడు అది కూడా పోయింది.

సిద్దార్థ్: ఇంత చేస్తున్న మీకు ఆ కెప్టెన్ కు పరిచయం లేదా? మీరు ఎప్పుడు అతనితో మాట్లాడలేదా, కలవలేదా?

చక్రవర్తి: ఆ కెప్టెన్ కేవలం నాగ్, జగత్ సింగ్ లతో మాత్రమే మాట్లాడుతాడు, మాకు కెప్టెన్ అనే వ్యక్తి వున్నడని తెలుసు కానీ అతను ఎవరో తెలియదు.

# Chapter 31 — The Faceoff

దయానంద్ని, చక్రవర్తిని ఇంటరాగేట్ చేసిన వివరాలన్నీ వీడియొ రికార్డ్ చేశారు, వాళ్ళు చెప్పినదంతా ఒక వ్రాత పత్రంగా చేసి దాని మీద వాళ్ళ సంతకాలు తీసుకున్నారు సిద్దార్థ్ గౌతం. చక్రవర్తిని, దయానంద్ ను రిమాండ్ కు పంపారు.

అజయ్ ని, నాగ్ ని ఇద్దరినీ పోలీస్ స్టేషన్లో విడివిడిగా బంధించి పెట్టారు. మిత్ర కూడా అప్పుడే పోలీస్ స్టేషన్ కు వచ్చాడు. మిత్ర, క్రాంతి, కేపీ ముగ్గురు ముందుగా నాగ్ ను ప్రశ్నించడం మొదలుపెట్టారు. ఆ ఇంటరాగేషన్ మొత్తం వీడియొ రికార్డింగ్ చేస్తున్నారు.

మిత్ర: నీ పేరేమిటి? నీ వివరాలన్నీ వివరంగా చెప్పు.

నాగ్: తెలుసుకుని ఏం చేస్తారు? మీకు నాకు టైమ్ వేస్ట్.

క్రాంతి: తిక్క తిక్కగా మాట్లాడకుండా, అడిగినదానికి సరిగ్గా సమాధానం చెప్పు, అలా చేస్తే నీకు పడే శిక్ష తగ్గవచ్చు.

నాగ్: సరే అది చూద్దాం. నా పూర్తి పేరు నాగేందర్ త్రిశంకు, అందరూ నన్ను నాగ్ అని పిలుస్తారు. నేను ఒక కార్డియాలజిస్ట్ డాక్టర్ని, ఒకడు చేసిన మోసం నన్ను నా ప్రొఫెషన్ కు దూరం చేసి నన్ను ఒక మోసగాడిగా, దేశ ద్రోహిగా చేసింది.

మిత్ర: చరిత్ర వద్దు, జరిగింది చెప్పు. అసలు మీరు ఈ విగ్రహాలను దొంగలించి విదేశాలకు అమ్మడం ఇవన్నీ ఏమిటి?

నాగ్: డాక్టర్ గా ఒకడి మోసం వలన ఉద్యోగం పోయింది, నేను స్వంత క్లినిక్ పెట్టుకుంటే నాకు ప్రాణాలు తీసే డాక్టర్ అని పేరు పెట్టి నా క్లినిక్ మూయించేశారు. అప్పుడు నాకు ఆ జగత్ సింగ్ పరిచయమై నాకు అండగా నిలిచాడు. నేను నా డాక్టర్ ప్రాక్టీస్ మొత్తం ఆపేశాను, కేవలం జగత్ సింగ్ వాళ్ళ తండ్రిని మాత్రం చూసుకునే వాడిని. అప్పుడు నన్ను జగత్ సింగ్ తన ఇంపోర్ట్స్ ఎక్స్పోర్ట్స్ వ్యాపారం గురించి చెప్పి నన్ను ఆయనకి సహాయాంగా వుండమన్నాడు. మాకు ఒక సారి ఒక ఆరు వందల సంవత్సరాల పాత నటరాజ విగ్రహం టర్కీ లోని జాన్సన్ విల్సన్ కు పంపని ఒక ఆర్డర్ వచ్చింది, దానిని నేను చూసి అదేదో మంచి డీల్ అని నేరుగా ఆ జాన్సన్ విల్సన్ కు ఫోన్ చేసి మాట్లాడను. ఆ తరువాత వాళ్ళే ఇక్కడకు నేరుగా వచ్చి నన్ను జగత్ సింగ్ ను ముంబై లో కలిశారు, అప్పుడు వాళ్ళకు మాకు ఒక వ్యాపార ఒప్పందం కుదిరింది, అప్పటినుండి వాళ్ళ అన్నీ సామాన్లు మా దగ్గర నుండే వెళ్లేవి, ఆ తరువాత మాకు జాన్సన్ ద్వారా కుప్పుసామి లింకు దొరికింది. ఆ కుప్పుసామి ద్వారా చక్రవర్తి, దయానంద్ అందరం ఒక టీంగా పని చేయడం మొదలు పెట్టం.

క్రాంతి: ఇంతకీ అజయ్ ని ఎందుకు ఇందులోకి దింపారు? ఆ కెప్టెన్ ఎవరు?

నాగ్: అజయ్ బాగా చదువుకున్నాడు, వుద్యోగం దొరకక నా దగ్గరే పని చేసేవాడు, అప్పుడు నేను, జగత్ సింగ్, చక్రవర్తి ఒక ప్లాన్ ప్రకారం అజయ్ కి పురావాస్తు శాఖలో వుద్యోగం వచ్చేలాగా చేసి, చక్రవర్తి వ్యూహంతో అజయ్ ని విక్రాంత్ వర్మకి అసిస్టెంట్ గా పెట్టం. అజయ్ వర్మకి ఎంతో దగ్గరయ్యాడు, అతని నమ్మక పాత్రుడయ్యాడు. అజయ్ అసలు ఎవరికి అనుమానం వచ్చే లాగా ఏది చేయలేదు. వర్మ అసిస్టెంట్ గా అజయ్ వర్మ చేసే అన్నీ పనులలో వుండేవాడు, అప్పుడే వాళ్ళు దక్షిణ బారతదేశం లో చేసిన అనేక విగ్రహాల, ఆలయాలా, గుళ్ళు, గోపురాల సంపద గురించిన వివరాలు మాకు దొరికాయి. వాటిని ఆసరా చేసుకుని మేము వాటిని దొంగిలించి జాన్సన్ విల్సన్ కు అమ్మేవాళ్ళం. మా వ్యాపారం పెరిగే కొద్ది ఆ జాన్సన్ విల్సన్ మా మీద పెత్తనం మొదలు పెట్టారు, అప్పుడే మేము కెప్టెన్ ను తీసుకుని వచ్చాము. కెప్టెన్ మాకు ఆ జాన్సన్ విల్సన్ కు మధ్యలో వుండి వ్యాపారంలో నష్టాలు లేకుండా సజావుగా సాగేలా చూసేవాడు.

కేపీ: బాగుంది, ఇంతకీ ఆ కెప్టెన్ ఎవరు?

నాగ్: ఆ కెప్టెన్ మరి ఎవరో కాదు, అజయ్ యే ఆ కెప్టెన్. తనకు ముందుగా ఎక్కడ ఏ సంపద వుందో తెలుసు కాబట్టి కెప్టెన్ లాగా ఆ వివరాలు మాకు ఆ జాన్సన్ విల్సన్ కు చెప్పేవాడు, నేను అజయ్ కి ఎప్పుడు ఏం చేయయాలో ఎలా చేయాలో సూచించేవాడిని, దానిని బట్టి తను అందరినీ ఒప్పించేవాడు.

మిత్ర, క్రాంతి, కేపీ: ఓ మై గాడ్, ఆన్బిలివబల్, ఎంతో మంచి వాడుగా వుండే అజయ్ ఇంత కథ నడిపాడా?

నాగ్: ఎస్, అన్నీ నా ఆదేశాలతో.

మిత్ర: ఒకే నాగేందర్, మేము నిన్ను మళ్ళీ వచ్చి కలుస్తాం. బాయ్స్ లెట్ అస్ గో అండ్ కం. అని మిత్ర బయటకు వెళ్ళాడు. క్రాంతి నాగ్ ను ఆ రూమ్లో బంధించి కేపీతో బయటకు వెళ్ళాడు.

మిత్ర, క్రాంతి, కేపీ లతో: మనం ఇప్పుడు ఆ అజయ్ ని ప్రశ్నిద్దం. అతడేమి చెప్తాడో చూద్దాం.

మిత్ర, క్రాంతి, కేపీ, అజయ్ వున్న రూమ్ కి వెళ్లారు. అతడి ఇంటరాగేషన్ కూడా వీడియొ రికార్డ్ చేస్తున్నారు.

మిత్ర: అజయ్, నీ పూర్తి పేరు వివరాలు అన్నీ మాకు చెప్పు.

అజయ్: నేను ఎందుకు చెప్పాలి? నేను చెప్పాను, మీరు ఏమి చేస్తారో చేసుకోండి.

క్రాంతి: అజయ్, నువ్వు చేయకూడాని తప్పులన్నీ చేశావు, మాకు రెడ్ హ్యాండడ్ గా దొరికిపోయావు, నువ్వు వివరాలు చెపితే నీకు కొద్దిగా శిక్ష తగ్గవచ్చు, లేదంటే మేమే మాకు తెలిసినవన్ని వ్రాసి నీకు పెద్ద శిక్ష పడే లాగా చేస్తాము.

కేపీ: అజయ్, ఇన్ని రోజులు మనం ఫ్రెండ్స్ లాగా కలిసే వున్నాం, ఇప్పుడు ఎందుకు ఈ వేషాలు, అన్నీ వివరాలు చెప్పెయ్యి.

అజయ్: సరే, నా పూర్తి పేరు అజయ్ త్రిశంకు, నేను మెటలర్జీ లో ఏంయస్సి చదివాను. వుద్యోగం దొరకక నేను మా అన్నయ్య నాగేందర్ దగ్గర పని చేసేవాడిని...

అజయ్ నాగ్ చెప్పిన విషయాలే అన్నీ చెప్పాడు.

క్రాంతి: అసలు ఆ వర్మగారి దగ్గర అంత నమ్మకంగా వుండి ఆయన మీద హత్య ప్రయత్నం ఎలా చేశావు?

అజయ్: నేను కేవలం ఆ ముందు తగలిన రబ్బర్ బుల్లెట్స్ మాత్రమే ప్రయోగించాను, వెనుకనుంచి ఆయన ఛాతిలోకి కాల్చవలసిన ఆ కిట్టప్ప నడుము ని కాల్చాడు, అయినా వాడి తప్పు కాదు అది, ఒకటి వాడు అంతా పొడుగుగా వుండడం, రెండు వాడు ఒక మెట్టు పైన వుండడం, మూడు వాడికి స్వంత తెలివి లేకపోవడం. లేకపోతే ఇప్పటికీ ఆ వర్మ పైకి వెళ్లిపోయేవాడు.

కేపీ: అజయ్, నీకు ఆ దేశ ద్రోహ పనులు చేసి నువ్వు పెద్ద క్రిమినల్ అయ్యావు, కొంచెం కూడా మానవత్వం లేకుండా మాట్లాడుతున్నావు.

అజయ్: అవును, నాకు మానవత్వం లేదు, నేను మా అన్నయ్య కటిక దరిద్రం అనుభవించి డబ్బులు లేక రెండు రోజులకోకసారి భోజనం చేసి ఎప్పటికైనా మేము బాగా చదువుకొని మంచి ఉద్యోగం చేయాలని కలలు కన్నం, అనుకున్నట్టుగానే కష్టపడి ఇద్దరం చదువుకున్నాం, మా పేదరికంను అడ్డు పెట్టుకుని మా అన్నయ్య ను ఎందుకు పనికిరాని వాడిగా ముద్ర వేశారు. నాకు ఎంతో మంచి ర్యాంక్ వున్న తెలివి వున్న లంచం ఇవ్వకుండా వుద్యోగం ఇవ్వలేదు. అప్పుడు మా అన్నయ్యను ఆ జగత్ సింగ్ ఆదుకున్నాడు. ఆ తరువాత ఆ చక్రవర్తి కల్పించుకుని నాకు వర్మ అసిస్టెంట్ గా ఉద్యోగం వేయించాడు. అప్పుడే నేను నిర్ణయం చేసుకున్న డబ్బు సంపాయించడం కోసం ఏ పనైనా ఎంతటి పనైనా చేయాలని, అందుకే ఇంతకు తెగించాను.

క్రాంతి: అంటే ఆ రిమోట్ డిజిటల్ సిం గన్ ఆ మీటింగ్ హాల్ లో పెట్టింది నువ్వేనా?

అజయ్: ఎస్, ఆ మీటింగ్ ముందు రోజు నేను అక్కడ ఏర్పాట్లు చూడడానికి వచ్చి అక్కడే ఆ గన్ ను ఏర్పాటు చేశాను, వర్మ సరిగ్గా అక్కడికి వచ్చేటట్టు, ఆ గన్ వర్మ మీదకి కాల్చేటట్టు నేనే ఏర్పాటు చేశాను. అనుకున్నది అనుకున్నట్టు జరిగింది.

మిత్ర: నువ్వు వర్మ దగ్గర పని చేస్తూ ఆయనను మోసం చేస్తున్నావని ఆయనకు అనుమానం రాలేదా?

అజయ్: వచ్చేవుంటుంది, ఎందుకంటే మేము వెళ్ళి పరీక్షించిన దక్షిణ భారతదేశం ఆలయాలలోని సంపద దొంగతనం వెనుక ఆ వివరాలు నేను ఎవరికైనా ఇచ్చాను అనుకోని ఆయన కనిపెట్టిన ఆ గుప్తుల నాటి గుప్తా ధనం ఎక్కడ వున్నది అన్న

విషయం నా నుంచి దాచారు. కానీ ఆయన ఆ వివరాలు అన్నీ ఒక డిజిటల్ స్కాన్ కీలో దాచారని మాత్రం నాకు తెలిసింది. దానికోసమే ఆయన ఫింగర్ ప్రింట్ కావాలని ఆయన హాస్పిటల్ లో వున్నప్పుడు ఆ పళనిగాడు ప్రభాకర్ ని పంపితే వాళ్ళు మొత్తం చెడగొట్టారు. అందుకే మా అన్నయ్య స్టేరాయిడ్ ఇచ్చాడు, ఒక వేళ్ళ కోమ లోనుంచి లేస్తే అతని దగ్గర ఆ కీ తీసుకోవాలనుకున్నాం, లేదా ఆ స్టేరాయిడ్ వల్ల వర్మ చనిపోతే ఆ స్థనంలోకి చక్రవర్తి వస్తాడు అప్పుడు మా పని సులభంగా అవుతుందని అనుకున్నాం. కానీ అన్నీ తారుమారు అయ్యాయి. అప్పుడే నాకు కెప్టెన్ గా జాన్సన్ విల్సన్ నుండి ప్రెషర్ పెరిగింది, అప్పుడే నేను ఎలాగైనా వర్మ దగ్గర ఆ వివరాలు తెలుసుకోవాలని ఇలా చేశాను.

కేపీ: అంటే నీ ఇంట్లో చిందరవందర వస్తువులు, ఆ గోడ మీద రాతలు, వేలి ముద్రలు, నిన్నటి నీ కిడ్నాప్అవన్నీ కూడా నీ ప్లానా?

అజయ్: కాదు, అది మా అన్నయ్య నాగ్ ప్లాన్, నా మీద ఎవరికి అనుమానం రాకుండా వుండేందుకు అలా చేశాడు.

అంతలో ఒక కానిస్టేబుల్ వచ్చి ‘‘సార్, ఆ బుగాటి కార్ అందులో వున్న జగత్ సింగ్ ను ఇక్కడకు తీసుకు వచ్చారు, బయట కస్టడీ లో వున్నాడు’’. అని చెప్పాడు.

‘‘ఒకే, మేము వస్తాము, నువ్వు వెళ్ళు’’ అని అతనిని పంపేశాడు క్రాంతి.

***

సిద్దార్థ్ క్రాంతి కి ఫోన్ చేశాడు ‘‘క్రాంతి, మేము ఇక్కడ దయానంద్, చక్రవర్తి ఇద్దర్ని అరెస్ట్ చేసి వాళ్ళ వాంగ్మూలం అంతా రికార్డ్ చేశాము, వాళ్ళు ఇద్దరు వాళ్ళు చేసిన తప్పులు ఒప్పుకుని ఆ వాంగ్మూలం మీద సంతకాలు కూడా చేశారు, మిగతాది ఏమి చేయాలో మీరు అక్కడ నిర్ణయం చేసుకుని చెప్పండి’’ అని అన్నాడు.

క్రాంతి: నేను మిత్రా గారితో మాట్లాడి నీకు ఒక పది నిముషాలాలో చెప్తాను, థాంక్ యు వెరీ మచ్ సిద్దార్థ్. అని ఫోన్ కట్ చేశాడు.

క్రాంతి మిత్రా కి సిద్దార్థ్ చెప్పిన విషయం అంతా చెప్పాడు.

మిత్ర: ఒకే, నేను ఇప్పుడే కర్ణాటక ఐజి తో మాట్లాడుతాను, సిద్దార్థ్, గౌతం ఇద్దరు ఆ దయానంద్, చక్రవర్తి, ఆ కేసుతో సంబంధం వున్న అందరినీ ఇక్కడకు తీసుకుని వచ్చే ఏర్పాట్లు నేను చేస్తాను, మీరు ఆ జగత్ సింగ్ పని చూడండి. అని బయటకు వెళ్ళిపోయాడు,

మిత్ర చెప్పిన విషయం క్రాంతి సిద్దార్థ్ కి ఫోన్ చేసి చెప్పాడు.

# Chapter 32 – The Conclusion

నాగేందర్, అజయ్ ఇద్దరు చెప్పిన వివరాలన్నీ వ్రాత పత్రాలుగా చేసి వాటిమీద సంతకాలు తీసుకున్నారు. వాళ్ళ ఇంటరాగేషన్లో తీసిన వీడియోలు మొత్తం బద్రపరిచారు క్రాంతి, కేపీ.

కేపీ: సార్, నాకు ఒక విషయం అర్ధం అవ్వలేదు. ఎంతో క్లిష్టమైన ఈ కేసు, ఇందులో బాగమైన నాగేందర్, అజయ్, అక్కడ దయానంద్, చక్రవర్తి వీళ్లందరు ఇంత తేలికగా ఎలా అన్నీ వివరాలు ఒప్పుకున్నారు, అసలు వీళ్ళ తెలివికి, పనితనానికి నేను వీళ్ళు ఇంత త్వరగా లొంగిపోయి అన్నీ ఒప్పుకుంటారని అనుకోలేదు. కారణం ఏమి అయివుండవచ్చు?

క్రాంతి: సింపుల్ కేపీ, ఇప్పుడు వీళ్ళు వున్న పరిస్థిలో ఆ జాన్సన్ విల్సన్ తో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆ గుప్తుల గుప్తా నిధి అందించలేరు, వాళ్ళు అసలే కిరాతకులు అని నాగేందర్ చెప్పాడుగా, వీళ్ళు ఒప్పందం ప్రకారం ఆ నిధి ఇవ్వకపోతే వాళ్ళు వీళ్ళని చంపేస్తారు, వాళ్ళ దగ్గర చావడం కన్నా వీళ్ళు మనకు నిజాలు చెప్పి లొంగిపోయీ బతకడం మంచిది అని అనుకుని అన్నీ నిజాలు ఒప్పుకున్నారు.

కేపీ: కరెక్ట్ సార్, మీరు కరెక్ట్ గా ఆలోచించారు.

క్రాంతి: రేపు ఉదయం సిద్దార్థ్, గౌతం ఆ దయానంద్, చక్రవర్తి, బబ్లూ అందరినీ తీసుకుని ఇక్కడకు వస్తారు. మనం ఆ ఆఖరి వ్యక్తి ఆ జగత్ సింగ్ ని ఒకసారి ప్రశ్ననిద్దము పద.

జగత్ సింగ్ ఒక రూములో కూర్చుని వున్నాడు, అతని పక్కన రెండు పెద్ద సూట్ కేసులు వున్నాయి, అతనికి బద్రతగా ఇద్దరు పోలీసులు ఆ రూమ్ బయట వున్నారు. క్రాంతి, కేపీ ఇద్దరు ఆ రూంలోకి వెళ్లారు.

క్రాంతి: జగత్ సింగ్, మీరు చేసే పనుల గురించి అంతా మాకు నాగేందర్, అజయ్ చెప్పారు, ఇప్పుడు మీ వాంగ్మూలం కూడా మేము వింటే ఈ కేసును మేము జుడీష్యల్ కు అప్పగిస్తాము. ఏమి దాచకుండా అన్నీ వివరంగా చెప్పండి.

జగత్ సింగ్: సార్, నేను ఒక ఇరవై సంవత్సరాల నుంచి ఈ ఇంపోర్ట్స్ ఎక్స్పోర్ట్స్ బిజినెస్ చేస్తున్నాను. నాకు ఒక అయిదు సంవత్సర క్రిందట డాక్టర్ నాగేందర్ పరిచయం అయ్యాడు. అతనిమీద తప్పుడు కేసు బనాయించి అతనిని పనిలోనుంచి తీసేసాడు వాళ్ళ యజమాని. ఆ తరువాత నేను అతనిని మా నాన్నగారికి పర్సనల్ డాక్టర్గా పెట్టుకున్నాను. అప్పుడే నాకు బిజినెస్లో ఒక నమ్మకస్థుడు అవసరం వచ్చింది, నాగేందర్ నాకు సహాయం చేయడానికి ఒప్పుకున్నాడు. అదే సమయంలో ఒక కన్సైన్మెంట్ విషయంలో ఆ జాన్సన్ విల్సన్ తో నాగేందర్ డీల్ ఒప్పించాడు, అప్పటినుంచి మాకు డబ్బులు విరివిగా వచ్చి పడ్డాయి. మాకు ఆ దయానంద్, చక్రవర్తి, కుప్పుసామి సహాయం చేసేవారు. ఆ తరువాత మీకు విషయం తెలుసు, మేము ఇప్పుడు మీకు దొరికిపోయాం.

క్రాంతి: గుడ్, మాకు ఆ జాన్సన్ విల్సన్ వివరాలు కావాలి, మేము ఇంటర్పోల్ తో మాట్లాడి వాళ్ళ సంగతి చూస్తాము. కేపీ, మీరు జగత్ సింగ్ దగ్గర ఆ జాన్సన్ విల్సన్ వివరాలు అన్నీ తీసుకోండి.

క్రాంతి జగత్ సింగ్ దగ్గర వున్న రెండు సూట్ కేసులను తెరిపించాడు, వాటిలో పది కోట్ల డబ్బు వివిధ దేశాల కరెన్సీలల్లో వున్నది, వాటి మధ్యలో కొన్ని వజ్రాలు, పురాతన పంచలోహ విగ్రహాలు మరికొన్ని పురాతన వస్తువులు వున్నాయి. అన్నింటినీ పోలీసులు వాళ్ళ ఆధీనంలోకి తీసుకున్నారు.

క్రాంతి కేపీ అన్నీ వివరాలతో మిత్రాను కలిశారు.

మిత్ర: గుడ్ జాబ్ క్రాంతి అండ్ కేపీ. యు బోత్ విల్ బి రివార్డెడ్, అట్లాగే సిద్దార్థ్, గౌతం కూడా ఈ కేసు సాల్వ్ చేయడంలో చాలా ఉపయోగ పడ్డారు, మీ అందరి గురించి నేను స్పెషల్ రికమండేషన్ హోమ్ మినిస్టర్ కు పంపిస్తాను. ఇంక మనం ఆఖరిగా ఆ విక్రాంత్ వర్మ గారి వాంగ్మూలం తీసుకుంటే ఈ కేసు అల్మోస్ట్ క్లోస్ అయినట్టే.

క్రాంతి: ఎస్ సార్, ఇప్పుడు మేము ఇద్దరం వర్మ గారి దగ్గరకే వెళుతున్నాం,

మిత్ర: గుడ్ లక్.

క్రాంతి కేపీ మిత్ర కు సెల్యూట్ చేసి వర్మ ఇంటికి వెళ్లారు.

వర్మ గారి ఇంటి దగ్గర నందిని, రజనీ, నిర్మలమ్మ, కానిస్టేబుల్స్ అందరూ ఆత్రుతగా వున్నారు.

వర్మ వీల్ చైర్ లో కూర్చుని వున్నారు, అతని చెరో వైపు నందిని, రజనీ వున్నారు.

క్రాంతి వర్మ, నందిని, రజనీ కి నాగేందర్, అజయ్, జగత్ సింగ్ చెప్పిన అన్నీ వివరాలు, బెంగళూరు విషయాలు అన్నీ వివరించారు.

క్రాంతి: వర్మ గారు, మీకు అజయ్ అంతా సన్నిహితంగా వుండే వాడు కదా మరి మీకు అతనిమీద ఎప్పుడు అనుమానం రాలేదా? లేదు మీరు అతనిని అంతగా నమ్మరా, లేక ఎప్పుడైనా అనుమానించారా?

వర్మ: క్రాంతి గారు, అజయ్ చాలా నమ్మకస్థుడుగా వుండేవాడు, నేను చేసే అన్నీ పనులలో నాకు చాలా సహాయ పడే వాడు, కొన్ని సార్లు నాకు అలాంటి కొడుకు వుంటే బాగుండేది అని కూడా అనిపించిది. కానీ నేను తనతో దక్షిణ బారతదేశం లోని అన్నీ ఆలయాలలో ఆడిట్ కు వెళ్ళి అక్కడి విషయాలు అన్నీ సేకరించిన తరువాత ఒకసారి నేను ఆఫీసు నుండి ఇంటికి వచ్చేసిన తరువాత అజయ్ ఆఫీసులో నా రూమ్ కి వెళ్ళి ఆ ఆడిట్ రిపోర్ట్స్ అన్నీ స్కాన్ చేసుకుని తీసుకున్నాడు అన్న విషయం నాకు దుర్గరావు చెప్పాడు, అప్పుడు నాకు తనమీద కొంచెం అనుమానం వచ్చింది, ఆ తరువాత ఒక నెల తరువాత మేము ఆడిట్ చేసిన ఆలయాలలోని విగ్రహాలు, వస్తువులు దొంగతనం అయ్యాయి, అప్పుడు నాకు అజయ్ మీద అనుమానం ఎక్కువైంది, కానీ నేను అది బయట పెట్టలేదు.

కేపీ: బహుశా అందుకే మీరు ఆ గుప్తుల గుప్తా నిధి వివరాలు కూడా అజయ్ కి చెప్పలేదు అనుకుంటాను.

వర్మ: ఎస్, ఆ నిధి నిజంగానే వెలకట్టలేని అంతా గొప్ప నిధి.

క్రాంతి: అంటే, ఆ మధ్య తిరువనంతపురం పద్మనాభ స్వామి ఆలయం నేలమాళిగలో దొరికిన నిధి కన్నా ఇంకా విలువైనదా?

వర్మ: అవును దానికన్న ఎన్నో రేట్లు విలువైనది.

కేపీ కొంచెం ఆత్రుతగా: ఎంత బంగారు, ఎంత వెండి, ఎన్ని వజ్రాలు, మణులు మాణిక్యాలు వుంటాయి అందులో?

వర్మ కొంచెం సేపు నవ్వి: మీరనుకుంటున్నట్టు ఆ నిధి బంగారు, వెండి, మణులు మాణిక్యాలు కాదు, చంద్రగుప్తుడి కాలంలో తక్షశిలా విశ్వవిద్యాలయం వుండేది, అక్కడ అన్నీ ప్రాంతాల, దేశాల విధ్యార్థులు వచ్చి విద్య అభ్యసించేవారు, ఆ విశ్వవిద్యాలయానికి వున్న ఆదరణతో చాణక్యుడు మరో విశ్వవిద్యాలయం నిర్మించడం కోసం ఆ తక్షశీలా విశ్వవిద్యాలయం లోని గ్రంధాలన్నీటిని నకలు చేయించి వాటిని ఒక చోట బద్ర పరిచాడు, చాణక్యుడి తరువాత ఆ గ్రంధాలు ఎక్కడ పెట్టారో ఎవరికి తెలియకుండా పోయింది, కొంత కాలం గడిచిన తరువాత తక్షశీలా విశ్వవిద్యాలయం ను దుండగులు ఆక్రమదారులు మొత్తం తగులబెట్టారు, అందులోని అమూలయమైన గ్రంధాలు అన్నీ నాశనం అయ్యాయి, మిగిలినవి కొన్ని మాత్రమే దొరికాయి. కానీ నేను చేసిన ఒక రీసర్చ్ వల్ల అలనాడు ఆ చాణక్యుడు దాచిన ఆ విద్య సంపద మొత్తం ఇప్పుడు దొరికింది. మణులు మాణిక్యాలు లెక్క కట్టవచ్చు కానీ జ్ఞాన సంపదను ఎవరు లెక్కకట్టలేరు. అందుకే నేను అది ఎంతో విలువైనది అని చెప్పాను.

కేపీ: మరి ఆ పాఖసోయ, అది కూడా కల్పితమేనా?

వర్మ: లేదు అది నేను చదివిన కొన్ని గ్రంధాలలో వివరించిన పరికరం, అది ఇప్పుడు నిజంగా వుండివుండకపోవచ్చు కానీ దానిగురించిన సాంకేతికత వివరాలు అన్నీ ఆ గ్రంధాలలో వున్నయి.

క్రాంతి: అంతా గొప్ప నిధి గురించి మీరు ప్రభుత్వానికి మాత్రం చెప్పాలనుకున్నారు మరి ఆ మీటింగ్ పెట్టి మరి ఎందుకు చెప్పారు?

వర్మ: అదే ఎర వేసి చేప పట్టడం అంటే. నేను ఆ గుప్తుల గుప్తా నిధి కనిపెట్టిన సంగతి అజయ్ కి తెలుసు, ఎప్పుడైతే నేను ఆడిట్ చేసిన వస్తువులు దొంగతనం జరిగిందో దాని వెనుక వున్న అసలు దొంగలను బయటకు రప్పించడం కోసం నేను వేసిన పథకం అది. అనుకున్నట్టుగానే అందరూ బయట పడ్డారు, పట్టు బడ్డారు.

క్రాంతి: థాంక్ యు వెరీ మచ్ సార్, మీరు చేసిన ఆ సాహసం వల్లనే మేము ఈనాడు ఆ దుండగులను దేశద్రోహులను పట్టుకోగలిగాము. మేము మీరు చెప్పిన అన్నీ వివరాలు రికార్డ్ చేశాము, రేపు మేము అన్నీ రాష్ట్ర హోమ్ మంత్రి గారికి అందచేస్తాము. ఇంక మేము వెళ్ళి వస్తాము, మీకు ఆ కానిస్టేబుల్స్ కాపలాగా ఇక్కడ వుంటారు.

క్రాంతి, కేపీ వాళ్ళకు కావలసిన వివరాలు తీసుకుని వెళ్లిపోయారు.

ఆ మరునాడు.

రాష్ట్ర సచివాలయంలో కమిషనర్ మిత్ర, ఐజి పృథ్వీరాజ్, రాష్ట్ర ముఖ్యమంత్రి, హోమ్ మంత్రి, కేంద్ర పురావస్తు శాఖ మంత్రి తో పాటు అనేకమైన టీవి ఛానెల్స్, న్యూస్ రిపోర్టర్స్ తో నిండిపోయింది.

అప్పటికే అక్కడికి క్రాంతి, కేపీ, సిద్దార్థ్, గౌతం, వర్మ, నందిని, రజనీ, మేఘ అందరూ వచ్చారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి, హోమ్ మంత్రి, మిత్రా, క్రాంతి, కేపీ, సిద్దార్థ్, గౌతం లను వారు ఎంతో క్లిష్టమైన ఈ కేసును పరిష్కరించినందుకు వారిని సన్మానించారు. క్రాంతి, కేపీ, సిద్దార్థ్, గౌతంలకు ప్రత్యేక బహుమతులు అవార్డ్ లు ఇచ్చారు.

టీవి ఛానెల్స్ ఆ కార్యక్రమం మొత్తం లైవ్ టెలీకాస్ట్ చేసింది, అక్కడకు వచ్చిన ఆ పత్రికా విలేఖరులు రకరకాల ప్రశ్నలు వేసి సమాధానాలు తెలుసుకున్నారు.

ఆ కార్యక్రమం అంతా ముగిసిన తరువాత, క్రాంతి, కేపీ గౌతం, సిద్దార్థ్, కమిషనర్ మిత్ర, ఐజి పృథ్వీరాజ్ లకు జగత్ సింగ్, నాగేందర్, అజయ్, కుప్పుసామి, పళని, ప్రభాకర్, మల్లేశ్, బబ్లూ, దయానంద్, చక్రవర్తి లను అప్పగించారు. వారందరిమీద క్రిమినల్ కేసు రిజిస్టర్ చేసి జుడీష్యల్ రిమాండ్కు పంపారు. ఐజి పృథ్వీరాజ్ జాన్సన్ విల్సన్ మీద కేసు తయారు చేసి కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, హోమ్ మంత్రికి ఇంటర్పోల్ కు పంపడానికి అన్నీ వివరాలు పంపాడు.

విక్రాంత్ వర్మ కేంద్ర పురావస్తు శాఖ మంత్రికి తను కనిపెట్టిన ఆ గుప్తుల నాటి గుప్తా నిధి జ్ఞాన బాండాగారం వివారాలు, దానికి సంబధించిన డిజిటల్ కీ ఆ రెడ్ బ్యాగ్ అన్నీ వివరించి అందించాడు. విక్రాంత్ వర్మ చేసిన ఆ పనికి అతనిని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఘనంగా సత్కరించారు, అతని వెన్నుఎముకకు చికిత్స కోసం అమెరికాకు ప్రభుత్వ ఖర్చులతో పంపడానికి ఏర్పాట్లు చేశారు.

ఇంత పెద్ద కేసు పరిష్కరించినందుకు అందరూ ఆనందపడ్డారు, రాష్ట్ర ముఖ్యమంత్రి అందరినీ అభినందించి అందరికీ ఆ రోజు రాత్రి డిన్నర్ పార్టీ ఏర్పాటు చేశారు.

* కథ సుఖాంతం *